సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 202

గురువారం 12-10-2023



'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'



రుచికి చూపెందుకు?

ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ఫుడ్ వ్లోగర్ ఆశాలతపై కథనం -13లో



అదరగొట్టిన రోహిత్

భారత కెప్టెన్ మెరుపు సెంచరీ. అఫ్గాన్‌పై 8 వికెట్లతో టీమిండియా గెలుపు -14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రాజస్తాన్‌లో నవంబర్ 25న..

రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలను నవంబర్ 23కి బదులుగా 25న నిర్వహించాలని ఈసీ నిర్ణయం తీసుకుంది.


వివరాలు 8లో ▸



గర్భవిచ్ఛిత్తి కేసులో...

గర్భ విచ్ఛిత్తికి సంబంధించిన కేసులో సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం బుధవారం భిన్న తీర్పుల్ని వెలువరించింది.

వివరాలు 6లో ▸



పఠాన్‌కోట్ సూత్రధారి హతం

పఠాన్‌కోట్‌లో వాయుసేన స్థావరంపై దాడి సూత్రధారి, జైషే మొహమ్మద్ ఉగ్రవాది షహీద్ లతీఫ్, అతడి సోదరుడు హతమయ్యారు.

వివరాలు 6లో ▸



పట్టాలు తప్పిన 'నార్త్ ఈస్ట్'

బిహార్‌లోని బక్సర్ జిల్లాలో నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లు పట్టాలు తప్పింది. ఐదుగురు మృతి చెందినట్లు సమాచారం.

వివరాలు 6లో ▸

ఐఏఎస్, ఐపీఎస్, నాన్ కేడర్ ఎస్పీలపై 20 మంది ఈసీ వేటు..

అసెంబ్లీ ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌తో పాటు 4 జిల్లాల కలెక్టర్ల బదిలీ

- వరంగల్, నిజామాబాద్ సీపీలు, 10 జిల్లాల ఎస్పీలు, రవాణాశాఖ కార్యదర్శి సైతం పక్కకు..
- ఈ 18 మంది అధికారులకు అసెంబ్లీ ఎన్నికల విధులు అప్పగించరాదని ఆంక్షలు
- ఆబ్కారీ, కమర్షియల్ ట్యాక్స్ శాఖల డైరెక్టర్/కమిషనర్లకూ స్థానచలనం
- ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, దేవాదాయశాఖల అదనపు బాధ్యతల నుంచి సీఎస్‌ను తప్పించిన ఈసీ
- వీరంతా వెంటనే తమ కింది అధికారులకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశం
- నేటి సాయంత్రం 5 గంటలలోగా బదిలీ అయిన వారి స్థానాల్లో కొత్త అధికారులు
- ఒక్కోపోస్టుకు ముగ్గురి చొప్పున ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పేర్లను తమకు ప్రతిపాదించాలని సర్కారుకు సూచన
- వీరి గత ఐదేళ్ల పనితీరు నివేదికలు, విజిలెన్స్ క్లియరెన్స్ సైతం పంపాలని ఆదేశం
- పక్షపాత ధోరణి, నిర్లక్ష్యం, నిబంధనల అతిక్రమణ ఆరోపణలు ప్రతిపక్షాల ఫిర్యాదుల నేపథ్యంలో సీఈసీ చర్యలు



సీవీ ఆనంద్



ఏవీ రంగనాథ్



వి. సత్యనారాయణ



హరీశ్

సాక్షి, హైదరాబాద్/ న్యూఢిల్లీ: రాష్ట్ర శాసనసభ ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై 20 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, నాన్ కేడర్ ఎస్పీలపై కేంద్ర ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో రాష్ట్ర పరిపాలనపై దఖలుపడిన అధికారం మేరకు ఈ చర్య తీసుకుంది. హైదరాబాద్ సీపీ సహా ముగ్గురు పోలీసు కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, 10 జిల్లాల ఎస్పీలు, ఓ శాఖ కార్యదర్శి, మరో శాఖ డైరెక్టర్, ఇంకో శాఖ కమిషనర్లపై బదిలీ వేటు వేసింది. వీరిలో 18 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, నాన్ కేడర్ ఎస్పీలకు శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి బాధ్యతలు అప్పగించకూడదని ఆంక్షలు విధించింది. బదిలీ అయిన అధికారులు సత్వరమే బాధ్యతల నుంచి తప్పుకొని తమ తర్వాతి స్థానంలో ఉన్న అధికారికి బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కూడా వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, దేవాదాయ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతల నుంచి తక్షణమే వైదొలగాలని ఆదేశించింది. ఈ మూడు శాఖలకు కొత్త ముఖ్య కార్యదర్శులతోపాటు బదిలీ వేటుపడిన 20 మంది అధికారుల స్థానంలో గురువారం సాయంత్రం 5 గంటల్లోగా కొత్త అధికారులను నియమించాలని రాష్ట్ర

మిగతా 5వ పేజీలో

బీజేపీ బ్రహ్మాస్త్రాలు!

ఎన్నికల యుద్ధానికి ఆయుధాలు సిద్ధం చేస్తున్న కాషాయ దళం

'ఓటుకు కోట్లు' కేసును విస్తృతంగా ప్రచారం చేసే యోచన

- ప్రచార పర్వాన్ని హోరెత్తించేందుకు రెడీ అవుతున్న కమలనాథులు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు లక్ష్యంగా వ్యూహాలకు పదును
- ఆ రెండు పార్టీలూ ఒక్కటే అన్న అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయం
- అప్పట్లో టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కినా తదుపరి విచారణ అటకెక్కిందంటూ చర్చనీయాంశం చేయనున్న కమలం పార్టీ
- 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. బీఆర్ఎస్‌లో చేరడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్లాన్
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, అక్రమాలపైనా విస్తృత ప్రచారం

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి దీటైన ఆయుధాలను కాషాయ దళం సిద్ధం చేసుకుంటోంది. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించే క్రమంలో తన అమ్ములపొదిలోని అస్త్రాలను ఒక్కొక్కటిగా బయటకు తీయాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, నిరుద్యోగ భృతి వంటి గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రధాన వాగ్దానాలను సైతం నెరవేర్చక పోవడం, కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల్లో అవినీతి, 'ధరణి'లో అక్రమాలు, ఆయా అంశాలకు సంబంధించి వివిధ వర్గాల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని ఆయుధాలుగా చేసుకుని ఎన్నికల ప్రచారంలో దూసుకుపోవాలని బీజేపీ భావిస్తోంది. ముఖ్యంగా అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనన్న తమ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఈ రెండు పార్టీల్లో ఎవరికి ఓటు వేసినా ఒక్కటేనన్న అభిప్రాయం ప్రతి ఒక్క ఓటరుకూ కలిగేలా వివరించేందుకు వివిధ అంశాలను సిద్ధం చేసుకుంటోంది. తద్వారా అధికార బీఆర్ఎస్ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్ వైపు మళ్లకుండా చూడాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'ఓటుకు కోట్లు' కేసును, 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరడాన్ని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచినా మళ్లీ బీఆర్ఎస్‌లోకే వెళతారనే విషయాన్ని ప్రజల హృదయాల్లో నాటుకునేలా ప్రచారం చేయాలని నిర్ణయించింది.

'ఓటుకు కోట్లు'పై స్పెషల్ ఫోకస్

'ఓటుకు కోట్లు' కేసులో.. నాడు తెలుగుదేశం పార్టీలో ఉన్న నేటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన

మిగతా 2వ పేజీలో



జంగ్ తెలంగాణ

కనపడని సైన్యం!

సోషల్ మీడియాలో పార్టీల బల ప్రదర్శన

ఆరోపణలు, విమర్శలతో నేతల బాహాబాహీ

ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్.. ఇలా ప్రతి ఆన్‌లైన్ వేదికను వాడుతున్న తీరు

రేణుకమ్మల పోలరైజ్ పాలిటిక్స్


మధ్యప్రదేశ్ బాణాలు లక్ష్యం ఛేదిస్తాయా?

మూడు రాష్ట్రాల్లో 18 మంది ఎంపీలకు బీజేపీ టికెట్లు

రాజస్తాన్‌లో రాజె వర్గానికి చెక్ పెట్టే వ్యూహంలో బీజేపీ అగ్రనాయకులు

- వివరాలు 7,8 పేజీల్లో

హంగ్ వస్తే.. సీఎం కుర్చీలో బీఎస్పీ



అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఒక వేళ హంగ్ పరిస్థితులే ఉంటే సీఎం పదవిని ఆఫర్ చేసిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు.

- వివరాలు 2లో ▸



అంతర్గత ప్రతిభకే అందలం

ఉన్నత విద్యలో కొత్త మూల్యాంకన విధానం

- అసలైన నైపుణ్యం వెలికితీతకు వ్యూహం.. పాఠాలపై చర్చలు.. ప్రతి నెలా పరీక్షలు
- తరగతి గదిలో చురుకైన పాత్రకు మార్కులు
- ఓయూ పీజీ విద్యార్థులకు ఈ ఏడాది నుంచే అమలు
- వచ్చే ఏడాది నుంచి ఉన్నత విద్య మొత్తానికీ వర్తింపు



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో మూల్యాంకన విధానం పూర్తిగా మారబోతోంది. సంప్రదాయ పద్ధతులకు ఇక స్వస్తి పలకనున్నారు. మార్కులే కొలమానం కాకుండా, విద్యార్థిలోని నిజమైన ప్రతిభను వెలికి తీసి, దాని ఆధారంగా అతని క్రెడిట్స్ నిర్ణయిస్తారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని పోస్టు- గ్రాడ్యుయేట్ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరంలో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీలకు విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కసరత్తును ఓయూ మొదలు పెట్టింది. అధ్యాపకులకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేసింది. విద్యార్థులను కూడా ముందుగానే సమాయత్తం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఓయూ పరిధిలో పీజీ కోర్సులు చేసే దాదాపు 30 వేల మంది సరికొత్త మూల్యాంకన పరిధిలోకి వస్తారు. కొత్త మూల్యాంకన విధానంపై ఉన్నత విద్యా మండలి గత ఏడాది

మిగతా 3వ పేజీలో

గాజా అష్ట దిగ్బంధం

రాకెట్లు, డ్రోన్లతో ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడులు

లెబనాన్, సిరియా నుంచి ఇజ్రాయెల్‌పై కొనసాగుతున్న దాడులు

ఇరువైపులా 2,200 మందికి పైగా మృత్యువాత

ఇజ్రాయెల్‌లో 1,200, గాజాలో 1,055 మంది బలి

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం బుధవారం 4వ రోజుకు చేరుకుంది. హమాస్ మిలిటెంట్లను తుదముట్టించడమే ధ్యేయంగా వారి పాలనలో ఉన్న గాజా ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టింది. పూర్తిగా దిగ్బంధించింది. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బాంబుల మోత మోగిస్తున్నాయి. రాకెట్లు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నాయి.ఈ దాడుల్లో పదుల సంఖ్యలో భవనాలు ధ్వంసమవుతున్నాయి. ఇజ్రాయెల్, గాజాలో ఉన్న భారతీయులకు సహకరించేందుకు భారత విదేశాంగ శాఖ ఢిల్లీలో కంట్రోల్ రూమ్, టెల్ అవీవ్, రమల్లాలో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసింది.

- వివరాలు 6లో

సింగరేణి ఎన్నికలు వాయిదా



సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ నెల 28న జరగాల్సిన సింగరేణి ఎన్నికలను వాయిదా వేయాలన్న యాజమాన్యం అభ్యర్థనకు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం అంగీకరించింది. డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ ఎన్నికలకు సహకరించాలని, ఆ మేరకు కార్మిక సంఘాలకు స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

5లో



హరినాథ్



కిరణ్మయి



సుమతి



విజయ్

ఏపీ హైకోర్టు జడ్జీలుగా నలుగురి పేర్లు సిఫారసు

- న్యాయవాదులు హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌లను సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- రాష్ట్రపతి ఆమోదం తరువాత నోటి ఫికేషన్ జారీ చేయనున్న కేంద్రం
- ఈ నలుగురి నియామకంతో 31కి చేరనున్న హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య

12లో

దసరా తర్వాతే బస్సు యాత్ర!

అభ్యర్థుల ఎంపిక కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి ఉపయోగం లేదనే భావనలో కాంగ్రెస్

- టికెట్లురాని నేతల అసమ్మతి కార్యకలాపాలు సద్దుమణిగాక యాత్ర చేయడమే మేలనే యోచన.. విజయ దశమి తర్వాత మొదలుపెట్టి ఎన్నికల వరకు కొనసాగించాలని నిర్ణయం
- ఆ సమయంలో అగ్రనేతల ప్రచారం కూడా కలసి వస్తుందనే వ్యూహం
- అంతా ఐక్యంగా ఉన్నామనే భావన కలిగించడమే లక్ష్యంగా ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలంతా కలసి నిర్వహించ తలపెట్టిన బస్సుయాత్రకు బ్రేకులు పడ్డాయి. ఈ యాత్రను ముందుగా అనుకున్నట్టు ఈ నెల 15 నుంచి కాకుండా దసరా పండుగ తర్వాత ప్రారంభించాలని పీసీసీ నేతలు నిర్ణయించారు. ఎన్నికల ప్రచారం ముగిసేదాకా బస్సు యాత్రను కొనసాగించడం ద్వారా అప్పటివరకు పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని కొనసాగించవచ్చన్న వ్యూహంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు అభ్యర్థుల ఖరారు ప్రక్రియ ఓ కొలిక్కిరాకపోవడంతో అసమ్మతి బెడద నుంచి బయటపడేందుకే యాత్రను వాయిదా వేసినట్టు పలువురు నేతలు పేర్కొంటున్నారు.

రెండు ప్రతిపాదనలు

వాస్తవానికి ఈనెల 15వ తేదీ నుంచి రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున అన్ని జిల్లాలను చుట్టివచ్చేలా బస్సుయాత్ర చేపట్టాలని కాంగ్రెస్ సూత్రప్రాయంగా నిర్ణయించింది. రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో చర్చించి దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని భావించింది. ఈ మేరకు పీఏసీలో బస్సుయాత్రపై చర్చించిన నేతలు రెండు ప్రతిపాదనలు చేశారు. ఈ నెల 15 నుంచి 22 వరకు యాత్ర చేయాలని.. లేదంటే దసరా తర్వాతి నుంచి ఎన్నికలదాకా నిర్వహించాలని.. ఈ రెండింటిలో జాతీయ నాయకత్వం సూచన మేరకు ఏదో ఒక షెడ్యూల్‌ను ఖరారు చేయాలని మంగళవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఇదే విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మీడియాకూ చెప్పారు. ఇందులో రెండో ప్రతిపాదనకే అధిష్టానం మొగ్గు చూపిందని, దసరా తర్వాతే యాత్రకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిసింది.

ఐక్యంగా ఉన్నామని చాటేందుకే..

బస్సు యాత్ర వాయిదా వెనుక పలు కారణాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అభ్యర్థుల ప్రకటన ఈ నెల 16న లేదా 18న ఉండే అవకాశముంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తేలకుండానే క్షేత్రస్థాయికి వెళ్లి ప్రయోజనం ఉండదన్న ఆలోచన వచ్చినట్టు తెలిసింది. అంతేగాకుండా ఈనెల 15 నుంచి ప్రారంభిస్తే యాత్ర మధ్యలో ఉండగానే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంటుందని, టికెట్లు రాని వారి అసమ్మతి ప్రభావం యాత్రపై పడుతుందన్న భావన వ్యక్తమైనట్టు సమాచారం. ఈ మేరకు గొడవల మధ్య యాత్ర నిర్వహించడం ద్వారా ప్రయోజనం ఉండదనే భావనకు అధిష్టానం వచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు దసరా తర్వాత యాత్ర చేపట్టడం ద్వారా.. ఆ సమయంలో సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే వంటి అగ్రనేతలు హాజరయ్యేలా షెడ్యూల్ రూపొందించి.. ఎన్నికల ప్రచారానికి ఊపు తేవచ్చనే ప్రణాళికతో వాయిదాకే మొగ్గుచూపినట్టు వివరిస్తున్నాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలంతా ఐక్యంగా ఉన్నారని ప్రజల్లో భావన కలిగించే ఉద్దేశమూ దెబ్బ తినదన్న ఆలోచన చేసినట్టు పేర్కొంటున్నాయి.

హస్తినలో పాలమూరు సీట్ల పంచాయితీ!

- అభ్యర్థులపై పునఃపరిశీలన చేయాలంటూ సునీల్ టీమ్‌కు హైకమాండ్ ఆదేశాలు - 3లో

ఇదండీ సంగతి



పక్కా గెలుస్తాడనే నమ్మకం, ధైర్యం ఉందట సార్! టికెట్ ఇస్తారా.. కొనుక్కోమంటారా అని అడుగుతున్నాడ్సార్!!

క్లుప్తంగా...

16 తర్వాత బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా

నోటిఫికేషన్ వెలువడేలోగా మేనిఫెస్టోతో చార్జ్‌షీట్ విడుదల: డా.కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోతో పాటు కేసీఆర్ సర్కార్‌పై చార్జ్‌షీట్ కూడా విడుదల చేస్తామని ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. అదేవిధంగా ఈనెల 16వ తేదీ తర్వాత బీజేపీ అభ్యర్థుల తొలిజాబితా ప్రకటిస్తామన్నారు. బుధవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ...రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీకి అన్ని వర్గాలకు బీజేపీ సముచిత స్థానం కల్పిస్తుందని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు వాస్తవాలు చెబుతుంటే వాటికి సరైన సమాధానం చెప్పలేక మంత్రి కేటీరామారావు సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసికట్టుగా అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నా యని ఈ పార్టీలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పడం ఖాయమని వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్‌లో ప్రమాణాల పర్వం

వైరా అభ్యర్థి మదన్‌లాల్ నివాసంలో కొణిజర్ల నేతల ప్రమాణం



వైరా (ఖమ్మం జిల్లా): ఖమ్మం జిల్లా వైరాలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు టికెట్ రాకపోవడంతో ఆయన వర్గీయులు ఆ పార్టీ అభ్యర్థి బానోతు మదన్‌లాల్‌కు మద్దతు పలికే విషయంలో తాత్సారం చేశారు. ఆ తర్వాత రాములు నాయక్... బానోతుకు మద్దతు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ ఏం జరిగిందో ఏమో కానీ మొన్నటివరకు రాములునాయక్ వర్గంలో కొనసాగిన కొణి జర్ల మండలం తీగలబంజరకు చెందిన జెడ్పీటీసీ పోట్ల కవిత భర్త శ్రీను మండలంలోని పలు గ్రామాల కార్యకర్తలు, సర్పంచ్‌ల ను బుధవారం ఖమ్మంలోని మదన్‌లాల్ ఇంటికి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో బానోతు గెలుపునకు కృషి చేస్తామని...మండలంలో 20 వేల మెజార్టీ తగ్గకుండా తీసుకొస్తామంటూ ప్రమాణం చేయించారు. ఈ వీడియో బయ టకు రావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోట్ల శ్రీను అడుగు ముందుకేసి తన స్వగ్రామమైన తీగలబంజరలో సీపీఎం, సీపీఐ నాయకుల ఓట్లు కూడా మదన్ లాల్‌కు వేయిస్తామని ప్రమాణం చేయడం విశేషం.

బిడ్డ గుర్తొచ్చి గుండె బరువెక్కుతోందా?

మంత్రి కేటీఆర్ ట్వీట్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్ రీట్వీట్



సాక్షి, హైదరాబాద్: తన కుమారుడిని మిస్సవుతున్నానంటూ రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్)లో చేసిన పోస్టుకు బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఘాటుగా రీట్వీట్ చేశారు. 'దూరంగా ఉన్న బిడ్డ గుర్తుకొచ్చి గుండె బరువెక్కుతోందా కేటీఆర్' అని ప్రశ్నించారు. తనతో పాటు తన కుమారుడు హిమాన్షు ఉన్న ఫొటోను పోస్టు చేసిన కేటీఆర్ 'మిస్సింగ్ దిస్ కిడ్' అని పేర్కొన్నారు. ఈ ట్వీట్‌కు స్పందనగా... 'కొడుకుతో కొద్ది రోజుల ఎడబాటుకే ప్రాణం తల్లడిల్లిపోతోంది కదా... ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి ఇంటి మొహం చూడని లక్షలాది మంది నిరుద్యోగుల తల్లిదండ్రుల ఆవేదన నీలా కాదనుకున్నావా? సర్కారు హాస్టళ్లలో మీరు పెట్టే తిండి తినలేక ఏడుస్తున్నారని తెలిసి అమ్మానాన్నలు పడే ఆవేదన నీలా కాదనుకున్నావా? కొడుకు తిరిగిరాక, పదేళ్లుగా ఏ సాయానికి నోచుకోక కుమిలి కుమిలి ఏడుస్తున్న అమర వీరుడి కుటుంబ యాతన నీలా కాదనుకున్నావా? ఉద్యోగాలివ్వక నిరుద్యోగులని వంచించిన మీ సర్కారుకు తల్లిదండ్రుల శాపం తగిలి తీరుతుంది' అని రేవంత్ రీట్వీట్ చేశారు.

ప్రభుత్వ అనైతిక చర్యలు ఆపండి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, దాని యూనిట్‌లలోని లబ్ధిదారులకు పాత తేదీలతో (యాంటీ డేటెడ్ చెక్స్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ఫండ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయడంపై విచారణ జరిపించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కి బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. ఓటర్ల దృష్టిని ఆకర్షించేందుకుప్రభుత్వం ఇలాంటి అనైతిక, అక్రమ చర్యలకు పాల్పడకుండా ఆదేశించాలని సీఈవోకు సమర్పించిన వినతిపత్రంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కోరారు. తాము వివిధ రూపాల్లో సేకరించిన సమాచారం, వివరాల ఆధారంగా చూస్తే సింగరేణి సంస్థకు వివిధ వస్తువులు పంపిణీ చేసే పంపిణీదారులకు, వివిధ శాఖలకు చెందిన కాంట్రాక్టర్లకు పాత తేదీలతో చెక్కులను ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ప్రేమేందర్ తెలిపారు.

హంగ్ వస్తే.. సీఎం కుర్చీలో బీఎస్పీ

- కేసీఆర్ పులి అయితే ప్రతిపక్షాలంటే భయమెందుకు?
- కీలక స్థానాల్లో బీఆర్ఎస్ తొత్తులుగా అధికారులు
- ఇంటెలిజెన్స్‌లో రిటైర్డ్ అధికారులను తొలగించాలి
- బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కొత్తగూడెం సభలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఒక వేళ హంగ్ పరిస్థితులే ఉంటే సీఎం పదవిని ఆఫర్ చేసిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. ఎన్నికల శంఖారావం పేరుతో కొత్తగూడెంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై పలు విమర్శలు చేయడంతో పాటు బీఎస్పీకి సంబంధించిన మేనిఫెస్టోలోని కీలక అంశాలను వెల్లడించారు.

పులికి భయమెందుకు..

తెలంగాణ రాష్ట్ర ఖజానా నుంచి నెలకు రూ.3.50 లక్షల జీతం తీసుకుంటున్న సీఎం కేసీఆర్ నెల రోజుల నుంచి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. అక్టోబర్ 15న పులి బయటకు వస్తుందని మంత్రి కేటీఆర్ అంటున్నారని, ఆయన పులి అయితే ప్రతిపక్షాలంటే ఎందుకు భయపడుతున్నారని, ఎందుకు అక్రమ అరెస్టులు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు మైండ్ బ్లాంక్ అయ్యే పథకాలతో ప్రజల ముందుకు వస్తామని మంత్రి హరీశ్‌రావు అంటున్నారని, ఇప్పటికే ప్రజల మైండ్‌లను నాశనం చేశారని ప్రవీణ్ విమర్శించారు.

ఈసీకి ఫిర్యాదు చేస్తాం

ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని అనేక జిల్లాల్లో కీలక పదవుల్లో తమ అడుగులకు మడుగులు ఒత్తే అధికారులను బీఆర్ఎస్ పార్టీ నియమించుకుందని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. అందరి వివరాలతో జాబితా రెడీ చేస్తున్నామని, త్వరలోనే ఎన్నికల కమిషన్‌ను కలిసి ఈ అంశంపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు. వివిధ పదవుల నుంచి రిటైరైన కేసీఆర్ కుటుంబ సభ్యులు, దూరపు బంధువులకు ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక బాధ్యతలు అప్పగించినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికలు ముగిసేవరకు వారిని ఆ పోస్టులకు దూరంగా ఉంచాలని ఈసీని కోరారు. కొందరు అధికారులు కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా పాత తేదీలతో సంతకాలు చేస్తున్నారని, ఆ వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. కాగా, కమ్యూనిస్టులు కమ్యూనిజాన్ని మరిచిపోయి దొరల గడీల దగ్గర కాపలా కాస్తున్నారని ఆయన విమర్శించారు.

119 నియోజకవర్గాల్లో పోటీ

రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. ఈ మేరకు 1,300 దరఖాస్తులు తమకు అందాయన్నారు. ఇందులో మేధావులు, ప్రొఫెసర్లు, రిటైర్డ్ ఐఏఎస్‌లు, స్కాలర్లు ఉన్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని ప్రకటించారు.

బీఎస్పీ మేనిఫెస్టోలో కీలక అంశాలు

- ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్సీ, బీసీ, అగ్రవర్ణ పేదలకు పోడు పట్టాల పంపిణీ
- భూమి లేని వారికి కనీసం ఎకరం భూమి పంపిణీ
- ప్రతీ మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల
- రాష్ట్ర వ్యాప్తంగా ఏసీ సౌకర్యంతో కూడిన కోచింగ్ సెంటర్లు
- ప్రతీ కుటుంబం నుంచి ఒకరు విదేశాల్లో విద్యనభ్యసించేలా ప్రణాళిక
- ఆయుఃప్రమాణం వందేళ్లకు పెంచేలా వైద్య రంగంలో మార్పులు
- మహిళలకు ఉచితంగా డ్రైవింగ్‌లో శిక్షణ
- పది లక్షల ఉద్యోగాల కల్పన, అందులో 50 శాతం మహిళలకు..
- కౌలు రైతులను ఆదుకునేలా విధానాలు
- జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపులు.

దోపిడీ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం
- రాష్ట్రం రూ.5 లక్షల కోట్ల అప్పుల పాలైంది
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'తెలంగాణ ప్రజలు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దోపిడీ ప్రభుత్వాన్ని తరిమికొట్టి.. ప్రజాప్రభుత్వాన్ని, ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకోవాలి. రాష్ట్ర సంపద, వనరులను ప్రజలకు పంచుకోవడం కోసం తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణను దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు దోచుకుంటున్నారు. ప్రజలు ఈ దోపిడీ ప్రభుత్వాన్ని వదిలించుకోవాలి' అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని అనంతసాగర్ గ్రామంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంపదను ప్రజలకు పంచడం కోసమే ఆరు గ్యారెంటీలను ప్రకటించిందని, తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ.. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఓట్లు దోపిడీ చేసిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు మరోసారి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ప్రజలను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణను సాధించుకున్నది ప్రజల కోసమే తప్ప.. దొరలు, దోపిడీదారుల కోసం కాదని అన్నారు. ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు, పరిశ్రమ.. ఇలా పనికొచ్చే ఏ వ్యవస్థ కూడా రాష్ట్రానికి రాకపోగా తెలంగాణ రూ.5 లక్షల కోట్ల అప్పుల పాలైందని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎక్స్‌పైరీ అయిపోయిన డ్రగ్‌లా మారిందని, బీజేపీతో చేతులు కలిపి తెలంగాణలో బీ టీమ్‌లా పనిచేస్తోందని ఆరోపించారు. దీనికి ఎంఐఎం వంతపాడుతూ భజన చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే.. బీజేపీకి వేసినట్టేనన్నారు. దేశ సంపదను ప్రధాని మోదీ బహుళజాతి సంస్థలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం లేదని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నాయని అన్నారు. సింగరేణి వంటి సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న భూములను అమ్మేసుకుంటున్నారని, ధరణిలో ప్రభుత్వ పెద్దల పేరుతో భూములను నమోదు చేయించుకుంటున్నారని అన్నారు. ఔటర్‌రింగ్ రోడ్డును కూడా ఓ ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చి, 30 ఏళ్ల ఆదాయాన్ని ఆ సంస్థకు ధారాదత్తం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని మండిపడ్డారు. తమది జాతీయ పార్టీ అని.. పొత్తులపై జాతీయ స్థాయిలోనే నిర్ణయాలు ఉంటాయని భట్టి వెల్లడించారు.

గిరిజన బిడ్డను రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీదే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న కిషన్‌రెడ్డి

ములుగు/ఎస్ఎస్ తాడ్వాయి: గిరిజన బిడ్డను రాష్ట్రపతి చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క – సారలమ్మలను రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎస్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్ గరికపాటి మోహన్‌రావు, మాజీ మంత్రి జగన్నాయక్, అజ్మీరా ప్రహ్లాద్, పార్లమెంటరీ ఇన్‌చార్జ్ హుస్సేన్ నాయక్‌లతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే గిరిజనులకు 12 శాతం, దేశవ్యాప్తంగా 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. హైదరాబాద్ కేంద్రంగా గిరిజన మ్యూజియం ఏర్పాటుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సమ్మక్క–సారలమ్మ పేరుతో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేసి, నిర్మాణానికి రూ.900 కోట్ల నిధులను మంజూరు చేసిన ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ములుగుతో పాటు భూపాలపల్లి, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను కలుపుకుని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి గుండేటి విజయ రామారావు, ఏనుగు రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ పతనాన్ని చూస్తే జాలేస్తుంది

దాసోజు శ్రవణ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పతనాన్ని చూస్తే జాలేస్తుందని టీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్)లో ట్వీట్ చేశారు. ఒకప్పుడు సిద్ధాంతాలకు, ప్రజా సంక్షేమానికి కట్టుబడ్డ కాంగ్రెస్ పార్టీ నేడు రాజకీయాలను వ్యాపారంగా, డబ్బు సంపాదనకు సులువైన మార్గంగా భావించే రేవంత్‌రెడ్డి చేతిలో బందీ కావడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. 'రేవంత్ పే పట్ల జాగ్రత్త. తెలంగాణ భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు. రేవంత్ పార్టీ టికెట్లను అమ్ముకుంటున్న తీరు అత్యంత జుగుప్సాకరమన్నారు. ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకుని తమ సొంత పార్టీ అభ్యర్థులనే దోచుకుంటున్న కాంగ్రెస్ నాయకులు పొరపాటున అధికారంలోకి వస్తే, తెలంగాణకు ఎదురయ్యే దుష్పరిణామాలను తలుచుకుంటేనే భయమేస్తోందని పేర్కొన్నారు.

బీజేపీ బ్రహ్మాస్త్రాలు!

▶ మొదటి పేజీ తరువాయి

సంగతి తెలిసిందే. కాగా కేసీఆర్ సర్కార్ ఈ కేసులో ఏసీబీ తదుపరి విచారణ జరపకుండా అటకెక్కించడాన్ని ప్రధానాస్త్రంగా చేసుకుని ప్రచారం సాగించాలని, కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీని ఇది స్పష్టం చేస్తోందంటూ ఆ పార్టీలను ఎండగట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని సాగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకూ ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు తెలిసింది. 'ఓటుకు కోట్లు' అస్త్రం ఎన్నికల్లో తమకు బాగా ఉపయోగ పడుతుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. 2015లో తమ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ నామినేటెడ్ ఎమ్మెల్యేకు టీడీపీ పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి ప్రలోభాలకు గురిచేయడాన్ని స్పై కెమెరాలతో రికార్డ్ చేయడంతో పాటు రేవంత్‌రెడ్డిని పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కొన్నిరోజులు జైల్లో గడిపిన రేవంత్‌రెడ్డి బయటకు రాగా.. టీడీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో కుమ్మక్కైన బీఆర్ఎస్ దీనిపై తదుపరి విచారణ జరిపి చర్యలు తీసుకోకుండా అటకెక్కించిందని బీజేపీ ముఖ్యనేతలు కొంతకాలంగా ఆరోపిస్తున్న సంగతి విదితమే. కాగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇదే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆ పార్టీ అధిష్టానం భావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో పరస్పరం సహకరించుకోవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య కుదిరిన రహస్య ఒప్పందం కారణంగానే ఈ కేసు విచారణ ముందుకు సాగకుండా చేస్తున్నారనే విషయాన్ని ప్రజలకు వివరించడం ద్వారా బీజేపీకి అనుకూలంగా మద్దతు కూడగట్టాలని భావిస్తోంది. దీనితో పాటు టీపీసీసీ రేవంత్ రెడ్డికి, బీఆర్ఎస్ నాయకురాలితో ఉన్న రహస్య వ్యాపార సంబంధాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఈ రెండు పార్టీలు ఒక్కటేననే అభిప్రాయం ప్రజల్లో బలపడేలా చేయాలని యోచిస్తోంది. అలాగే ఎన్డీఏ బలపరిచిన రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపదీ ముర్మును కాదని కాంగ్రెస్, ఇతర పార్టీలు బలపరిచిన యశ్వంత్ సిన్హాకు కేసీఆర్ మద్దతు తెలపడం, ప్రధాని మోదీపై కాంగ్రెస్, ఇతర పక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కూడా భారత రాష్ట్ర సమితి మద్దతు పలకడం వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కమలనాథులు భావిస్తున్నారు.

అవినీతి, అక్రమాలు

కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల్లో ప్రభుత్వ అవినీతిని బాగా ప్రచారం చేయాలని బీజేపీ భావిస్తోంది. కాళేశ్వరం కేసీఆర్ సర్కార్‌కు ఏటీఎంలా మారిందని బీజేపీ అగ్రనేతలు సైతం పదేపదే ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఇక ధరణి పోర్టల్ తెచ్చి రెవెన్యూ రికార్డుల నవీకరణ పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారని కూడా బీజేపీ ఆరోపిస్తున్న విషయం విదితమే. కాగా ఇప్పుడు కూడా ధరణితో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగాన్ని తమ సొంత భూములపై హక్కుల విషయంలో ఆందోళనకు గురిచేసి పెద్ద మొత్తంలో అవినీతి, అక్రమాలకు బీఆర్ఎస్ అవకాశమిచ్చిందంటూ ప్రచారం చేయాలని కాషాయ దళం భావిస్తోంది. ఈ అస్త్రాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి బాధిత రైతులు, ప్రజలు, వారి కుటుంబసభ్యుల మద్దతు కూడగట్టాలని నిర్ణయించింది.

వైఫల్యాలపై విస్తృత ప్రచారం

గత తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను సమర్థవంతంగా ఎండగట్టేలా ఎన్నికల ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని కూడా బీజేపీ నాయకత్వం నిర్ణయించింది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ నినాదమైన నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం వైఫల్యం చెందడాన్ని, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీతో నిరుద్యోగుల ఆశలకు గండి కొట్టడాన్ని, నిరుద్యోగ యువతకు ఇస్తామన్న భృతి ఇవ్వకుండా అన్యాయం చేయడాన్ని ప్రజల్లో బాగా ప్రచారం చేయాలని భావిస్తోంది. తద్వారా ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న యువజనులను (పెద్ద సంఖ్యలో ఓటర్లుగా ఉన్నారు) బీజేపీ వైపు తిప్పుకునేలా పావులు కదుపుతోంది. అలాగే పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు హామీ పూర్తిస్థాయిలో నిలుపుకోకపోవడం, అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యేల అనుయాయులకు ఎక్కువగా కేటాయించడం ఎండగట్టాలని నిర్ణయించింది. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు జరిగిన నష్టం, అన్యాయం గురించి, వివిధ పథకాల పేరిట ప్రచారమే తప్ప పెద్దగా మేలు చేయకపోవడం, ప్రయోజనం కల్పించకపోవడాన్ని విస్తృతంగా ప్రచారం చేసి ఈ వర్గాల మద్దతును కూడా కూడగట్టాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు, తదితర పథకాలు కేవలం ప్రచారానికే పరిమితమైన తీరును, గిరిజన బంధు, బీసీ బంధు అంటూ ఊరించడం తప్ప ఎలాంటి కార్యాచరణను చేపట్టకపోవడాన్ని ప్రజల్లో ప్రచారం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

కాంగ్రెస్‌కు ఎన్నిక అంటే ఏటీఎమ్

టికెట్లకు అర్రాజు పెట్టి లోపలేసుకోవడమే పని

- నాడు ఓటుకు కోట్లు, నేడు సీటుకు నోటు.. ఇప్పుడు రేటెంత రెడ్డి అంటున్నారు
- పీసీసీ చీఫ్ రేవంత్‌పై మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- దేవరకొండ కాంగ్రెస్ నేత బిల్యా నాయక్ బీఆర్ఎస్‌లో చేరిక



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత బిల్యా నాయక్. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ పార్టీకి ఎన్నిక అంటే ఏటీఎమ్. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఒక్కో సీటుకు బేరం పెట్టి అర్రాజు పాడి రూ.20 కోట్ల దాకా లోపలేసుకోవడమే పనిగా పెట్టుకున్నడు. ఒకనాడు ఓటుకు కోట్లు, నేడు సీటుకు నోటు.. ఇప్పుడు రేటెంత రెడ్డి అంటున్నారు. కాంగ్రెస్ పార్టీతో ఊదు కాలదు పీరీ లేవదు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత బిల్యా నాయక్‌తో పాటు దేవరకొండ, ఉప్పల్ నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీ ఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'ఎన్నికలు రాగానే కాంగ్రెస్ నాయకులు కొత్త బట్టలు కుట్టిచ్చుకుని, ఇళ్లకు సున్నాలు వేసుకుని ముఖ్యమంత్రి, మంత్రులు అవుతామంటూ జమ అయితరు. మీడియాలో సర్వే మాకే అనుకూలంగా ఉందని పాత కథ చెప్తరు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేసీఆర్‌ను ఓడించేంత వరకు గడ్డం తీయనని చెప్పాడు. కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం చేస్తానని రేవంత్ ప్రకటించి, ఆ సన్నాసి మళ్లీ పోటీ చేసిండు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

అబద్ధాల అమిత్ షా క్షమాపణ చెప్పాలి

'కాంగ్రెస్ దివాలాకోరు రాజకీయం చేస్తుంటే బీజేపీ నుంచి రోజుకో నాయకుడు వచ్చి మొరుగుతున్నారు. రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ చివరి స్థానంలో ఉందని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే హోమ్ మంత్రి అమిత్ షా మాత్రం ఆత్మహత్యలో టాప్ అని అబద్ధాలు చెప్తున్నారు. వీరికి ప్రజలు ఏమనుకుంటారనే సిగ్గూ, భయం లేదు. అమిత్ షాకు బాధ్యత ఉంటే తన వ్యాఖ్యలను సవరించుకుని క్షమాపణ చెప్పాలి'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కేసీఆర్ ప్రభుత్వం మీద వ్యతిరేకత లేదు

'తొమ్మిదేళ్లుగా పాలించిన ప్రభుత్వంపై అసంతృప్తి, అసహనం ఉండటం సహజం. కానీ ఒక్క చోట కూడా ప్రభుత్వం మీద వ్యతిరేక కనపడటంలేదు. కాంగ్రెస్ ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరుతోంది. మన వేలితో మన కంటిని పొడుచు కుందామా. అంధకారం కావాలంటే కాంగ్రెస్‌కు.. వెలుగు జిలుగులు కావాలంటే బీఆర్ఎస్‌ను ఎన్నుకోండి. ఒక వైపు కారు.. మరో వైపు బేకారు కాంగ్రెస్, బీజేపీ ఉన్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రజలకు బదులుగా వారే బాగుపడ్డారు. కేసీఆర్ తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని నంబర్ వన్ చేశారు. బిడ్డలను అమ్ముకునే దుస్థితి నుంచి దేవరకొండను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. ఏడాదిన్నరలో డిండి ద్వారా దేవరకొండకు నీళ్లు ఇచ్చి రుణం తీర్చుకుంటాం. అని కేటీఆర్ పేర్కొన్నారు. నల్లగొండలో బీఆర్ఎస్ గాలి వీస్తోందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్, ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి, పార్టీ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి, దాసోజు శ్రవణ్, తాడూరు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరువు, కర్ఫ్యూ, ముడుపులు, ముఠాలకు కేరాఫ్ కాంగ్రెస్

ఆ పార్టీని ప్రజలు ఎప్పుడో మరచిపోయారు: మంత్రి హరీశ్‌రావు



సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. ముత్తిరెడ్డి కాళ్లకు నమస్కరిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తప్పిదారి అధికారంలోకి వస్తే.. కైలాసం ఆటలో పెద్ద పాము మింగిన విధంగా తెలంగాణ పరిస్థితి మారిపోతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో, ఈ నెల 16న జనగామ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభ నేపథ్యంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందులో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక్క చాన్స్ అంటూ ప్రజలను బతిమిలాడుకుంటున్న కాంగ్రెస్‌కు.. ప్రజలు 11 సార్లు అధికారం కట్టబెడితే ఒరగబెట్టింది ఏమీ లేదన్నా రు. ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ తెలంగాణను దేశం గర్వించే స్థాయికి తీసుకెళ్లారన్నారు. కరువులు, కర్ఫ్యూలు, ముడుపులు, ముఠాలు, మతం పేరిట గొడవలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్ అని, ప్రజలు ఆ పార్టీని పక్కన బెట్టి ఎప్పుడో మరచిపోయారని అన్నారు. కర్ణాటకలో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో కరెంటు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, ప్రతి ఇంటికి మంచినీళ్లు అందించడంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తోందన్నారు. ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నా.. మీ ఆశీర్వాదం కావాలి

సమావేశంలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతుండగా.. అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి యాదగిరిరెడ్డికి కాళ్లు మొక్కేందుకు వంగారు. 'అన్నా.. మీ ఆశీర్వాదం కావాలి'అంటూ కడుపులో తలపెట్టి మోకాళ్లను పట్టుకున్నారు. ఇందుకు ప్రతి గా ముత్తిరెడ్డి మాట్లాడుతూ 'తమ్ముడూ.. మీ గెలు పులో నా కృషి వందశాతం ఉంటుంది'అని బదులిచ్చారు.

తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- అవినీతి రహిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చూపిస్తాం
- మజ్లిస్ చేతుల్లో బీఆర్ఎస్ స్టీరింగ్
- బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ అన్నారు. తెలంగాణలో అవినీతి రహిత ప్రభు త్వాన్ని ఏర్పాటు చేసి చూపిస్తామన్న ఛుగ్, బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ఏటా సెప్టెంబర్ 17న ప్రతీ గ్రామంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా, కేసీఆర్ ప్రభుత్వాన్ని అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీనే నడిపిస్తోందని.. బీఆర్ఎస్ పార్టీ స్టీరింగ్ మజ్లిస్ చేతుల్లో ఉందని మండిపడ్డారు. మజ్లిస్ చేతుల్లోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను సరైన మార్గంలో తీసుకెళ్లదని, జాతీయవాదంతో పనిచేసే బీజేపీ మాత్రమే రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపిస్తుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ తన పాలనతో, తెలంగాణ ప్రజలను ఓట్లు అడిగే హక్కు కోల్పోయారన్నారు. అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. తన కుటుంబాన్నే బంగారు కుటుంబంగా తయారు చేయడంలో మునిగి పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అహంకారం, అవినీతి సమస్యలు తారస్థాయికి చేరుకున్నాయని తరుణ్ ఛుగ్ అన్నారు. కాగా, కుటుంబ రాజకీయా లకు స్వస్తి పలికి పర్ఫార్మెన్స్ ఆధారిత రాజకీ యాలను నెలకొల్పారని ఛుగ్ అన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వాన్ని తీసుకురావాలంటే బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే మార్గమన్నారు. దేశం మొత్తం బలపరిచే బీజేపీ పాలన కావాలా? లేక అవినీతి, కుంభకోణాలు చేసే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రభుత్వం కావాలా? అనేది తెలంగాణ ప్రజలు నిర్ణయించుకోవాలని అన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే..

- దసరాకు ముందే కాంగ్రెస్ సీట్ల ప్రకటన: ఎంపీ కోమటిరెడ్డి
- నల్లగొండలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని, కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని ఒకరినొకరు తిట్టుకుంటున్నట్లు యాక్షన్ చేస్తున్నారని కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేయడంతో పాటు క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడిందని మోదీతోపాటు అమిత్‌షా కూడా చెప్పారని, నిజంగా బీఆర్ఎస్‌తో సంబంధం లేకపోతే మోదీ ఎందుకు సీబీఐ చేత విచారణ చేయించడం లేదని ప్రశ్నించారు. బీజేపీకి తెలంగాణలో ప్రజా ఆదరణ లేదని, రెండు సీట్లు కూడా రావన్నారు.

ఓడిపోతారని వారి సర్వేలోనే తేలింది...

బీఆర్ఎస్ పార్టీ ఓడిపోతుందని ఆ పార్టీ చేయించుకున్న సర్వేలోనే తేలిందని, అందుకనే బావ, బావమరిది కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారని వెంకట్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఏజెన్సీలు సర్వేలో చెబితే.. అది తప్పని బీఆర్ఎస్ పార్టీ అనడం విడ్డూరంగా ఉందన్నారు. దాదాపు 90% టికెట్లు ఖరారయ్యాయని, దసరా లోగా ప్రకటించే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా...

ఏపీ సీఎం జగన్‌ను కలిసిన నైనా జైశ్వాల్



సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ని ప్రపంచ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైశ్వాల్ కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె సీఎంతో భేటీ అయ్యారు. ఆమెతో పాటు సీఎంను కలిసిన వారిలో నైనా జైశ్వాల్ తల్లిదండ్రులు భాగ్యలక్ష్మి జైశ్వాల్, అశ్వనీకుమార్ జైశ్వాల్, సోదరుడు అగస్త్య జైశ్వాల్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులున్నారు.

15 నుంచి ఐసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 15 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యా విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. స్లాట్‌బుక్ చేసుకున్నవారు 16న ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవ్వాలని, 16 నుంచి 17 వరకు ఆప్షన్లు ఇవ్వొచ్చంది. ఈనెల 20న సీట్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించింది. సీట్లు వచ్చిన అభ్యర్థులు ఈనెల 29లోగా ఆన్‌లైన్, 31వ తేదీలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించింది.

మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష గడువు 31కి పొడిగింపు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ కోసం 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసే గడువును పొడిగించారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. వివరాలకు http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వాలని సూచించారు.

మా పార్టీ సీఎం అభ్యర్థి తీన్మార్ మల్లన్న కాదు

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతల స్పష్టీకరణ

పంజగుట్ట (హైదరాబాద్): ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కొన్ని సీట్లు బ్లాక్ చేసి పెట్టింది, ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించింది అని చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వీ.ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ మృత్యుంజయ స్పష్టంచేశారు. 'మా పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ప్రకటించామనడంలో నిజం లేదు. మాది జాతీయ పార్టీ. ఏ ప్రకటన చేసినా జాతీయ నాయకుల సూచనల మేరకే చేస్తాం 'అని ప్రకటించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే అభ్యర్థులు పంజగుట్టలోని తమ నేతాజీ భవన్‌లోని కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 119 స్థానాల్లో బరిలో ఉంటామన్నారు. సమావేశంలో తౌఫీక్ అలీ, మేకల శ్రీధర్, శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, జంగం రమేశ్, రాజేశ్, చిన్నం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హస్తినలో పాలమూరు పంచాయితీ!

- ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ సీట్లలో సగానికిపైగా ఇతర పార్టీల నుంచి చేరినవారికే!
- టికెట్ల ఖరారు ప్రచారంతో కాంగ్రెస్ జిల్లా నేతల్లో ఆందోళన
- కాంగ్రెస్‌వాదులు, వలసవాదుల నినాదంతో నిరసన
- ప్యారాచూట్లకు టికెట్లిస్తే పార్టీకి సేవచేసిన వారు ఏం కావాలంటూ ప్రశ్నలు... ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్, ఇతర పెద్దలకు వరుసగా ఫిర్యాదులు
- స్పందించిన హైకమాండ్.. అభ్యర్థులపై పునః పరిశీలన చేయాలంటూ సునీల్ కనుగోలు టీమ్‌కు ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పరిధిలో అసెంబ్లీ టికెట్లపై పంచాయితీ ముదిరింది. దశాబ్దాలుగా పార్టీకి సేవలు చేస్తున్న తమకే టికెట్లు ఇవ్వాలంటూ కాంగ్రెస్ వాదులు.. గెలుపు అవకాశాలున్న తమకే టికెట్లు కావాలంటూ వలస నేతలు ఎవరికి వారు గట్టిగా పట్టుబట్టడంతో ఈ వ్యవహారం ఢిల్లీలో హైకమాండ్ పెద్దలకు చేరింది. ఉమ్మడి పాలమూరు నేతలు దీనిపై వరుసగా ఫిర్యాదులు చేస్తుండటంపై పార్టీ పెద్దలు స్పందించినట్టు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల ఎంపికపై పునః పరిశీలన చేయాలని ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందాన్ని ఆదేశించినట్టు సమాచారం.

పార్టీకి సేవ చేసినవారికి గుర్తింపేదీ?

అభ్యర్థుల ఎంపికపై పార్టీ స్క్రీనింగ్ కమిటీ ప్రతి భేటీలోనూ కాంగ్రెస్ వాదులు, వలసవాదులు అన్న పంచాయితీ కొనసాగుతూ వస్తోంది. ఇతర పార్టీల నుంచి వచ్చిన ప్యారాచూట్లకు టికెట్ల కేటాయింపుపై ఆచితూచి వ్యవహరించాలని సీనియర్ నేతలు ఇప్పటికే పలుమార్లు పేర్కొన్నారు. వారికే 60 శాతానికిపైగా సీట్లిస్తే తొలినుంచీ కాంగ్రెస్‌లో ఉన్నవారిలో నైరాశ్యం నెలకొంటుందని, పార్టీకి పనిచేసేవారు కరువవుతారని వారు స్పష్టం చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే సరేగానీ, రానిపక్షంలో ప్యారాచూట్లంతా ఎగిరిపోవడం ఖాయమని.. అదే జరిగితే పార్టీ ప్రాథమిక నిర్మాణానికే ముప్పు ఉంటుందని పేర్కొంటున్నారు. అయినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సగానికిపైగా సీట్లను ఇతర పార్టీల నుంచి వచ్చినవారికే ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడుతున్నారు.

ఏడింటిలో ఐదు వారికే అయితే..

- నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సీట్లలో ఐదింటిని ప్యారాచూట్ నేతలకే ఇచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. కల్వకుర్తిలో ఇటీవల పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి టికెట్ ఫైనల్ కానుందని.. స్థానిక నేత చల్లా వంశీచంద్‌రెడ్డిని ఒప్పించాకే ఇక్కడ టికెట్ కేటాయింపుపై ముందుకు వెళ్తుండటంతో వివాదం లేదని చెప్తున్నాయి.
- నాగర్‌కర్నూల్‌లో సీనియర్ నేత నాగం జనార్దనరెడ్డిని కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కుమారుడు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి టికెట్ ఖరారైందనే ప్రచారం జరుగుతోంది. దీనిపై నాగం వర్గం నేతలు ఇటీవలే గాంధీభవన్‌లో గొడవ చేశారు కూడా. టికెట్ విషయంలో నాగం స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సహా ఇతర పెద్దలకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ అక్రమాలపై, ప్రాజెక్టుల్లో అవినీతిపై బలంగా పోరాడుతున్న తనను పక్కనపెట్టే ప్రయత్నాలపై హైకమాండ్ వద్దే తేల్చుకోవాలని భావిస్తున్నారు.
- వనపర్తిలో పార్టీ సీనియర్ నేత జి.చిన్నారెడ్డికి ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన మేఘారెడ్డికి టికెట్ ఇవ్వొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. దీనితో చిన్నారెడ్డి ఢిల్లీ వెళ్లి కేసీ వేణుగోపాల్ సహా ఏఐసీసీ స్థాయిలో తనకు సన్నిహితంగా ఉండే పెద్దలకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఆయన స్క్రీనింగ్ కమిటీ సభ్యులనూ కలిసినట్టు సమాచారం.
- బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరడంపై తొలి నుంచీ అసంతృప్తితో ఉన్న కొల్లాపూర్ నేత జగదీశ్వర్‌రావు సైతం ఢిల్లీ వెళ్లి హైకమాండ్ పెద్దలను కలిశారు.
- గద్వాలలో బీఆర్ఎస్ జెడ్పీచైర్మన్ సరిత తిరుపతయ్యకు కాంగ్రెస్ టికెట్ దక్కిందన్న ప్రచారంతో రగిలిపోతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, ఓయూ విద్యార్థి నేత కురువ విజయకుమార్‌లు కూడా ఖర్గే, కేసీ వేణుగోపాల్, మురళీధరన్, నజీర్ హుస్సేన్, జిగ్నేశ్ మేవానీ, ముకుల్‌వాస్నిక్‌లను కలిశారు. కేవలం మూడు నెలల ముందు పార్టీలో చేరిన సరితకు టికెట్ ఇవ్వొద్దని, తమలో ఒకరికి టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
- మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం పరిధిలోని మక్తల్‌లో పదిహేను రోజుల కింద కాంగ్రెస్‌లోకి వచ్చిన కొత్తకోట సిద్ధార్థరెడ్డికి వ్యతిరేకంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు వాకాటి శ్రీహరి ఢిల్లీలోనే మకాం వేశారు.
- మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి వచ్చిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇవ్వొద్దంటూ.. స్థానిక నేతలు ఒబేదుల్లా కొత్వాల్, సంజీవ్ ముదిరాజ్, ఎన్పీ వెంకటేశ్ తదితర నేతలు అభ్యంతరాలు చెప్తున్నారు.
- ఇన్ని పంచాయితీల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై పునః పరిశీలన చేయాలని సునీల్ కనుగోలు టీమ్‌కు హైకమాండ్ నుంచి ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది. ఆయా స్థానాల్లో ఇతర అభ్యర్థుల బలాబలాలపై బేరీజు వేయాలని సూచించినట్టు సమాచారం.

రూ. 2 కోట్ల 47 లక్షలు..

- పోలీసుల తనిఖీల్లో భారీగా నగదు స్వాధీనం,
- కేజీ 600 గ్రాముల బంగారం పట్టివేత



చైతన్యపురి పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

సాక్షి నెట్ వర్క్: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం వివిధ ప్రాంతాల్లో సరిగ్గా లెక్క చూపని, సరైన పత్రాల్లేని రూ. 2,47,30,500 నగదు, కేజీ 600 గ్రాముల బంగారం పట్టుబడ్డాయి. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఆయా నగదును, బంగారాన్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

- **మంచాల:** రంగారెడ్డి జిల్లా మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆగాపల్లి వద్ద మంచాల మండలం లోయపల్లికి చెందిన కె.శ్రీనివాస్ కారులో రూ.20 లక్షలు, కూకట్‌పల్లికి చెందిన సీహెచ్ రాజశేఖర్‌రెడ్డి కారులో రూ.2లక్షలు పట్టుబడ్డాయి.
- **చిక్కడపల్లి:** నిర్మల్ జిల్లా బైంసా ప్రాంతానికి చెందిన శ్రీధర్ తన కియా కారులో కేజీ బంగారం తీసుకువెళ్తుండగా గాంధీనగర్ స్టేషన్ పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.58 లక్షల విలువైన ఆ బంగారానికి సంబంధించి సరైన పత్రాలు చూపిస్తే అందజేస్తామని లేకపోతే ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు.
- హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో దోమలగూడ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో వెంకటరమణ అనే ద్విచక్రవాహనదారుడు నుంచి రూ.1,75,000 స్వాధీనం చేసుకున్నారు.
- **చైతన్యపురి:** బైక్‌లపై వెళ్తున్న దిల్‌సుఖ్‌నగర్ వీవీనగర్‌కు చెందిన బిరాదార్ సిద్దేశ్వర్, సరూర్‌నగర్ ఇంద్రహిల్స్‌కు చెందిన బి.శంకర్‌రెడ్డి నుంచి రూ.60 లక్షల నగదును చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు.
- **చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరులో బ్యాంక్ ఉద్యోగి చీర్యాల సాయికుమార్ కారులో రూ. 45 లక్షలు ఉండటంతో ఆ డబ్బును సీజ్ చేశారు.
- **అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని తమ్మరబండపాలెం వద్ద ధాన్యం వ్యాపారి చింతకుంట్ల కోటేశ్వరరావుకు చెందిన కారులో రూ.7లక్షల 30వేలు లభ్యమయ్యాయి.
- **రామగిరి:** నల్లగొండ జిల్లా తిప్పర్తి వద్ద నెల్లూరు జిల్లాకు చెందిన కుంచాల సుధాకర్ కారులో పోలీసులు రూ.8 లక్షల 50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.
- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ధర్మసాగర్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో రూ.18,39,500, అంతారం స్టేజీ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.7.40 లక్షలు , కొత్తూరు బైపాస్ (వై జంక్షన్)వద్ద రూ.8.85 లక్షల నగదు, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో రూ. 5.11 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- **చైతన్యపురి:** సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి కొత్తపేట చౌరస్తాలో గోషామహల్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి సునీల్ జహంగీర్ నుంచి రూ. 7 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- **విజయనగర్‌కాలనీ:** గోల్కొండ టోలిచౌకీలోని అప్సర్ కాలనీకి చెందిన మహ్మద్ అశ్వాక్ ద్విచక్రవాహనంలో రూ.6 లక్షలు ఉన్నట్లు ఆసిఫ్‌నగర్ పోలీసులు గుర్తించారు.
- **జియాగూడ:** కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పురానాపూల్ చౌరస్తాలో నార్సింగికు చెందిన ఆనంద్ నుంచి సుమారు 30 లక్షల విలువచేసే 600 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- **ఇందల్వాయి:** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి వద్ద కామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు కారులో వస్తున్న ఓ వ్యక్తి నుంచి రూ. 50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

త్వరలో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు

సిద్ధమైన రెండు బస్సులను పరిశీలించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ కేటగిరీల్లో త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ప్రస్తుతం విజయవాడ మార్గంలో 10 ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతున్నాయి. ఇవి రాజధాని కేటగిరీలో ఉన్నాయి. రాష్ట్రంలో తొలిసారి నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు దూర ప్రాంతాలకు తిరగబోతున్నాయి. చమురు భారాన్ని తగ్గించుకునే క్రమంలో టీఎస్ఆర్టీసీ 1,860 ఎలక్ట్రిక్ బస్సులకు గతంలో ఆర్డర్ ఇచ్చింది. వాటిల్లో 500 బస్సులను హరియాణాకు చెందిన జేబీఎం గ్రూపు సరఫరా చేయనుంది. ఈ బస్సులు ప్రస్తుతం హరియాణాలోని పల్వాల్‌లో ఉన్న జేబీఎం గ్రూపు కంపెనీలో తయారవుతున్నాయి. సిద్ధమైన రెండు బస్సులను బుధవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఈడీ వెంకటేశ్వర్లు ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. సంస్థ ప్రతినిధులకు వారు కొన్ని సూచనలు చేశారు.

ఆ ముగ్గురిని కోర్టులో హాజరు పరిచిన సీఐడీ

పదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితులు

సాక్షి, హైదరాబాద్: తప్పుడు పత్రాలను రూపొందించి నిధులు స్వాహా చేసి పదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ముగ్గురిని సీఐడీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచింది. రాజీవ్ రాజారామ్ కశ్యప్, విమలేందర్ రాజ్‌కుమార్ మిశ్రా, రింకూ విమలేందర్ మిశ్రాలు పలువురిని మోసగించి రూ.29 కోట్ల వరకు వసూళ్లకు పాల్పడటం, తప్పుడు పత్రాలను రూపొందించడం లాంటి అభియోగాలపై వీరిపై 2013లో కేసు నమోదైంది. ఎల్బీనగర్ కోర్టు వీరిపై నాన్ బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వీరిని వై.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలోని సీఐడీ తెలంగాణ స్పెషల్ ఎగ్జిక్యూషన్ టీమ్ ముంబైలో అరెస్టు చేసింది. ఈనెల 9న మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఎల్బీనగర్ రెండవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపర్చింది.

స్వయం సహాయక సంఘాల పాత్ర కీలకం

ఏపీ మాస్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానం

సాక్షి, హైదరాబాద్: సమాజాభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల పాత్ర చాలా కీలకమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ స్వయం సహాయక సమాఖ్యల (ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్స్) ప్రతినిధుల రెండురోజుల సమావేశం హైదరాబాద్‌లో బుధవారం ముగిసింది. స్వచ్ఛందసేవా సంస్థ 'ఏపీ మాస్'ఆధ్వర్యంలో ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఆడిటోరియంలో జరిగిన ఈ సమ్మేళనంలో 19 రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయ, రైతు, ఇతర సేవారంగాల్లో ఉత్తమ నిర్వహణతో అవార్డులు గెలుచుకున్న సమాఖ్యలకు పురస్కారాలు ప్రదానం చేశారు. రాష్ట్రంలోని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలోని తెలంగాణ సెర్ప్ విభాగానికి, లెటర్ ఆఫ్ అప్రిషియేషన్ లభించింది. కార్యక్రమంలో ఏపీ మాస్ సీఈవో, ఎండీ సీఎస్‌రెడ్డి, ఏపీ మాస్ బోర్డ్ వైస్‌చైర్ పర్సన్ మహాపర అలీ, తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, పీఆర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్‌బీఐ ఎండీ అలోక్‌కుమార్ చౌదరి, సేవా సంస్థ ఎండీ జయశ్రీవ్యాస్, ఎన్ఐఆర్‌డీ విశ్రాంత డీజీ డా. డబ్ల్యూఆర్‌రెడ్డి, నాబార్డ్ తెలంగాణ సీజీఎం సుశీల చింతల పాల్గొన్నారు.

బీసీలకు 50% టికెట్లు ఇవ్వని పార్టీలను ఓడిస్తాం: ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



ముషీరాబాద్ (హైదరాబాద్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50% టికెట్లు ఇవ్వని పార్టీలన్నిటినీ ఓడిస్తామని, బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించే పార్టీని గెలిపిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. రాజకీయపార్టీల మేనిఫెస్టోలో బీసీల కులగణన, రిజర్వేషన్లు, బీసీ మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం బడ్జెట్ కేటాయింపు వంటి అంశాలను చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 15న జరిగే బీసీ మహాసభ పోస్టర్‌ను బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...75 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో 15 మంది ముఖ్యమంత్రులు మారినా 60%పైగా ఉన్న బీసీలకు సీఎం పదవీ రాకపోవడానికి రాజకీయపార్టీలే కారణమన్నారు. అన్ని పార్టీలు అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించే బీసీలకు వారి వాటా ప్రకారం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 25 సీట్లు ఇస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తే ఓడించాల్సిందే: జాజుల



వంగూరు: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసే ఏ పార్టీనైనా ఓడించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరులో జరిగిన బీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తక్కువ జనాభా ఉన్న రెడ్డి, వెలమలకు ప్రధాన రాజకీయ పార్టీలు అధికశాతం సీట్లను కేటాయించాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీసీలు ఏకమై మెజార్టీ సీట్లలో పోటీ చేసి రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. 12 శాతం జనాభా ఉన్న అగ్రవర్ణాల చేతుల్లోనే అన్ని రాజకీయ పార్టీలున్నాయని, అగ్రకులాల నాయకులకు ఇవే ఆఖరి ఎన్నికలు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం పార్లమెంటు పరిధిలో 2 అసెంబ్లీ స్థానాల చొప్పున తెలంగాణలో 34 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని జాజుల డిమాండ్ చేశారు.

అంతర్గత ప్రతిభకే అందలం

▶ మొదటి పేజీ తరువాయి

ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) చేత అధ్యయనం చేయించింది. ఈ సంస్థ ఇచ్చిన సిఫారసులను మండలి ఆమోదించి అమల్లోకి తెస్తోంది.

ప్రతిభకు అన్నివిధాలా పరీక్ష: ఇప్పటివరకూ ఏడాది మొత్తం చదివిన విద్యకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో వచ్చే మార్కులే ప్రతిభకు కొలమానాలు. కొత్త విధానంలో విద్యార్థి అంతర్గత నైపుణ్యాన్ని గుర్తిస్తారు. ఈ ప్రక్రియలో బోధకులు అత్యంత కీలకంగా మారనున్నారు. విద్యార్థి ఏ కోర్సులో చేరినప్పటికీ ఏడాది పొడవునా అతను అనుసరించే విధానాలనే ప్రామాణికంగా తీసుకుంటారు. ఇందులో అటెండెన్స్‌కు సైతం కొన్ని మార్కులుంటాయి. ప్రతి చాప్టర్‌లో పాఠాన్ని విద్యార్థి ఏమేర అర్థం చేసుకున్నాడో గుర్తించాల్సి ఉంటుంది. దీనికోసం విద్యార్థులకు అధ్యాపకులు కొన్ని ప్రశ్నలు వేస్తారు. సబ్జెక్టుపై పట్టు కోసం తరగతి గదిలో స్వల్పకాలిక చర్చలు నిర్వహిస్తారు. నెలవారీ పరీక్షలూ నిర్వహిస్తారు. విద్యార్థి తాను చదివే సబ్జెక్టుల్లో ఎక్కడ ప్రతిభ కలిగి ఉన్నాడు? ఎక్కడ వెనుకబడ్డాడు? అనేది గుర్తించి మార్కులు వేస్తారు. మరోవైపు అనుభవ పూర్వక విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థి థియరీ కాకుండా, ప్రాక్టికల్‌గా తన ప్రతిభను నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ మెరుగైన ఫలితాలిస్తాయని పారిశ్రామిక రంగం కోరుకునే నిపుణులు తయారయ్యే వీలుందని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది.

ప్రతిభను వెలుగులోకి తేవడానికే..



మూల్యాంకన విధానంలో మార్పుల వల్ల విద్యార్థి కేవలం థియరీకే పరిమితం అయ్యే అవకాశం లేదు. అతనిలో అంతర్గతంగా ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఉన్నత విద్య చేసినా, ఉపాధి కోసం వెతుక్కునే పరిస్థితి ఉండకూడదనే ఈ సరికొత్త విధానం అనుసరిస్తున్నాం. అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నాకే ముందుకెళ్లాం. మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి (ఉన్నత విద్యామండలి చైర్మన్)

అధ్యాపకులనూ సన్నద్ధం చేశాం

ఈ ఏడాది పీజీ కోర్సుల్లో కొత్త మూల్యాంకన విధానం అమలు చేస్తున్నాం. దీనికి అనుగుణంగా అధ్యాపకులను సన్నద్ధం చేశాం. క్లాసులు ప్రారంభమైనప్పట్నుంచే ఈ ప్రక్రియ మొదలవుతుంది. సిసలైన ప్రతిభ వెలికితీసే విధానం కాబట్టి విద్యార్థులకూ మేలు జరుగుతుంది.

– ప్రొఫెసర్ రవీందర్ (ఓయూ వీసీ)



భాగం కంటే మొత్తం అనేది ఎప్పుడూ ఎక్కువే.
- యూక్లిడ్

సాక్షి
గురువారం, 12 అక్టోబర్ 2023

ఆలోచన రేపుతున్న ఎంపిక

ఏటా ఇచ్చే పురస్కారాలు సైతం విజేతల ఎంపిక, వారు చేసిన కృషి రీత్యా విశిష్టంగా నిలుస్తాయి. రాయల్ స్వీడిష్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ఈ ఏడాదికి గాను ఇప్పటి దాకా ప్రకటించిన పురస్కారాల్లో కొన్ని అలాంటివే! స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ప్రైజ్ అనే పేరు కన్నా ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం ఇచ్చే 'నోబెల్ పురస్కారం'గానే ప్రసిద్ధమైన ఈ గౌరవం దక్కిన ఇద్దరు మహిళల గురించి ఇప్పుడు ప్రపంచమంతా ఆసక్తి కనబరుస్తోంది. మహిళా శ్రామికశక్తిపై విస్తృత పరిశోధన జరిపిన ఆర్థిక శాస్త్రవేత్త క్లాడియా గోల్డిన్‌కు అర్థశాస్త్రంలో నోబెల్ ప్రైజ్, అలాగే ఇరాన్‌లో జైలులో మగ్గుతున్న మానవ హక్కుల ఉద్యమకారిణి నర్గిస్ మొహమ్మదీకి నోబెల్ శాంతి బహుమతి దక్కడం వారు దీర్ఘకాలంగా చేస్తున్న కృషికి అతి పెద్ద అంతర్జాతీయ గుర్తింపు. ఈ ఇద్దరి ఎంపిక వేతనాల్లో స్త్రీ పురుష వ్యత్యాసం మొదలు లింగ సమానత్వం దాకా అనేక అంశాలపై మరోసారి చర్చ రేపుతోంది.

గోల్డిన్ కృషికి అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం దక్కడం బాగున్నా, అందులోనూ వైచిత్రి ఉంది. ఆమె నాలుగు దశాబ్దాల కృషి అంతా శ్రామిక విపణుల్లో మహిళలు, లింగ సమానత్వం గురించి! విచిత్రం ఏమిటంటే 1969లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతిని స్థాపించినప్పటి నుంచి నిన్నటి వరకు ఆ పురస్కారం దక్కింది ఇద్దరంటే ఇద్దరు మహిళలకే! అదీ వేరేవాళ్ళతో కలసి! ఆ గౌరవం దక్కిన మూడో మహిళ గోల్డినే! పైగా, ఒక మహిళకు ఒంటరిగా అర్థశాస్త్రంలో నోబెల్ దక్కడమూ ఇదే ప్రప్రథమం. నోబెల్ బహుమతుల్లో లింగ అసమానత్వంపై విమర్శలు వస్తున్న వేళ లేబర్ మార్కెట్‌లో మహిళా విజయం లోతుపాతులు విశ్లేషించిన గోల్డిన్‌కు ఈ గౌరవం దక్కడం గమనార్హం.

హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరైన గోల్డిన్ అమెరికాలోని శ్రామిక విపణినీ, అలాగే వేతనాల్లో లింగ అసమానత్వానికి కారణాలనూ నాలుగు దశాబ్దాలుగా లోతుగా అధ్యయనం చేస్తూ వచ్చారు. 200 ఏళ్ళ అమెరికా చరిత్రను లోతుగా విశ్లేషిస్తూ, చారిత్రకంగా స్త్రీ పురుషుల ఆదాయాల్లో తేడాకు ప్రధానంగా చదువు, వివిధ రకాల ఉద్యోగాలే కారణమని తేల్చారు. వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక ఆధారిత వ్యవస్థ వైపు దేశం మారడంతో శ్రామిక విపణిలో వివాహిత స్త్రీల భాగస్వామ్యం పడిపోయిందనేది ఆమె అధ్యయన సారం. ఆ తర్వాత 20వ శతాబ్దంలో సర్వీసుల పరిశ్రమ వృద్ధి చెందడంతో, మరింత విద్యావంతులైన మహిళలు రంగంలోకి వచ్చారు. గర్భనిరోధక విధానాల లాంటివి ఆరోగ్యరంగంలో వ్యాప్తిలోకి వచ్చాయి. తత్ఫలితంగా, శ్రామికశక్తిలోకి మహిళలు మళ్ళీ ప్రవేశించారు. కానీ, అప్పటికే తలెత్తిన అంతరం మాత్రం పూడిపోలేదు. ముఖ్యంగా, తొలిచూలుతో ఈ తేడా తలెత్తుతోందని గోల్డిన్ పరిశోధన.

ఇక, మరణశిక్షకు వ్యతిరేకంగా గళం విప్పినందుకూ, దేశంలో మహిళలకు సైతం సమాన హక్కులు ఉండాలని కోరినందుకూ ఇరాన్‌లో కటకటాలు లెక్కపెడుతున్న నర్గిస్ పోరాటం మరో పెద్ద కథ. ఇప్పటికి ఆమె 13 సార్లు అరెస్టయి, అయిదుసార్లు దోషిగా తీర్మానమై, 31 ఏళ్ళ జైలుశిక్షను ఎదుర్కొంటోంది. 2022 నాటి డబ్ల్యూఈఎఫ్ గ్లోబల్ జెండర్ గ్యాప్ నివేదికలో అట్టడుగున అఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌లతో పాటు నిలిచిన దేశంగా ఇరాన్ పేరుమోసింది. అలాంటి దేశాల్లో నర్గిస్ లాంటి మహిళలు కడకు తమ ఉనికిని కాపాడుకొనేందుకు సైతం పోరాడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో అటు క్లాడియా గోల్డిన్ అధ్యయనానికీ, ఇటు నర్గిస్ మొహమ్మదీ అలుపెరుగని పోరాటానికీ నోబెల్ గుర్తింపు రావడం ఆనందదాయకం.

సరిగ్గా గోల్డిన్‌కు నోబెల్ ప్రకటించిననాడే మన దేశంలో వార్షిక 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) విడుదలైంది. గత 2022 జూలై నుంచి ఈ 2023 జూన్‌కి సంబంధించిన ఈ సర్వే శ్రమజీవుల్లో మహిళల సంఖ్య మునుపటి కన్నా కొద్దిగా పెరిగిందని పేర్కొంది. అయితే, అది సహజమైన పెరుగుదల కాక కరోనా తర్వాత కుటుంబ ఆదాయాలు దెబ్బతినడంతో తప్పని పరిస్థితుల్లో వచ్చిన పాలపొంగు అని విశ్లేషకుల అభిప్రాయం. వెరసి, లోతుగా గమనిస్తే భారత్‌లోనూ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం రేటు ఇవాల్టికీ తక్కువగానే ఉందన్నది విచారకరమైన వాస్తవం. ఇది మారాలంటే... అర్థవంతమైన ఉపాధి, అదే సమయంలో మహిళా శ్రామికశక్తి భాగస్వామ్యం పెరిగేలా విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత మన ప్రభుత్వాలది. అందుకు ప్రొఫెసర్ గోల్డిన్ అధ్యయనం నుంచి భారతదేశం సైతం పాఠాలు నేర్వాలి.

ఏ దేశమైనా సరే ఆర్థిక పురోగతి సాధించినంత మాత్రాన శ్రామిక విపణిలో లింగ వ్యత్యాసం దానంతట అది తగ్గిపోదని గోల్డిన్ నిరూపించారు. అలాగే, సామాజిక, వ్యవస్థాపరమైన అవరోధాలు ఉన్నంత కాలం కేవలం స్త్రీ విద్య సైతం శ్రామికశక్తిలో లింగ అంతరాల్ని తగ్గించలేదు. సాంప్రదాయిక సమాజాల్లో పిల్లల పెంపకమూ ఓ కీలకాంశం. విధాన నిర్ణేతలు వీటిని దృష్టిలో ఉంచుకోవాలి. లింగ కోణం నుంచి అర్థశాస్త్ర అధ్యయనం ప్రధాన స్రవంతిలో భాగం కాదన్న భావనల్ని గోల్డిన్ బద్దలుకొట్టారు. అమెరికా నుంచి ఇరాన్ దాకా ప్రపంచంలో ప్రతి చోటా ఇవాళ్టికీ ఆడవారి పరిస్థితి ఒకేలా ఉంది. ఇవాళ పురుషుల్లో నూటికి 80 మంది ఉద్యోగాల్లో ఉంటే, ప్రపంచ మహిళా జనాభాలో కేవలం సగం మందే వేతన ఉపాధి పొందుతున్నారు. అదీ మగవాళ్ళ కన్నా తక్కువ వేతనాలకే పనిచేస్తూ, వృత్తిలో ఉన్నత శిఖరాల అధిరోహణకు అవకాశాలూ తక్కువే. అందుకే, లింగ సమానత్వ సాధనలో ప్రపంచం ప్రయాణించాల్సిన దూరం ఇంకా ఎంతో ఉంది. ఆ దిశలో నోబెల్ విజేతలైన గోల్డిన్ అధ్యయనం, నర్గిస్ పోరాటం మనకు తాజా మార్గదర్శకాలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.7.14 వరకు,
తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పుబ్బ ప.12.13 వరకు, తదుపరి ఉత్తర,
వర్జ్యం: రా.8.08 నుండి 9.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.49 నుండి 10.37 వరకు, తదుపరి ప.2.31 నుండి 3.18 వరకు,
అమృత ఘడియలు: లేవు

సూర్యోదయం: 5.55
సూర్యాస్తమయం: 5.38
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

బలమైన ప్రభుత్వం ఓ అపోహే!

అభిప్రాయం



డాక్టర్ రాజ్‌దీప్ పాకనాటి

ఒకే పార్టీ, ఒకే నాయకుడి ద్వారా మాత్రమే ఉత్తమ పాలన అందుతుందనేది అపోహ. సంకీర్ణ ప్రభుత్వాలు 'బలహీనమైనవి' అనీ, అవి నిర్ణయాలు తీసుకోలేవనీ ఈ అపోహ జనాన్ని నమ్మేలా చేస్తుంది. కానీ చట్టాలను ఆమోదించడంలో ఏకీకృత లేదా సంకీర్ణ ప్రభుత్వాల మధ్య ఎటువంటి తేడా లేదని చరిత్ర చెబుతోంది. అమెరికాలో మహా మాంద్యం తర్వాత, 'న్యూ డీల్'(1933)లో భాగంగా సంక్షేమ విధానాలను అమలు చేశారు. సంపూర్ణ మెజారిటీ లేని ప్రభుత్వ హయాంలోనే ఇది జరిగింది. 1980ల చివరి నుండి భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు తప్పనిసరి అయిపోయాయి. ఈ కాలంలోనే భారత ఆర్థిక వ్యవస్థను సరళీకరించారు. నిర్ణయాత్మకమైన పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేశారు.

భారత్ వంటి విశాలమైన దేశానికి ఒకే పార్టీ, ఒకే నాయకుడి ద్వారా మాత్రమే ఉత్తమ పాలన అందుతుందనే అపోహ ఆధారంగా, ప్రస్తుత కేంద్రప్రభుత్వ పాలనను తిరిగి ఎన్నుకోవడం అనే ప్రబలమైన కథనం ఆధారపడి ఉంది. 'బలమైన ప్రభుత్వం' అనే ఈ అపోహ– బహుళ పార్టీ, సంకీర్ణ ఆధారిత ప్రభుత్వాలు 'బలహీనమైనవి' అనీ, అవి నిర్ణయాలు తీసుకోలేవనీ లేదా చట్టాలను ఆమోదించలేవనీ నమ్మేలా చేస్తుంది. అయితే, రాజనీతి శాస్త్ర రంగంలోని పరిశోధనలు మనకు భిన్నమైన చిత్రణను చూపుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే ప్రధానంగా మూడు రకాల ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఉనికిలో ఉన్నాయి. అవి: అధ్యక్ష తరహా, పార్లమెంటరీ, సంఘటిత (కాన్‌సోషియేషనల్) ప్రభుత్వాలు. ఈ ప్రతి ప్రభుత్వ రూపంలోనూ, బహుళ పార్టీ ప్రభుత్వాలు లేదా సంకీర్ణ ప్రభుత్వాలు స్థిరంగా ఉండటమే కాకుండా పౌరుల సంక్షేమం విషయంలో కూడా మెరుగ్గా ఉన్నాయని సాక్ష్యాధారాలు చూపుతున్నాయి.

అమెరికా, అధ్యక్ష వ్యవస్థను అనుసరిస్తుంది. ఈ వ్యవస్థలో అధ్యక్షుడిని నేరుగా కార్యనిర్వాహక అధిపతిగా ఎన్నుకుంటారు. అయితే పన్నులు పెంచడం, డబ్బు ఖర్చు చేయగల సామర్థ్యం అనే ఖజానా అధికారాలను ప్రతినిధుల సభకు కట్టబెట్టారు. డేవిడ్ మేహ్యూ రాసిన 'డివైడెడ్ వియ్ గవర్న్: పార్టీ కంట్రోల్, లా మేకింగ్ అండ్ ఇన్వెస్టిగేషన్స్, 1946–2002' అనే పుస్తకంలో, ఒకే రాజకీయ పార్టీ అటు అధ్యక్ష పదవినీ, ఇటు కాంగ్రెస్‌నీ నియంత్రించినప్పుడు మాత్రమే అమెరికన్ జాతీయ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుందనే సాధారణ అపోహను తొలగించారు. చట్టాలను ఆమోదించడంలో ఏకీకృత పార్టీ లేదా వివిధ పార్టీల మధ్య ఎటువంటి తేడా లేదని ఈ పుస్తకం వెల్లడిస్తుంది. నిజానికి, మహా మాంద్యం (గ్రేట్ డిప్రెషన్) తర్వాత, అంటే 1933లో కొత్త ఒప్పందం (న్యూ డీల్)లో భాగంగా సంక్షేమ ఆధారిత విధానాలు అమలు చేశారు. అలాగే, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ కాలంలో ఇటీవలే తీసుకొచ్చిన ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం, 2022 వంటి సంక్షేమ ఆధారిత విధానాల్లో భాగంగానే ద్రవ్యోల్బణాన్ని తక్కువగా ఉంచడం, మందుల ధరలను తగ్గించడం, క్లీన్ ఎనర్జీకి మద్దతు ఇవ్వడం వంటివాటిని ఆమోదించారు. సంపూర్ణ మెజారిటీ లేని ప్రభుత్వాల హయాంలోనే ఇవి ఆమోదం పొందాయి.

దీనికి విరుద్ధంగా, అఫోర్డబుల్ కేర్ యాక్ట్ (ఏసీఏ) లేదా ఒబామా కేర్ చట్టంగా ప్రసిద్ధి చెందిన యాక్ట్‌ను, 2009లో డెమొక్రాటిక్ పార్టీ అటు అధ్యక్ష పదవినీ నిర్వహిస్తూ, ఇటు ప్రతినిధుల సభలోనూ, సెనేట్‌లోనూ మెజారిటీని కలిగి ఉన్నప్పుడు ఆమోదించారు. అయినా ఈ చట్టాన్ని రిపబ్లికన్ పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యులు, గవర్నర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. పైగా దానిని రద్దు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అటువంటి చట్టంలో భాగం కాలేనప్పుడు, తమ



నియోజకవర్గాలకు ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు ఉంటాయని తెలిసినప్పటికీ, ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తాయని ఇది సూచిస్తోంది.

పశ్చిమ ఐరోపాలో జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం వంటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాలను ఎక్కువగా వామపక్ష లేదా సంప్రదాయవాద పార్టీల చుట్టూ కేంద్రీకృతమై ఉన్న సంకీర్ణ ప్రభుత్వాలు పాలిస్తుంటాయి. 1945 నుండి జర్మనీని రైట్ వింగ్ లేదా ఉదారవాద సంకీర్ణ ప్రభుత్వాలు పాలిస్తున్నాయి. 'క్రిస్టియన్ డెమో క్రటిక్ యూనియన్ ఆఫ్ జర్మనీ' మితవాద పక్షానికీ, 'సోషల్ డెమో క్రటిక్ పార్టీ ఆఫ్ జర్మనీ' మధ్యస్థ–వామపక్ష ప్రభుత్వానికీ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఇక 'సంఘటిత' ప్రభుత్వాలను పార్లమెంటరీ విధానంలోని ఉపవిభాగంగా చూడవచ్చు. ఇవి సంకీర్ణ ప్రభుత్వాలను మాత్రమే కలిగి ఉంటాయి. ఇటలీ, లెబనాన్, ఇథియోపియా వంటి దేశాలలో, వివిధ రకాలైన జాతి, మత, భాషా సమూహాలు సహజీవనం చేయవలసి వస్తోంది. సంఘటిత ప్రభుత్వాలు ఈ సమూహాలలోని అన్ని వర్గాల ఏకాభిప్రాయంతో ఏర్పడతాయి. వీటో అధికారాన్ని కలిగి ఉంటాయి. ఇక్కడ ఒక సమూహం ఏదైనా విషయంపై మరొకరిని అడ్డుకుంటే, రెండోది ప్రతిగా ఆ సమూహాన్ని నిరోధించే అవకాశం ఉంటుంది.

1980ల చివరి నుండి భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు తప్పనిసరి అయిపోయాయి. ఈ కాలంలోనే భారత ఆర్థిక వ్యవస్థను సరళీకరించారు. నిర్ణయాత్మకమైన పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేశారు. అలాగే దేశ అణ్వాయుధ ప్రయోగాల సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించారు. 2004 నుండి 2014 వరకు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అనేక పౌరుల, హక్కుల ఆధారిత చట్టాలను రూపొందించింది. వీటిలో 2005లోని సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ), 2006లోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, 2009లోని విద్యా హక్కు చట్టంతో పాటు, 2013లో తెచ్చిన ఆహార హక్కు చట్టం; భూ సేకరణ, పునరావాసం, రీసెటిల్మెంట్ (ఎల్ఏఆర్ఆర్) చట్టం ఉన్నాయి.

అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌ను ఉద్దేశించి... బలహీనమైన, కీలుబొమ్మ ప్రభుత్వం అనే అపోహను ప్రచారం చేయడంతో అది 2014లో బీజేపీ విజయానికి దారితీసింది. అయితే, 2014 నుండి 'బలమైన నాయకత్వం' మనకు ఏమి అందించిందో చూద్దాం. హక్కుల ఆధారిత చట్టాలు వేటినీ ఈ ప్రభుత్వం ఆమోదించలేదు. పాలనా పారదర్శకత, జవాబుదారీతనానికి సంబంధించి ఏ ఆధారాలూ లేవు. బదులుగా మోదీ ప్రభుత్వం ప్రజలను జవాబుదారీగా ఉంచాలనుకుంది. పెద్దనోట్ల రద్దు ద్వారా మీ డబ్బును నాకు చూపించమంది; జీఎస్టీ ద్వారా మీ పన్నులు నాకు చెల్లించమంది. ఇంకా ఆర్టికల్ 370 రద్దు చేయడం, పౌరసత్వ సవరణ చట్టాన్ని తేవడం వంటివి జరిగాయి. నిరసనల తర్వాత మాత్రమే 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రద్దయినాయి.

గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం లేదా స్వచ్ఛ భారత్ పథకం కింద మరుగుదొడ్లు నిర్మించడం వంటివి అమలులో ఉన్న సంక్షేమ విధానాలకు పొడిగింపు మాత్రమే. ఏ కొత్త ఆవిష్కరణా లేదా కొత్త దిశనూ ఈ ప్రభుత్వం చూపలేదు. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన సుమారు 50 కోట్ల బ్యాంకు ఖాతాలను తెరవడానికి ఆర్థిక సేవలను అందిస్తుంది. అయితే ఇందులో 4.12 కోట్ల మంది జూలై 2023 నాటికి జీరో బ్యాలెన్స్ కలిగి ఉన్నారు. కాగా, జనవరి 2018 నుండి 6 కోట్ల ఖాతాల్లో ఎటువంటి లావాదేవీలు జరగలేదు.

హక్కుల ఆధారిత చట్టాలు ఈ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమయ్యాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయించిన నిధులు తగ్గాయి. సమాచార హక్కు చట్టాన్ని బలహీనపరచడం ద్వారా ప్రభుత్వం తనను సూక్ష్మశోధనకు అతీతంగా ఉంచుకుంది. వివిధ పథకాలు లేదా ప్రభుత్వ వైఖరి సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి కాదు. ఒక రకమైన భూస్వామ్య పరాధీనతను సృష్టించడంలో భాగమే. అన్ని గ్యాస్ స్టేషన్‌లపై, మనందరి కోవిడ్ టీకా సర్టిఫికేట్‌లపై భూస్వామ్య ప్రభువైన ప్రధాని స్వయంగా కనిపిస్తుంటారు.

ఏకవ్యక్తి ప్రభుత్వం వర్సెస్ సంకీర్ణ ప్రభుత్వం గురించి చరిత్ర పొడవునా సమీక్షించినప్పుడు, బలమైన నాయకుల అహంకారం వారి ప్రజలకు ఎల్లప్పుడూ మంచిది కాదని మనకు అర్థమవుతుంది. ఇస్లామిక్ చట్టంలో ఇజ్మా అనే భావన ఉంటుంది. అంటే ఏకాభిప్రాయం. అతి పెద్ద సమాజం తరపున నిర్ణయాలు తీసుకోవడానికి పండితుల సంఘం కలిసి వస్తుందనే అవగాహనపై ఇది ఆధారపడి ఉంటుంది.

ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' రూపంలో మనం ఒక సంభావ్యతకు సాక్ష్యులుగా ఉన్నాం. భారత దేశంలోని భిన్న సమూహాల ప్రజానీకానికి ప్రాతినిధ్యం కల్పించడం కోసం అనేక పార్టీలు కలిసి వస్తున్నాయి. వాళ్లకు ఓటర్లు ఒక అవకాశం ఇస్తారని ఆశించవచ్చు.

వ్యాసకర్త 'జిందాల్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్' ప్రొఫెసర్, ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మీరు వెళ్ళి చేయండి!



పిల్లలకు పాలిచ్చే తల్లుల్ని రెస్ట్‌రూమ్/బాత్‌రూమ్‌లోకి పొమ్మనేవాళ్లు... నిజానికి వాళ్లే తమ లంచో, డిన్నరో ఆ రెస్ట్ రూమ్‌లో చేయాలి.

– చిన్మయి శ్రీపాద, గాయని

అసలు రుచి



చాలాకాలంగా నేను శుద్ధమైన ఏ2 ఆవు నెయ్యిని గోశాలల నుంచి తెచ్చి వాడుతున్నాను. అదే నేను కమర్షియల్ డైరీ నెయ్యి వాడితే దాని రుచి ఫైనంలా ఉంటుంది. దానికి ఏం చేస్తారు వాళ్లు? జనానికి కమర్షియల్ నెయ్యి శుద్ధమైనది కాదని కూడా తెలీదు. విషాదం.

– ఆర్తీ అగర్వాల్, 'కౌనామిక్స్' రచయిత్రి

ఏది చోటు?



ఇజ్రాయిలీలు వెళ్లడానికి ఇంకో చోటంటూ లేదని తనకు అర్ధ శతాబ్దం క్రితం గోల్డా మెయిర్ (ఇజ్రాయిల్ మాజీ అధ్యక్షురాలు) చెప్పిన విషయాన్ని జో బైడెన్ (అమెరికా అధ్యక్షుడు) ఉట్టంకించారు. అప్పుడు ఇజ్రాయిల్ నిజంగా అస్తిత్వ సంక్షోభం ఎదుర్కొంది. కానీ ఇప్పుడు కాదు. హమాస్ ఎంత క్రూరమైనదో ఇదీ అంతే! కానీ ఇరవై లక్షల గాజా ప్రజలు ఎక్కడికి పోవాలి?

– ఇషాన్ థరూర్, కాలమిస్ట్

అమితమైన సంతోషం



పుట్టిన రోజు (అక్టోబర్ 11) శుభాకాంక్షలు అమిత్‌జీ (అమితాబ్ బచ్చన్). ఈ సంవత్సరం మీకు మంచి ఆరోగ్యం, సంతోషం, స్థిరమైన విజయాలు దక్కాలి. హ్యాపీ బర్త్ డే సర్.

– సంజయ్ దత్, నటుడు

ఇంత అన్యాయమా?



ఇండియా ఎంత గందరగోళంలో ఉందో తెలుసుకోవాలంటే, (రచయిత్రి) అరుంధతీ రాయ్ ఎప్పుడో పదేళ్ల క్రితం చెప్పినదానికి ఇప్పుడు దేశద్రోహ ఆరోపణలు ఎదుర్కోవడమే నిదర్శనం. న్యాయస్థానాల్లో దేశద్రోహ కేసు నిలవాలంటే అది 'తక్షణ' హింస, అశాంతికి కారణమవ్వాలి. పదేళ్ల తర్వాత అంటే... 'తక్షణం' కాదుగా!

– వసుంధర సిర్నాటే, జర్నలిస్ట్

రెండూ ఒకటి కాదు!



మీరు పాలస్తీనాకైనా మద్దతివ్వాలి, హమాస్‌కైనా మద్దతివ్వాలి. రెంటికీ ఇవ్వడం కుదరదు. తన సొంత పాలస్తీనా ప్రజల కన్నా ఇరాన్ ముల్లా నాయకత్వానికి హమాస్ ఎక్కువ విధేయంగా ఉంది. ఈ హేయమైన గ్రూపు తన సొంత ఆసుపత్రులు, పాఠశాలల నుంచి ఇజ్రాయిల్ పైకి రాకెట్లతో దాడి చేస్తుంది. బదులుగా ఇజ్రాయిల్ దాడిచేయగానే ఆ చనిపోయిన పిల్లల్ని చూపి ప్రపంచ సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తుంది.

– అలీ ఎ. రిజ్వీ, రచయిత

గుర్తుంచుకోండి!



త్వరలో, ఈ ఉన్న కొద్దిపాటి కరెంట్, కనెక్షన్ లేకుండా పోతాయి. ఒకవేళ నేను చనిపోతే... నేను, మేము వ్యక్తులం, మనుషులం, మాకూ పేర్లుండేవి, కలలుండేవి, విజయాలుండేవని గుర్తుంచుకోండి. మా తప్పల్లా... వాళ్ళ దృష్టిలో మేము తక్కువ మనుషులు కావడమే!

– బిలాల్ అల్దాబౌర్, పాలస్తీనా వైద్యుడు

ఇన్ బాక్స్

ఈ సంక్షోభం అగ్ర రాజ్యాల చలవ!

ఇజ్రాయెల్‌పై హమాస్ తీవ్రవాద సంస్థ దాడీ, ఫలితంగా వందలాది పౌరులు ప్రాణాలు కోల్పోవడం, కొనసాగుతున్న ఇజ్రాయెల్ ప్రతిదాడిలో అంతే స్థాయిలో గాజా పౌరుల ప్రాణాలు పోవడం అత్యంత బాధాకరం. ఈ భీకర పోరు కేవలం ఆయా దేశాల మధ్యనున్న జాతి వైరానికి దర్పణం కాదు. అగ్రరాజ్యాల స్వార్థానికీ, వారి సొంత లాభాల కోసం మంటల్లో పోస్తున్న ఆజ్యానికీ కొండ గుర్తు. ఏడు దశాబ్దాల క్రితం ఇజ్రాయెల్ పుట్టుక మొదలు పాలస్తీనాతో సమరం మొదలైంది. పాలస్తీనాను దశల వారీగా ఆక్రమిస్తూ, దాడి చేస్తూ ఇజ్రాయెల్ తన బలం నిలుపుకుంటోంది. అందుకు అమెరికా మద్దతు పుష్కలంగా ఉంది. దానికి వ్యతిరేకంగా పాలస్తీనాలో హమాస్ తీవ్రవాద సంస్థ పుట్టుకొచ్చింది. దాని ప్రయత్నాలు అది చేస్తోంది. కట్టుదిట్టమైన రక్షణ వ్యవస్థ , ఆయుధ సంపత్తి, అగ్ర రాజ్యాలతో స్నేహాలు, అంతర్గత నిఘా వ్యవస్థ బలంగా ఉన్న ఇజ్రాయెల్‌పై ఈ స్థాయి దాడి చెయ్యడం దుస్సాహసమే. అయితే అక్కడ ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అనిశ్చితి, అధ్యక్షుడిపై దేశంలో కొనసాగుతున్న వ్యతిరేక వాతావరణం కారణంగా ఇదే సరైన సమయమని భావించి అమానుష దాడికి ఒడిగట్టింది హమాస్.

గత కొన్నేళ్లుగా తమ దేశంపై జరుగుతున్న ఆక్రమణలకు, దాడులకు ప్రతీకారంగా ఈ దాడిని తలచింది. పైగా సౌదీ అరేబియాతో ఇజ్రాయెల్‌కు బలపడుతున్న స్నేహాన్ని తమకు ముప్పుగా భావిస్తూ వచ్చింది. మరో వైపు ఇదే అదనుగా ఇరాన్, లెబనాన్‌లు హమాస్‌కు మద్దతుగా నిలిచాయి. అమెరికా ఇజ్రాయెల్‌కు బాసటగా నిలబడగా, చైనా, రష్యాలు మౌనం వహించాయి. కొండొకచో పాలస్తీనా తరఫున ఉన్నట్టు సంకేతాలు ఇస్తున్నాయి. ఇలా అగ్ర రాజ్యాలు తమ సొంత లాభాలకు అనుకూలంగా మంటల్ని ఎగదోస్తుంటాయి. సమస్యల్ని చావనివ్వవు. మంటల్ని ఆరనివ్వవు. ఫలితంగా ప్రపంచ శాంతి ఒక భ్రాంతిగా మిగిలి పోతుంది.

ఇజ్రాయెల్ పాలస్తీనా సమస్య మూలాల్లోకి పోకుండా పైపైన పరిష్కారాలు సాధ్యం కావు. అణిచివేత, అతివాదం ఒక నాణేనికి రెండు వైపులు. దీర్ఘకాలిక పరిష్కారాలు వెదకాల్సిన సమస్యలు. ప్రపంచ దేశాలు ఏదో ఒక వైపు నుండి కాకుండా పై నుండి చూస్తేనే అసలు సమస్య అర్థమవుతుంది. ప్రపంచంలో ఏ మూల అశాంతి ఉన్నా అది అంతటికీ ప్రమాదమే. ఇప్పుడు చూస్తున్నది అదే.

– డా. డి.వి.జి. శంకర రావు, పార్వతీపురం మాజీ ఎంపీ । 94408 36931

ప్రజలకు ఏం కావాలో గ్రహించలేదా?

అభిప్రాయం



ఫిరోజ్ ఖాన్

తెలంగాణకు ఎలక్షన్ షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 30న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. పార్టీలు సైతం విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ఈ నెల 15న మేనిఫెస్టోను విడుదల చేస్తామని అధికార బీఆర్ఎస్ ప్రకటించింది. ఇంకా కసరత్తు జరుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ చెబుతున్నది. ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని బీజేపీ పేర్కొంటున్నది. దీంతో ప్రజలకు ఏం కావాలో ప్రధాన పార్టీలు ఇప్పటికీ తెలుసుకోలేకపోతున్నాయా అనే అనుమానం వ్యక్తమవుతున్నది.

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో తీవ్ర జాప్యమున్నా ఎన్నికల కదన రంగంలో మాత్రం కాంగ్రెస్ ముందుగానే దూకిందని చెప్పాలి. గత మేలో వరంగల్‌లో రాహుల్ గాంధీతో సభ నిర్వహించి 'రైతు డిక్లరేషన్'ను 'హస్తం' పార్టీ ప్రకటించింది. అధికారంలోకి వస్తే రైతులకు ఏమేం చేసేదీ దాంట్లో పేర్కొన్నది. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ, యూత్ డిక్లరేషన్లను ప్రకటించింది. దీంతోపాటు మహిళలు, బీసీలు తదితరులపై డిక్లరేషన్లను ప్రకటించడానికి సిద్ధమవుతున్నది. మరోవైపు 'ఆరు గ్యారెంటీ'ల పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు విస్తృతంగా ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లాయి. అయితే మేనిఫెస్టోను ఇప్పటికీ ఎందుకు ఫైనల్ చేయడం లేదనే ప్రశ్న ఉత్పన్న మవుతున్నది. శ్రీధర్ బాబు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఇంకెంత కాలం అభిప్రాయాలను సేకరిస్తుందోననే అనుమానం కాంగ్రెస్ కార్యకర్తల్లోనే ఉంది.

అందరి కంటే ముందే అభ్యర్థులను ప్రకటించి దూకుడు మీదున్న బీఆర్ఎస్ ఇప్పటికీ తన మేనిఫెస్టోను విడుదల చేయలేదు. అయితే అక్టోబర్ 15న రిలీజ్ చేస్తామని ఇటీవల తేదీని నిర్ణయించింది. గత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయింది. దీంతో ఇష్టానుసారంగా హామీలు ఇచ్చేస్తే బడ్జెట్ సెట్ చేయడం కష్టమేనని బీఆర్ఎస్‌కు అనుభవ



పూర్వకంగా తెలిసొచ్చిందనిపిస్తోంది. 'గృహలక్ష్మి', బీసీ, మైనార్టీలకు 'చేయూత' లాంటి స్కీమ్స్‌ను లేటుగా అయినా ప్రవేశపెట్టి అమలు ప్రారంభించి తాము ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్నామనే సంకేతాన్ని పంపడానికి ప్రయత్నించింది. అయితే తూతూమంత్రంగా అమలు చేయడంతో వీటి వల్ల ప్రజల్లో పార్టీ పట్ల పాజిటివిటీ రాలేదు. మరోవైపు కాంగ్రెస్ హామీల వర్షం కురిపిస్తుండడంతో తప్పనిసరిగా మేనిఫెస్టోలో పలు హామీలను చేర్చేందుకు బీఆర్ఎస్ రెడీ అయినట్లు తెలుస్తున్నది. మహిళల కోసం బీఆర్ఎస్ తెచ్చే స్కీమ్ ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ చేస్తుందని మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించడం కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రభావంతోనే అని అర్థమవుతోంది.

కర్ణాటక ఎలక్షన్స్ కంటే ముందు తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే. అయితే కన్నడ ఓటర్లు బీజేపీని తిరస్కరించడంతో తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగింది. మరోవైపు బండి సంజయ్‌ను స్టేట్ చీఫ్ పదవి నుంచి తొలగించడంతో బీజేపీ పతనం మొదలైంది. మేనిఫెస్టో తయారీని కూడా ఆ పార్టీ లైట్ తీసుకుంటున్నట్లు అర్థమవుతున్నది. తాము ఉచితాలకు వ్యతిరేకమని ఇప్పటికే పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. సంక్షేమమే తమ ధ్యేయమనేది వారి మాట.

దీంతో బీజేపీ మేనిఫెస్టో పట్ల ప్రజల్లోనూ ఆసక్తి కనిపించడం లేదు. షెడ్యూల్ రావడానికి ఐదు రోజుల ముందు మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో 'మేనిఫెస్టో కమిటీ'ని ఆ పార్టీ ఏర్పాటు చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం అందజేస్తామని బండి సంజయ్ ప్రకటించారు. ఇది నోటిమాటగానే తప్ప దీన్ని ఎలా అమలు చేస్తారో క్లారిటీ ఇవ్వలేదు. దశాబ్దాలుగా ప్రజలను పాలించిన, పాలిస్తున్న పార్టీలు ప్రజలకు ఏం కావాలో ఇప్పటికీ గ్రహింపు లేక పోవడం విడ్డూరంగానే ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
మొబైల్: 96404 66464

భగవత్ సాన్నిధ్యం

స్వామి చిద్భవానంద తమిళంలోనూ, ఇంగ్లిష్‌లోనూ భగవద్గీతకు విపులమైన వ్యాఖ్యను రచించి అరవై ఏళ్ళ కిందట ప్రచురించారు. పురుషోత్తమ యోగంలోని 'ఊర్ధ్వ మూలం అధశ్శాఖం అశ్వత్థం...' అని మొదలయ్యే శ్లోకానికి వారు చేసిన వ్యాఖ్యలో సందర్భానుసారంగా, శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన ఒక ఉదంతాన్ని ఉట్టంకించారు.

ఒకచోట సంత జరుగుతోంది. సంత బయట నిల్చున్న వానికి లోపల ఏమి జరుగుతున్నదీ తెలియదు. అమ్మకందార్లు, కొనుగోలుదార్లు మాట్లాడే మాటల సవ్వడి అతడికి రణగొణ ధ్వనిగా, గందరగోళంగా, రొదగా వినిపిస్తుంది. స్పష్టత ఉండదు. కానీ, ఎప్పుడైతే అతడు సంత లోపలికి ప్రవేశిస్తాడో, అప్పుడు అతడి అవగాహనలో మార్పు వస్తుంది. అక్కడ జరిగే బేరసారాలు, మాట్లాడే మాటలు స్పష్టంగా వినపడతాయి. అర్థమవుతాయి.



జ్యోతిర్మయం

అలాగే ఒక వ్యక్తి భగవంతునికి దూరంగా ఉన్నప్పుడూ, భగవంతుని గురించిన అనుభవ జ్ఞానం లోపించినప్పుడూ, భగవంతుని గురించిన అతని అవగాహనలో స్పష్టత ఉండదు. అతడి ఆలోచనా విధానం గందరగోళంగా ఉంటుంది. కార్యకారణ సంబంధాల గురించి అతడు చేసే యోచన సరైన మార్గంలో సాగదు. అతడు చేసే వాదనలకు, ప్రతివాదనలకు అంతూపొంతూ ఉండదు. కానీ, ఎప్పుడైతే అతడు భగవంతునికి దగ్గరగా జరుగుతాడో, ఎప్పుడైతే అతనికి భగవత్ సాన్నిధ్య భాగ్యం లభిస్తుందో, అప్పుడు అతనికి సత్యం గోచరిస్తుంది. అతడు భగవంతుని గురించి చేసే ఊహాగానాలూ, ఆధారం లేని ఆలోచనలూ అన్నీ ఒక కొలిక్కి వస్తాయి. భగవత్తత్వం గురించిన రహస్యం విడిపోతుంది. అంతా బట్ట బయలు అవుతుంది.

– దీవి సుబ్బారావు

24శాతం వడ్డీతో అసలు చెల్లించండి

- భూ విక్రయంలో ఎన్నారైకి జరిగిన అన్యాయంపై వినియోగదారుల కమిషన్ తీర్పు
- చెల్లించిన రూ.37.70 లక్షలకు 24 శాతం వడ్డీతో కలిపి ఇవ్వాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బెంగళూరు రూరల్ జిల్లాలో భూమి కొనుగోలు కోసం డబ్బులు చెల్లించిన ఓ ఎన్నారైకి ఏళ్లు గడిచినా ఆ భూమిని అప్పగించకుండా మానసిక క్షోభకు గురిచేసినందుకు గానూ సాలీనా 24% వడ్డీతో, అతను ఇచ్చిన రూ.37.70 లక్షలను తిరిగి చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ బుధవారం తీర్పు చెప్పింది. వివరాలిలా.. హైదరాబాద్ ఎర్రమంజిల్‌కు చెందిన ఎన్నారై మార్నీడి శ్రీనివాస్ రావు కర్ణాటకలోని బెంగళూరు రూరల్ జిల్లా దేవనహల్లి తాలుకాలోని షెట్టిరహల్లి గ్రామం సర్వే నెంబర్ 93లో ఎకరా స్థలం నుంచి పావు ఎకరం (పది గుంటలు) కొను గోలు కోసం నగరానికి చెందిన సరిపల్లి వివేకానంద కుమార్ రాజు, దాసరి శ్రీనాథ రావు తో 2007 ఏప్రిల్ 4న ఒప్పందం కుదుర్చుకున్నారు. తరువాత మిగతా ముప్పావు ఎకరాన్ని కూడా కొనుగోలు చేస్తూ రూ.37.70 లక్షల మొత్తాన్ని అమెరికాలోనే ఉన్న ఎన్నారై శ్రీనివాస్ రావు సరిపల్లి వివేకానంద కుమార్ రాజుకు నగదు, చెక్కుల రూపంలో చెల్లించాడు.

ఏళ్లు గడిచినా డెవలప్ చేయకుండా...

అయితే ఏళ్లు గడిచినా భూమిని డెవలప్ చేయకుండా, తనకు అప్పగించకుండా వేధిస్తున్నందుకు శ్రీనివాస్ రావు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. కేసు పూర్వపరాలను, సాక్ష్యాలను పరిశీలించిన కమిషన్ ఇన్‌చార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్, సభ్యుడు కె. రంగారావు బుధవారం తీర్పు చెప్పారు. శ్రీనివాస్‌రావు చెల్లించిన రూ. 37.70 లక్షలను సాలీనా 24 శాతం వడ్డీతో అగ్రిమెంట్ జరిగిన తేదీ నుంచి లెక్కించి చెల్లించాలని, ఫిర్యాదుదారుడిని మానసిక క్షోభకు గురిచేసినందుకు రూ.లక్ష, అదనంగా మరో రూ.50వేలు ఆరు వారాల్లోగా చెల్లించాలని తీర్పు చెప్పారు.

20 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఈసీ వేటు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక్కో పోస్టుకు ముగ్గురు ఐఏఎస్/ఐపీఎస్ అధికారుల పేర్లను ప్రతిపాదించాలని.. వారికి సంబంధించిన గత ఐదేళ్ల వార్షిక పనితీరు మదింపు నివేదిక (ఏపీఏఆర్)లు, విజిలెన్స్ క్లియరెన్స్‌లను సైతం జత చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి ఎస్.బీ జోషి గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ రాశారు. దీనితో బదిలీ అయిన వారు తక్షణమే ఆయా పోస్టులకు వెళ్లాలని సీఎస్ బుధవారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర పర్యటనకు వచ్చి కేంద్ర ఎన్నికల సంఘం బృందానికి వివిధ రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులు, నిబంధనల అతిక్రమణ, తమ దృష్టికి వచ్చిన ఇతర అంశాల ఆధారంగానే పెద్ద సంఖ్యలో అధికారులపై చర్యలు తీసుకున్నట్టు తెలిసింది.

పెద్ద ఎత్తున ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలో ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌లతో కూడిన బృందం ఈనెల 3 నుంచి 5 వరకు రాష్ట్రంలో పర్యటించింది. ఎన్నికల సన్నద్ధతపై విస్తృతంగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించింది. ఈ క్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశమైంది. ఈ సమయంలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వ్యవహార శైలిపై ప్రతిపక్షాల ప్రతినిధులు ఈసీ బృందానికి పలు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఎన్నికలకు ముందు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించే అధికారులను జిల్లా కలెక్టర్లుగా, ఎస్పీలుగా బదిలీ చేశారని, నిష్పక్షపాతంగా వ్యవహరించే యువ అధికారులను పక్కనపెట్టారని పేర్కొన్నట్టు సమాచారం. దీనికితోడు ఈ అధికారులు క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలను బదిలీ చేసిన విషయం కూడా ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లినట్టు తెలిసింది.

గతంలో ఎన్నికల నిర్వహణను ఎత్తిచూపుతూ..

కేంద్ర, రాష్ట్రాల ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఉన్నతాధికారులు, డీజీపీ, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో నిర్వహించిన సమావేశాల సందర్భంగా గతంలో నిర్వహించిన ఎన్నికల తీరుపై సీఈసీ బృందం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికలతోపాటు తర్వాత జరిగిన హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బు, మద్యం, బంగారం, ఇతర కానుకలు పంపిణీ చేసినట్టు ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నాయని గుర్తు చేసినట్టు తెలిసింది. తెలంగాణతోపాటు ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో ఓటర్లను అత్యధికంగా ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు తమకు సమాచారం ఉందని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా ఎన్నికల సమయంలో జప్తు చేస్తున్న డబ్బు, మద్యం, మాదకద్రవ్యాలు, బంగారం, వెండి, ఇతర కానుకలు నామమాత్రంగానే ఉన్నాయని పేర్కొన్నట్టు తెలిసింది. ముఖ్యంగా మునుగోడు ఉప ఎన్నికలు నిర్వహించిన తీరుపై పదేపదే ఆక్షేపణలు తెలిపినట్టు సమాచారం. మరోవైపు డ్రగ్స్, లిక్కర్ మాఫియాపై చర్యలు తీసుకోవడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మహారాష్ట్ర, గుజరాత్‌లలో పెద్ద మొత్తంలో దొరికి డ్రగ్స్ రాష్ట్రం నుంచే తరలివెళ్లినట్టు నివేదికలు ఉన్నాయని.. డ్రగ్స్ మాఫియాతో చేతులు కలిపారా? అని వ్యాఖ్యానించినట్టు సమాచారం. రవాణా శాఖ కార్యదర్శి అధికార పార్టీ సభలకు వాహనాల కేటాయింపులో సహకరించినట్టు వచ్చిన ఆరోపణలతో ఆయనను తొలగించినట్టు తెలిసింది. వివిధ జిల్లాల్లో ఎస్పీలు ప్రతిపక్షాల సభలు, సమావేశాలకు అనుమతులు నిరాకరించడం, నిబంధనలను ఉల్లంఘించడం తదితర ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని వేటు వేసినట్టు సమాచారం.

మరో నాలుగు రాష్ట్రాల్లోనూ బదిలీలు..

తెలంగాణతోపాటు శాసనసభ సాధారణ ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో కూడా పెద్ద సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఆయా రాష్ట్రాల్లో వేటుపడిన వారిలో 9 మంది కలెక్టర్లతోపాటు పలువురు పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు ఉన్నారు.

అధికార వర్గాల్లో ప్రకంపనలు

రాష్ట్రంలో విస్తృతంగా సమీక్షలు జరిపి వెళ్లిన వారంలోనే కేంద్ర ఎన్నికల సంఘం 20 మంది అధికారులపై బదిలీ వేటు వేయడం అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బదిలీ చేసిన అధికారులను ఇంకా ఎలాంటి ఇతర పోస్టుల్లో ఇంకా నియమించలేదు. అయితే బదిలీ అయిన 10 మంది జిల్లా ఎస్పీల్లో 9 నాన్ కేడర్ ఎస్పీలే (ఐపీఎస్ కాకుండా ఎస్సై, సీఐ వంటి పోస్టుల నుంచి సీనియారిటీతో ఎస్పీగా నియామకమైనవారే) కావడం గమనార్హం. సాధారణంగా జిల్లా ఎన్నికల అధికారులుగా కలెక్టర్లే వ్యవహరిస్తారు. ఇలాంటిది నాలుగు జిల్లాల కలెక్టర్లను బదిలీ చేయడం, వారికి ఎలాంటి ఎన్నికల విధులు అప్పగించవద్దని ఈసీ ఆదేశించడం గమనార్హం.

బదిలీ అయిన ఐపీఎస్ అధికారులు వీరే..

తొలగించిన పోస్టు	అధికారి పేరు
హైదరాబాద్ పోలీస్ కమిషనర్	సీవీ ఆనంద్
వరంగల్ పోలీస్ కమిషనర్	ఏవీ రంగనాథ్
నిజామాబాద్ పోలీస్ కమిషనర్	వి.సత్యనారాయణ
సంగారెడ్డి జిల్లా ఎస్పీ	బి.శ్రీనివాస్‌రెడ్డి
జగిత్యాల జిల్లా ఎస్పీ	ఎ.భాస్కర్
మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ	కె.నరసింహ
నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ	కె.మనోహర్
జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ	కె.సృజన
మహబూబాబాద్ జిల్లా ఎస్పీ	జి.చంద్రమోహన్
నారాయణపేట జిల్లా ఎస్పీ	ఎన్.వెంకటేశ్వర్లు
జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ	పి.కరుణాకర్
సూర్యాపేట జిల్లా ఎస్పీ	రాజేంద్రప్రసాద్
కామారెడ్డి జిల్లా ఎస్పీ	బి.శ్రీనివాస్‌రెడ్డి

బదిలీ అయిన కలెక్టర్లు..

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్.హరీశ్
మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ డి.అమోయ్ కుమార్
యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
నిర్మల్ జిల్లా కలెక్టర్ కె.వరుణ్‌రెడ్డి

బదిలీ అయిన ఇతర అధికారులు

రవాణా, రోడ్లు–భవనాల శాఖ కార్యదర్శి కేఎస్ శ్రీనివాసరాజు
ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ
వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి
(వీరిలో ముషారఫ్, శ్రీదేవిలకు ఎన్నికల విధుల అప్పగింతపై ఈసీ ఎలాంటి ఆంక్షలు విధించలేదు)

రేపటినుంచి బహుజన బతుకమ్మ వేడుకలు

- ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్రారంభం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విమలక్క, తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజన బతుకమ్మ వేడుకలు ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట అరుణోదయ విమలక్క, పలువురు అధ్యాపకులు, విద్యార్థి నేతలు బహుజన బతుకమ్మ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విమలక్క మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం 2010లో ప్రారంభమైన బహుజన బతుకమ్మ వేడుకలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న ఉదయం 11 గంటలకు గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళులు అర్పించి మధ్యాహ్నం 2 గంటలకు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆటా–పాటా కార్యక్రమాలతో బహుజన బతుకమ్మను ప్రారంభించనున్నట్లు వివరించారు. అనంతరం ఈ నెల 14న బోడుప్పల్, 15న సెంటినరి కాలనీ గోదావరి ఖని, 16న చీర్లవంచ, రాజన్న సిరిసిల్లా జిల్లా, 17న రావులపల్లి, రంగారెడ్డి జిల్లా, 18న రేగడి మైలారం, వికారాబాద్ జిల్లా, 19న బమ్మెర గ్రామం, జనగామ జిల్లా, 20న వేములవాడ, 21న కేశవపురం, సూర్యాపేట జిల్లాలో వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. 22న ఖమ్మం జిల్లా ముదిగొండలో బహుజన బతుకమ్మను ముగించనున్నట్లు చెప్పారు.

ఓటుకు కోట్లు కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును ముద్దాయిగా చేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల ధర్మాసనం విచారించింది. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అందుబాటులో లేకపోవడం వల్ల కేసు విచారణ వాయిదా వేయాలని చంద్రబాబు తరపు న్యాయవాది గుంటూరు ప్రభాకర్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దీనికి ఎమ్మెల్యే ఆళ్ల తరపు న్యాయవాది అభ్యంతరం చెబుతూ చాలా రోజుల తర్వాత ఈ కేసు జాబితాలోకి వచ్చిందని తదుపరి విచారణ తేదీని ఖరారు చేయాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీనికి అనుమతించిన ధర్మాసనం నవంబర్ 8న విచారణ చేపడతామని పేర్కొంది.

ఐవోక్యూఎమ్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా మేథ మెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫయర్ ఇన్ మేథమెటిక్స్ (ఐవోక్యూఎమ్) ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ సత్తాచాటింది. ఇందులో తమ విద్యాసంస్థ అత్యధికంగా 365 సెలక్షన్లు సాధించిందని శ్రీచైతన్య డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అత్యధికంగా 167 మంది విద్యార్థులు, తెలంగాణ నుంచి 47, కర్ణాటక నుంచి 63, తమిళనాడు నుంచి 28, నార్త్ ఇండియా నుంచి 60 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆమె వెల్లడించారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు సీమ అభినందనలు తెలిపారు.

దసరా పండుగ స్పెషల్

- హైదరాబాద్ నుంచి ఏపీకి వెయ్యి ప్రత్యేక బస్సులు
- సాధారణ చార్జీలకే నడపనున్న ఏపీఎస్ ఆర్టీసీ

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెయ్యి ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులను దృష్టిలో ఉంచుకుని సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు రోజువారీగా తిరుగుతున్న 355 బస్సులకు ఇవి అదనంగా తిరుగుతాయి. ఈనెల 18 నుంచి 23 వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. గతంలో పండుగ ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీ వసూలు చేసే పద్ధతి ఉండేది. కానీ, ఈసారి ఎలాంటి ప్రత్యేక చార్జీలు లేకుండా సాధారణ టికెట్ ధరలే వసూలు చేయాలని నిర్ణయించారు. దసరా పండుగకు నగరం నుంచి ఏపీలోని సొంతూళ్లకు ప్రజలు భారీ ఎత్తున వెళ్తారు. ఈపాటికే అన్ని రైళ్లలో రిజర్వేషన్లు పూర్తయి, పెద్ద ఎత్తున వెయిటింగ్ జాబితా కనిపిస్తోంది. ప్రత్యేక రైళ్లు కూడా నిండిపోయాయి. దీంతో చాలామంది బస్సులపైనే ఆధారపడతారు. తెలంగాణ నడిపే బస్సులు కూడా చాలక ప్రైవేటు వాహనాల్లో వెళ్లేవారు అధిక సంఖ్యలో ఉంటారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. బీహెచ్ఈఎల్, మియాపూర్, ఈసీఐఎల్, ఎంజీబీఎస్‌ల నుంచి ఇవి బయలుదేరతాయి. ఎంజీబీఎస్‌లో రద్దీని నివారించేందుకు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు, మాచెర్ల తదితర ప్రాంతాలకు వెళ్లే సాధారణ, ప్రత్యేక బస్సులను ఎంజీబీఎస్ ఎదురుగా ఉన్న పాత సీబీఎస్ ప్రాంగణం నుంచి నడుపుతారని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఎలక్ట్రిక్ బైక్‌ల ముసుగులో | రూ.45.67 కోట్లు కొట్టేశారు

పన్ను సొమ్మును అక్రమంగా క్లెయిమ్ చేసుకున్న 7 ఉత్తుత్తి ఫర్మ్‌లు

- ఢిల్లీలో స్పేర్ పార్ట్స్ కొన్నట్టు, తెలంగాణలో అమ్మినట్టు టోకరా
- మాదాపూర్ జాయింట్ కమిషనర్ గీత నేతృత్వంలో గుట్టు రట్టు
- కీలక సూత్రధారి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

సాక్షి, హైదరాబాద్: చాలా కాలం తర్వాత వస్తుసేవల పన్ను (జీఎస్టీ) అధికారులు పంజా విసిరారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీ పేరుతో ఉత్తుత్తి ఫర్మ్‌లు సృష్టించి నిబంధనల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని రూ.45.67 కోట్లు కొట్టేసినట్టు గుర్తించారు. ఈ మేరకు ఏడు ఉత్తుత్తి ఫర్మ్‌లపై విచారణ ప్రారంభించి నిందితులను పట్టుకునే పనిలో పడ్డారు. ఈ అక్రమ పన్ను క్లెయిమ్ బాగోతంలో కీలక సూత్రధారిగా వ్యవహరించిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఢిల్లీ నుంచి స్పేర్ పార్ట్స్ (విడి భాగాలు) కొనుగోలు చేసి తెలంగాణలో ఎలక్ట్రిక్ బైక్‌లను తయారు చేసి అమ్ముతున్నామంటూ నిందితులు పలు చిరునామాలతో ఏడు ఫర్మ్‌లను సృష్టించారు. శివసాయి ఎంటర్ ప్రైజెస్, యోకా, మాగ్నమ్, అపెక్స్, గ్రో మోర్, సుప్రియా ఎలక్ట్రిక్ బైక్స్, వినర్డ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో తెలంగాణ జీఎస్టీ విభాగంలో రిజిస్టర్ చేసుకున్న ఈ ఫర్మ్‌ల ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లు తయారు చేసి అమ్మినట్టు చూపించారు. తయారీ, అమ్మకాలు పూర్తి చేశామని పేర్కొంటూ రూ.45.67 కోట్ల పన్నును విలోమ పద్ధతిలో అక్రమంగా క్లెయిమ్ చేసుకున్నారు. ఈ బోగస్ కంపెనీలపై అనుమానంతో మాదాపూర్ జాయింట్ కమిషనర్ కె.గీత నేతృత్వంలో విచారణ జరపగా అసలు ఢిల్లీ నుంచి ఎలాంటి పరికరాలు తీసుకురాలేదని, ఆ పరికరాలు తెచ్చినట్టు చూపించిన ఫర్మ్‌లు కూడా బోగస్ అని వెల్లడయ్యింది. ఒక్క వినర్డ్ ఫర్మ్ ద్వారానే రూ.23.7 కోట్ల మేర క్లెయిమ్ చేసుకున్నట్టు తేలింది. దీంతో ఈ తతంగంలో కీలక పాత్ర పోషించిన వేమిరెడ్డి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసి బుధవారం నాంపల్లిలోని ఆర్థిక నేరాల కోర్టులో హాజరు పరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్టు తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. మరింత లోతుగా విచారణ ప్రారంభించి టాస్క్‌ఫోర్స్ సాయంతో ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నవారిని గుర్తించే పనిలో ఉన్నామని తెలిపింది.

ఈసారి బీఆర్‌ఎస్‌కు మైండ్‌బ్లాంక్ అయ్యే తీర్పు

- నేనెక్కడ పోటీ చేయాలనేది అధిష్టానం నిర్ణయిస్తుంది: బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రెండుసార్లు ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలను అయోమయానికి గురిచేసిందని, ఈసారి ప్రజలే బీఆర్‌ఎస్ పార్టీకి మైండ్‌బ్లాంక్ అయ్యే తీర్పు ఇవ్వబోతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ...ఎన్నికల్లో మళ్లీ ఎలాగైనా గెలవాలని కుట్ర చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమకు తొత్తులుగా పనిచేసే వాళ్లకే పోస్టింగులు ఇచ్చుకున్నారన్నారు. అన్నిశాఖల అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం ఇంటెలిజెన్స్ అధికారులను ఎందుకు బదిలీ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చే గ్యారెంటీలను నమ్మేదెవరని ప్రశ్నించారు. ఎంగిలి మెతుకులకు ఆశపడే నీచమైన పార్టీ ఎంఐఎం అని, ఆ పార్టీకి దమ్ముంటే తెలంగాణ అంతటా పోటీ చేయాలని సవాల్ విసిరారు. తానెక్కడ పోటీ చేయాలనే విషయంలో అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. సీఎం కేసీఆర్‌కు ఆరోగ్యం బాగోలేదని ఆయన భార్య, కుటుంబ సభ్యులు గుడికెళ్లి పూజలు చేస్తుంటే...కేటీఆర్ ఎటుపోయారని, అందుకే ప్రజలకు అనుమానం వస్తుందని ఆరోపించారు.

బీజేపీలో చేరికలు: కరీంనగర్‌లో బుధవారం బండి సంజయ్ సమక్షంలో పెద్దఎత్తున యువకులు బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో తాను పోటీ చేస్తున్నానని అనగానే కొంతమంది భయంతో దారుస్సలాంకు పరుగులు తీస్తున్నారని బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ఇతరపార్టీల నాయకులకు రూ.5లక్షల నుంచి రూ.కోటి వరకు ఆఫర్‌చేస్తూ గులాబీ కండువాలు కప్పుతోందని విమర్శించారు.

కమలం కమిటీల కసరత్తు షురూ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల మేనిఫెస్టోతో పాటు కేసీఆర్ సర్కార్‌పై పెట్టే చార్జిషీట్లు, ప్రభుత్వ వైఫల్యాలు, ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన బీజేపీ కమిటీలు తమ కసరత్తును మొదలుపెట్టాయి. బుధవారం పార్టీ కార్యాలయంలో విడివిడిగా జరిగిన వివిధ కమిటీల భేటీల్లో రాష్ట్రపార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌ఛుగ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. వివేక్ వెంకటస్వామి చైర్మన్‌గా ఉన్న మేనిఫెస్టో కమిటీ భేటీలో జవదేకర్, ఇతర నేతలు పాల్గొని పార్టీ ఎన్నికల ప్రణాళికలో చేర్చే అంశాలపై ప్రాథమిక చర్చలు జరిపారు. అదేవిధంగా అర్వింద్ చైర్మన్‌గా ఉన్న సోషల్ మీడియా కమిటీ సమావేశంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సామాజిక మాధ్యమాల వేదికగా ఏయే రూపాల్లో కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై చర్చించారు. మరో 2, 3 దఫాలుగా ఆయా కమిటీలు భేటీ అయ్యాక మేనిఫెస్టో, చార్జిషీట్లు ఇతర అంశాలపై కార్యాచరణను ఖరారు చేయనున్నారు.

ఢిల్లీ వెళ్లిన కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. జాతీయ నాయకత్వం పిలుపు మేరకే ఆయన అక్కడకు వెళ్లినట్టుగా చెబుతున్నారు. గురువారం రాత్రికల్లా ఆయన నగరానికి తిరిగి వస్తారని పార్టీవర్గాల సమాచారం. ఇదిలా ఉంటే..ఈ నెల 15న తెలంగాణ అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థుల జాబితాపై చర్చకు బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం కానుంది. 40 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాపై ఆమోద ముద్ర వేసి, అదేరోజు లేదా 16న ప్రకటించే అవకాశాలున్నాయి. తొలి జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తారని, సింగిల్ క్యాండిడేట్ నియోజకవర్గాల్లో గెలిచే అవకాశాలున్న ముఖ్యనేతల పేర్లు జాబితాలో ఉంటాయని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు.

హైవే 'అక్రమ పార్కింగ్'పై చర్యలేవీ..

- ప్రమాదాల వివరాలు ఇవ్వండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారులపై భారీ వాహనాలను అక్రమంగా నిలపడం వల్ల జరిగిన ప్రమాదాలు, తీసుకున్న చర్యలపై వివరాలు అందజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. కేంద్ర రవాణా శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది. జాతీయ రహదారులపై భారీ వాహనాలను నిలుపరాదని, అయినా అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారని, నిజామాబాద్–కామారెడ్డి రహదారిపై అక్రమ పార్కింగ్ కారణంగా తన కుమార్తె మృతి చెందిందని పేర్కొంటూ తాపీ మేస్త్రీ నాగరాజు గత నెల రాసిన లేఖను హైకోర్టు టికెన్ అప్ పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. జాతీయ రహదారులపై అక్రమ పార్కింగ్ లేకుండా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని కూడా ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

నేడు విశాఖలో జాతీయస్థాయి సైబర్ క్రైమ్ సమావేశం

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖలోని నొవోటెల్ హోటల్‌లో పది రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులతో సైబర్ క్రైంపై జాతీయస్థాయిలో ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించనున్నారు. ఏపీ సైబర్ క్రైం విభాగం ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కేరళ, జార్ఖండ్, ఒడిశా, అండమాన్, లక్షద్వీప్, పాండిచ్చేరి, ఇతర రాష్ట్రాల డీజీలు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. అలాగే కేంద్ర హోంశాఖ నుంచి కూడా అధికారులు పాల్గొని ప్రసంగించనున్నారు.

'పెరిక కార్పొరేషన్ ప్రతిపాదన పెట్టండి'

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెరిక కార్పొరేషన్ ఏర్పాటు ప్రతిపాదన పెట్టాలని పెరికల రాజకీయ ఐక్యత కార్పొరేషన్ సాధన సమితి కోరింది. టీపీసీసీ వికలాంగ విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మ ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో మేనిఫెస్టో కమిటీ చైర్మన్ డి.శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక వృత్తి లేని కారణంగా పెరిక కులస్తులు సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కాలేకపోతున్నారని పేర్కొన్నారు.

సింగరేణి ఎన్నికలు వాయిదా

- ఈ నెల 28న వద్దు
- డిసెంబర్ 27న నిర్వహించాలన్న హైకోర్టు
- అదే రోజు ఫలితాలూ వెల్లడించాలన్న ధర్మాసనం
- నవంబర్ 30లోగా ఓటర్ల తుది జాబితా సిద్ధం చేయాలి
- ప్రభుత్వానికి, కార్మిక శాఖకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ నెల 28న జరగాల్సిన సింగరేణి ఎన్నికలను వాయిదా వేయాలన్న యాజమాన్యం అభ్యర్థనకు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం అంగీకరించింది. డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని, నవంబర్ 30లోపు ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని స్పష్టం చేసింది. ఈ ఎన్నికలకు సహకరించాలని, ఆ మేరకు కార్మిక సంఘాలకు స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 29కి వాయిదా వేసింది.

ఈ పరిస్థితుల్లో ఇప్పుడు ఎన్నికలు నిర్వహించలేమన్న యాజమాన్యం

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహించలేమని, గడువు కావాలంటూ యాజమాన్యం గత నెల హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఈ ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖలు రాశారని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చింది. వరుస పండుగలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని ప్రభుత్వానికి అధికారులు రాసిన లేఖలో పేర్కొన్నట్లు తెలిపింది. ఈ పరిస్థితుల్లో సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించలేమని వారు పేర్కొన్నట్లు వివరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. గతంలో అక్టోబర్‌లో నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించాలని తేల్చిచెప్పారు. యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ సింగరేణి యాజమాన్యం అప్పీల్‌కు వెళ్లింది. అలాగే సింగరేణి ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ సహకరించేలా ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం మధ్యంతర అప్లికేషన్(ఐఏ) దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.



ప్రక్రియ మాత్రం కొనసాగించండి..

'అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పుడు దాదాపు ఆరు జిల్లాల(కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, భూపాలపల్లి) పరిధిలోని 13 నియోజకవర్గాల్లోని 15 ట్రేడ్ యూనియన్లకు ఎలక్షన్లు అక్టోబర్‌లో నిర్వహించడం సాధ్యం కాదు. ఇందులో మూడు జిల్లాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు. దాదాపు 43,000 మంది ఓటర్లు ఉంటారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్‌తో పాటు ఇతర పలు శాఖల అధికారులు అసెంబ్లీ ఎన్నికల బిజీలో ఉన్నారు. వీరి సహకారం లేకుండా గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదు. 700 మంది అధికారులు, సిబ్బంది సాయం కావాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిల్లో కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు మరి కొంత సమయం ఇవ్వాలి' అని సింగరేణి యాజమాన్యం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం.. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు డిసెంబర్ 27 వరకు సమయం ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గుర్తుల కేటాయింపు తదితర ప్రక్రియను మాత్రం కొనసాగించాలని, నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించింది.

క్లుప్తంగా...

ఐరాస మానవ హక్కుల సంస్థలో రష్యాకు దక్కని స్థానం

ఐక్యరాజ్యసమితి: అంతర్జాతీయంగా మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ(హెచ్ఆర్సీ)లో రష్యాకు స్థానం దక్కలేదు. ఈ కౌన్సిల్‌లో రష్యాకు గతంలో సభ్యత్వం ఉండేది. ఉక్రెయిన్‌పై ఏకపక్షంగా దండయాత్రకు దిగిన రష్యాను గత ఏడాది కౌన్సిల్ నుంచి తొలగించారు. కౌన్సిల్‌లో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు తాజాగా ఎన్నికలు నిర్వహించారు. వీటిని బల్గేరియా, అల్బేనియా దక్కించుకున్నాయి. ఐరాస సభ్యదేశాల సంఖ్య 193. ఇందులో వేర్వేరు దేశాలకు వేర్వేరు సంఖ్యలో ఓట్లు ఉన్నాయి. ఐరాస సాధారణ సభలో జరిగిన ఎన్నికల్లో బల్గేరియాకు 160, అల్బేనియాకు 123, రష్యాకు కేవలం 83 ఓట్లు లభించాయి. రష్యాకు ఓటమి ఎదురైంది.

మిజోరం స్పీకర్ రాజీనామా

బీజేపీలో చేరికకు రంగం సిద్ధం

ఐజ్వాల్: ఎన్నికల రాష్ట్రం మిజోరంలో ఎమ్మెల్యేల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా అసెంబ్లీ స్పీకర్, అధికార మిజో నేషనల్ ఫ్రంట్ నేత లాల్‌రిన్లియానా సైలో తన పదవికి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం త్వరలో బీజేపీలో చేరనున్నట్టు బుధవారం ప్రకటించారు. గురువారం ఆయన కాషాయ తీర్థం పుచ్చుకుంటారని సమాచారం. గత ఎనిమిది రోజుల్లో రాష్ట్రంలో ఏకంగా ఏడుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. వీరిలో ఇద్దరు కాంగ్రెస్ నేతలు కాగా మిగతా ఐదుగురు జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ మద్దతున్న స్వతంత్రులు.

న్యూస్‌క్లిక్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ: విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం ఉల్లంఘన కేసులో న్యూస్‌క్లిక్ వార్తా పోర్టల్, దాని వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థపై సీబీఐ బుధవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సంస్థ కార్యాలయం, ఆయన నివాసాల్లో మరోసారి సోదాలు కూడా నిర్వహించింది. న్యూస్‌క్లిక్, ప్రబీర్‌తో పాటు వరల్డ్ వైడ్ మీడియా హోల్డింగ్ మేనేజర్ జేసన్ ఫెచర్, ఐటీ కన్సల్టెన్సీ సంస్థను నడిపే అమెరికా మిలియనీర్ నెవిలీ రాయ్ సింగం తదితరులను కూడా నిందితులుగా చేర్చింది. నాలుగు విదేశీ మూలాల నుంచి అక్రమంగా రూ.28.46 కోట్ల మేరకు న్యూస్‌క్లిక్‌కు అందినట్టు సీబీఐ ఆరోపించింది.

అఫ్గానిస్తాన్‌లో మళ్లీ భూకంపం

చాహక్: అఫ్గానిస్తాన్‌లో మళ్లీ భూకంపం సంభవించింది. ఇది రిక్టర్ స్కేల్‌పై 6.3గా నమోదయ్యింది. బుధవారం తెల్లవారుజామున 6.11 గంటలకు భూమి కంపించింది. పశ్చిమ అఫ్గానిస్తాన్‌లో హెరాత్ నగరానికి 29 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే సంస్థ ప్రకటించింది.

గాజా అష్ట దిగ్బంధం

రాకెట్లు, డ్రోన్లతో ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడులు | **భవనాల శిథిలాల కిందే మృతదేహాలు**



గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడి అనంతరం దట్టంగా వెలువడుతున్న పొగ

- ఇజ్రాయెల్‌పై రాకెట్లు ప్రయోగిస్తున్న హమాస్
- ఇరువైపులా 2,200 మంది మృత్యువాత
- ఇజ్రాయెల్‌లో 1,200, గాజాలో 1,055 మంది బలి
- గాజాకు ఆహారం, విద్యుత్ సరఫరా బంద్
- ఆసుపత్రుల్లో నిండుకున్న ఔషధాలు
- బందీల భద్రతపై కుటుంబ సభ్యుల్లో ఆందోళన
- లెబనాన్, సిరియా నుంచి ఇజ్రాయెల్‌పై కొనసాగుతున్న దాడులు

జెరూసలేం/టెల్ అవివ్/న్యూఢిల్లీ: హమాస్ మిలిటెంట్లను తుదముట్టించడమే ధ్యేయంగా వారి పాలనలో ఉన్న గాజా ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టింది. పూర్తిగా దిగ్బంధించింది. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బాంబుల మోత మోగిస్తున్నాయి. రాకెట్లు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నాయి. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో భవనాలు ధ్వంసమవుతున్నాయి. సామాన్య ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నేలకూలుతున్న భవనాలు, ఎగిసిపడుతున్న దుమ్ము ధూళీ, పొగ.. గాజా అంతటా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి. పరిస్థితి హృదయవిదారకంగా మారింది. శిథిలాల కింద ఎన్ని మృతదేహాలు ఉన్నాయో తేలడం లేదు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. హమాస్ ముష్కరులు ఇజ్రాయెల్‌పై రాకెట్ల దాడి కొనసాస్తూనే ఉన్నారు. దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఆష్కెలాన్ సిటీపై బుధవారం భారీగా రాకెట్లను ప్రయోగించారు. ఇరువైపులా ఇప్పటివరకు 2,200 మంది చనిపోయారు. తమ దేశంలో 155 మంది సైనికులు సహా 1,200 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారని ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. గాజాలో కనీసం 1,055 మంది బలయ్యారు. వీరిలో 260 మంది చిన్నారులు, 230 మంది మహిళలు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు, ఉత్తర ఇజ్రాయెల్ సరిహద్దుల్లో లెబనాన్, సిరియా నుంచి తీవ్రవాదులు ఇజ్రాయెల్ సైన్యంపై దాడికి దిగుతున్నారు. ఇరువర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఇది మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

క్షతగాత్రులతో నిండిపోయిన గాజా ఆసుపత్రులు

దారులన్నీ మూసుకుపోవడంతో గాజాలో ఆహారం, ఇంధనం, ప్రాణాధార ఔషధాలు నిండుకున్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంధకారం అలుముకుంది. ఆసుపత్రులన్నీ ఇప్పటికే క్షతగాత్రులతో నిండిపోయాయి. ఔషధాలు, వైద్య పరికరాలు లేకపోవడంతో బాధితులకు వైద్యం అందించలేకపోతున్నారు. ఇతర దేశాల నుంచి గాజాకు ఔషధాల సరఫరా కోసం సురక్షిత కారిడార్లు ఏర్పాటు చేయాలని స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి. గాజాలోని ఏకైక విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఇంధనం లేకపోవడంతో మూతపడింది. ఇంధన సరఫరాను ఇజ్రాయెల్ నిలిపివేసింది. ప్రస్తుతం కరెంటు కోసం కొన్నిచోట్ల జనరేటర్లు ఉపయోగిస్తున్నారు. ఈజిప్టు కూడా తమ సరిహద్దును మూసివేసింది. గాజా నుంచి రాకపోకలను అనుమతించడం లేదు. గాజాలో 2,50,000 మందికిపైగా ప్రజలు సొంత ఇళ్లు వదిలేసి, ఐక్యరాజ్యసమితి శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. గాజా చుట్టూ ఇజ్రాయెల్ సైన్యం మోహరించడంతో బయటకు వెళ్లే మార్గం లేకుండాపోయింది. గాజాలో ఇప్పుడు భద్రమైన స్థలం అంటూ ఏదీ లేదని స్థానికులు చెబుతున్నారు.

బందీలను ఎక్కడ దాచారో?

ఇజ్రాయెల్‌లో హమాస్ మిలిటెంట్లు అపహరించిన 150 మందికిపైగా జనం జాడ ఇంకా తెలియరాలేదు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్నవారి క్షేమ సమాచారాలు తెలియక వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తు హెచ్చరికలు లేకుండా గాజాపై ఇజ్రాయెల్ దాడి చేసిన ప్రతిసారీ ఒక్కో బందీని చంపేస్తామని హమాస్ సాయుధ విభాగం హెచ్చరికలు జారీ చేసింది. హమాస్ అపహరించిన 150 మందిలో ఇజ్రాయెల్ సైనికులు, మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. గాజాలో రహస్య సొరంగాల్లోకి వారిని తరలించినట్లు ఇజ్రాయెల్ అనుమానిస్తోంది.

ఇజ్రాయెల్‌లో 40 మంది చిన్నారుల హత్య!

హమాస్ మిలిటెంట్లు రాక్షసంగా ప్రవర్తించారు. ఇజ్రాయెల్‌లో 40 మంది చిన్నారులను పాశవికంగా హత్య చేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ వార్తా సంస్థ వెల్లడించింది. హమాస్ దాడులు చేసిన ప్రాంతాల్లో 40 మంది పసిబిడ్డల మృతదేహాలు లభ్యమయ్యాయని ఇజ్రాయెల్ సైన్యం తెలియజేసినట్లు పేర్కొంది. బాధిత చిన్నారుల మృతదేహాల్లో కొన్నింటికి తలలు దారుణంగా నరికేసి ఉన్నాయని వివరించింది.

గాజాలో ఆకలి కేకలు

ఆహారం, తాగునీరు లేక గాజా ప్రజలు అల్లాడిపోతున్నారు. బయటి నుంచి ఎలాంటి సరఫరాలూ వచ్చే మార్గం లేక 23 లక్షల మంది గాజాపౌరులు హాహాకారాలు చేస్తున్నారు. నిజానికి 2007 నుంచే గాజాను ఇజ్రాయెల్ పూర్తిగా తన గుప్పెట్లో ఉంచుకుంది. అక్కడికి ఎలాంటి సరఫరాలైనా ప్రధానంగా ఇజ్రాయెల్ గుండా, దాని అనుమతితో వెళ్లాల్సిందే. గాజా గగనతలం, ప్రాదేశిక జలాలతో పాటు మూడు ప్రధాన సరిహద్దు ప్రాంతాల్లో రెండింటిని ఇజ్రాయెలే పూర్తిగా నియంత్రిస్తోంది. మూడో సరిహద్దు ఈజిప్టు నియంత్రణలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని, గాజాకు అత్యవసర ఆహార పదార్థాలు, ఇతర సదుపాయాలు అందేలా చూడాలని పాలస్తీనా విమోచన సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రధాన కార్యదర్శి హుసేన్ అల్ షేక్ విజ్ఞప్తి చేశారు. గాజాలో ఐరాస శిబిరాల్లో తలదాచుకుంటున్న 1.8 లక్షల మందికి ఎలాంటి ఆహార సరఫరాలూ అందడం లేదని ఐరాస రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ వెల్లడించింది.



గాజాపైకి కాల్పులు జరుపుతున్న ఇజ్రాయెల్ శతఘ్నులు

హమాస్ దుశ్చర్యను ఖండించిన జో బైడెన్

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి ఖండించారు. ఈ దాడి ముమ్మాటికీ రాక్షస చర్య అని అభివర్ణించారు. ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని ఉద్ఘాటించారు. ఈ పరిణామాన్ని సానుకూలంగా మార్చుకోవాలని ఎవరూ చూడొద్దని హెచ్చరించారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతు తెలియజేయడానికే ఆయన స్వయంగా వచ్చినట్లు సమాచారం. జో బైడెన్‌తోపాటు అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇజ్రాయెల్‌లో హమాస్ దాడిలో తమ పౌరులు 14 మంది మరణించారని జో బైడెన్ నిర్ధారించారు. అలాగే కనీసం 20 మంది అమెరికన్లు కనిపించకుండాపోయినట్లు సమాచారం. హమాస్ దాడిలో ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, ఆస్ట్రేలియా పౌరులు కూడా మృతి చెందారు. గాజాను ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధించడాన్ని తుర్కియే అధ్యక్షుడు రిసెప్ తయాప్ ఎర్డోగాన్ ఖండించారు. పాలస్తీనా పౌరుల మానవ హక్కులపై దాడి చేయొద్దని డిమాండ్ చేశారు. ఘర్షణకు తెరదించాలని, కాల్పుల విరమణ పాటించాలని ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసీ ఇజ్రాయెల్, హమాస్‌కు విజ్ఞప్తి చేశారు.



శిథిలాల నుంచి చిన్నారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న సిబ్బంది

భారత రాయబార కార్యాలయం భరోసా

ఇజ్రాయెల్‌లో తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని టెల్ అవివ్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని భారతీయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రశాంతంగా ఉండాలని సూచించింది. అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఏదైనా సహాయం కావాలంటే తమను సంప్రదించాలని తెలియజేసింది. భద్రత విషయంలో స్థానిక అధికారుల మార్గదర్శకాలు పాటించాలని కోరింది.

ఇజ్రాయెల్‌దే పైచేయి!

హమాస్‌పై ఇజ్రాయెల్ సైన్యం క్రమంగా పైచేయి సాధిస్తోంది. గాజాలో హమాస్ అధీనంలో ఉన్న ప్రాంతాలను సైన్యం స్వాధీనం చేసుకుంటోంది. హమాస్ స్థావరాలపై దాడులను తీవ్రతరం చేస్తోంది. గాజా విషయంలో ఇక మునుపటి స్థితికి వెళ్లడం దాదాపు అసాధ్యమని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ తాజాగా ప్రకటించారు. హమాస్‌పై ఇక పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమైనట్లు వెల్లడించారు. గాజా నుంచి హమాస్ మిలిటెంట్లను ఏరిపారేస్తామని తేల్చిచెప్పారు. వారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు.

భారత విదేశాంగ శాఖ హెల్ప్‌లైన్

ఇజ్రాయెల్, గాజాలో ఉన్న భారతీయులకు సహకరించేందుకు, ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు భారత విదేశాంగ శాఖ ఢిల్లీలో కంట్రోల్ రూమ్, టెల్ అవివ్, రమల్లాలో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసింది. ఇజ్రాయెల్‌లో ప్రస్తుతం 18 వేల మంది భారతీయులు ఉన్నట్లు అంచనా. 1800118797, +91-11 23012113, +91-11-23014104, +91-11-23017905 +919968291988, +97235226748, +972-543278392, +970-592916418 నంబర్లకు ఫోన్ చేసి, సమాచారం తెలుసుకోవచ్చని విదేశాంగ శాఖ సూచించింది.

వివాహిత 26 వారాల గర్భవిచ్ఛిత్తి కేసులో...

సుప్రీం భిన్న తీర్పులు

- పిండం గుండె ఆపేయాలని ఏ కోర్టు చెప్పదన్న జస్టిస్ హిమా కోహ్లీ
- గర్భవిచ్ఛిత్తిలో మహిళ నిర్ణయాన్ని గౌరవించాలన్న జస్టిస్ నాగరత్న
- ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో ప్రధాన న్యాయమూర్తికి సిఫారసు

న్యూఢిల్లీ: గర్భ విచ్ఛిత్తికి సంబంధించిన ఒక కేసులో అత్యున్నత న్యాయస్థానం ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. సుప్రీం కోర్టులో ద్విసభ్య బెంచ్ బుధవారం భిన్న తీర్పుల్ని వెలువరించింది ఒక వివాహిత గర్భం దాల్చిన 26 వారాలకు గర్భవిచ్ఛిత్తి కోరుతూ కోర్టును ఆశ్రయించింది. దీనిపై ఎయిమ్స్ ఇచ్చిన నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు బెంచ్‌లోని న్యాయమూర్తి జస్టిస్ హిమ కోహ్లి పిండం గుండె ఆపేయాలని ఏ కోర్టు అయినా ఎందుకు చెబుతుందని ప్రశ్నిస్తూ గర్భవిచ్ఛిత్తికి నిరాకరించారు. సుప్రీం బెంచ్‌లో మరో న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న దాంతో విభేదించారు. మహిళ నిర్ణయాన్ని తప్పనిసరిగా గౌరవించాలని అన్నారు. వివరాల్లోకి వెళితే........

ఇద్దరు పిల్లలున్న ఒక వివాహిత మూడోసారి గర్భం దాల్చింది. అప్పటికే కుంగుబాటు సమస్యతో బాధపడుతున్న ఆమె మానసికంగా, ఆర్థికంగా తాను మరో పిల్లని పెంచడానికి సంసిద్ధంగా లేనని, అందుకే గర్భవిచ్ఛిత్తికి అనుమతినివ్వాలని సుప్రీం కోర్టుని ఆశ్రయించింది. గర్భం దాల్చి 26 వారాల కావడంతో ఎయిమ్స్‌లో వైద్యులు ఆమెని పరీక్షించి అబార్షన్ వల్ల ఎలాంటి ప్రమాదం లేదని అక్టోబర్ 6న నివేదిక కూడా ఇచ్చారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు గర్భవిచ్ఛిత్తికి అనుమతినిస్తూ అక్టోబర్ 9న తీర్పు చెప్పింది.ఆ మహిళకు అబార్షన్ చేయాలని ఎయిమ్స్ వైద్యాధికారుల్ని ఆదేశించింది. అబార్షన్‌కు ముందు ఎయిమ్స్ డాక్టర్లు ఆమెని పరీక్షించి గర్భవిచ్ఛిన్నం చేసినా శిశువు సజీవంగానే ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతూ మరో నివేదిక ఇచ్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వం గర్భవిచ్ఛిత్తి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందిగా అక్టోబర్ 10న మరో పిటిషన్ దాఖలు చేసింది. అత్యవసరంగా బుధవారం ఆ పిటిషన్‌ను విచారించిన సుప్రీం బెంచ్ తొలుత ఎయిమ్స్‌లో మరో వైద్య బృందం గర్భవిచ్ఛిత్తి వల్ల వచ్చే ప్రమాదేమేమీ లేదని ఇచ్చిన నివేదికను ప్రస్తావించింది. అక్టోబర్ 6 న అబార్షన్‌కు ప్రమాదం లేదని వైద్యులు ఎందుకు నివేదిక ఇచ్చారు ? ఎందుకు ఆ దాపరికం ? నాలుగు రోజుల్లోనే ఎలా పరిస్థితి మారింది ? అని ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిపై న్యాయమూర్తులు ప్రశ్నల వర్షం కురిపించారు. గర్భవిచ్ఛిన్నం చేసినా శిశువు బతికే ఉంటుందని అంటే ఏ కోర్టు అయినా పిండం గుండె ఆపేయమని ఎందుకు చెబుతుంది ? అంటూ జస్టిస్ హిమాకోహ్లీ ప్రశ్నించారు. నా వరకు నేనైతే అలాంటి పని చేయలేనన్న జస్టిస్ హిమ గర్భవిచ్ఛిత్తికి నిరాకరించారు. మరో న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని ప్రస్తావించారు. ఇప్పటికీ ఆ మహిళ గర్భం తీసివేయడం పట్ల సుముఖంగా ఉన్నందున ఆమె నిర్ణయాన్ని గౌరవించాలంటూ గర్భవిచ్ఛిత్తికి అనుమతినిస్తూ తీర్పు చెప్పారు. ఆ మహిళ సామాజిక ఆర్థిక పరిస్థితులతో పాటు ఆమె శారీరక, మానసిక పరిస్థితుల దృష్ట్యా గర్భవిచ్ఛిత్తి చేయడమే సరైనదన్నారు. ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో ఈ కేసుని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు పరిశీలనకు సిఫారసు చేశారు.

హమాస్ దాడి వెనుక...

- పశ్చిమాసియాలో మారుతున్న బలాబలాలతో ఆందోళన
- అరబ్ దేశాలతో ఇజ్రాయెల్ సాన్నిహిత్యంతో కలవరం
- అన్నివిధాలా ఇరుకున పెట్టడమే లక్ష్యంగా నెత్తుటేర్లు

ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడి ఒక్క ఆ దేశాన్నే గాక ప్రపంచమంతటినీ నిర్ఘాంతపరిచింది. నెలల తరబడి పక్కాగా ప్రణాళిక వేసుకుని మరీ చేసిన ఈ దాడి వెనక, ఇదే సమయాన్ని ఎంచుకోవడం వెనక కారణాలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఒకరకంగా పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ ప్రభుత్వ మితిమీరిన దూకుడు విధానాలు ఈ దాడిని సమర్థించునేందుకు హమాస్‌కు అవకాశం కూడా కల్పించినట్టు కన్పిస్తోంది.

ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7న తెల్లవారుతూనే ఉరుముల్లేకుండానే పిడుగులు పడ్డాయి. జనం పిట్టల్లా రాలిపోయారు. రక్తం ఏరులై పారింది. బందీలుగా చిక్కిన వంద మందికి పైగా సైనికులు, పౌరులు నరకం చూస్తున్నారు. ఇంతటి ఉత్పాతానికి కారణమైన పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ దాడి గురించి ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోంది. పశ్చిమాసియాలో మారుతున్న రాజకీయ బలాబలాలు, నానాటికీ పెరుగుతున్న ఇజ్రాయెల్ దూకుడు దాన్ని ఇందుకు పురిగొల్పిన కారణాల్లో ప్రధానమైనవని భావిస్తున్నారు.

ఇప్పుడే ఎందుకు?

హమాస్‌ను తాజా దాడి వెనక ప్రధానంగా మూడు కారణాలు కన్పిస్తున్నాయి. వాటిలో ప్రధానమైనది అతివాద ఇజ్రాయెల్ సర్కారు దూకుడు విధానాలు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్, జెరూసలేంల్లో యూదు సెటిలర్ల హింసను అది బాహాటంగా ప్రోత్సహించడం పాలస్తీనియన్ల ఆగ్రహానికి కారణమైంది. చివరికి ప్రతీకారేచ్ఛగా మారింది. సరిగ్గా అదే సమయంలో వెస్ట్‌బ్యాంక్‌లో పెరుగుతున్న ఉద్రిక్తత కారణంగా దక్షిణాది నుంచి సైన్యాన్ని ఇజ్రాయెల్ ఉత్తరానికి తరలించడం హమాస్‌కు కలిసొచ్చింది.

అరబ్–ఇజ్రాయెల్ బంధం

అరబ్ దేశాలతో సాధారణ సంబంధాల స్థాపనకు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రయత్నాలు కాస్తో కూస్తో ఫలించేలా కన్పిస్తుండటం హమాస్‌ను కలవరపరిచిన రెండో అంశం. కొంతకాలంగా పాలస్తీనా విషయంలో ఇజ్రాయెల్‌పై అరబ్ దేశాల ఒత్తిడి తగ్గుతూ వస్తుండటం మరింత ఆందోళనకు కారణమైంది. ఇదే సమయంలో అరబ్ దేశాల పెద్దన్నగా భావించే సౌదీ అరేబియా ఇజ్రాయెల్‌తో పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తుండటంతో హమాస్ అప్రమత్తమైంది. ఇదిలాగే కొనసాగితే పాలస్తీనాకు పూర్తి స్వాతంత్ర్యం ఇక కల్లోని మాటేనన్న అంచనాకు వచ్చింది.

ఇరాన్ దన్ను

ఇరాన్‌తో కొన్నేళ్ల కిందటి దాకా క్షీణ దశలో ఉన్న సంబంధాలను హమాస్ క్రమంగా పట్టాలకెక్కించుకుంటూ వచ్చింది. 2022లో హమాస్ ప్రతినిధుల బృందం సిరియాలో ఇరాన్ నేతలతో పలుమార్లు భేటీ అయింది. అనంతరం లెబనాన్, ఇరాన్‌లలో జరిగిన పలు సమావేశాల ద్వారా సంబంధాల పునరుద్ధరణ జోరందుకుంది. ఇవన్నీ ఇజ్రాయెల్‌పై భారీ ఆకస్మిక దాడికి కావాల్సిన హేతుబద్ధమైన కారణాలు, అవకాశాలతో పాటు సాయుధ, ఆర్థిక తదితర వనరులను కూడా హమాస్‌కు చేకూర్చాయి.



ఇప్పుడేం జరగనుంది?

ముస్లింలకు అతి పవిత్రమైన అల్ అక్సా మసీదు వద్ద యథాతథ స్థితిని ఇజ్రాయెల్ ఉల్లంఘించకుండా చూడాలన్న స్వల్పకాలిక లక్ష్యాన్ని ఈ దాడి ద్వారా హమాస్ సాధించినట్టే కన్పిస్తోంది. కానీ దీర్ఘకాలంలో సాధించదలచిన ఇజ్రాయెల్ వినాశనం, ముస్లిం రాజ్య ఏర్పాటు లక్ష్యాలు నెరవేరడం దేవుడెరుగు, గాజా స్ట్రిప్‌ను నామరూపాల్లేకుండా చేయకుండా ఇజ్రాయెల్‌ను అడ్డుకోవడమే హమాస్‌కు తలకు మించిన భారం కాగలదంటున్నారు. ఇజ్రాయెలీ బందీలను అడ్డుపెట్టుకున్నంత కాలమే హమాస్ ఆటలు సాగేలా కన్పిస్తున్నాయి.

అంతమెప్పుడు?

ఈ పోరుకు ముగింపు ఎప్పుడు, ఎలా జరగనుందన్నది ప్రస్తుతానికైతే అస్పష్టమే. దీనికి సమీప భవిష్యత్తులో ఏదో రకంగా తెర పడాలంటే బహుశా అంతర్జాతీయ సమాజపు జోక్యమే ఏకైక మార్గమని భావిస్తున్నారు. ఆ సందర్భంగా తన దగ్గర బందీలుగా ఉన్న ఇజ్రాయెలీ సైనికులు, పౌరులకు బదులుగా ఖైదులో ఉన్న పాలస్తీనియన్లను విడిపించుకోవడం హమాస్ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఆలోపు ఇజ్రాయెల్ భారీ ప్రతీకార దాడులకు దిగకుండా అడ్డుకునేందుకు కూడా బందీలు ఉపయోగపడతారని భావిస్తోంది. గాజాలో పౌర ఆవాసాలపై ఇజ్రాయెల్ భూతల దాడులకు దిగిన మరుక్షణం బందీలను హతమార్చడం మొదలు పెడతామని హమాస్ అధికార ప్రతినిధి అబూ ఉబైదా ఇప్పటికే హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో గాజాలోకి చొచ్చుకెళ్లి దాడులకు దిగడంపై ఇజ్రాయెల్ ఇప్పటికైతే ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది. మరోవైపు ఈ దాడి ద్వారా గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాల్లో తనకు పెరిగిన ప్రతిష్ట రాజకీయంగా మరింతగా బలపడేందుకు పనికొస్తుందని కూడా హమాస్ ఆశిస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పట్టాలు తప్పిన నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లు.. ఐదుగురి మృతి!

బక్సర్: నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లు బిహార్‌లోని బక్సర్ జిల్లా రఘునాథ్‌పూర్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పాయి. ఈ రైలు ఢిల్లీ నుంచి అస్సాంకు బయలుదేరింది. బుధవారం రాత్రి 9.35 గంటలకు కొన్ని కోచ్‌లు పట్టాలు తప్పినట్లు రైల్వే అధికారులు చెప్పారు. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందినట్లు సమాచారం. 100 మందికిపైగా ప్రయాణికులు గాయపడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు రంగంలోకి దిగారు. సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. రైలు కోచ్‌లు పట్టాలు తప్పడం వెనుక కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.



పట్టాలు తప్పిన నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ బోగీలు


మేరా యువ భారత్ వేదికకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: యువతలో నైపుణ్యాల అభివృద్ధి కోసం మేరా యువ భారత్(మై భారత్) అనే స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ ఏర్పాటుకు బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో యువతలో నైపుణ్యాల అభివృద్ధి, నాయకత్వ లక్షణాల పెంపు కోసం ఒక వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ విలేకరులకు వెల్లడించారు. అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఈ సంస్థను జాతికి అంకితం చేయనున్నారు. యువతలో నైపుణ్యాలను, ఆకాంక్షలను వెలికి తీయడమే లక్ష్యంగా ఆ సంస్థ పనిచేస్తుందన్నారు. మరోవైపు కేబినెట్ సమావేశంలో కొన్ని ఖనిజాలకు సంబంధించిన రాయల్టీ రేట్లను నిర్ణయించారు. లిథియం, నియోబియం ఖనిజాలకు 3%, అరుదుగా లభించే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్ఈఈ)లకు ఒక్క శాతం రాయల్టీ నిర్ణయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

‘పఠాన్‌కోట్’ సూత్రధారి షహీద్ లతీఫ్ హతం

- పాకిస్తాన్‌లో దుండగుల కాల్పుల్లో మృతి
- సోదరుడు హరీస్ హషీం సైతం హతం

న్యూఢిల్లీ: 2016లో పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) స్థావరంపై దాడి వెనుక సూత్రధారి, పాకిస్తాన్‌కు చెందిన జైషే మొహమ్మద్ ఉగ్రవాది షహీద్ లతీఫ్, అతడి సోదరుడు హరీస్ హషీం హతమయ్యారు. బుధవారం ఉదయం పాకిస్తాన్‌లోని సియాల్‌కోట్ జిల్లాలో గుర్తుతెలియని దుండుగుల కాల్పుల్లో వారిద్దరూ మరణించారని అధికారులు వెల్లడించారు. డాస్కా పట్టణంలో నూర్ మదీనా మసీదు బయట ఈ ఘటన జరిగిందని చెప్పారు. మసీదులో ప్రార్థనలు ముగించుకొని బయటకు రాగానే ముగ్గురు దుండుగులు తుపాకులతో కాల్పులు జరిపారని, 53 ఏళ్ల షహీద్ లతీఫ్, అతడి సోదరుడు హషీం అక్కడికక్కడే చనిపోయారని, మరో వ్యక్తి గాయపడ్డాడని తెలిపారు. షహీద్ లతీఫ్ అలియాస్ బిలాల్ అలియాస్ నూర్ అల్–దిన్ నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మొహమ్మద్ లాంచింగ్ కమాండర్‌గా పని చేస్తున్నాడు. భారత ప్రభుత్వం అతడిని చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఉగ్రవాదిగా ప్రకటించింది. భారత్‌లో పలు ఉగ్రవాద దాడుల వెనుక లతీఫ్ హస్తం ఉంది. 1994 నవంబర్‌లో భారత్‌లో అరెస్టయ్యాడు. జమ్మూకశ్మీర్ జైలులో 16 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. 2010లో విడుదలై పాకిస్తాన్‌కు చేరుకున్నాడు. పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రం అమీనాబాద్‌లో జన్మించిన షహీద్ లతీఫ్ చిన్న వయసులోనే ఉగ్రబాట పట్టాడు. 2016 జనవరి 2న పఠాన్‌కోట్‌లోని ఐఏఎఫ్ స్థావరంపై జరిగిన దాడిలో ఏడుగురు భారత వైమానిక దళం సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడికి పథక రచన చేసిందని లతీఫ్ అని భారత దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులజాబితాలో లతీఫ్ పేరును చేర్చారు. అతడి కోసం ఎన్ఐఏ గాలిస్తోంది. పాకిస్తాన్ భూభాగంలోనే లతీఫ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపడం జైషే మొహమ్మద్‌కు భారీ ఎదురుదెబ్బేనని చెప్పొచ్చు.



కనపడని సైన్యం!

సోషల్ మీడియాలో పార్టీల బల ప్రదర్శన | ఆరోపణలు, విమర్శలతో నేతల బాహాబాహీ | ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్.. ఇలా ప్రతి ఆన్‌లైన్ వేదికను వాడుతున్న తీరు | కొత్త పుంతలు తొక్కుతున్న ప్రచార శైలి



'సోషల్' ప్రచారం.. ఎందులో ఎలా?
ఫేస్‌బుక్‌లో ప్రత్యేక పేజీలు, ఖాతాలు సృష్టించి ప్రమోషన్.. ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ద్వారా.. ట్విట్టర్ (ఎక్స్)లో హ్యాష్‌ట్యాగ్‌ల ద్వారా.. యూట్యూబ్ చానల్స్‌లో ఎక్కువ లైక్స్, వ్యూస్ వచ్చేలా చేయడం.

#ట్రెండింగ్..
యూట్యూబ్, ట్విట్టర్‌లలో ఒక హ్యాష్‌టాగ్ తయారు చేస్తారు. పార్టీ అభ్యర్థి తన కంటెంట్ ప్రమోషన్‌కు తన పేరుతోపాటు సీనియర్ నేత పేరు జత చేసి హ్యాష్‌ట్యాగ్‌లా రాసి కంటెంట్‌ను సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్‌సాయంతో ఎక్కువ వ్యూలు, లైక్‌లు, పేర్లు వచ్చేలా ట్రెండింగ్ చేయిస్తారు.

ఒకప్పుడు.. ఎన్నికల ప్రచారమంటే ఊరూరా పార్టీలు, నాయకుల ర్యాలీలు.. మైకులలో హోరెత్తే ప్రసంగాలు.. ప్రచార పాటలతో తిరిగే వాహనాలు మాత్రమే అన్నట్టుండేది. ప్రతి పార్టీకి, అభ్యర్థికి వారి మద్దతుదారులే ప్రచార సేనగా ఉండేవారు. కానీ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. సోషల్ మీడియా సైన్యం ఎన్నికల కదనంలో తెరవెనుక ఉంటూ కనిపించని యుద్ధం చేస్తోంది. ఓటర్లపై దీని ప్రభావం ఎక్కువే ఉంటుండటంతో.. ప్రతి పార్టీ ప్రత్యేకంగా తమకంటూ ఓ సోషల్ మీడియా వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. కొన్ని పార్టీల నేతలు, కొత్తగా ఎన్నికల్లో పోటీలో దిగుతున్నవారు కూడా సైతం ఎవరికి వారు సొంతంగా సోషల్ టీంలను పెట్టుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా ప్రచారం ఎలా ఉండబోతోంది, సాంకేతికంగా దీని వెనుకదాగున్న అంశాలపై కథనం..

– సాక్షి, హైదరాబాద్

ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా వినియోగాన్ని ప్రధానంగా మూడు భాగాలుగా చూడవచ్చు

సోషల్ మీడియా వాడకం సూక్ష్మంగా ఇలా.. → కంటెంట్ క్రియేషన్ → కంటెంట్ ప్రమోషన్ అండ్ ట్రెండింగ్ → సోషల్ మీడియా సెంటిమెంట్ అనాలసిస్

కంటెంట్ క్రియేషన్.. కంటెంట్ రైటర్లు..

సోషల్ మీడియాలో మంచి ప్రచారం పొందాలంటే ఓటర్లను ఆకట్టుకునేలా, ఆలోచింపజేసేలా.. అనుకూల ఓటరుగా మార్చేలా వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు, వీడియో, ఆడియో సందేశాలు ఉండాలి. ఇందుకే అన్ని రాజకీయ పార్టీలు కంటెంట్ రైటర్లను, క్రియేటర్లను నియమించుకుంటున్నాయి. నేతలు కూడా వ్యక్తిగత సోషల్ మీడియా టీంలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ కంటెంట్ క్రియేటర్లు రోజువారీగా వారికి ఇచ్చిన టార్గెట్ నియోజకవర్గ పరిధిలోని సమస్యలు, సదరు రాజకీయ పార్టీ లేదా పోటీలో ఉన్న నాయకుడి గురించిన సానుకూల అంశాలు.. ప్రత్యర్థి పార్టీ, అభ్యర్థుల బలహీనతలపై విమర్శలతో కంటెంట్‌ను రాసి ఇస్తూ ఉంటారు.

కంటెంట్ ప్రమోషన్ అండ్ ట్రెండింగ్..

కంటెంట్ రైటర్ల ద్వారా తీసుకున్న అంశాలతో తయారు చేసిన కథనాలు, ఆడియోలు, వీడియోలు, ఫొటోలను టార్గెట్‌గా పెట్టుకున్న అసెంబ్లీ సెగ్మెంట్, జిల్లా లేదా రాష్ట్రం మొత్తంగా ఓటర్లకు వివిధ రకాల సోషల్ మీడియా వేదికల ద్వారా చేర్చడమే కంటెంట్ ప్రమోషన్. ఇందుకోసం కంటెంట్ ప్రమోటర్లు తొలుత ఆ రాజకీయపార్టీ, నేతల పేరిట ఫేస్‌బుక్, ట్విట్టర్ (ఎక్స్), ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ చానళ్లు, వాట్సాప్ గ్రూపులు, చానళ్లు వంటివి సృష్టిస్తారు.

సోషల్ మీడియా సెంటిమెంట్ అనాలసిస్

సోషల్ మీడియా అనేది బయటికి కనిపించని డిజిటల్ ప్రపంచం. అందులో మనం పోస్ట్ చేస్తున్న, వైరల్ చేస్తున్న కంటెంట్‌ను, వీడియోలు, ఫొటోలు, సమాచారం, ఆడియో మెసేజ్‌లు ఎంత వరకు టార్గెట్ ఓటర్లకు చేరుతుంది. ఒకవేళ చేరకపోతే ఎందుకు చేరడం లేదు? టార్గెట్ ఓటర్‌ను ఆకర్షించేలా ప్రత్యర్థి పార్టీలు ఎలాంటి ప్రమోషన్ చేస్తున్నాయి? వాటిని కౌంటర్ చేయాలంటే ఎలాంటి మార్పులు చేసుకోవాలన్న అంశాలను విశ్లేషించడాన్నే స్థూలంగా సోషల్ మీడియా సెంటిమెంట్ అనాలసిస్‌గా చెప్పొచ్చు. దీని ఫీడ్‌బ్యాక్‌ను ఆధారంగా కంటెంట్‌లో ఎలాంటి మార్పులు చేయాలనేది కంటెంట్ రైటర్లకు సూచనలు చేస్తున్నారు. కేవలం సోషల్ మీడియాలో అంశాలనే కాకుండా క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి ప్రజల నాడి తెలుసుకోవడం కూడా ఈ సోషల్ మీడియా సెంటిమెంట్ అనాలసిస్ టీమ్‌ల పనిగా చెప్పొచ్చు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో సోషల్ మీడియాతో..

భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీపడటం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆన్‌లైన్ డిబేట్లు, సోషల్ మీడియాలో గట్టి ప్రచారంతో ఆయన ముందంజలో నిలుస్తున్నారని అక్కడి రాజకీయ విశ్లేషకులు ఇప్పటికే పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రచారం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరింత ప్రభావం చూపనుందని అంచనా వేస్తున్నారు.

హ్యాకింగ్ టీమ్‌లతో గుట్టు తెలుసుకుంటూ..

పలు రాజకీయ పార్టీలు ప్రత్యర్థి పార్టీలు, నేతల వ్యూహాలను తెలుసుకోవడం కోసం సైబర్ హ్యాకింగ్ నిపుణుల సేవలనూ వాడుకుంటున్నారు. సోషల్ మీడియా పెనెట్రేటింగ్ టూల్స్‌ను వినియోగించి.. కీలక వివరాలు సేకరించి, తమకు అనుకూలంగా, ప్రత్యర్థులకు వ్యతిరేకంగా వినియోగిస్తున్నారు.

ప్రచార ట్రెండ్ మారింది..

తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను చేరేందుకు సోషల్ మీడియా అనేది రాజకీయ పార్టీలకు, నేతలకు అస్త్రంగా మారింది. ఓటర్లకు మన బలాన్ని చెప్పడంతోపాటు ఎదుటి వ్యక్తి బలహీనతలపై ఓటర్లను ఆలోచింపజేసేలా ఈ డిజిటల్ ప్రచారం ఉపయోగపడుతోంది. పార్టీలే కాదు అభ్యర్థులు సైతం సొంతంగా సోషల్ మీడియా ప్రచార టీమ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

వాట్సాప్ చానల్.. నయా ట్రెండ్.

స్మార్ట్‌ఫోన్ ఉండి, ఇంటర్నెట్ వాడే ఉన్న ప్రతి ఒక్కరూ వాడుతున్న సోషల్ మీడియా యాప్ అంటే వాట్సాప్ అని టక్కున చెప్పేయొచ్చు. ఇందులో ఇటీవల జతచేసిన సరికొత్త చానల్ ఫీచర్ సైతం ఎన్నికల వేళ అభ్యర్థులకు, ఆయా పార్టీలకు బాగా ఉపయోగపడుతోంది. ఈ వాట్సాప్ చానల్ ట్రెండ్ బాగా పెరుగుతోంది. వాట్సాప్ చానల్‌లో సదరు పార్టీలు, నాయకులు తమ కంటెంట్‌ను వైరల్ చేస్తూ ఓటర్లకు చేరుతున్నారు. ఇది కూడా కంటెంట్ ప్రమోషన్‌గా చెప్పొచ్చు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండ్స్..

టిక్‌టాక్ వీడియోలు, హెల్త్, యోగా, ఫ్యాషన్ ఇలా పలు అంశాలపై సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఇన్‌ఫ్లుయెన్సర్ల (సోషల్ మీడియాలో ప్రభావవంతమైన వ్యక్తులు)కు డబ్బు చెల్లించి ఒప్పందం చేసుకోవడం ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం మరో విధానం. మనం చెప్పదలచుకున్న అంశాలపై వీడియోలు, లింక్‌లు ఇస్తే.. వాటిని లక్షల్లో ఫాలోవర్స్ ఉన్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో వాటిని షేర్ చేస్తారు. ఇందులో ఇన్‌ఫ్లుయెన్సర్ల ఫాలోవర్స్‌కు సదరు రాజకీయ పార్టీ లేదా నేత కంటెంట్‌ను చేర్చుతున్నారు.

ఒక్కో చోట..ఒక్కోలా..

- ఫేస్‌బుక్‌లో పార్టీ లేదా నాయకుడి కంటెంట్, ఆడియోలు, వీడియోలు, ఫొటోలు ఓటర్లకు చేరాలనుకుంటే అధికారికంగానే ఫేస్‌బుక్ యాడ్ సెన్స్‌లో ప్రమోషన్‌కు కొంత డబ్బులు చెల్లిస్తే చాలు. స్పాన్సర్డ్ ప్రకటనలు వైరల్ అవుతాయి. ఇందుకోసం మనం ఇచ్చిన వివరాలతో ఫేస్‌బుక్ ఓ జియోఫెన్సింగ్ క్రియేట్ చేస్తుంది. దాని ఆధారంగా ఈ కంటెంట్ వెళ్లేలా చేస్తారు.
- గూగుల్ యాడ్ సెన్స్‌లోనూ డబ్బులు చెల్లిస్తే.. ఫేస్‌బుక్ లింక్, యూట్యూబ్ లింక్, ఇన్‌స్టాగామ్ లింక్ అందులో షేర్ చేస్తారు. ఇలా కూడా కంటెంట్ ప్రమోషన్ చేస్తున్నారు. గూగుల్‌లోకి వెళ్లి సెర్చ్ చేయగానే మనం ప్రమోట్ చేయాలనుకున్న లింక్‌లు హైలెట్ అయ్యేలా చేయడమే గూగుల్ యాడ్ సెన్స్.

ఎమ్మెల్యే వద్దు.. ఎంపీ ముద్దు



బీజేపీ ఓ సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఆ పార్టీకి చెందిన నేతలు అసెంబ్లీలో అడుగుపెట్టేందుకు సంకోచిస్తున్నారు. అదే నేతలు పార్లమెంట్‌కు వెళ్లేందుకు మాత్రం తెగ ఆసక్తి చూపిస్తున్నారు. సింపుల్‌గా చెప్పాలంటే కమలనాథులు మేం ఎమ్మెల్యేకు తక్కువ...ఎంపీకి ఎక్కువ అన్నట్లు చెప్తున్నారు. అయితే బీజేపీ అధిష్టానం మాత్రం పార్టీ సీనియర్లంతా అసెంబ్లీకి పోటీ చేయాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నా....అసెంబ్లీ ఎన్నికల్లో అయితే కమలం వికసించేది లేదు బాబోయ్ అనేస్తున్నారట. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ నాయకుడు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్వే కూడా చేయించుకున్నాడట. ఆయన సర్వే చేయించుకున్న నాలుగుచోట్ల కూడా గడ్డు పరిస్థితులు ఎదురవడంతో ససేమిరా అసెంబ్లీకి పోటీ చేసేది లేదు బాబోయ్ అని చెప్పారట. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిస్తే...కేంద్రమంత్రివర్గంలో సామాజిక సమీకరణ నేపథ్యంలో మంత్రి పదవి దక్కుతుందన్న ఊహల్లో ఆయన ఉన్నట్లు చెబుతున్నారు. ఇక రాజధాని నగరానికి ఆనుకుని ఉన్న నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచి, మరోసారి అవకాశం రాకపోవడంతో పార్టీ మారిన నాయకుడు కూడా తాను అసెంబ్లీకి అయితే పోటీ చేయను అని చేతులెత్తేశారట.

ఓట్ దిస్ పాయింట్

సర్వీసు ఓటర్లు ఎవరు?
- అస్సాం రైఫిల్స్, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీఎఫ్, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌లోని జీఆర్ఈఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలు, విదేశాల్లో నియమితులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న రాష్ట్రాల సాయుధ బలగాలను సర్వీసు ఓటర్లుగా పనిచేసే చోట నుంచి పోస్టల్ ద్వారా ఓటేసేందుకు అవకాశం కల్పిస్తారు. కేంద్ర/రాష్ట్ర సాయుధ బలగాలు ఫారం 2/2ఏ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఫారం–3 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ప్రవాస భారతీయ ఓటర్లు ఎవరు?
- ఉద్యోగ, ఉపాధి, విద్యావకాశాల కోసం విదేశాలకు వెళ్లి ఏ విదేశీ పౌరసత్వం పొందని భారతీయ పౌరులకు విదేశాల నుంచి వారి పాస్‌పోర్టులో సూచించిన చిరునామా ఆధారంగా సంబంధిత నియోజకవర్గంలో ఓటేసేందుకు ప్రవాస భారతీయ ఓటర్లుగా అవకాశం కల్పిస్తారు. ఫారం–6ఏ దరఖాస్తు చేసుకోవాలి.

ఇప్పుడు విదేశాలకు వెళ్లి పోలింగ్ సమయానికి రాలేకపోతే ఓటేయడం ఎలా?
- ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత కేవలం సాధారణ ఓటర్ల నమోదుకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రవాస భారతీయ ఓటర్ల నమోదుకు వచ్చే దరఖాస్తులను ఎన్నికలు ముగిసే వరకు పెండింగ్‌లో పెడ్తారు. తదుపరి ఎన్నికల్లో విదేశాల నుంచి ఓటేసేందుకు అవకాశం కల్పిస్తారు.

ఓటు నిజామాబాద్‌లో ఉండి ఓటరు ముంబైలో ఉంటే ఏం చేయాలి?
- పోలింగ్ నాటికి నిజామాబాద్‌కు రావాలి. లేకుంటే వేరే మార్గాలు లేవు.

జైలులో బందీగా ఉన్న ఖైదీ ఓటు వేయవచ్చా ?
- లేదు. ఓటు వేయడానికి వీలులేదు.

పాప్‌కార్న్

ఏడు అడుగుల బంధం

- ఈటల రాజేందర్ కోసం ఏడుసార్లు నామినేషన్ వేసిన జమున



సాక్షిప్రతినిధి, కరీంనగర్: మాజీ మంత్రి, హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమునారెడ్డికి రాష్ట్ర రాజకీయాలకు సంబంధించి ఆసక్తికర రికార్డు ఉంది. ఇంతవరకూ ఈటల పోటీ చేసిన ప్రతీ ఎన్నిక, ఉప ఎన్నికలో విజయం సాధిస్తూనే ఉన్నారు. ఉద్యమ సమయంలో అయినా..రాష్ట్రం వచ్చిన తర్వాత అయినా ప్రతీ ఎన్నికలో ఆయన విజయం వెనుక జమునారెడ్డి ఉన్నారు. అందుకే, రాజేందర్‌కు ఒక సెంటిమెంట్ ఉంది. తాను నామినేషన్ వేసే ప్రతీసారి ఆయన సతీమణిని తనకు డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేయిస్తారు. అలా 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 ఎన్నికల్లో మొత్తం ఏడుసార్లు జమున నామినేషన్ వేశారు. ఇందులో 2008, 2010, 2021లో జరిగినవి ఉపఎన్నికలు కావడం గమనార్హం. త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల్లోనూ ఆయన హుజూరాబాద్ నుంచే బరిలోకి దిగనున్నారు. ఈసారి కూడా జమున ఆయన తరఫున నామినేషన్ వేస్తారని ఈటల అనుచరులు ధీమాగా ఉన్నారు. మరోవైపు రాజేందర్‌తో సమానంగా ఆయన రాజకీయ వ్యవహారాలు చూసిన అనుభవం ఉన్న నేపథ్యంలో జమున సైతం అసెంబ్లీకి పోటీ చేస్తారన్న ప్రచారం స్థానికంగా జరుగుతోంది.

రేణుకమ్మల పోలరైజ్ పాలిటిక్స్

కొమ్మినేని శ్రీనివాసరావు

తెలంగాణలో కమ్మ సామాజికవర్గ ప్రతినిధిగా తనను తాను ఫోకస్ చేసుకోవడానికి కాంగ్రెస్‌నేత రేణుకాచౌదరి చాలా కష్టపడుతున్నారు. అందులో భాగంగా ఆమె కాంగ్రెస్ అధిష్టానం వద్దకు కొందరు కమ్మ జేఏసీ నేతలను తీసుకెళ్లారు. వచ్చే అసెంబ్లీఎన్నికల్లో కమ్మ వర్గానికి పన్నెండు సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1982లో టీడీపీ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి ఏపీలో రెండు పార్టీల వ్యవస్థ ఆవిర్భవించిందని చెప్పాలి. 1983కు ముందు కమ్మవర్గం కాంగ్రెస్‌తోనే ఉందని గణాంకాలు చెబుతున్నాయి. తదుపరి టీడీపీ కమ్మ సామాజికవర్గం ఆధిపత్యంలో ఉంటే, కాంగ్రెస్ పార్టీ రెడ్డి సామాజిక వర్గం ఆధిపత్యంలో ఉన్నట్లు లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఆయా ఎన్నికల్లో ఇతర సామాజిక వర్గాలను ఎవరు ఆకర్షించగలిగితే ఆ పార్టీ అధికారంలోకి వస్తోంది. రెడ్డి సామాజికవర్గం ఆంధ్ర, తెలంగాణలలో రెండు చోట్ల ప్రాముఖ్యత కలిగి ఉంది. కమ్మ వర్గం ప్రధానంగా ఆంధ్రకే పరిమితమైందని చెప్పాలి. రెడ్డి వర్గం ప్రతి ఎన్నికలోనూ రెండు ప్రాంతాల్లో కలిపి సుమారు ఎనభై నుంచి తొంభైమంది ఎమ్మెల్యేలుగా గెలుస్తుంటే.. కమ్మవర్గం అత్యధికంగా ఆంధ్రలోనే గెలుస్తోంది. రెండు ప్రాంతాల్లో కలిపి వీరు అత్యధికంగా 1994లో 53 మంది, అత్యల్పంగా 2018లో తెలంగాణలో ఐదుగురు, 2019లో ఏపీలో పదిహేడు మంది అంటే రెండు రాష్ట్రాలలో కలిపి ఇరవై రెండు మంది గెలిచారు. 2014లో రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి 38 మంది.. ఉమ్మడి ఏపీలో 2009లో 27, 2004లో 35, 1999లో 43, 1994లో 53 , 1989లో 36, 1985లో 52, 1983లో 51, 1978లో 41, 1972లో 35, 1967లో 41, 1962లో 39 మంది గెలిచారు. అయితే ఇప్పటివరకు తెలంగాణలో మాత్రం కమ్మ వర్గం నుంచి 1985లో అత్యధికంగా ఎనిమిది, మిగతా ఎన్నికల్లో రెండు నుంచి ఏడుగురు వరకు మాత్రమే గెలిచారు.

ఎవరు అధికారంలోకి వస్తే..

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలోనూ టీడీపీ ఉనికిని నిలబెట్టడానికి కమ్మ వర్గం యత్నించింది. కానీ టీడీపీ అధినేత చంద్రబాబు ఓటుకు కోట్లు కేసుతో ఇక్కడ మొత్తం పార్టీ కకావికలమైంది. దీంతో కమ్మవర్గం వారు ఏ పార్టీకి అధికారం వస్తే అటువైపు మొగ్గు చూపడానికి అధికంగా ఇష్టపడుతున్నట్టు అనిపిస్తుంది. గత రెండు ఎన్నికల్లో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) పాలన పగ్గాలు చేపట్టగా... కమ్మవర్గం ఎమ్మెల్యేలు ఏ పార్టీలో గెలిచినా అంతా బీఆర్ఎస్‌లో చేరిపోయారు. రెడ్డి వర్గం ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ నుంచి కొందరు టీఆర్ఎస్‌లో చేరినా, పూర్తిగా ఆ పార్టీకి దూరం కాలేదు. 2018 ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడంతో కమ్మవర్గం నేతలు కూడా ఆ బాట పట్టారు. కానీ పెద్దగా ఫలితం సాధించలేకపోయారు. టీఆర్ఎస్ పక్షాన పోటీచేసిన ఐదుగురు కమ్మ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. టీడీపీ లేదా కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా గెలవలేదు. చివరికి టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ మనుమరాలు, మాజీ మంత్రి హరికృష్ణ కుమార్తె సుహాసిని కూకట్‌పల్లి నుంచి పోటీచేసి ఘోర పరాజయం పొందారు. ఏ వర్గం వారైనా కేవలం కులం ఆధారంగానే గెలవరని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. టీడీపీ సెంటిమెంట్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో కలవడాన్ని చాలామంది జీర్ణించుకోలేకపోయారు. దానికి తోడు విభజిత ఆంధ్రలో అప్పటికే చంద్రబాబుపై ఏర్పడిన విపరీతమైన వ్యతిరేకత కూడా ప్రభావం చూపింది. 2014లో టీఆర్ఎస్ నుంచి ఒక్క కమ్మ అభ్యర్థి గెలుపొందలేదు. ఇద్దరు టీడీపీ నుంచి, ఇద్దరు కాంగ్రెస్ నుంచి , ఒకరు బీఎస్పీ నుంచి విజయం సాధించారు. తదుపరి కాలంలో వీరంతా టీఆర్ఎస్‌లోకి జంప్ చేశారు. తర్వాత ఒక ఉప ఎన్నిక ద్వారా మరో కమ్మ నేత టీఆర్ఎస్ పక్షాన ఎమ్మెల్యే అయ్యారు.



ఈ ప్రాంతంలో 65 ఏళ్ల రాజకీయచరిత్రలో పెద్దగా ప్రభావం చూపని కమ్మ వర్గం
- 'ఓటుకు కోట్లు' కేసుతో చంద్రబాబు తట్టాబుట్టా సర్దుకున్నాక మరింత ప్రభావం
- ఫలానా పార్టీకి ఈ వర్గం అనుకూలమనే భావజాల వ్యాప్తికి వ్యూహం
- ఈ అనవసర రాజకీయాలతో కమ్మ వర్గానికి అప్రతిష్ట వస్తుందనే అభిప్రాయాలు

తెలంగాణలో పెద్దగా బలంగా లేకున్నా..

ఉమ్మడి ఏపీలో ఎన్నికలు జరిగినప్పుడు పరిశీలిస్తే... 2009లో తెలంగాణలో ముగ్గురు గెలవగా, వారిలో ఇద్దరు టీడీపీ, ఒకరు లోక్‌సత్తాకు చెందినవారు. 2004లోనూ ఈ వర్గం వారు ముగ్గురే గెలిచారు. ఒకరు కాంగ్రెస్ నుంచి, ఇద్దరు ఇతరులు కావడం విశేషం. టీడీపీ నుంచి ఎవరూ గెలవలేదు. 1999లో టీడీపీ పక్షాన ముగ్గురు విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి ఎవరూ గెలవలేదు. 1994లో ఆరుగురు విజయం సాధించగా.. టీడీపీ నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి ఒకరు, ఇతరులు ఒకరు గెలిచారు. 1989లో ముగ్గురు గెలిస్తే టీడీపీ నుంచి ఒకరు, ఇద్దరు ఇతర పార్టీలవారు. 1985లో మొత్తం ఎనిమిది మందికిగాను ఆరుగురు టీడీపీ, ఇద్దరు టీడీపీ కూటమిలోని ఇతర పార్టీలవారు. తెలంగాణ చరిత్రలో ఈ ఎన్నికలోనే కమ్మ వర్గం నుంచి ఎక్కువ మంది ఎమ్మెల్యేలు అవడం విశేషం. 1983లో గెలిచిన ఏడుగురు కమ్మ ఎమ్మెల్యేలు టీడీపీ వారే. ఎన్.టి.రామారావు ప్రభంజనం వీయడంతో వీరు విజయం సాధించారు. అంతకుముందు 1978 ఎన్నికలలో కమ్మ వర్గం వారు ఐదుగురు, 1972, 1967లలో నలుగురు 1962లో ఇద్దరు గెలుపొందారు. స్థూలంగా చూస్తే తెలంగాణ ప్రాంతంలో కమ్మ సామాజికవర్గం ఎప్పుడూ పెద్ద బలంగా లేదు. కాకపోతే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ వర్గం ఓన్ చేసుకోవడానికి యత్నించింది. అది కొంతకాలం బాగానే సాగినా.. తర్వాత అది నెగిటివ్‌గా మారుతోంది. ప్రత్యేకించి 2018 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కమ్మ సామాజికవర్గం వారు ఎక్కువగా టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారన్న భావనతో ఇతర వర్గాలవారు ఆ పార్టీకి దూరమయ్యారు.

ఓటర్లను కాంగ్రెస్ వైపు తిప్పడానికే..

తాజా పరిణామాలలో కమ్మ ఓటర్లను పోలరైజ్ చేయడానికి రేణుకాచౌదరి వంటివారు యత్నిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆ వర్గం సంఖ్య కాస్త ఎక్కువగా ఉండటమే కారణం. నిజంగానే కమ్మ వర్గానికి అంత బలముంటే చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీకే మద్దతు ఇవ్వవచ్చు కదా! అలా చేయడం లేదంటే కారణం అర్థం చేసుకోవచ్చు. అయినా రేణుక వంటివారు కమ్మ వర్గాన్ని అడ్డు పెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై ఏపీలో అవినీతి కేసు నమోదై జైలుకు వెళితే దానిని కమ్మ సామాజికవర్గంపై దాడిగా ఆమె ప్రచారం చేసింది. ఎందుకైనా మంచిదని ఇతర పార్టీలవారు కూడా అదే బాటలో మాట్లాడారు. ఇప్పుడు తెలంగాణలో టీడీపీ పూర్తిగా బలహీనపడిపోయిన నేపథ్యంలో ఆంధ్రజ్యోతి వంటి పత్రికలు ఆ వర్గం వారిని కాంగ్రెస్‌కు అంటగట్టడానికి యత్నిస్తున్నాయి. నిజానికి ఆ వర్గం కానీ, ఆయా సెటిలర్ వర్గాలుగానీ కొంతకాలం క్రితం వరకు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారన్న అభిప్రాయముంది. కానీ చంద్రబాబు అరెస్టు తర్వాత కమ్మ వర్గాన్ని కాంగ్రెస్ వైపు మళ్లించడానికి కొందరు వ్యూహాలు పన్నుతున్నారు. నిజానికి ఏ కులం వారైనా తమ ఇష్టం వచ్చిన పార్టీకి మద్దతు ఇవ్వొచ్చు. కానీ ఒక భావజాలాన్ని వ్యాప్తిలోకి తెచ్చి, కమ్మవారు ఫలానా పార్టీకి అనుకూలం అనుకోవాలనేది వారి వ్యూహం. రేణుకాచౌదరి ఖమ్మం జిల్లాలో తనకు, తనవారికి టికెట్లు ఇప్పించుకోవడానికి కులం కార్డు ఉపయోగిస్తున్నారు. నలభై నియోజకవర్గాల్లో కమ్మ వర్గం గణనీయంగా ఉందని.. ముప్పై చోట్ల గెలుపోటములు నిర్ణయించే దశలో ఉందని, పది చోట్ల విజయావకాశాలు కలిగి ఉందని కమ్మ ఐక్యవేదిక కాంగ్రెస్ అధినాయకత్వానికి వివరించింది. వీటిలో ఎక్కువ భాగం హైదరాబాద్ పరిసరాల్లోనివే కాగా.. కొన్ని నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లోనివి. జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఖమ్మం, మల్కాజిగిరి, కొత్తగూడెం, కోదాడ, పాలేరు మొదలైన చోట్ల టికెట్లు ఆశిస్తున్నట్లు ఈ వేదిక తెలిపింది. ఒకరకంగా ఇది కులం పేరు చెప్పుకుని కొందరు ఆయా పార్టీలను బ్లాక్ మెయిల్ చేస్తున్నట్టు అనిపిస్తుంది.

కాంగ్రెస్‌కు నష్టం చేస్తుందా?


ఏ సామాజికవర్గం వారికైనా వారి సత్తాను బట్టి పార్టీలు టికెట్లు ఇస్తాయి. కాకపోతే కమ్మ వర్గం కొంత ఆర్థిక బలం కూడా కలిగి ఉంటుందన్న అభిప్రాయం ఉంది. టీఆర్ఎస్ కమ్మ వర్గానికి చెందిన ఐదుగురికి టికెట్లు కేటాయించింది. కాంగ్రెస్ అంతకు మించి ఇస్తుందా అన్నది సందేహమే. ఈ వర్గం నేతల హడావుడి కారణంగా కాంగ్రెస్ హైకమాండ్ బీసీవర్గం నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదట. అది ఆ పార్టీకి తలనొప్పి అయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ కూడా అదేదో కమ్మ వర్గం వారికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వకపోతే నష్టం అనుకుంటే అది పెద్ద పొరపాటు అవుతుంది. పైగా ఇతర వర్గాల్లో అపోహలు పెరిగే అవకాశం ఉండవచ్చు. అసలే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పటికీ చంద్రబాబుకు సన్నిహితుడన్న ప్రచారం ఉండగా.. ఆయనను రేణుకాచౌదరి వంటివారు ఇలాంటి వివాదాలలోకి తీసుకెళ్లకుండా ఉంటేనే పార్టీకి ప్రయోజనం అని చెప్పాలి. ఏది ఏమైనా అరవై ఐదేళ్ల తెలంగాణ ఎన్నికల చరిత్రను చూస్తే కమ్మ సామాజికవర్గం అంత ప్రభావశీలిగా లేదనే చెప్పాలి. అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేయడంలో భాగంగా ఏ పార్టీ అయినా ఇతర కులాలతోపాటు కమ్మవారు కొందరికి కూడా టికెట్లు ఇస్తాయి. కానీ అదే సమయంలో ప్రత్యేకించి రాష్ట్ర విభజన నేపథ్యంలో ఒక గ్రూపు తయారై అనవసరంగా రాజకీయాలు చేస్తూ ఆ వర్గం వారికి అప్రతిష్ట తేకుండా ఉంటే అదే పదివేలు అని చెప్పాలి.

సినిమాలూ...

పొలిటికల్ గుర్తులు...

ద-పొలిటికల్-'పుష్ప'!

సినిమాలంటే అందరికీ ఆసక్తి కదా. మామూలు జనాలకు మరీ ఎక్కువ. అందుకే జనాలందరికీ సినిమా భాషలోనే తమ అర్జీలు చెప్పుకుంటే పరమ క్యాచీగా ఉంటుందనుకున్నాయి రాజకీయ పార్టీలు. బాడీ లాంగ్వేజీలోలాగా... తమనే గెలిపించాలంటూ 'మూవీ లాంగ్వేజ్'లో పొలిటికల్ పార్టీలు విన్నవించుకోవాలని నిర్ణయించుకుంటే... ఆ వచ్చే అభ్యర్థనలకు ఊహారూపమే ఈ వాక్యాలు...



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

'పుష్ప సినిమా చూశారుగా అందరూ. అందులోని పాటలో హీరో చెప్పు జారిపోలా. అచ్చం అలాగే జారింది మా అధికారం కూడా. అయితే హీరోగారి గూడ పైకి లేచి నిలబడింది చూశారా... ఈసారి అచ్చం మీరూ మమ్మల్ని పైకి లేపండి. గూడను కాదు... మా చేతిని. అదే... చేతి గుర్తును.''

'ప్రజలారా... చేతిగుర్తు వారి మాటలు చెవిన పెట్టకండి. అసలు పుష్ప అంటే ఏమిటి? పువ్వు! దీని బట్టి తెలియడంల్యా... ఎవరికి ఓటెయ్యాలో! పుష్పకు ఓటెయ్యండి. అంటే 'పువ్వు గుర్తు'కు అని అర్థం. పువ్వు గుర్తు అంటే కమలం పార్టీ అని విజ్ఞులైన మీకు వేరే చెప్పాలా?''

'ఈ పువ్వు గుర్తువారూ, ఆ చెయ్యి గుర్తు వారూ ఎలాంటివాళ్లు? ఆ సినిమాలోనే చూశారుగా. గంధం చెక్కల ఆచూకీ చెప్పేదాకా కారెక్కించి తిప్పుతారు. తీరా ఆచూకీ దొరికాక... హీరో కారెక్కబోతుంటే కార్లోంచి కాలు పక్కకు లాగేస్తారు. నాఁలూపాయలు పారేసి... షేర్ ఆటోలో రమ్మంటారు. ఓడనెక్కేదాక ఓడమల్లయ్యా... ఓడ దిగాక బోడ మల్లయ్య. ఇలాంటి పార్టీలకా మీ ఓటు? పాపం... హీరో అప్పటికప్పుడు కారు కొనాల్సి వచ్చింది. హీరో కొన్నదేమిటి? 'కారు'! ఆ సంగతి గుర్తుపెట్టుకోండి. అసలు మా కారు గుర్తుకు ఓటేస్తే... కృతజ్ఞతకొద్దీ ఎప్పుడూ కార్లోనే తిప్పుతాం. కారు దిగకండి... మమ్మల్ని దించకండి. కారు స్పీడు విషయంలో మీరు తగ్గేదేల్యా... మమ్మల్ని తగ్గించేదే ల్యా''

సినిమా అభ్యర్థనలు పూర్తయ్యాయి.

....

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ హెచ్చరించే కేన్సర్ క్యారెక్టర్ 'ముఖేశ్' ఈసారి ఈ సినిమా యాడ్స్ అయ్యాక వచ్చాడు. అతడు చెప్పేదేమిటంటే...

"అసలా మూవీ హీరోయే ఓ ఎర్రచందనం స్మగ్లర్.
అతడు చేసేదే అడవుల్ని నరకడం.
మీకు అర్థమవ్వడం కోసం
ఎంతటి సినిమా ఉపమాలిచ్చినా సరే...
ఈ నెగెటివ్ కేరెక్టర్ల పట్ల పాజిటివ్ కోణంలో కాకుండా
అసలు కేరెక్టర్లను గుర్తెరిగి ఎంచుకోండి.
ఐదేళ్ల పాటు హాయిగా మిమ్మల్ని మీరే పరిపాలించుకోండి.

రూ.50 వేల వరకు తీసుకెళ్లేందుకు అనుమతి

- రూ.10 వేలకు మించిన కొత్త వస్తువుల తరలింపూ నిషిద్ధమే..
- అంతకుమించి తీసుకెళ్తే ఇబ్బందే..
- సంబంధిత పత్రాలు ఉంటేనే సేఫ్

నోట్ దిస్ పాయింట్

సాక్షి, హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ సోమవారం వెలువడింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసు విభాగం ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలుచేయడం ప్రారంభించింది. ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం.. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి వినియోగించే అక్రమ మద్యం, నగదుపై డేగకన్ను వేసింది. సోమ, మంగళవారాల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.15 కోట్లకు పైగా నగదు, కిలోల కొద్దీ బంగారం, వెండి స్వాధీనం చేసుకుంది. ఎన్నికల క్రతువు ముగిసేవరకు ఈ తనిఖీలు సాగనున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో వృత్తి, వ్యాపార, క్రయవిక్రయాల కోసం నగదు తరలించే వారిలో అనేక సందేహాలున్నాయి. కోడ్ అమల్లో ఉన్నంత కాలం ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

రూ.50 వేలకు మించితే...

ఓ వ్యక్తి తన వెంట రూ.50 వేల వరకు మాత్రమే నగదును తీసుకెళ్లవచ్చు. అంతకుమించిన మొత్తం తీసుకెళ్లాలంటే దాని మూలాలను నిరూపించే ఆధారాలు కచ్చితంగా కలిగి ఉండాలి. వ్యాపారులు దానికి సంబంధించిన పత్రాలు, లావాదేవీల బిల్లులు కలిగి ఉండాల్సిందే. సాధారణ వ్యక్తులు తీసుకెళ్తుంటే బ్యాంకు నుంచి డ్రా చేసిన పత్రాలు లేదా ఆ నగదు ఎక్కడ నుంచి వచ్చిందో, ఎందుకు వినియోగిస్తున్నామో చెప్పడానికి అవసరమైన ఇతర ఆధారాలు చూపించాలి.

- రూ.2 లక్షలకు మించిన నగదు తలింపును మాత్రం పోలీసు, రెవెన్యూ, ఎన్నికల అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఆ మొత్తం తమ వద్దకు ఎలా వచ్చింది? ఏం చేయబోతున్నారు? అనే వాటికి ఆధారాలు చూపాల్సి ఉంటుంది. అలా కాని పక్షంలో పోలీసులు నగదు స్వాధీనం చేసుకుంటారు. ఇలా సీజ్ చేసిన నగదు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఉంటే అది జిల్లా ఎన్నికల అధికారి నియమించే కమిటీ వద్దకు వెళ్తుంది.
- నలుగురు సభ్యులతో ఉండే ఈ జిల్లా కమిటీ ఎదుట నగదు యజమాని హాజరై నగదు మూలం, అవసరాలకు సంబంధించి వివరణ ఇవ్వాలి. దీనిపై కమిటీ సంతృప్తి చెందితే నగదు తిరిగి అప్పగిస్తుంది. లేదంటే పోలీసు విభాగానికి ఫిర్యాదు చేయడం ద్వారా తదుపరి చర్యలకు ఆదేశిస్తుంది.
- పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు రూ.10 లక్షలకు మించితే విషయం ఆదాయపు పన్ను శాఖకు నివేదించాల్సి ఉంటుంది. నగదును స్వాధీనం చేసుకునే ఆ అధికారులు బాధ్యులకు నోటీసులు జారీ చేస్తారు. వారిచ్చే సమాధానాన్ని వివిధ కోణాల్లో పరిశీలించాకే తదుపరి చర్యలు తీసుకుంటారు.
- కొత్త బంగారం, వెండి నగలు, వస్తువులతోపాటు గిఫ్ట్ ఆర్టికల్స్, కుక్కర్లు, క్రికెట్ కిట్స్ వంటి సామగ్రి విలువ రూ.10 వేలకు మించితే పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. యజమానులు వాటిని వ్యాపార నిమిత్తం తరలిస్తున్నట్లు పత్రాలు చూపించి, నిరూపించుకుంటేనే తిరిగి అప్పగిస్తారు. లేదంటే విషయం ఎన్నికల అధికారుల వద్దకు వెళ్తుంది.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సైతం తాము ఖరీదు చేసే ప్రచార, ఇతర సామగ్రికి సంబంధించి విక్రేతలకు రూ.10 వేల కంటే ఎక్కువ నగదు చెల్లింపులు చేయకూడదు. అంతకంటే ఎక్కువ మొత్తంలో చెల్లింపులు చేయాలంటే చెక్కులు, ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చేయాలి. అభ్యర్థి లేదా అతని ఏజెంట్ కూడా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లకూడదు.
- పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు (రూ.50 వేలలోపు అయినా), వస్తువులు (రూ.10 వేల కంటే తక్కువ విలువైనవి అయినా) ఓటర్లను ప్రలోభపెట్టడానికని ఆధారాలు లభిస్తే పోలీసులు కేసు నమోదు చేస్తారు. బాధ్యులపై ఐపీసీ 171(బీ) రెడ్‌విత్ 171(సీ) సెక్షన్లతోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టం -1951లోని సెక్షన్ 123 ప్రకారం వీటిని రిజిస్టర్ చేసి దర్యాప్తుచేస్తారు. బాధ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించే అవకాశమూ ఉంది.

విచిత్రం

ఈనెల 16న జనగామ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుండటంతో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బుధవారం జనగామలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ కార్యకర్త ప్రభుత్వ పథకాల బ్యానర్‌ను డ్రెస్‌గా మార్చుకుని వేసుకున్నాడు. తలపై కేసీఆర్ బొమ్మతోపాటు చుట్టూ దేవతల చిత్రాలతో ఉన్న టోపీని ధరించి మైక్‌లో ప్రచారం చేస్తూ కనిపించాడు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, జనగామ



	అర్బన్	రూరల్
లౌడ్ స్పీకర్	900	800
12 సీట్ల బస్సు	3,500	3,500
డ్రైవర్ బత్తా	2,000	2,000
జనరేటర్ రోజుకు	1,500	1,500
ఎల్ఈడీ బల్బు రోజుకు	250	200

ప్రతి లెక్కా పక్కాగా...

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచార వ్యయంపై ఎన్నికల కమిషన్ నిఘా పెట్టింది. ఈ మేరకు భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ప్రతి నియోజకవర్గంలో అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు క్యాంపెయిన్‌లో భాగంగా ఖర్చుపెట్టే ప్రతిదానికి నిర్ణీత ధరలను నిర్ణయించారు. ఆయా వస్తువుల ధరలు ఇలా ఉన్నాయి.

వస్తువులు	ధర (రూ.లలో) అర్బన్	రూరల్
8 X 8 సైజు పోడియం/మండపం	3,000	3,000
10 X 12 బ్యానర్	1,500	1,500
కలర్ పోస్టర్	8	8
8 X 12 సైజు హోర్డింగ్	8,500	7,500
12 X 4 కటౌట్	4,500	3,500
పెన్‌డ్రైవ్	300	300
ఆడియో క్యాసెట్	300	300
ట్రక్, టెంపో	3,500	3,500
సుమో ఏసీ–నాన్ ఏసీని బట్టి	600-2,000	600-2,000
డీసీఎం, వ్యాన్	1,000-2,500	1,000-2,500
రోజుకు హోటల్ గది ఏసీ-	1,800	1,500
నాన్‌ఏసీ-	800	600
షామియానా	600-1,200	600-1,200
గ్లాసులు	2.50	2
ఏసీ ఫంక్షన్ హాల్ రోజుకు	15,000	12,000
నాన్ ఏసీ ఫంక్షన్ హాల్	9,000	8,000
హైడ్రోజన్ బెలూన్	4,000	4,000
చికెన్ బిర్యానీ	140	100
మటన్ బిర్యానీ	180	150
స్టేజ్ డెకరేషన్ చార్జ్	2,000	1,500
40-50 సీట్ల బస్సు	6,000	6,000
ఫొటో ప్రింట్ టీషర్ట్	100	100

	అర్బన్	రూరల్
వీడియోగ్రాఫర్	1,800	1,800
ఎల్ఈడీ స్క్రీన్	15,000	
సోఫా	200	200
కార్పెట్లు	300	250
ఫ్యాన్/కూలర్	300	300

పంచతంత్రం

నవంబర్ 25న రాజస్తాన్ అసెంబ్లీ పోలింగ్

భారీగా పెళ్లిళ్లు ఉండడంతో తేదీ మార్చిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 23కి బదులుగా నవంబర్ 25న పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత సోమవారం అయిదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడు రాజస్తాన్ ఎన్నికల తేదీని నవంబర్ 23గా ప్రకటించింది. అయితే అదే రోజు రాష్ట్రంలో దేవ్ ఉథాని పర్వదినాన్ని జరుపుకుంటారు. రాజస్తాన్ వాసులకు అదొక పవిత్ర దినం. పెళ్లిళ్ల సీజన్ మొదటి రోజు కూడా అదే. ఆ రోజు పెళ్లి చేసుకుంటే జీవితంలో అంతా మంచే జరుగుతుందని ప్రజల విశ్వాసం. దీంతో ఆ ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా 50 వేలకు పైగా పెళ్లిళ్లు జరగనున్నాయి. పెళ్లి అంటే దాని చుట్టూ జరిగే వ్యాపారాలతో అందరూ ఆ రోజు బిజీగా ఉంటారు. పోలింగ్ బూత్‌కి రావడానికి రవాణా సదుపాయాల సమస్య కూడా తలెత్తే అవకాశం ఉంది. అలాంటి రోజు పోలింగ్ జరిగితే ప్రజలు ఓటు వెయ్యడం కష్టమవుతుందని, పోలింగ్ శాతం తగ్గిపోతుందని ఆందోళనలు నెలకొన్నాయి. వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, మీడియాలో వచ్చిన కథనాలు, ఇతర వర్గాల విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ తేదీని 25కి మారుస్తూ కొత్త షెడ్యూల్ ప్రకటించింది. భారీ సంఖ్యలో పెళ్లిళ్లు, ఇతర సామూహిక కార్యక్రమాలు జరగడం వల్ల ఓటింగ్ తగ్గుతుందన్న ఆందోళనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా ఈసీ స్పష్టం చేసింది.

బీజేపీ ఎంపీపై దాడి

జోధ్‌పూర్: రాజస్థాన్‌లో బీజేపీ ఎంపీ దేవీ ఎం.పటేల్ కాన్వాయ్‌పై బుధవారం కొందరు దాడికి దిగారు. స్థానిక ఆలయంలో పూజలు జరిపి సాంచోర్‌లోని తన నివాసానికి వెళ్తుండగా ఈ ఉదంతం చోటుచేసుకుంది. సాంచోర్ అసెంబ్లీ స్థానం నుంచి ఆయన నామినేషన్ వేయడానికి వీల్లేదని నిరసనకారులు నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున రాళ్లు రువ్వారు. దాడి నుంచి ఎంపీ సురక్షితంగా బయటపడ్డారు. రాళ్ల దాడిలో వాహనాలు బాగా దెబ్బతిన్నాయి. దాడికి దిగినవారు పార్టీలోని ఆయన ప్రత్యర్థి నేత దానారాం చౌదరి వర్గీయులని భావిస్తున్నారు. దానారాం గత అసెంబ్లీ ఎన్నికల్లో సాంచోర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. జాలోర్ ఎంపీ అయిన పటేల్‌కు ఈసారి సాంచోర్ అసెంబ్లీ టికెట్ దక్కింది. దీన్ని చౌదరి వ్యతిరేకిస్తున్నారు.

ఎంపీ బాణాలు లక్ష్యం ఛేదిస్తాయా?

మూడు రాష్ట్రాల్లో 18 మంది ఎంపీలకు బీజేపీ టికెట్లు

రాజస్తాన్‌లో రాజె వర్గానికి చెక్ పెట్టే వ్యూహంలో బీజేపీ అగ్రనాయకులు

"బీజేపీ అమ్ములపొదిలో ఉన్న బాణాలు పార్టీ ఎంపీలు. వాటిని బయటకి తీసి వదిలితే కాంగ్రెస్ వెన్నులో వణుకు పుట్టాల్సిందే. రాజస్థాన్‌లో ఈ ఎంపీల బాణం గురి తప్పదు. లక్ష్యాన్ని సరిగ్గా ఛేదిస్తుంది" ఇదీ బీజేపీలో జరుగుతున్న చర్చ ఇది. బీజేపీ తొలి విడతగా 41 మంది అభ్యర్థులతో జాబితా విడుదల చేస్తే అందులో ఏడుగురు ఎంపీలే ఉన్నారు. అంతమంది దిగ్గజ నాయకుల్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు దింపింది ? వచ్చే లోక్‌సభ ఎన్నికల వ్యూహం ఇందులో దాగుందా ?

రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ఒక్కో జాబితాను విడుదల చేస్తూ ఉంటే అందులో ఉండే అతిరథ మహారథుల్లాంటి నాయకుల పేర్లను చూస్తే అందరూ విస్తుపోవాల్సి వస్తుంది. 18 మంది ఎంపీలు, నలుగురు కేంద్ర మంత్రుల్నిఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీ బరిలో దింపింది. రాజస్తాన్‌ల మొదటి జాబితాలో ఏకంగా ఏడుగురు ఎంపీలున్నారు. బీజేపీ ఎంపీలైన రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, దియా కుమారి, నరేంద్ర కుమార్, బాబా బాలకాంత్, దేవ్‌జీ పటేల్, కిరోరిలాల్ మీనా, భగీరథ్ చౌధరిలు ఈ సారి ఎమ్మెల్యేలుగా పోటీ చేయనున్నారు. పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపడానికే ప్రధానమంత్రి మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మోదీతో కలిసి పని చేసినవారే ఇప్పుడు తమతో కలిసి పనిచేయడానికి వచ్చారన్న భావన కార్యకర్తలకు బూస్టప్ ఇస్తుందని, ఒక్క సీటుని వదిలిపెట్టకుండా అన్నింట్లో విజయం సాధిస్తామని రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ చెబుతున్నారు.

విజయావకాశాలు మెరుగు

రాజస్థాన్ అసెంబ్లీలో 200 స్థానాలుంటే, 25 లోక్‌సభ స్థానాలున్నాయి. అంటే ఒక్కో ఎంపీ ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం చూపించగలరు. ఆ విధంగా బీజేపీ 56 సీట్లను గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఏడుగురు ఎంపీలను బరిలోకి దింపింది. కేంద్ర మంత్రులైన గజేంద్ర సింగ్, అర్జున్ మేఘ్వాల్ కూడా ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది.

ఎంపీల ప్రజాదరణకు ఇదో పరీక్ష

2024 లోక్‌సభ ఎన్నికలకు కొద్ది నెలల ముందు జరుగుతున్న ఎన్నికలు కావడంతో వీటిని సెమీఫైనల్‌గా భావించవచ్చు. అందుకే బీజేపీ ఎంపీలకు ఎంత ప్రజాదరణ ఉందో తెలుసుకోవడానికే బీజేపీ పెద్దలు ఎంపీలను నిలబెడుతున్నారు. ఎంపీల పరిధిలో ఉన్న నియోజకవర్గాల్లో గెలుపోటముల ఆధారంగా వచ్చే లోక్‌సభ ఎన్నికలపై కసరత్తు చేస్తారు. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో మోదీ వేవ్ ఆధారంగానే అన్ని రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు బీజేపీ కైవశం చేసుకోగలిగింది. అందులోనూ రాజస్తాన్‌లో మొత్తం 25 స్థానాలు తన ఖాతాలో వేసుకొని క్లీన్ స్వీప్ చేసింది. ఇప్పుడు ఈ అసెంబ్లీ ఎన్నికలు ఒక రకంగా ఎంపీలకు లిట్మస్ టెస్ట్ వంటిది.



మోదీ హవా

రాజస్తాన్‌లో బీజేపీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఎవరో ప్రకటించడం లేదు. ప్రధాని మోదీకున్న ఛరిష్మాపైనే ఆధారపడుతోంది. దానికి తోడు స్థానిక సమస్యలు, స్థానికంగా ప్రభావం చూపించగలిగే ఎంపీలను బరిలో నిలబెడితే విజయావకాశాలు ఎక్కువవుతాయని భావించి ఈ నిర్ణయం తీసుకుంది.

అసెంబ్లీ స్థానాలు	200
పార్లమెంటు స్థానాలు	26
ఒక్కో ఎంపీ ప్రభావితం చేసే స్థానాలు	8 సీట్లు
ఏడుగురుని బరిలోకి దింపడం	
ద్వారా గురిపెట్టిన స్థానాలు	56

భగ్గుమన్న అసమ్మతి

బీజేపీ తొలి జాబితాలో ఏడుగురు ఎంపీలకు చోటు కల్పించడంపై అసమ్మతి భగ్గుమంది. విద్యాధర్ నగర్ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యే నర్పత్ సింగ్ రజ్వీ స్థానంలో ఎంపీ దియా కుమారికి టికెట్ ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మాజీ ఉప రాష్ట్రపతి భైరాన్ సింగ్ షెకావత్ అల్లుడు రజ్వీ కావడంతో రాజకీయంగా కలకలం రేగింది. సిట్టింగ్ ఎమ్మెల్యేని కాదని ఒక ఎంపీకి టికెట్ ఎలా ఇస్తారని రజ్వీ ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో తన భవిష్యత్ ప్రణాళిక వెల్లడిస్తానని స్పష్టం చేశారు. మరి కొన్ని అసెంబ్లీ స్థానాల్లో వసుంధరా రాజె అనుచర వర్గానికి టికెట్లు ఇవ్వకపోవడంపైన కూడా అసంతృప్త జ్వాలలు ఎగసి పడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ఎన్నికల్లో ఎంపీలను బాణాలుగా వదిలితే అవి లక్ష్యాన్ని ఛేదిస్తాయా అన్న అనుమానాలైతే వస్తున్నాయి.

వసుంధర రాజెకు కౌంటర్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలకు రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజె మధ్య ఎప్పుడూ సత్సంబంధాలు లేవు. అయినప్పటికీ ఆరెస్సెస్ అండదండలతో ఆమె తనకున్న స్థానాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పటివరకు రాజస్తాన్‌లో వసుంధరా రాజె, ఆమె వర్గీయులకు టిక్కెట్లు దక్కలేదు. రాజెకు చెక్ పెట్టడానికే బీజేపీ వ్యూహాత్మకంగా పార్టీ ప్రముఖుల్ని బరిలోకి దింపిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

మిజోరంలో ముక్కోణం

ఈశాన్య రాష్ట్రం మిజోరంలో ముక్కోణ పోరు నెలకొంది. పాలక మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), కాంగ్రెస్‌తో పాటు జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ ఈసారి హోరాహోరీగా తలపడుతున్నాయి...

జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) రాకతో బుల్లి రాష్ట్రం మిజోరంలో పోరు ఆసక్తికరంగా మారింది. ఆ పార్టీ మొత్తం 40 స్థానాలకూ అభ్యర్థులను బరిలో దింపింది. పార్టీ నాయకుడు లాల్‌దుహోమా గత ఉప ఎన్నికలో నెగ్గిన సెర్ఛిప్ నుంచే పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ ఇప్పటికే 39 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇక పాలక ఎంఎన్ఎఫ్ కూడా మొత్తం సీట్లకూ అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో 15 కొత్త ముఖాలున్నాయి. ఇద్దరు మహిళలకు కూడా అవకాశం దక్కింది. సీఎం, ఎంఎన్ఎఫ్ అధ్యక్షుడు జోరాంతంగా ఐజ్వాల్ ఈస్ట్-1 నుంచే బరిలో దిగుతున్నారు. ఇక ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉన్న బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.



జెడ్‌పీఎం జోరు...!

మిజోరం జనాభా కేవలం 11 లక్షలు. దశాబ్దాల తరబడి సాగిన చొరబాట్ల సమస్య అనంతరం 1987లో రాష్ట్రంగా ఏర్పడింది. నాటినుంచీ ప్రతి రెండుసార్లకు ఒకసారి చొప్పున అధికారం ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్ మధ్య చేతులు మారుతోంది. ఈసారి మాత్రం పాలక ఎంఎన్ఎఫ్‌కే కాస్త మొగ్గుందని పరిశీలకులు భావిస్తున్నారు. కానీ జెడ్‌పీఎం గట్టి పోటీ ఇచ్చి ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారే ఆస్కారం కూడా లేకపోలేదని చెబుతున్నారు. సరిగ్గా 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరేడు పార్టీల కూటమిగా పుట్టుకొచ్చిన జెడ్‌పీఎం ఆ తర్వాత ఒకే పార్టీగా రూపుమార్చుకుంది. పట్టణ ప్రాంతాల్లో చూస్తుండగానే పట్టు సాధించింది. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా సత్తా చాటాలని భావిస్తోంది. మిజోరం జనాభాలో క్రైస్తవులే మెజారిటీ. వారి మనోగతంతో పాటు మయన్మార్ శరణార్థుల అంశం కూడా ఈసారి నిర్ణాయకంగా మారవచ్చని భావిస్తున్నారు. రాష్ట్రంలో నవంబర్ 7న పోలింగ్ జరగనుంది. ఫలితాలు డిసెంబర్ 3న వెల్లడవుతాయి.


2018లో ఇలా...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ అన్ని స్థానాల్లోనూ పోటీ చేయగా బీజేపీ 39 స్థానాల్లో బరిలో దిగింది. ఎంఎన్ఎఫ్ 26, కాంగ్రెస్ 5 సీట్లు గెలవగా బీజేపీ ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. స్వతంత్రులుగా బరిలో దిగిన జెడ్‌పీఎం అభ్యర్థులు ఎనిమిది సీట్లలో నెగ్గారు. కేంద్రంలోని పాలక ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న ఎంఎన్ఎఫ్ మిజోరంలో బీజేపీతో జట్టు కట్టకుండా విడిగానే పోటీ చేసింది.

-సాక్షి, నేషనల్ డెస్క్

పార్టీ	2018	2013
ఎంఎన్ఎఫ్	26	5
కాంగ్రెస్	5	34
జెడ్‌పీఎం	8	-
బీజేపీ	1	0
ఇతరులు	0	1

క్యాండీ క్రష్ ఆడుతూ ఛత్తీస్‌గఢ్ సీఎం



రాయపూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తులో తలమునకలైంది. దీనికి సంబంధించి రాయపూర్‌లో అతి ముఖ్యమైన సమావేశంలో పాల్గొన్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ క్యాండీక్రష్ ఆడడం రాజకీయంగా మాటల యుద్ధానికి దారి తీసింది. రాయపూర్‌లో మంగళవారం రాత్రి అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరిగింది. అత్యంత కీలకమైన ఈ సమావేశంలో సీఎం బఘేల్ తన ఫోన్‌లో క్యాండీక్రష్ ఆడుతూ కనిపించారు. ఈ ఫొటోను బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ వ్యంగ్యంగా కామెంట్ చేశారు. ''అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు జరుగుతూ ఉంటే సీఎం హాయిగా క్యాండీ క్రష్ ఆడుతూ రిలాక్సవుతున్నారు. బహుశా కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవదని ఆయనకూ తెలిసి ఉంటుంది'' అని మాలవీయ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. వీటిని బఘేల్ తిప్పికొడుతూ గతంలో తాను ఛత్తీస్‌గఢ్ సంప్రదాయ క్రీడలు గిల్లీ దండా, భవురా ఆడినప్పుడు కూడా బీజేపీ విమర్శలు చేసిందని గుర్తు చేశారు.'' ఛత్తీస్‌గఢ్ సంప్రదాయ క్రీడలు ఎంత ఇష్టంగా ఆడతానో క్యాండీక్రష్ అంతే ఇష్టంగా ఆడతాను. క్యాండీక్రష్‌లో చాలా లెవల్స్ పూర్తయ్యాయి. ఇంకా ఆటని కొనసాగిస్తూ లెవల్స్ అన్నీ దాటతాను. ఎవరు అధికారంలోకి వస్తారో రారో ప్రజలే నిర్ణయిస్తారు. ఎవరు గెలుస్తారో అందరికీ తెలుసు'' అని ఎదురుదాడి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో రెండు దశల్లో నవంబర్ 7, 17 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

సాక్షి హైదరాబాద్

గురువారం । 12 । అక్టోబర్ । 2023

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వీరే..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ నియమించారు. వివరాలిలా ఉన్నాయి.

- ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి వి.లక్ష్మీనారాయణ (95501 47479).
- మలక్‌పేట్ కె.వెంకట ఉపేందర్‌రెడ్డి (94408 15870).
- అంబర్‌పేట్ బి.అపర్ణ (96188 77044).
- ఖైరతాబాద్ వెంకటేష్ దొత్రె (78424 52571).
- జూబ్లీహిల్స్ టి.రవి (94408 15891).
- సనత్ నగర్ బి.కిషన్ రావు (96189 02253).
- నాంపల్లి వి.లావణ్య (94408 15856).
- కార్వాన్ కొమురయ్య (94408 15892).
- గోషామహల్ వి.విక్టర్ (98666 79319).
- చార్మినార్ టి.వెంకన్న (96182 49933).
- చాంద్రాయణగుట్ట ఎం.సూర్య ప్రకాష్ (94408 15890).
- యాకుత్‌పురా ఇ.వెంకటచారి (94408 15887).
- బహదూర్‌పురా ఆర్.దశరథ్ సింగ్ (99481 68481).
- సికింద్రాబాద్ ఎస్.ఎల్లా రెడ్డి (99892 29215).
- కంటోన్మెంట్ మధుకర్ నాయక్ (72880 66777).
- వీరు ఆయా నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేసే కార్యాలయాల వివరాలు, ఇతరత్రా సమాచారాన్ని ప్రకటిస్తారని అధికారి రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు.



దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో డిస్కో దాండియా 2.0 పేరుతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు కనువిందు చేశాయి. 'హైదరాబాద్ వన్ లేడీస్ సర్కిల్ 166.. హైదరాబాద్ వన్ రౌండ్ టేబుల్ 212' ఆధ్వర్యంలో జరిగిన ఈ ఫండ్ రైజింగ్ ప్రోగ్రాం యువతుల దాండియాతో ఆకట్టుకుంది. ఫండ్ రైజింగ్ కన్వీనర్ గుల్షన్ అగర్వాల్, మేఘా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్

సంచలన బదిలీలు

నగర కొత్వాల్ సీవీ ఆనంద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లకు స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని రెండు జిల్లాల కలెక్టర్లు, నగర పోలీస్ కమిషనర్ బదిలీ వార్త బుధవారం రాత్రి రాజధాని నగరంలో సంచలనం రేకెత్తించింది. అసెంబ్లీ ఎన్నికల బదిలీల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం గ్రేటర్ హైదరాబాద్‌తో కలగలసి ఉన్న పొరుగు జిల్లాల కలెక్టర్లతో పాటు నగర పోలీస్ కమిషనర్‌పై బదిలీ వేటు వేయడం టాక్ ఆఫ్ ద సిటీగా మారింది. గ్రేటర్‌లోని వివిధ అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. దాదాపు రెండు నెలల క్రితం నుంచే ఎన్నికల నేపథ్యంలో పలు కీలకస్థానాల్లోని అధికారుల బదిలీలు జరిగాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడ్డాక.. రాష్ట్రానికి గుండెకాయ వంటి రాజధాని కేంద్రమైన హైదరాబాద్‌పై ప్రభావం చూపేలా తలవని తలంపుగా.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, మేడ్చల్ కలెక్టర్ అమోయ్‌కుమార్‌లపై బదిలీ వేటు పడటంతో ఆయా విభాగాలు ఉలిక్కిపడ్డాయి. వీరిద్దరూ జిల్లా కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టి దాదాపు ఆర్నెల్లు మాత్రమే అయింది. వీరితో పాటు నగర పోలీస్ కమిషనర్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను సైతం బదిలీ చేయడంతో పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జనాభా రీత్యా, అభివృద్ధి దృష్ట్యా, ఆర్థిక వనరుల పరంగా అన్నింటా రాష్ట్రంలో కీలకంగా ఉండటంతో పాటు ఓటర్లలోనూ మూడో వంతు ఉన్న గ్రేటర్ పరిధిలోని వీరిని బదిలీ చేయడం అన్ని వర్గాల ప్రజలనూ నివ్వెరపోయేలా చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి వీరు కళ్లు, చెవులుగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు మెజార్టీ ప్రజల్లో ఉన్నాయి. జిల్లాల కలెక్టర్లుగా ఇద్దరు కలెక్టర్లు రెండు జిల్లాల ఎన్నికల అధికారులుగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌పై సైతం ప్రభావం పడనుందా అన్న ప్రశ్నలు తాజాగా ఉత్పన్నమవుతున్నాయి. గతంలో 2008లో వికారాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ ప్రకాశ్‌ను ఇలాగే ఎన్నికలకు ముందు బదిలీ చేయడాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. బదిలీ అయిన కలెక్టర్ల స్థానంలో గురువారం సాయంత్రం 5 గంటల్లోపు నియామకాలకు ప్యానల్ పంపాల్సిందిగా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.



అక్రమ నగదు, మద్యంపై గట్టి నిఘా

- ప్రలోభాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి
- ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: నగదు, మద్యం అక్రమ తరలింపుపై గట్టి నిఘా ఉండాలని, ప్రలోభాలకు లొంగకుండా ప్రజలను చైతన్యపర్చాలని ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) నోడల్ ఆఫీసర్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల ఫ్లైయింగ్ స్క్వాడ్స్ (ఎఫ్ఎస్), వీడియో సర్వైలెన్స్‌టీమ్స్ (వీఎస్‌టీ)కు మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘనలకు సంబంధించి తీసుకున్న చర్యలపై రోజువారీ నివేదిక అందించాలన్నారు. ఎఫ్ఎస్‌ల పనితీరును జీపీఎస్ ట్రాక్ సిస్టం, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పరిశీలిస్తామన్నారు. మద్యం, ఉచిత పంపిణీలు వంటివి పట్టుబడ్డప్పుడు తప్పనిసరిగా రికార్డ్ చేయాలని సూచించారు. రాజకీయ పార్టీల మీటింగులు, బ్యానర్లు వంటి సామగ్రిని కూడా వీటీఎస్‌లు రికార్డు చేయాలన్నారు. ఎఫ్ఎస్‌లు సీజ్ చేసిన నగదును కోర్టుకు సమర్పించాలని, ఎఫ్ఐఆర్ నమోదు కాని నగదును హైదరాబాద్ కలెక్టరేట్‌లోని డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్‌సెల్‌కు సమర్పించాలని తెలిపారు. నేరం కాని పక్షంలో ఆ నగదును సంబంధిత వ్యక్తులకు అందజేస్తారని చెప్పారు. నగర ప్రజలు రూ. 50వేలకు మించి నగదుకు తగిన పత్రాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఇళ్లలో నగదు ఉందని తెలిస్తే వెంటనే ఐటీ అధికారులకు సమాచారమివ్వాలన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు రూ. 40 లక్షలకు మించి ఖర్చు చేయరాదన్నారు. ఎన్నికల వ్యయం మానిటరింగ్ నోడల్ అధికారి శరత్ చంద్ర మాట్లాడుతూ, ఎన్నికల అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయాన్ని చూపించకపోతే డిస్మిస్ చేసేందుకు కూడా అవకాశం ఉందన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులకు వంద నిమిషాలలోపు సమాధానం ఇవ్వాలని తెలిపారు.ఈ యాప్ లో ప్రజలు ఫోటోలు, వీడియో, ఆడియో ద్వారా ఫిర్యాదులు చేయొచ్చన్నారు. ఎఫ్ఎస్‌లు సుమోటోగా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సరిహద్దుల్లో 18 చెక్ పోస్టులు

- తనిఖీల కోసం సర్వైలెన్స్ బృందాలు
- నగర కొత్వాల్ సీవీ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగరంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పటిష్ట చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేయడానికి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో అవసరమైన నివేదికలను సకాలంలో తయారు చేయాలని స్పష్టం చేశారు. సిబ్బంది విధులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బలగాలకు నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎన్నికల క్రతువు ముగిసే వరకు ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆనంద్ ఆదేశించారు. డీసీపీలు, ఏసీపీలతో పాటు నోడల్ అధికారులుగా ఉన్న అధికారులు సైతం ఎప్పటికప్పుడు తమ స్థాయిల్లో సమీక్షలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ అధికారులు తమ కార్యాలయాల్లో నిర్విరామంగా పని చేసేలా ప్రత్యేక సెల్స్ ఏర్పాటు చేయాలని, వీటిలో అనుభవజ్ఞులైన సిబ్బందిని నియమించుకోవాలని కొత్వాల్ పేర్కొన్నారు. అక్రమ మద్యం, నగదు, మాదకద్రవ్యాలతో పాటు ప్రలోభాలకు వినియోగించే ఇతర సామగ్రి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటిని ఎక్కడికక్కడ అడ్డుకోవాలని స్పష్టం చేశారు. నగరంలోని లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగి ఉన్న వారంతా వాటిని డిపాజిట్ చేసేలా స్థానిక పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆనంద్ పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ ఇంటర్ కమిషనరేట్ చెక్‌పోస్టుల సంఖ్యను 11 నుంచి 18కి పెంచామన్నారు. అదనపు సీపీ, ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జ్ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ.. నోడల్ అధికారులుగా ఉన్న ఏసీపీలు సమన్వయంతో పని చేయాలని, విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని పేర్కొన్నారు. స్పెషల్ బ్రాంచ్ అదనపు సీపీ ఎం.విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. నకిలీ ఓటర్ ఐడీ ముఠాలతో పాటు రవాణా సంస్థలు, కొరియర్ సర్వీసుల పైనా నిఘా ఉంచాలని కోరారు. సమావేశంలో అదనపు సీపీ సుధీర్ బాబు, ట్రాఫిక్ విభాగం సంయుక్త సీపీ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు. కాగా.. గత రెండు రోజుల్లో పోలీసులు రూ.4.2 కోట్ల విలువైన 7.706 కేజీల బంగారం, రూ.8.77 లక్షల విలువైన 11.700 కేజీల వెండి, రూ.5.1 కోట్ల నగదు, 110 లీటర్ల మద్యం. 23 మొబైల్ ఫోన్లు, 43 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

నువ్వా.. నేనా!

రసవత్తరంగా రంగారెడ్డి జిల్లా రాజకీయం


- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్
- పోటాపోటీగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు

రాష్ట్రంలోనే కొంత విభిన్నమైన జిల్లా రంగారెడ్డి. సెమీ అర్బన్‌గా జిల్లాగా ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. రాజకీయ చైతన్యం కాస్త ఎక్కువ ఉన్న ప్రాంతం కూడా ఇదే. ఇక్కడ కేవలం తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓటర్లు మాత్రమే కాదు ఉత్తరాది ప్రాంతాలకు చెందిన భిన్న కులస్తులు, మతస్తులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. అత్యధికంగా శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో ఉన్నారు. వీరి ఓట్లు ఎన్నికల్లో కీలకం కాబోతున్నాయి. సీట్లు ఖరారు కావడంతో అధికార బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటికే నియోజకవర్గాలను ఓ దఫా చుట్టేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, కాలనీ సంక్షేమ సంఘాలు, కుల సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘాలతో ఆత్మీయ సభలు, సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీలతో పోలిస్తే కొంత ముందున్నట్లు కనిపిస్తోంది. విపక్షాలు అభ్యర్థుల పేర్లు ఇంకా అధికారికంగా వెల్లడించకపోయినా.. ఆయా పార్టీలు సైతం ఓటర్లను ఆకర్షించేందుకు పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నాయి. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నాయి.

– సాక్షి, రంగారెడ్డి జిల్లా

సెగ్మెంట్ రిపోర్ట్

టికెట్లు రాకున్నా ఎవరికి వారే ప్రచార పర్వం



విద్యాశాఖ మంత్రి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం ఇది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు వరకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ఆమె బిజీగా మారారు. రోజుకు కనీసం 12 గంటలు నియోజకవర్గంలోనే ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌తో పోలిస్తే.. ఎన్నికల ప్రచారంలో ఆమె కొంత ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. అదే విధంగా బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న అందెల శ్రీరాములు సైతం పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ తప్పిదాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి అంశాల్లో స్థానికులకు జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ.. ఎప్పటికప్పుడు అధికార పార్టీ టార్గెట్‌గా ముందుకెళ్తున్నారు. ఈ సీటును హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ఇదే నియోజకవర్గం వేదికగా ఇటీవల భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఆశించిన దానికంటే అధిక సంఖ్యలో జనం రావడంతో ఆ పార్టీకి కొత్త ఊపునిచ్చింది. తీరా టికెట్ల కేటాయింపు అంశం వివాదాస్పదంగా మారింది. ఇక్కడి నుంచి బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పోటీ చేయనున్నారనే ప్రచారం జరిగింది. ఆయన కూడా ఇందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటి వరకు ఫీక్ స్టేజీలో ఉన్న కాంగ్రెస్.. ఇటీవల బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి చేసిన ఆరోపణలతో రాజకీయంగా కోలుకోలేని స్థితికి చేరింది. సంస్థాగతంగా పార్టీ బలంగా ఉన్నప్పటికీ.. నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం తెచ్చిపెట్టే విధంగా ఉన్నాయి. ఆశావహులంతా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పని చేస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సిట్టింగ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేసే ప్రక్రియలో బిజీగా ఉంటున్నారు. నియోజకవర్గానికి కొంత అభివృద్ధి పథంలో నడిపించారు. కాంగ్రెస్ నుంచి అధికారికంగా అభ్యర్థి పేరు వెల్లడించకపోయినప్పటికీ.. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పోటీలో ఉండనున్నట్లు సమాచారం. ఆయన ఇప్పటికే గ్రామాల వారీగా పర్యటిస్తూ బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. సంస్థాగతంగా పార్టీకి మంచి పట్టుండటం ఆయనకు కలిసి వచ్చే అంశం. ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావహులు మర్రి నిరంజన్‌రెడ్డి, దండెం రామిరెడ్డిలు ఆయనకు సహకరిస్తారా? లేదా? వేచి చూడాల్సిందే. ఇక్కడ బీజేపీ పెద్దగా ప్రచారంలో లేకపోవడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య ప్రధాన పోటీ నెలకోనుంది.

పూర్తిగా అర్బన్ ఓటర్లు ఉన్న ప్రాంతం ఇది. ఇక్కడ తెలంగాణ, ఏపీ జిల్లాలకు చెందిన ఓటర్లు అధికం. సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బీఆర్ఎస్ మళ్లీ అవకాశం కల్పించింది. గత ఎన్నికల్లో చేతి గుర్తుపై గెలుపొందిన ఆయన ఈసారి కారు గుర్తుతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇక్కడ బీజేపీకి సంస్థాగతంగా బలంగా ఉంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ 11 డివిజన్లకు 10 డివిజన్లలో విజయం సాధించింది. ఇక్కడి నుంచి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డితో పాటు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేరు ప్రముఖంగా ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ మధుయాష్కీ పేరు దాదాపు ఖరారైంది. అధికారికంగా పేరు వెల్లడించక పోయినా.. అంతర్గతంగా ఆయన ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో ముక్కోణపు పోటీ నెలకొనే అవకాశం లేకపోలేదు.

బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కే మళ్లీ టికెట్ వరించింది. ఇతర పార్టీలతో పోలిస్తే ఆయన ప్రచారంలో కొంత ముందున్నారు. బీజేపీ నుంచి పలువురు ఆశావహులు పోటీపడుతున్నారు. వీరిలో ముఖ్యంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అధికారికంగా అభ్యర్థి పేరు వెల్లడించక పోయినా.. వీరిలో తోకల శ్రీనివాసరెడ్డి ఇప్పటికే ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. కాంగ్రెస్ నుంచి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గౌరీ సతీష్, నరేందర్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు. ఎంఐఎం కూడా తమ అభ్యర్థిని బరిలో నిలిపే అవకాశం ఉంది. ఇక్కడ బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్యే ప్రధానంగా పోటీ ఉండే అవకాశం ఉంది.

రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం శేరిలింగంపల్లి. ఇక్కడ 6,98,133 మంది ఓటర్లు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ప్రచారంలో ఆయన దూసుకుపోతున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ తనయుడు రవికుమార్ యాదవ్‌కు టికెట్ దాదాపు ఖరారైనట్లే. ఆయన అధికార పార్టీకి గట్టిపోటీ ఇచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ నుంచి యువ నేత రఘునాథ్ యాదవ్ పేరు దాదాపు ఖరారైనట్లు తెలిసింది. ఈయన కూడా ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అయితే.. ఇక్కడ అధికార బీఆర్ఎస్, బీజేపీల మధ్యే ప్రధానంగా పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది.

జంగ్ తెలంగాణ 2023

సామాజిక మాధ్యమాలపై నజర్

రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు రాచకొండ పోలీసులు అన్ని రకాల కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. గత ఎన్నికల సమయంలో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించే వ్యక్తుల మీద నిఘా పెట్టారు. రౌడీ షీటర్లతో పాటు సస్పెక్ట్, హిస్టరీ షీట్స్ ఉన్నవారిని బైండోవర్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పోలీసు అధికారులతో రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ బుధవారం ఉప్పల్ ట్రాఫిక్ డీసీపీ ఆఫీసులో సమీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలని, ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి అన్ని సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టాలని సూచించారు. గొడవలు, శాంతి భద్రతలకు విఘాతం సృష్టించే అవకాశం ఉన్న సోషల్ మీడియా సందేశాలు, వీడియోలు వైరల్ చేసే వారిని కనిపెట్టి, సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సమస్యాత్మక, వల్నరబుల్ పోలింగ్ ప్రాంతాలను గుర్తించాలని, ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల నిర్వహణ పరికరాలు తీసుకెళ్లే మార్గాలను పరిశీలించాలని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద భద్రత ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసరం ఉన్న పోలింగ్ స్టేషన్ ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, బూత్‌లలో మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ అంబర్ కిషోర్ ఝూ, డీసీపీలు రాజేష్ చంద్ర, అభిషేక్ మహంతి, దరావత్ జానకి, గిరిధర్, శ్రీనివాస్, బాలస్వామి, అనురాధ, ఇందిరా, సాయిశ్రీ, శ్రీనివాసులు, ఉషా విశ్వనాథ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

Jung telangana-2023

మేడ్చల్ బీజేపీ అభ్యర్థిగా ఈటల జమున?



మేడ్చల్: మొదటి నుంచీ ఈటల కుటుంబానికి మేడ్చల్ నియోజకవర్గానికి సమీప సంబంధాలు ఉండటంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున మేడ్చల్ నుంచి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమునను రంగంలోకి దించేందుకు ఆ పార్టీ అధిష్టానం వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈటల రాజేందర్ మేడ్చల్ మండల పరిధిలోని పూడూర్ దగ్గర ఔటర్ రింగురోడ్డు సమీపంలో నివాసముంటున్నారు. ఆయన గోదాంలు, గతంలో పౌల్ట్రీలు, ఇతర వ్యాపారాలు నియోజకవర్గ పరిధిలోనే ఉండటంతో వారి కుటుంబానికి మేడ్చల్‌కు చాలా రోజులుగా సత్సంబంధాలు ఉన్నాయి. జమున నివాసం పూడూర్ పరిధిలో ఉండటంతో పాటు స్థానిక నాయకులతో పరిచయాలు ఉన్నాయి. ఈటలకు అర్థ బలం పరిపుష్టిగా ఉండటం, టికెట్ ఆశిస్తున్న మిగతావారికి ఆ బలం లేకపోవడం, రాజేందర్ బీసీ అయినా జమున రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు కావడం, ఆ సామాజికవర్గ పెత్తనం మేడ్చల్‌లో ఎక్కువగా ఉండటంతో ఆమె అభ్యర్థిత్వం తమకు కలిసి వస్తుందని బీజేపీ అధిష్టానం ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు బీజేపీ మేడ్చల్ టికెట్ తన భార్య జమునకు కేటాయించాలని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అధిష్టానాన్ని కోరినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

బీజేపీలోకి ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి?



హబ్సిగూడ: బీఆర్ఎస్ టికెట్ దక్కకపోవడంతో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఆయన బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా బండారి లక్ష్మారెడ్డికి ఆ పార్టీ టికెట్ ఇచ్చింది. ఇక్కడి నుంచి టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. కొన్ని రోజులుగా ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన బీజేపీలో చేరేందుకు ఆ పార్టీ అగ్రనేతలతో చర్చలు జరిపినట్లు సమాచారం.

ఓయూ కాలేజీలకు ఈ నెల 14 నుంచి 25 వరకు దసరా సెలవులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కాలేజీలకు విద్యార్థులకు, అధ్యాపకులకు ఈ నెల 14 నుంచి 24 వరకు అధికారులు దసరా సెలవులు ప్రకటించారు. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీలలో తిరిగి ఈ నెల 25 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. క్యాంపస్ హాస్టళ్లకు, మెస్‌లకు సైతం సెలవులు ప్రకటించగా యూనివర్సిటీ కార్యాలయాలు యథావిధిగా పని చేయనున్నట్లు పేర్కొన్నారు.

20 వరకు దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు ఈ నెల 20 వరకు పొందవచ్చని డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి బుధవారం తెలిపారు. యూజీసీ ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

ఓయూ స్నాతకోత్సవానికి భారీగా పీహెచ్‌డీ దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 31న జరిగే 83వ స్నాతకోత్సవానికి భారీగా పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా సుమారు 600 పైగా పీహెచ్‌డీ డాక్టరేట్ అభ్యర్థులు స్నాతకోత్సవంలో పట్టాను అందుకునేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవంలో బంగారు పతకాలను అందుకునేందుకు సుమారు 58 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఇదిలా ఉండగా స్నాతకోత్సవానికి దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 16 వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు.

నేడు నిరుద్యోగుల బతుకమ్మ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గురువారం విద్యార్థి, నిరుద్యోగ అక్కా, చెల్లెళ్ల బతుకమ్మను జరుపుకోనున్నారు. తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగే నిరుద్యోగ బతుకమ్మ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని జేఏసీ రాష్ట్ర కార్యదర్శి నల్ల లత విశ్వజన్, ఓయూ అధ్యక్షురాలు మధుమతి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల భర్తీలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిరుద్యోగ బతుకమ్మతో నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు సహకార రంగం దన్ను

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్



సదస్సులో పాల్గొన్న గవర్నర్ తమిళిసై

నాంపల్లి: దేశ ఆర్థిక వ్యవస్థకు సహకార రంగం దన్నుగా నిలిచిందని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. నేషనల్ కో ఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కెఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో ‘దక్షిణాది రాష్ట్రాలు–సహకార రంగ అభివృద్ధి’ అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తమిళిసై మాట్లాడుతూ దేశ పురోభివృద్ధిలో సహకార రంగం ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో గడచిన 75 ఏళ్లలో సాధించలేని ప్రగతిని సాధించామని తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయేతర, ఉత్పత్తి, సేవా రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నట్లు చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన సహకార రంగంపై సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి, నేషనల్ కో ఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దిలీప్ సంఘానీ, ఎన్ఎఫ్ఎస్‌సీఓబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, టీఎస్ మార్క్‌ఫెడ్ చైర్మన్ ఎం.గంగారెడ్డి, ఎన్‌సీయుఐ సలహాదారు రాధాకృష్ణన్, ఏపీ మహేష్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ రమేష్ కుమార్ భంగ్, వి.పి సేథియా తదితరులు పాల్గొన్నారు.

కర్రలతో దాడి ఘటన.. ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులు భాస్కర్, లలిత్

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్‌నగర్ బస్తీలో శనివారం అర్థరాత్రి దాటిన తర్వాత ఓ వ్యక్తిపై కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్ఎన్‌నగర్‌లో ఓ వ్యక్తిని స్థానిక బీఆర్ఎస్ కార్యకర్త ఎం.భాస్కర్‌తో పాటు అతడి స్నేహితుడు లలిత్‌కుమార్‌తో సహా పలువురు వ్యక్తులు రౌండప్‌చేసి కర్రలతో విచక్షణారహితంగా దాడి చేస్తున్న దృశ్యాలు మంగళవారం రాత్రి సోషల్‌మీడియాలో హల్‌చల్ చేశాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు సంఘటనపై విచారణ ప్రారంభించారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఘటన జరిగినట్లు తేలడంతో నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు భాస్కర్, లలిత్‌లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో వివరాలు బయటపడ్డాయి.

రాయితో కొట్టడంతో దాడి..

ఎల్ఎన్‌నగర్‌లో నివాసం ఉంటున్న భాస్కర్ (24) బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా ఉన్నాడు. సుమారు పది రోజులుగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి కార్యాలయంలో ఉంటూ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు తీస్తూ వాట్సప్‌గ్రూపుల్లో వేస్తున్నాడు. కాగా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న స్నేహితుడు లలిత్ కుమార్ ఇంటివద్దకు భాస్కర్ వచ్చాడు. గుంటూరుకు చెందిన చందు అనే వ్యక్తి బస్తీలో వచ్చి న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడని, తాను నిలదీయడంతో దాడికి పాల్పడ్డాడని లలిత్‌కుమార్ చెప్పాడు. దాంతో అక్కడే ఉన్న చందును ప్రశ్నించగా గొడవ ప్రారంభమయింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న చందు ఆగ్రహంతో రాయితో భాస్కర్ తలపై దాడి చేశాడు. దీంతో రక్తస్రావం జరగడంతో రెచ్చిపోయిన భాస్కర్ తన స్నేహితులతో కలిసి చందును రౌండప్ చేశారు. కర్రతో విచక్షణా రహితంగా దాడి చేయగా ఇతర స్నేహితులు పిడిగుద్దులు కురిపిస్తూ, కాళ్లతో తన్నుతూ పైశాచిక ఆనందాన్ని పొందారు. తీవ్రంగా గాయపడిన చందు చేతులెత్తి మొక్కుతూ..తనను వదిలిపెట్టాలంటూ వేడుకున్నా కనికరించకుండా సుమారు 10 నిమిషాలు దాడిని కొనసాగించారు. స్థానికుల సమాచారం మేరకు జూబ్లీహిల్స్ పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు రావడంతో భాస్కర్‌తో పాటు ఇతర వ్యక్తులు పారిపోయారు. దాడిలో గాయపడిన చందును 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా సంఘటనలో తన తప్పు కూడా ఉందని, ఎలాంటి కేసు వద్దంటూ బాధితుడు చెప్పాడు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స అనంతరం సొంతూరుకు వెళ్లిపోయాడు. కాగా ఈ ఘటన మంగళవారం రాత్రి వెలుగులోకి రావడంతో నిందితులపై ఐపీసీ 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు భాస్కర్, లలిత్‌కుమార్‌లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ముందుగా తనమీదనే చందు దాడి చేశాడంటూ భాస్కర్ కూడా ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

రూ.17.33 లక్షలు పట్టివేత

ఇబ్రహీంపట్నం: స్థానిక చెరువు కట్ట వద్ద బుధవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.17.33 లక్షల నగదును నలుగురు వ్యక్తుల నుంచి ఇబ్రహీంపట్నం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్థానిక చెరువు కట్ట వద్ద వాహనాల తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మూడు కార్లు, ఒక బైక్‌లో తరలిస్తున్న 17. 33 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నగదును అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

21 లీటర్ల లిక్కర్ స్వాధీనం

ఇబ్రహీంపట్నం: బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు చేసి అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన ఉడుగుల యాదయ్య, మచ్చ గోవర్ధన్‌లు బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ ఇరువురి వద్ద సుమారు 21 లీటర్ల అక్రమ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

టిప్పర్ బీభత్సం..ఒకరి మృతి


భవనంలోకి దూసుకొచ్చిన టిప్పర్ (ఇన్‌సెట్‌లో) మృతుడు ఏసు (ఫైల్)

చైతన్యపురి: అదుపు తప్పిన టిప్పర్ ఓ నిర్మాణం జరుగుతున్న ఇంట్లోకి దూసుకెళ్లి వాచ్‌మన్ దుర్మరణం పాలైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పోలుమల్ల గ్రామానికి చెందిన పాల్వ ఏసు (50) మోహన్ నగర్‌లో ఓ నిర్మాణం జరుగుతున్న భవనంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఏసు భవనం ముందు నిలబడి ఉండగా నాగోల్ నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి నిర్మాణంలో ఉన్న భవనంలోకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఏసు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నకిలీ పోలీస్ అరెస్టు

- ఎయిర్ పిస్టల్, సెల్‌ఫోన్, నగదు స్వాధీనం



మేడిపల్లి: టాస్క్‌ఫోర్స్ పోలీసునని చెప్పి స్పా సెంటర్ యజమానిని డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరించిన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఎస్ఓటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఘట్‌కేసర్ మండలం జోడిమెట్ల సద్భావన టౌన్‌షిప్‌లో నివాసం వుంటున్న మారుడి మధుసూదన్ రెడ్డి(36) సులువుగా డబ్బులు సంపాదించాలనే దురాలోచనతో ఇటీవల నాంపల్లిలోని ఓ దుకాణంలో ఎయిర్ పిస్టల్‌ను కొనుగోలు చేశాడు. నకిలీ పోలీసుగా అవతారమెత్తి..పీర్జాదిగూడలోని రీసెంట్ బ్యూటీ అండ్ స్పా సెంటర్ యజమానిని బెదిరించాడు. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వగా..మల్కాజ్‌గిరి జోన్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఒక ఎయిర్ పిస్టల్, సెల్‌ఫోన్, రూ. 5800 నగదును స్వాధీనం చేసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆకట్టుకునే ఆంథాలజీ..‘ఐ కాంట్ బ్రీత్’

17 ఏళ్ల వయసులోనే రూపొందించిన నగర బాలుడు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన అర్మన్ చతుర్వేది..17 ఏళ్ల వయసులోనే సేకరించిన అద్భుతమైన కవిత్వం, పాటలు, స్ఫూర్తిదాయకమైన మాటల సమాహారంతో ‘ఐ కాంట్ బ్రీత్’ అనే ఆంథాలజీ పుస్తకాన్ని రూపొందించి ఆకట్టుకుంటున్నాడు. అతి పిన్న వయసులోనే వివక్ష, హింస, అన్యాయం, పర్యావరణ సంరక్షణ తదితర అంశాలపైన అవగాహన పెంచుకున్న అర్మన్ చతుర్వేది ఈ అంశాలను ప్రభావితం చేసే ఆంథాలజీ పుస్తకాన్ని రూపొందించారు. అమెరికాలో జన్మించిన అర్మన్ చతుర్వేది ఇప్పటికే 25కు పైగా దేశాలను సందర్శించారు. ‘ఐ కాంట్ బ్రీత్’ పుస్తకంలో పొందుపర్చిన కవిత్వం, పాటలు చిన్న వయసులోనే అర్మన్ పెంపొందించుకున్న పరిపక్వత, విజ్ఞానాన్ని ప్రదర్శిస్తుందని అతని తల్లి పేర్కొంది.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం: నిఖత్ జరీన్



శంషాబాద్: ఒలింపిక్స్‌లో విజయం సాధించడమే తన ముందున్న లక్ష్యమని ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖిత్ జరీన్ అన్నారు. ఏషియన్ గేమ్స్‌లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన ఆమె బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో క్రీడాభిమానులు, తెలంగాణ స్పోర్ట్స్ విభాగం అధికారులు, కుటుంబ సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భవిష్యత్తులో జరిగే ఆటలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మరింత పట్టుదలగా కృషి చేస్తానన్నారు. తెలంగాణ ప్రభుత్వం మంచి సహకారం అందిస్తోందన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి


శర్వణప్రియ (ఫైల్)

మాదాపూర్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..పాండిచ్చేరికి చెందిన శర్వణప్రియ (25) ఓ ఫార్మసీలో ఉద్యోగిగా పనిచేస్తూ కుటుంబసభ్యులతో కలిసి జీవనం సాగిస్తుంది. ఈ నెల 10వ తేదీన సాయంత్రం 5 గంటల ప్రాంతంలో శర్వణ ప్రియను కలిసేందుకు చెన్నైలో వ్యాపారిగా కొనసాగుతున్న స్నేహితుడు శ్రీహరి రమేశ్(25) హైదరాబాద్‌కు వచ్చాడు. కళాశాలలో చదువుకున్న సమయంలో ఇతనితో స్నేహం ఉంది. వీరిద్దరు కలిసి మాదాపూర్‌లోని చందానాయక్ తాండలో గోల్డెన్ హైవ్ ఓయోలో 308 రూంను బుక్ చేసుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరు కలిసి మద్యం సేవించారు. మరుసటి రోజు తెల్లవారు జామున శ్రీహరికి వాంతులు కావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. చికిత్స అనంతరం ఓయో రూంకు వచ్చిన శ్రీహరి రమేశ్...శర్వణప్రియ కుర్చీలో నిశ్చలంగా పడి ఉండడాన్ని చూసి అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. ఓయో రూం సహాయక సిబ్బంది సహాయంతో ఆమెను అంబులెన్స్‌లో చేర్చి పరీక్షించగా అప్పటికే చనిపోయినట్లు అంబులెన్స్ సిబ్బంది నిర్ధారించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు యువతి తల్లిదండ్రులకు విషయం తెల్పి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ నెల 11వ తేదీ ఉదయం 10.49 నిమిషాలకు రూం నుంచి యువతి ఫోన్‌చేసి సాయంత్రం వరకు ఉంటామని చెప్పిందన్నారు. ఆ తర్వాత ఆమెకు ఆకలి వేయడంతో జొమోటాలో ఫుడ్ ఆర్డర్ చేసిందన్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో శ్రీహరి గదికి వచ్చి చూడగా అప్పటికే యువతి అపస్మారక స్థితిలో ఉన్నట్టు తెలిపారు.

ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

డీఐజీ సుమతి


మాట్లాడుతున్న డీఐజీ సుమతి తదితరులు

వెంగళరావునగర్: ఇంటర్‌నెట్ వ్యవస్థను యువత జాగ్రత్తగా వినియోగించుకుంటూ పురోగతిని సాధించాలని, లేనిపక్షంలో మనకు తెలియకుండానే క్రైమ్ కార్నర్‌లో ఇరుక్కుపోతారని టీఎస్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీఐజీ సుమతి తెలియజేశారు. రూం టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో ‘మి అండ్ మై డిజిటల్ వరల్డ్’ అనే ప్రచార కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో విద్యార్థులకు ఫోన్లు వద్దంటూ తల్లిదండ్రులు నివారించేవారని, అయితే ప్రస్తుతం అన్ని అవసరాలకు ఇంటర్‌నెట్ వినియోగిస్తున్నందువల్ల దాని వాడకం ఎక్కువైందని పేర్కొన్నారు. మన పిల్లలు ఇంటర్‌నెట్‌లో ఎలాంటి సైట్స్‌ను వినియోగిస్తున్నారు, వారి స్నేహితులు ఎవరనే విషయాన్ని మాత్రం తల్లిదండ్రులు తప్పనిసరిగా గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. ఒక్కోసారి అగంతకులు ఫేక్ అకౌంట్స్‌ను క్రియేట్ చేసి స్నేహం ముసుగులో అమాయక యువతులను మోసం చేస్తూ తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నారని, ఇలాంటి సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ఇంటర్‌నెట్‌తో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. కాగా ఇంటర్‌నెట్ ద్వారా యువతులకు కలిగే ఉపయోగాలు, నష్టాలను తెలియజేస్తూ ప్రచారానికి శ్రీకారం చుట్టిన రూం టు రీడ్ సంస్థను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సంస్థ స్టేట్‌హెడ్ నర్సింహాచారి, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ కోశాధికారి రాజేష్, ప్రోగ్రాం ఆఫీసర్ సరిత, మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు డిపాజిట్ చేస్తానని చెప్పి బురిడీ

- ఏటీఎం వద్ద రూ.6 లక్షలు కాజేసిన ఆగంతకుడు

అమీర్‌పేట: ఏటీఎం మిషన్ ద్వారా డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చిన వ్యక్తిని ఓ ఆగంతకుడు మోసగించి రూ.6 లక్షలు కాజేసిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ రఘురామ్ తెలిపిన వివరాల ప్రకారం..ప్యారడైజ్ సమీపంలోని అన్నానగర్‌కు చెందిన బి.శ్రీకాంత్ ఎస్ఆర్‌నగర్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన సంస్థకు చెందిన రూ.3 లక్షల నగదును సమీపంలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలోని క్యాష్ డిపాజిట్ మిషన్ ద్వారా డిపాజిట్ చేసేందుకు వచ్చాడు. ఆ సమయంలో మిషన్ పనిచేయక పోవడంతో అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డును సంప్రదించాడు. గార్డు అక్కడే ఉన్న ఒక వ్యక్తిని పరిచయం చేసి అతడికి డబ్బులు ఇస్తే ఖాతాలో డిపాజిట్ చేస్తాడని తెలిపాడు. అతడి మాటలు నమ్మిన శ్రీకాంత్ రూ.3 లక్షలు సదరు వ్యక్తికి ఇచ్చాడు. అతను డబ్బులు తీసుకుని డబ్బు డిపాజిట్ అయినట్లు ఓ నకిలీ సందేశాన్ని ఖాతాదారు అయిన సంస్థ యజమానురాలికి పంపాడు. ఇంకా ఏమైనా డబ్బు డిపాజిట్ చేయాల్సి వస్తే తనను సంప్రదించాలని చెప్పి వెళ్లి పోయాడు. 9వ తేదీన శ్రీకాంత్ మరో రూ.3 లక్షలు తీసుకుని అదే ఏటీఎంకు వచ్చాడు. అప్పటికే అక్కడ ఉన్న అగంతకుడికి రెండోసారి డబ్బులు ఇచ్చాడు. ఖాతాలో డబ్బులు డిపాజిట్ చేస్తానని చెప్పి అక్కడి నుండి జారుకున్నాడు. ఈసారి డబ్బులు డిపాజిట్ చేసినట్లు ఎలాంటి మెసేజ్ రాకపోవడంతో ఖాతాను పరిశీలించారు. డబ్బు జమ కాకపోగా మొదటిసారి ఇచ్చిన డబ్బు కూడా ఖాతాలో డిపాజిట్ కాలేదని గుర్తించారు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు డీఐ తెలిపారు.


ఐఐఎంసీ కళాశాలలో జి 20 నమూనా సమావేశం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని ఐఐఎంసీ కళాశాలలో రెండు రోజుల పాటు జి 20 నమూనా సమావేశాలను నిర్వహించారు. ఈ నెల 10, 11 తేదీలలో కళాశాల సమావేశ మందిరంలో జరిగిన జి 20 నమూనా సమావేశంలో దేశం ఐక్యంగా ఉండాలని, సమాజానికి ఐకమత్యమే బలమని, అది లేకపోతే ఆ సమాజం దుర్బలమౌతుందన్నారు. 8 ఎజెండా పాయింట్లపై చర్చించారు. మొదటి రోజు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు, స్టార్టప్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్, కరెన్సీలు, యుద్ధం, టెర్రరిజం అంశాలతో పాటు రెండో రోజు సుస్థిరత, సుస్థిర వాతావరణ మార్పు, మహిళా సాధికారత, రాజకీయ అస్థిరత తదితరన అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు...

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి గాయాలు


శివకుమార్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: పెట్రోల్ ట్యాంకర్ ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి స్వల్ప గాయాలైన ఘటన మంగళవారం రాత్రి ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాగర్ హైవేపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం పోచారం గ్రామానికి చెందిన ఎం వినయ్‌కుమార్‌తో కలిసి అదే గ్రామానికి చెందిన తాళ్ళపల్లి శివకుమార్(28) బైక్‌పై తుర్కయంజాల్ వెళ్లారు. తిరిగి వస్తుండగా మన్నెగూడ బీఎంఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా బైక్‌ను వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న శివకుమార్ కిందపడడంతో అతని తలపై నుంచి ట్యాంకర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వినయ్‌కుమార్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ర్యాలీలు, పాదయాత్రలకు అనుమతి తప్పనిసరి

'సువిధ' యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి

- అనుమతులు లేకుండా ప్రచారం చేయవద్దు
- రాజకీయ పార్టీల నేతలకు రిటర్నింగ్ అధికారుల సూచన



వివిధ పార్టీల నేతలతో సమావేశమైన ఖైరతాబాద్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే



జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో..

బంజారాహిల్స్: శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఖైరతాబాద్ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఎన్నికల నిర్వహణ, రాజకీయ పార్టీలు పాటించాల్సిన నియమ, నిబంధనలపై బుధవారం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి డిసెంబర్ 5 వరకు అమలులో ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ముందస్తుగా సువిధ యాప్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎంసీసీ, సోషల్ మీడియా బృందాలు పని చేస్తున్నాయని నవంబర్ 3 నుంచి ఎన్నికల వ్యయపరిశీలకుల బృందాలు రంగంలోకి దిగుతాయన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడ్ ఉల్లంఘనలు జరిగితే 1950 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘన అంశాలు, లైవ్ ఫొటోలు, వీడియోలు తీసి ఈసీకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మతాలు, ప్రాంతాలు, వ్యక్తులను కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నియోజక వర్గ ఎన్నికల నోడల్ అధికారి, పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, సహాయ వ్యయ పరిశీలకురాలు హేమభాను, ఏఆర్‌వోలు అనితారెడ్డి, ప్రశాంతి, సంపత్, సాయి శ్రీనివాస్, పాల్గొన్నారు.

కరపత్రాలపై వివరాలు, ఫోన్ నంబర్లు తప్పనిసరి

రాజకీయ పార్టీలకు సంబంధించి కరపత్రాలు, పోస్టర్లపై వాటిని ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్ పేరు, మొబైల్ నెంబర్ తదితర వివరాలు అచ్చు వేయాలని జూబ్లీహిల్స్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి రవి సూచించారు. బుధవారం బంజారాహిల్స్‌రోడ్ నెం. 2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో నియోజక వర్గ రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్‌ను ప్రతి రాజకీయ పార్టీకి అందజేశామన్నారు. ప్రచారాలు, పాదయాత్రలు, ర్యాలీలు, సమావేశాలకు సంబంధించిన అనుమతుల కోసం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి సమావేశం వద్దకు తమ బృందాలు వస్తాయని వాటి ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తాయని తెలిపారు. కొత్తగా ఓటు హక్కు పొందే వారు ఫారం-6 నింపి ఈ నెల 31లోగా అందజేయవచ్చునని వారు ఈ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నోడల్ అధికారి, జూబ్లీహిల్స్ ఏసీపీ కె. హరిప్రసాద్, ఏఆర్‌వోలు ఇస్లావత్ సేవానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసిన తర్వాతే పథకాల అమలు

బంజారాహిల్స్: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి, బీసీ బంధు, దళితబంధు తదితర పథకాల లబ్ధిదారులకు చెక్కులు, ప్రొసిడింగ్స్‌కు సిద్ధంగా ఉన్నా ఇవ్వలేకపోతున్నామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బుధవారం ఆయన ఫిలింనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గానికి గృహలక్ష్మి పథకానికి గాను 6 వేల మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ సిద్ధమై తన టేబుల్‌పైనే ఉన్నాయని డిసెంబర్ 6న వాటిని అందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు. చాలామందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని వాటిని కూడా కోడ్ ముగినిస తర్వాత పంపిణీ చేస్తామన్నారు సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందిన వారికి ఇళ్లతో పాటు వివిధ పథకాల చెక్కులను ఇచ్చేది తామేనని మరోసారి స్పష్టం చేశారు. తనపై పూర్తి భరోసా పెట్టుకోవాలన్నారు. ఏ ఒక్కరికి అన్యాయం జరిగనివ్వనని అన్నారు.



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్..

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఏ ఇంటికి వెళ్లినా సమస్యలు చెబుతున్నారని, ఏ వీధి చూసినా ఎన్నో సమస్యలు ఉన్నాయని మరి కొద్దిరోజుల్లోనే మన ప్రభుత్వం రాగానే అన్ని పరిష్కరించుకుందామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల స్కీంలను ప్రజల్లోకి తీసుకు వెళ్లే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె చింతల్‌బస్తీ, బిస్తీవాడ, ఎసీ గాడ్స్ తదితర ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన ఉందని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని స్పష్టమవుతోందని ఆమె పేర్కొన్నారు.



పోలింగ్ స్టేషన్ల పరిశీలన



పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తున్న ఫిలింనగర్ సీఐ రామకృష్ణ, జూబ్లీహిల్స్ ఆర్‌వో రవి తదితరులు

ఫిలింనగర్ : పోలింగ్ స్టేషన్లలో మౌలిక సౌకర్యాలను తెలుసుకునేందుకు బుధవారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఆర్‌వో రవి, ఫిలింనగర్ సీఐ రామకృష్ణ, సిబ్బందితో కలిసి షేక్‌పేట, ఫిలింనగర్ పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, వెలుతురు, గేట్లు, చుట్టు ప్రహరీలను పరిశీలించారు. ఎక్కడెక్కడ సమస్యలున్నాయో వాటిని రికార్డు చేసుకున్నామన్నారు. ర్యాంపులు లేని చోట్ల వాటిని నిర్మించాలని సూచించారు. పోలీస్ సెక్టోరియల్ ఆఫీసర్లు, రెవెన్యూ సెక్టోరియల్ ఆఫీసర్లు, జీహెచ్ఎంసీ సెక్టోరియల్ ఆఫీసర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా...

భూ పరీక్షలపై అవగాహన



మెరీడియన్ స్కూల్‌లో భూ పరీక్ష ప్రాజెక్ట్‌లో పాల్గొన్న ప్రతినిధులు...

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం 7లోని మెరీడియన్ స్కూల్‌లో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశలో భూమిసేవ, ఐసీఏఆర్, ఐఐఆర్‌ఆర్‌ల సహకారంతో సాయిల్ టెస్టింగ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేశారు. విద్యార్థి దశ నుంచే భూపరీక్షలపై అవగాహన కల్పించాలని ప్రధాని మోడీ ఆకాంక్షల నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో భూమి సేవ సీఐవో ప్రశాంత్ మాథూర్, స్కూల్ ప్రిన్సిపాల్ నిషీరాణా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. బంజారాహిల్స్ పోలీసులు రోడ్ నెం. 12లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీసులు వేర్వేరు చోట్ల ఈ తనిఖీలు జరిగాయి.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



దగ్ధమైన వస్తువులు

రహమత్‌నగర్ : బోరబండసైట్1లోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సైట్1 కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మి ఇంట్లో మంగళవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చేలరేగడంతో ఇంట్లోని వారు బయటికి పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో పలు వస్తువులతో పాటు రూ. 4 లక్షల నగదు పూర్తిగా దగ్ధమైందని బాధితురాలు తెలిపారు. బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు డా.వీరప నేని పద్మ సంఘటనా స్థలానికి చేరుకుని నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

1 నుంచి మహా కుంభాభిషేకం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ రామయ్య

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేకం నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సిహెచ్. రామయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్వామివారి సన్నిధిలో బుధవారం ఈవో ఎస్. లావణ్య, ట్రస్ట్ బోర్డు సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. నవంబర్ 1న విద్యాశంకర భారతీ స్వామి చేతుల మీదుగా గోపూజ, ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రదక్షిణ, శాలంగ బలి, గణపతి పూజ, నవగ్రహ మండపారాధన నిర్వహిస్తామన్నారు. మహాగణపతి హోమం, వేదపారాయణాలు, ధ్వజారోహణ ఉంటాయని తెలిపారు. సాయంత్రం శ్రీ మణికంఠ భజన బృందంచే భజన కార్యక్రమాలు, రాత్రి 9 గంటలకు హరివరాసనం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 16 నుంచి డిసెంబర్ 27వ తేదీ వరకు అయ్యప్ప స్వామి మండల పూజా మహోత్సవాలు జరుగుతాయని ఆయన వివరించారు.

ఇద్దరు రౌడీ షీటర్లు బైండ్ ఓవర్



పోలీసుల అదుపులో రౌడీ షీటర్లు

రహమత్‌నగర్ : బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు రౌడీ షీటర్లను బైండ్ ఓవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపారు. కార్మికనగర్‌కు చెందిన నిజమోద్దీన్, సంజయ్‌నగర్‌కు చెందిన అలీ బోరబండ పీఎస్ లో రౌడీ షీటర్లుగా ఉన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వీరు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండేందుకుగాను వారిని అదుపులోకి తీసుకుని బుధవారం నాంపల్లిలోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా వారిని ఏడాది పాటు బైండోవర్ చేసినట్లు తెలిపారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అసాంఘీక కార్యక్రమాలు, బెదిరింపులకు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువత ప్రధాన భూమిక పోషించాలి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



యూత్ కమిటీ ప్రతినిధులకు ఓటర్ లిస్టులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో యవకులు ప్రధాన భూమిక పోషించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి గతంలో కంటే ఎక్కువ మెజారిటీ తీసుకువచ్చేందుకు వారు కృషి చేయాలన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బోరబండ డివిజన్ యూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలు, బోరబండ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. తన గెలుపు ఖాయమని, అయితే గతంలో కంటే ఎక్కువ మెజారిటీ సాధించాలన్నదే తన ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఓటరు లిస్టులకు ఆయా బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లకు అందజేశారు. డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షు డు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, నాయకులు విజయ్‌కుమార్, యూత్ కమిటీ అధ్యక్షుడు బాబారావు, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ విభాగాల అధ్యక్షుడు సర్దార్, ధర్మ, బాబానాయక్, మహిళా నేతలు దేవమణి, సరళ, సూర్యకళ, కవిత, నాగ మణి తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశం..

రహమత్‌నగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం పై చర్చించారు. రహమత్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోట లాంటిదని గుర్తుచేశారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నాయకులు నజీర్, జాఫర్, అరుణ్‌కుమార్, మన్సూర్.ఫయాజ్, షేక్‌చోటు, జబ్బార్, వేముల జగన్, రాకేష్, గఫూర్, విజయ్‌కిరణ్ పాల్గొన్నారు.

15న క్యాట్ షో



పోటీల్లో పాల్గొనే పిల్లిని ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: ది ఫెల్లిస్ క్లబ్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 15న 'క్యాట్ షో' నిర్వహిస్తున్నట్లు మలేషియాకు చెందిన పోటీల న్యాయనిర్ణేత సేన్ అబ్దుల్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్‌సీఐ హైదరాబాద్ ప్రతినిధి అబ్దుల్ మనన్, సక్వేబ్ పాథా, డాక్టర్ మురళిలతో కలిసి వివరాలు వెల్లడించారు.. అత్తాపూర్ లోని పిల్లర్ నెంబర్ 290, హెచ్.ఎఫ్ కన్వెన్షన్‌లో ఈ క్యాట్ షో జరుగుతుందన్నారు. సుమారు 250కి పైగా పిల్లులు పాల్గొంటాయని అందులో 13 బ్రీడ్స్ ఉన్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండే కాకుండా మలేషియా, సింగపూర్, ఉక్రేయిన్, రష్యా, థాయిలాండ్, యూఎస్ నుంచి కూడా పిల్లుల పెంపకందారులు హాజరుకానున్నట్లు తెలిపారు. పిల్లి హెడ్ స్టక్చర్, బాడీ స్టక్చర్, కంటి కలర్, వాటి హెల్త్ కండీషన్, బిహేవియర్ చూసి పాయింట్లు ఇస్తారన్నారు. పెట్ లవర్స్ తప్పకుండా ఈ షోను వీక్షించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి డీటీఎఫ్ మహాసభలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 15,16,17 తేదీల్లో 'ఐదవ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలు' నిర్వహిస్తున్నట్లు మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. ఈ మహాసభలు మహబూబ్‌నగర్ జిల్లా, భగీరథకాలనీ, అన్నపూర్ణ గార్డెన్స్‌లో జరుగుతాయన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాసభల పోస్టర్‌ను డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సోమయ్య, ప్రధానకార్యదర్శి టి.లింగారెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక బాధ్యులు రాఘవాచారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్యం చేసి సమాజంపట్ల ఎలా అవగాహన పెంచాలి అన్న అంశాలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. సమాజాన్ని చైతన్యం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రజాస్వామ్యవ్యవస్థ ప్రమాదంలో ఉన్నప్పుడు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సభలకు భగత్‌సింగ్ అల్లుడు ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిష్టప్ప, డాక్టర్ రామకృష్ణ, వినోదర్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు



కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేస్తున్న రోహిన్ రెడ్డి

బంజారాహిల్స్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఖైరతాబాద్‌డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలపై బంజారాహిల్స్ డివిజన్ ఎన్‌బీటీ నగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు, ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సమస్యలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు బబ్లు, బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షుడు గొల్యాల రాజు, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడు నారికెల నరేష్, రహీం, బైండ్ల శ్రీనివాస్, విష్ణు, పరమేష్ యాదవ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థినులకు బహుమతి ప్రదానం చేస్తున్న పల్లవి అగర్వాల్

వెంగళరావునగర్ : విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని భారత ప్రభుత్వ మహిళా శిశుసంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ పల్లవి అగర్వాల్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాంగణంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లవి అగర్వాల్ మాట్లాడుతూ గతంలో ఆడపిల్లలకు టీచర్లు, నర్సులు లాంటి ఉద్యోగాలు చేస్తే చాలని అనేకమంది తల్లిదండ్రులు భావించి ఆయా రంగాల్లో ప్రోత్సహించేవారన్నారు. అయితే సమాజంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, మహిళా ఆలోచనా విధానంలో కూడా మార్పులు వచ్చాయని ప్రతి ఒక్కరూ అత్యంత ఉన్నతంగా ఎదగాలనే దృక్పథంతో ఉన్నారన్నారు. మహిళ తలచుకుంటే సాధించలేనిది లేదనే వాస్తవాన్ని గ్రహించి సాధారణ ఉద్యోగాలు కాకుండా అత్యున్నతంగా ఎలా ఎదగాలని యోచిస్తున్నారన్నారు. నేటితరం విద్యార్థులు కూడా అదే దిశలో అడుగులు ముందుకు వేస్తూ ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా అంతిమంగా విజయాన్ని అందుకోవాలని సూచించారు. మహిళా శిశుసంక్షేమశాఖ వారికి నిరంతరం అండగా ఉంటుందన్నారు. అనంతరం పది, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీదేవి, జిల్లా సంక్షేమశాఖ అధికారి అక్కేశ్వరరావు, ఉమెన్ వెల్ఫేర్ ఆఫీసర్ తేజస్వినీ తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థినులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ఆవు నెయ్యి ఆరోగ్యానికి శ్రీరామరక్ష



సాక్షి, సిటీబ్యూరో: సృష్టిలో అమ్మ తరువాత అంత గొప్పది గోమాతే అని, అన్ని పోషక పదార్థాల తయారీకి మూలం కూడా గో మాతనే అని..ఆవు నెయ్యి అందుకు గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని ఉదయకృష్ణ ఆవు నెయ్యి సౌత్ ఇండియా హెడ్ రాంచందర్ రావు అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ ప్రతినిధులు షర్మిల, దివాకర్, విష్ణులతో కలిసి ఆ సంస్థ నూతనంగా ఉత్పత్తి చేసిన ఉదయ కృష్ణ నెయ్యిని మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయకృష్ణ నెయ్యి బ్రాండ్ తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఇప్పటికే ప్రాచుర్యం పొందిందని, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభిస్తున్నామని చెప్పారు. శుద్ధమైన, పరిపూర్ణమైన నెయ్యిని అందుబాటులోకి తెస్తున్నామని, ఇది వినియోగదారులకు తప్పకుండా నచ్చుతుందని పేర్కొన్నారు.

మందు బాబులకు జైలు

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యం సేవించి బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరు వాహనదారులను బుధవారం నాంపల్లిలోని ఆరవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. బంజారాహిల్స్ రోడ్ నెం.11కు చెందిన జి. సాగర్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండుసార్లు పట్టుబడగా అతడికి ఏడు రోజుల జైలు, రూ. 3100 జరిమానా విధిస్తూ, మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశారు. యూసుఫ్‌గూడకు చెందిన జె. సతీష్ కూడా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండు సార్లు పట్టుబడటంతో ఆయనకు వారం రోజుల జైలు, రూ. 3100 జరిమానా, మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు.

యువతకు సాధ్యం కానిది లేదు

కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

పంజగుట్ట: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్న తరుణంలో యువత తలచుకుంటే సాధ్యం కానిది లేదని, ఈ 50 రోజులు కష్టపడి దుష్టపాలన అంతం చేద్దామని పలువురు వక్తలు అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ యూత్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్టేట్ యూత్ సమావేశం, యూత్ డిక్లరేషన్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ ముద్దిశెట్టి అజయ్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్.సామేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ .. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని వీరికి ఎంఐఎం తొత్తుగా పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్నదాని కన్నా సమైక్యరాష్ట్రంలో బాగానే బతికామని, ఇప్పుడు ఆత్మగౌరవం లేకుండా, రెండవ తరగతి వారిగా జీవించాల్సి వస్తుందన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అది యువతతోనే సాధ్యమని యువత ముందుకు వచ్చి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. తమ పార్టీ అధినాయకురాలు ప్రియాంకా గాంధీ ఇప్పటికే అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ వేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. యూత్ మానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలలో న్యాయపరమైన అంశాలను తమ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు, లేదా తనకైనా ఇస్తే తమ మేనిఫెస్టోలో పొందుపరుస్తామన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ .. రాష్ట్రంలో యువత భవిష్యత్ కోల్పోయిందని ఉద్యోగం, ఉపాధి కల్పించకపోవడంతో పాటు కనీసం వారి నైపుణ్యాలను పెంచలేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, యువత నైరాశ్యంతో మద్యం, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం, ఉపాధి అనేది ప్రభుత్వాల బాధ్యత అన్నారు. యూత్ డిక్లరేషన్‌పై తెలంగాణ జనసమితి సీరియస్‌గా తీసుకుని దాని అమలుకు ప్రయత్నిస్తుందన్నారు. యువతకు భవిష్యత్ కల్పించే అంశంపై అన్ని పార్టీలు బాధ్యతగా తీసుకోవాలన్నారు. యువత సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న నిర్వహించనున్న రాస్తారోకోను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మహ్మద్‌యాద్, సలీం పాషా, మారేపల్లి కుమార్, సద్ది సందీప్ రెడ్డి, అశోక్ ముదిరాజ్, చంద్రకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జీలుగా నలుగురి పేర్లు సిఫారసు

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు నలుగురు న్యాయవాదుల పేర్లను కేంద్రానికి సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల కొలీజియం మంగళవారం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు చేసిన వారిలో హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నూనేపల్లి హరినాథ్, న్యాయవాది మండవ కిరణ్మయి, ప్రభుత్వ న్యాయవాదిగా వ్యవహరిస్తున్న జగడం సుమతి, న్యాయవాదిగా ఉన్న న్యాపతి విజయ్ ఉన్నారు. ఈ నలుగురి పేర్లకు కేంద్రం ఆమోదముద్ర వేసిన తరువాత ప్రధానమంత్రి కార్యాలయం ద్వారా రాష్ట్రపతికి చేరతాయి. రాష్ట్రపతి ఆమోదముద్ర తరువాత వీరి పేర్లను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీచేస్తుంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరి 22న హైకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా (ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తి) నేతృత్వంలోని కొలీజియం ఏడుగురు న్యాయవాదుల పేర్లను హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు సిఫారసు చేసింది. హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్, యర్రంరెడ్డి నాగిరెడ్డి, ఎన్.రవిప్రసాద్, అశ్వత్థనారాయణ పేర్లను సుప్రీంకోర్టుకు పంపింది. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి కూడా ఈ పేర్లపై తమ అభిప్రాయాలు పంపారు. అనంతరం కేంద్ర హోంశాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ద్వారా రహస్య విచారణ జరిపి ఈ ఏడుగురి వివరాలు తెప్పించుకుంది. ఫిబ్రవరి నుంచి ఈ ఏడుగురి పేర్లు కేంద్రం వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ఈ ఏడుగురి పేర్లను కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టుకు పంపింది. ఈ ఏడుగురి పేర్లపై చర్చించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన కొలీజియం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. అంతకుముందే ఈ ఏడుగురి గురించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో గతంలో న్యాయమూర్తులుగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉన్నవారి అభిప్రాయాలు కూడా తీసుకుంది. మంగళవారం జరిగిన కొలీజియం సమావేశంలో హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్ పేర్లకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులుగా ఈ నలుగురిని నియమించే విషయంలో వీరి నైతికనిష్ఠకు సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి ప్రతికూల నివేదికలు లేవని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నలుగురు హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం అయ్యేందుకు అన్ని రకాలుగా అర్హులని స్పష్టం చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి మాత్రం న్యాపతి విజయ్ విషయంలో ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. ఏడుగురిలో మిగిలిన ముగ్గురి విషయంలో సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం ఏమిటన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు. ప్రస్తుతం హైకోర్టులో సీజేతో సహా 27 మంది న్యాయమూర్తులున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు సిఫారసు చేసిన నలుగురి పేర్లకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 31కి చేరుకుంటుంది.

ఇన్నర్ కేసులో చంద్రబాబుకు తాత్కాలిక ఊరట

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అక్రమాలు, క్విడ్ ప్రో కో ఆరోపణలపై సీఐడీ నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు హైకోర్టు బుధవారం తాత్కాలిక ఊరటనిచ్చింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌లో తదుపరి ముందుకెళ్లొద్దని విజయవాడ ఏసీబీ కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 16వరకు పీటీ వారెంట్ విషయంలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయవద్దని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో తదుపరి ఎలాంటి సమయం ఇచ్చే ప్రసక్తేలేదని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఒకవేళ సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో ఏదైనా కేసులో వాదనలు వినిపించాల్సి ఉంటే ఒక్కరోజు మాత్రమే గడువునివ్వడం సాధ్యమవుతుందని తేల్చి చెప్పారు.

‘రింగ్’ మాస్టర్ అష్ట వంకర్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేశ్‌కు సీఐడీ ప్రశ్నల వర్షం

- ‘ఉప సంఘం’ వ్యవహారంపై ప్రశ్నలకు తడబాటు
- హెరిటేజ్ భూముల అంశంపై ప్రశ్నలకు బిత్తరచూపులు
- కరకట్ట నివాసంపై ప్రశ్నించేసరికి కస్సుబుస్సు
- విలేకరుల సమావేశంలోనూ అదే తీరు
- ‘సాక్షి’పై అసత్య ఆరోపణలతో విషయాన్ని పక్కదారి పట్టించే యత్నం
- ఇతర విలేకరుల ప్రశ్నలకు చిందులు..
- నేనెక్కడికి వెళ్తానో మీకనవసరం అంటూ అసహనం



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఎన్ని వంకర్లు తిప్పారో.. ఆ కేసులో నిందితుడు నారా లోకేశ్ సీఐడీ విచారణలో ప్రశ్నలకు అన్ని వంకర్లు తిరిగారు. చంద్రబాబు కుటుంబం, ఆయన అస్మదీయుల భూము ల విలువ అమాంతంగా పెరిగేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చిన తీరుపై సీఐడీ అధికా రులు అడిగిన సూటి ప్రశ్నలకు లోకేశ్ నేల చూపులు చూశారు. తాను సభ్యుడిగా ఉన్న మంత్రివర్గ ఉప సంఘం ద్వారానే అక్రమాల కథ నడిపిన తీరును సీఐడీ ఆధారాలతో సహా ముందు పెట్టడంతో బిత్తరపోయారు. హెరిటేజ్ భూముల కొనుగోలు, లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట నివాసంపై ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయారు. విచారణకు సహకరించకుండా దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు యత్నించారు.

ఈ కేసులో ఏ–14గా ఉన్న లోకేశ్‌ను సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు వరుసగా రెండో రోజు బుధవారం తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో విచారించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ దర్యాప్తునకు సహకరించకుండా ఉండేందుకు లోకేశ్ అనేక ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ సిట్ బృందం తమదైన శైలిలో కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయన న్యాయవాది సమీప దూరంలో ఉండగా ఆడియో, వీడియో రికార్డింగ్ నిర్వహిస్తూ అధికారులు లోకేశ్‌ను విచారించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ దర్యాప్తునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

అలైన్‌మెంట్ మార్చాలని ఎందుకు ఒత్తిడి చేశారు?

ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు అమరావతి కోర్ కేపిటల్‌పై టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రివర్గ ఉప సంఘం ద్వారా అక్రమాల కథ నడిపిన తీరుపై సీఐడీ లోకేశ్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. జూనియర్ మంత్రి అయినప్పటికీ లోకేశ్‌కు ఉప సంఘంలో స్థానం కల్పించడంపై మొదటగా ప్రశ్నించింది. పేరుకు మంత్రివర్గ ఉప సంఘం అయినప్పటికీ ఇతర సభ్యులకంటే అందులో లోకేశ్, నారాయణదే హవా అని, భూ సమీకరణ, ఇన్నర్‌రింగ్ రోడ్డుకు భూసేకరణపై వీరే కీలకంగా వ్యవహరించినట్టు సీఐడీ ఆధారాలు సేకరించింది. వాటిని లోకేశ్‌కు చూపిస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని సీఆర్‌డీఏ అధికారులపై ఎందుకు ఒత్తిడి చేశారని ప్రశ్నించింది. తామేమీ ఒత్తిడి చేయలేదని లోకేశ్ బుకాయించారు. మంత్రివర్గ ఉపసంఘం, టీడీపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే అలైన్‌మెంట్‌ను మార్చినట్లు అప్పటి సీఆర్‌డీఏ అధికారులు వాంగ్మూలం ఇచ్చిన అంశాన్ని సీఐడీ అధికారులు ప్రస్తావించడంతో లోకేశ్ షాక్ తిన్నారు. దాంతో ఆయన నోట మాట రాలేదని సమాచారం. వెంటనే తన న్యాయవాదితో సంప్రదించి చెబుతానని చెప్పారు. న్యాయవాదితో మాట్లాడిన తరువాత కూడా ఆయన ఈ అంశంపై సమాధానం దాట వేసేందుకే ప్రయత్నించారు. ముందుగానే సీఆర్‌డీఏ అధికారులతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించి, దానినే మాస్టర్‌ప్లాన్‌లో చేర్పించి సింగపూర్‌కు చెందిన కన్సల్టెన్సీ ద్వారా ఆమోదింపజేయడం అంటే అక్రమమే కదా అని అధికారులు ప్రశ్నించడంతో లోకేశ్ మౌనంగా ఉండిపోయారు. మంత్రివర్గ ఉప సంఘం వ్యవహారం అంతా బూటకమని, ఆ ముసుగులో చంద్రబాబు, నారాయణ, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతంగా పెంచుకున్నారని సీఐడీ కీలక ఆధారాలు చూపించడంతో లోకేశ్ నిశ్చేష్టుడయ్యారు.

కరకట్ట నివాసం అంశంపై కస్సుబుస్సు

లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట బంగ్లాపై సీఐడీ ప్రశ్నించడంతో లోకేశ్ తత్తరపాటుకు గురై అధికారులపై కస్సుబుస్సులాడారు. ఆ ఇంటికి తాము అద్దె చెల్లించామన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు చూపిస్తూ ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌ను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. దర్యాప్తులో భాగంగా ఏ పత్రాలనైనా సంబంధిత శాఖలను సంప్రదించి తీసుకునే వెసులుబాటు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు ఉందనే అవగాహన ఆయనకు లేకపోవడం విడ్డూరం. లింగమనేని రమేశ్ ఆ కరకట్ట నివాసాన్ని ఉచితంగా ఇచ్చానని ఓసారి, కాదు దేశభక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని మరోసారి చెప్పిన విషయాలను అధికారులు ప్రస్తావించారు. దాంతో అసలు తనకు ఆ కరకట్ట నివాసం గురించి తెలియదని లోకేశ్ బుకాయించారు. మంత్రి హోదాలో మీరు నివసించిన ఇంటి గురించి తెలియదా అని అధికారులు రెట్టించి అడిగేసరికి సమాధానం దాటవేశారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి మరికొన్ని కీలక వ్యవహారాలపై లోకేశ్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. కానీ ఆయన నుంచి సరైన సమాధానం రాలేదు. వీలైనంతవరకు దర్యాప్తునకు సహకరించకుండా విషయాన్ని పక్కదారి పట్టించేందుకే లోకేశ్ యత్నించారు. పలువురు అధికారుల పేర్లను ప్రస్తావిస్తూ వారిని ప్రశ్నించాలని సీఐడీకి సూచించడం హాస్యాస్పదంగా మారింది. దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన నిందితుడు తిరిగి ఇతరలను ప్రశ్నించాలని చెబుతుండటం విడ్డూరంగా ఉందని సీఐడీవర్గాలు వ్యాఖ్యానించాయి. అవసరమైతే మరోసారి విచారణకు రావల్సి ఉంటుందని సీఐడీ అధికారులు లోకేశ్‌కు చెప్పి బుధవారం విచారణ ప్రక్రియను ముగించారు.

హెరిటేజ్ భూముల అంశంపై అసహనం..

- ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్ భూములు కొన్న అంశంపై సీఐడీ సూటి ప్రశ్నలకు లోకేశ్ తీవ్ర అసహనానికి గురయ్యారు. ఏ ప్రాతిపదికన ఆ ప్రాంతంలో భూములు కొనాలని హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అధికారులు వేసిన ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమివ్వలేదు. ప్రస్తుతం తాను హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా లేనని, ఆ విషయాలు తనకు తెలియవని అన్నారు. భూములు కొనాలని తీర్మానించిన సమయంలో మీరే డైరెక్టర్‌గా ఉన్నారు కదా అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేయడం గమనార్హం.

సంబంధం లేని ప్రశ్నలువేశారు: లోకేశ్

సీఐడీ అధికారులు తనకు ఏమాత్రం సంబంధం లేని ప్రశ్నలు వేశారని లోకేశ్ చెప్పారు. రెండో రోజు విచారణ అనంతరం సీఐడీ కార్యాలయం బయట మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని ఈ విచారణ ద్వారా తనకు తెలిసిందన్నారు. కరకట్ట నివాసానికి తన తల్లి అద్దె చెల్లించారన్నారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. సాక్షి పత్రికలో షేర్లను కొందరు కొన్నట్లుగా తమ హెరిటేజ్ ఫుడ్స్ షేర్లను లింగమనేని కొనలేదని వ్యాఖ్యానించారు.

‘సాక్షి’ ప్రశ్నలకు తత్తరపాటు

ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంలో లోకేశ్ పాత్రపై ‘సాక్షి’ ప్రతినిధులు ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. సాక్షి పత్రికపై అసత్య ఆరోపణలు చేసి విషయాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించారు. కానీ సాక్షి ప్రతినిధులు సూటి ప్రశ్నలు సంధించడంతో తత్తరపాటుకు గురయ్యారు. ఇతర మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. లోకేశ్‌తో సాక్షి, ఇతర మీడియా ప్రతినిధుల సంభాషణ ఇలా సాగింది..

- **సాక్షి:** మీరు మంత్రివర్గ ఉప సంఘంలో సభ్యుడయ్యాకే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారని, హెరిటేజ్‌ఫుడ్స్‌కు భూములు కొన్నారన్న అభియోగంపై స్పందన ఏమిటి?
- **లోకేశ్:** మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడిగా నేను ఒత్తిడి చేసి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశానని సీఐడీ అంటోంది. కానీ అది నా శాఖకు ప్రమేయం లేని అంశం. అదే చెప్పా.
- **సాక్షి:** ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉన్న కంతేరు వైపు ఎందుకు మళ్లింది?
- **లోకేశ్:** సీఐడీ అధికారులు నాకు బాహుబలి సినిమా చూపించారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ గూగుల్ మ్యాప్ చూపించి ప్రశ్నించారు. ఆ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని నాకు అర్థమైంది.
- **సాక్షి:** క్విడ్‌ప్రోకో కిందే లింగమనేని మీకు కరకట్ట బంగ్లా ఇచ్చారని సీఐడీ అభియోగం మోపింది కదా?
- **లోకేశ్:** మాకు క్విడ్ ప్రో కో అలవాటు లేదు. క్విడ్ ప్రో కో ద్వారా సాక్షి మీడియాలో పెట్టుబడులు పెట్టినట్టు మా హెరిటేజ్ ఫుడ్స్‌లో ఎవరూ పెట్టుబడులు పెట్టలేదు.
- **సాక్షి:** మరి మీకు మాత్రమే లింగమనేని ఆ కరకట్ట బంగ్లాను ఎందుకు ఇచ్చారు?
- **లోకేశ్:** ఆ ఇంటికి మేము అద్దె చెల్లిస్తున్నాం. ప్రభుత్వానికి ఆ మేరకు లేఖ కూడా రాశాం.
- **సాక్షి:** అదే నిజమైతే 2019కు ముందు ఎందుకు అద్దె చెల్లించలేదు?
- **లోకేశ్:** (వెంటనే సమాధానం చెప్పలేక మౌనం వహించారు. కాసేపటికి తేరుకుని..) ఆ విషయం నాకు తెలీదు. నాకు తెలిసినంతవరకు ఇప్పుడు అద్దె చెల్లిస్తున్నాం. మా అమ్మ ఐటీ రిటర్న్ రికార్డులు సీఐడీకి ఎలా వచ్చాయి? దీనిపై న్యాయపోరాటం చేస్తాం.
- **సాక్షి:** మీ సన్నిహితుడు కిలారు రాజేశ్ ఎందుకు పరారయ్యారు?
- **లోకేశ్:** ఆయన గురించి నాకేం తెలుస్తుంది? ఎక్కడ ఉన్నారో నాకు తెలీదు
- **ఇతర మీడియా ప్రతినిధులు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జైలుకు పంపారు అని మీరు అంటున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ విధించేది కోర్టులు కదా?
- **లోకేశ్:** ఈ కేసులో ఎఫ్‌ఐఆర్ వేసింది జగన్ ప్రభుత్వమే.అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు.
- **మీడియా ప్రతినిధులు:** మీరు మళ్లీ ఢిల్లీ వెళ్లిపోతారా?
- **లోకేశ్:** నేను ఎక్కడికి వెళ్తానో మీకు చెప్పాలా? అది మీకు అనవసరం. నేను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని. ఎక్కడికి వెళ్లినా షెడ్యూల్ ఇస్తా.

నగర వార్తలు

నిప్పంటుకుని బస్సు దగ్ధం

కాప్రా: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఓ బస్సు దగ్ధమైన ఘటన కాప్రా డివిజన్‌లోని విజయ స్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. ఖాళీ ప్రదేశంలో ఉన్న బస్సులో ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఎగిసిపడ్డాయి. చూస్తుండగానే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఎగిసిపడుతున్న మంటలను స్థానికుల సహాయంతో అదుపుచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. గత కొన్ని నెలలుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడ బస్సును వదిలివెళ్లారని స్థానికులు చెబుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని చెబుతున్నారు స్థానికులు. ఎవరో సిగరేట్ తాగి అక్కడ వేస్తే మంటలు చెలరేగి బస్సు దగ్ధమైనట్లుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఈ బస్సు ఎవరిది, ఎందుకు అక్కడ వదిలివెళ్లారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇన్నాళ్లు లేనిది ఇప్పుడే ఉన్నట్లుండి బస్సులో మంటలు చెలరేగడమేంటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యాన శాఖలో ఖాళీల భర్తీకి కృషి చేయాలి



ఏజీవర్సిటీ: ఉద్యాన వన శాఖలో ఖాళీలను భర్తీ చేసేందుకు కృషి చేయాలని కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం విద్యార్థులు బుధవారం టీపీసీసీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యానవన అధికారి, సహాయ ఉద్యానవన అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ 9 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యాన నిరుద్యోగుల సమస్యలు చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన విద్యార్థి నాయకుడు నాగులపల్లి సంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు తనిఖీల్లో బంగారం, నగదు స్వాధీనం

కూకట్‌పల్లి: ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్ మంగళహాట్‌కు చెందిన అశోక్ నుంచి వజ్రాలు, రెండు కిలోల 311 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎల్లమ్మ బండలో దత్తాత్రేయనగర్ కాలనీకి చెందిన ద్వారకా ప్రసాద్ అనే వ్యక్తి నుంచి రూ.3.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా వీరిద్దరు నగల వ్యాపారం చేస్తుంటారని తెలుస్తోంది.

సంపన్నుల నగరం

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ధనవంతులు కలిగి ఉన్న నగరాల్లో హైదరాబాద్ కూడా టాప్ 5లో నిలిచింది. ముంబై (328), ఢిల్లీ(199), బెంగళూర్(100)ల తర్వాత అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా హైదరాబాద్ స్థానం దక్కించుకుంది. హురున్ ఇండియా అనే సంస్థ తాజాగా వెల్లడించిన ఈ జాబితాలో నగరానికి చెందిన అరడజను మంది పైగా సంపన్నులు దేశంలోనే రిచెస్ట్ బిలియనీర్లకు సంబంధించిన టాప్ 100 జాబితాలో జేరారు.

దినదినాభివృద్ధి చెందుతున్న సంపన్నులు...

గత కొంత కాలంగా నగరం సంపన్నుల జాబితాలో సంఖ్యాపరంగా తన స్థానాన్ని మెరుగుపరచుకుంటూనే ఉంది. ఎదుగుదలే తప్ప వెనుకడుగు లేదన్నట్టుగా ముందడుగు వేస్తోంది. సరిగ్గా మూడేళ్ల క్రితం హురున్ ఇండియా విడుదల చేసిన జాబితాలో నగరం నుంచి వేల కోట్లు సంపద దాటిన వారి సంఖ్య 51 కాగా... తాజా జాబితాలో ఆ సంఖ్య 87కి పెరగడం గమనార్హం. అదే విధంగా మూడేళ్ల క్రితం నగరం నుంచి నెంబర్ వన్ స్థానంలో ఉన్న దివీస్ ల్యాబ్స్ అధినేత మురళీ దివి తాజా జాబితాలో కూడా రూ.55,700 కోట్లతో.తన అగ్రస్థానాన్ని కొనసాగించారు. రెండవ స్థానంలో నిలిచినప్పటికీ, ఏకంగా 196శాతం ఎదుగుదలతో మేఘా ఇంజనీరింగ్ సంస్థకు చెందిన పిచ్చిరెడ్డి (రూ.37,300 కోట్లు) పివి కృష్ణారెడ్డి(రూ.37.800 కోట్లు) వేగవంతమైన వృద్ధిలో అగ్రస్థానంలో నిలిచారు.

అగ్రస్థానం ఫార్మాదే...

నగరం నుంచి సంపన్నుల జాబితాలో స్థానం దక్కించుకున్న సంపన్నుల్లో దివీస్ ల్యాబ్స్, హెటిరో, అపోలో తదితర సంస్థలతో...ఫార్మా రంగమే అత్యధిక సంపదను సృష్టిస్తున్నట్టుగా వెల్లడవుతోంది. హైదరాబాద్ ప్రధానమైన సంపద కేంద్రంగా వేగంగా అవతరిస్తోందని, దీనికి వ్యాపార వృద్ధికి గాను 83శాతం మంది నగరాన్ని ఎంచుకోవడమే నిదర్శనమని హురున్ ఇండియా ఛీఫ్ రిసెర్చర్ అనాస్ రహ్మాన్ జునైద్ అంటున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సంపన్నుల్లో 24శాతం ఫార్మా రంగం నుంచే ఉన్నారని, 13 శాతంతో నిర్మాణ–ఇంజనీరింగ్ రంగం నుంచి ఉన్నారని ఆయన చెబుతున్నారు. అంతేకాకుండా నగరం నుంచి అత్యధికంగా మరికొందరు కొత్త వ్యాపారవేత్తలు సైతం ఈ జాబితాలో చోటు సంపాదించడం గమనార్హం అని అటున్నరాయన.

టాప్–5లో హైదరాబాద్



సమస్యలు పరిష్కరించే పార్టీకే మద్దతు



డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్న మున్నూరు కాపు ప్రతినిధులు

పంజగుట్ట: జనాభాలో 25 శాతం ఉన్న మున్నూరు కాపులకు ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతీ సంవత్సరం 5 లక్షల కోట్లు కేటాయిస్తామని స్పష్టమైన హామీ ఇస్తారో వారికే తమ సంపూర్ణ మద్దతు అని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం మహిళా అధ్యక్షురాలు బండారి లత, ఆర్.వీ.మహేందర్ కుమార్‌తో కలిసి మాట్లాడుతూ.. జనాభా పరంగా ఎంతో అధికంగా ఉన్నప్పటికీ అన్ని పార్టీలు కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన అదే నిష్పత్తిలో అన్ని పార్టీలు 18 నుండి 22 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పటికే 10 సీట్లు ప్రకటించిందని మరో 5 సీట్లు ప్రకటించాలని అందులో ముఖ్యంగా గోషామహల్ టిక్కెట్ ఆర్.వీ.మహేందర్ కుమార్‌కు ప్రకటించాలని కోరారు. మహిళలకు కూడా రెండు టిక్కెట్లు ఇవ్వాలన్నారు. వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా ఉన్న మున్నూరు కాపులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రకటించాలన్నారు. సమావేశంలో సూర్యచందర్, విష్ణుమూర్తి, వాసాల వెంకట్, నర్సింగ్ రావు, శివకుమార్, హరికృష్ణ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ గుంతలో పడి బాలుడికి తీవ్ర గాయాలు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు
- 24గంటలు దాటితే గాని చెప్పలేమన్న వైద్యులు





జీడిమెట్ల: ఆడుకుంటూ ఓ బాలుడు ప్రమాదవశాత్తు లిఫ్ట్ గుంతలో పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పురుషోత్తం బతకుదెరువు కోసం నగరానికి వచ్చి టీఎస్‌ఐఐసీ కాలనీలో ఓ గుడిసెలో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా పురుషోత్తం కుమారుడు నవదీప్(5) బుధవారం సాయంత్రం వారు ఉంటున్న గుడిసె ఆవరణలో ఆడుకుంటున్నాడు.

- అదే ప్రాంతంలో కాలనీకోసం కమ్యూనిటీహాల్‌ను నిర్మిస్తున్నారు. నిర్మాణం వద్ద లిఫ్ట్ కోసం గుంత తీసి ఉంచారు అందులో వర్షానికి నీరు వచ్చి చేరింది. అదే ప్రాంతంలో ఆడుకుంటున్న నవదీప్ ప్రమాదవశాత్తు గుంతలో పడి నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన నవదీప్ తండ్రి చుట్టు పక్కల వారి సహాయంతో బాలుడిని నీటిలో నుంచి బయటకు తీశారు.

సీపీఆర్ చేసిన జీడిమెట్ల ఎస్సై

విషయం తెలుసుకున్న జీడిమెట్ల ఠాణా ఎస్సై అంజనేయులు వెంటనే సంఘటనా స్థలికి వెళ్లారు. బాలుడిలో ఎలాంటి చలనం లేకపోవడంతో బాలుడికి 10 నిమిషాల పాటు సీపీఆర్ నిర్వహించాడు. అనంతరం బాలుడిని దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. 24గంటలు దాటితే గాని పరిస్థితి చెప్పలేమని డాక్టర్లు తెలిపారు.

నూతన ఆవిష్కరణలతో ఈ మట్టి రుణం తీర్చుకోండి

శంషాబాద్ రూరల్: ఔషధ పరిశోధకులు నూతన ఆవిష్కరణలు చేసి ఈ మట్టి రుణం తీర్చుకోవాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ యువతకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పెద్దషాపూర్‌లో ఉన్న ప్రతాపనరేందర్‌రెడ్డి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన విద్యార్థుల అవగాహన సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తరగతి గదుల నుంచే భవిష్యత్ సమాజానికి సంబంధించి పరిశోధనలకు ప్రాణం పోయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాఠ్యాంశాలతో పాటు బయటి ప్రపంచాన్ని చదువగలిగితేనే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలు సమాజానికి ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫార్మసీ కళాశాలల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.రామదాస్, వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపానాగేశ్వర్‌రావు, కళాశాల చైర్మన్ టి.రమేష్‌బాబు, కార్యదర్శి నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఇబ్రహీం, రామానందతీర్థ గ్రామీణ విద్యా సంస్థ మాజీ డైరక్టర్ నారాకిశోర్, ఇండియన్ ఫార్మాసూటికల్ అసోసియేషన్ కమ్యూనిటి డివిజన్ అధ్యక్షురాలు కె.శివాంతిక, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జూలూరి గౌరీశంకర్ తదితరులు

ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్న సంస్కరణలు



చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైల్‌లో సమావేశానికి హజరైన జైళ్లశాఖ ఐజీ మురళీబాబు

కుషాయిగూడ: తెలంగాణ జైళ్లశాఖ అమలు చేస్తున్న సంస్కరణలు ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని జైళ్లశాఖ ఐజీ మురళీబాబు అన్నారు. బుధవారం చర్లపల్లి ఓపెన్ ఎయిర్‌జైల్‌లో జరిగిన జైళ్లశాఖ హైదరాబాద్ రేంజ్ సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఖైదీలను సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు జైళ్లశాఖ విశేష కృషి చేస్తోందన్నారు. ఆ సంస్కరణల ఫలితంగా నేడు ఖైదీల్లో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఖైదీలు జైలు జీవితం అనంతరం కూడా స్వశక్తిపై నిలిచేలా ఉపాధి శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పరిశ్రమల నిర్వహణతో ఆర్థికంగా వృద్ధి చెందడంతో పాటుగా ఖైదీలకు ఉపాధి మార్గాలు చూపుతున్నట్లు తెలిపారు. తెలంగాణ జైళ్లశాఖ అమలు చేస్తున్న సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆ దిశగా కృషి చేసి తెలంగాణ జైళ్లశాఖ కీర్తి ప్రతిష్టలను నలుమూలలా చాటలన్నారు. అనంతరం ఓపెన్ ఎయిర్ జైల్‌లోని కొలనులో చేపలను వదిలారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్‌రాయ్, కళాసాగర్, శివకుమార్‌గౌడ్, వెంకటలక్ష్మీతో పాటుగా పలువురు అధికారులు పాల్గొన్నారు.

సాహిత్యపు తొలి అడుగు జాడ గురజాడ రచనలు



మాట్లాడుతున్న జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు

చిక్కడపల్లి: అభ్యుదయ సాహిత్యపు తొలి అడుగు జాడ గురజాడ రచనలు అని పూర్వ న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త, కవి గురజాడ అప్పారావు యాదిలో శీర్షికన ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. నాటి దురాచారాలను ఖండించేలా కన్యాశుల్కం నాటకానికి ఒక ప్రత్యేక స్థలం ఉందన్నారు. బాల్య వివాహాలను రూపుమాపాలనే ఉద్దేశంతో పుత్తడి బొమ్మ పూర్ణమ్మ పద్యం, దేశభక్తిని పెంపొందించేలా దేశమంటే మట్టికాదోయ్ కవితను రాశారన్నారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయుడు గురజాడ అప్పారావు అని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు చిక్కారామదాసు, బండి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఈ ఏడాది మనదేశంలో జీ 20 సదస్సులు జరిగాయి. దేశదేశాల ప్రతినిధులు మనదేశంలో అడుగు పెట్టారు. వారికి మనదేశం గురించి సరళంగా వివరించాలి. ఆ వివరణ మనకు గర్వకారణంగా సమగ్రంగా ఉండి తీరాలి. అందుకు ఒక గిఫ్ట్ బాక్స్‌ను రూపొందించారు విశాల రెడ్డి. మిల్లెట్ బ్యాంకు స్థాపకురాలిగా తన అనుభవాన్ని జోడించారు. మన జాతీయ పతాకాన్ని గర్వంగా రెపరెపలాడించారు.



జి-20 ప్రతినిధులకు భారతీయ సంస్కృతి, కళలు, చిరుధాన్యాల వంటల గురించి వివరిస్తున్న విశాలరెడ్డి

విశాల ప్రపంచం

విశాలాక్షి ఉయ్యాల. చిత్తూరు జిల్లాలో ముల్లూరు కృష్ణాపురం అనే చిన్న గ్రామం ఆమెది. ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరైన జీ 20 సదస్సులో సమన్వయకర్తగా వ్యవహరించారు. మనదేశంలో విస్తరించిన అగ్రికల్చర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్, కళావారసత్వాలను కళ్లకు కట్టారు. అంత గొప్ప అవకాశం ఆమెకు బంగారు పళ్లెంలో పెట్టి ఎవ్వరూ ఇవ్వలేదు. తనకు తానుగా సాధించుకున్నారు. 'ఆడపిల్లకు సంగటి కెలకడం వస్తే చాలు, చదువెందుకు' అనే నేపథ్యం నుంచి వచ్చారామె. 'నేను బడికెళ్తాను' పోరాట జీవితంలో ఆ గొంతు తొలిసారి పెగిలిన సమయమది. సొంతూరిలో ఐదవ తరగతి పూర్తయిన తర్వాత మండల కేంద్రంలో ఉన్న హైస్కూల్‌కి వెళ్లడానికి ఓ పోరాటం. కాళ్లకు చెప్పుల్లేకుండా పదికిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకున్నారు. ఆ తర్వాత కాలేజ్... కుప్పంలో ఉంది. రోజూ ఇరవై- ఇరవై నలభై కిలోమీటర్ల ప్రయాణం. డిగ్రీ కర్నాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో. అప్పటికి ఇంట్లో పోరాడి కాలేజ్‌కి వెళ్లడానికి ఒక సైకిల్ కొనిపించుకోగలిగారామె. ప్రయాణ దూరం ఇంకా పెరిగింది. మొండితనంతో అన్నింటినీ గెలుస్తూ వస్తున్నప్పటికీ విధి ఇంకా పెద్ద విషమ పరీక్ష పెట్టింది. తల్లికి అనారోగ్యం. క్యాన్సర్‌కి వైద్యం చేయించడానికి బెంగుళూరుకు తీసుకువెళ్లడం, డాక్టర్‌లతో ఇంగ్లిష్‌లో మాట్లాడగలిగిన చదువు ఉన్నది ఇంట్లో తనకే. బీఎస్సీ సెరికల్చర్ డిస్‌కంటిన్యూ చేసి అమ్మను చూసుకుంటూ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ డిస్టెన్స్‌లో బీఏ చేశారు. అమ్మ ఆరోగ్యం కోసం పోరాటమే మిగిలింది, అమ్మ దక్కలేదు. ఆమె పోయిన తర్వాత ఇంట్లో వాళ్లు ఏడాది తిరక్కుండా పెళ్లి చేసేశారు. మూడవ నెల గర్భిణిగా పుట్టింటికి రావాల్సి వచ్చింది. ఎనిమిది నెలల బాబుని అక్క చేతిలో పెట్టి హైదరాబాద్‌కు బయలుదేరారు విశాలాక్షి ఉయ్యాల. 'తొలి ఇరవై ఏళ్లలో నా జీవితం అది'... అంటారామె. 'మరో ఇరవై ఏళ్లలో వ్యక్తిగా ఎదిగాను, మూడవ ఇరవైలో వ్యవస్థగా ఎదుగుతున్నా'నని చెప్పారామె.



హైదరాబాద్ నిలబెట్టింది!

"చేతిలో పదివేల రూపాయలతో నేను హైదరాబాద్‌లో అడుగు పెట్టిన నాటికి ఈవెంట్స్ రంగం వ్యవస్థీకృతమవుతోంది. ఈవెంట్స్ ఇండస్ట్రీస్ కోర్సులో చేరిపోయాను. ఇంగ్లిష్ భాష మీద పట్టుకోసం బ్రిటిష్ లైబ్రరీ, రామకృష్ణ మఠం నుంచి పుస్తకాలు తెచ్చుకుని చదివేదాన్ని. మొత్తానికి 2004లో నెలకు మూడు వేల జీతంతో ఈవెంట్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరాను. ఆ తర్వాత నోవాటెల్‌లో ఉద్యోగం నా జీవితానికి గొప్ప మలుపు. ప్రపంచస్థాయి కంపెనీలలో ఇరవైకి పైగా దేశాల్లో పని చేయగలిగాను. నా పేరుకు కూడా విశాలత వచ్చింది చేసుకున్నాను. హైదరాబాద్‌లో రహగిరి డే, కార్ ఫ్రీ డే, వన్ లాక్ హ్యాండ్స్ వంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించాను. ప్రదేశాలను మార్కెట్ చేయడంలో భాగంగా హైదరాబాద్‌ని మార్కెట్ చేయడంలో భాగస్వామినయ్యాను. ఒక ప్రదేశాన్ని మార్కెట్ చేయడం అంటే ఆ ప్రదేశంలో విలసిల్లిన కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్ అన్నింటినీ తెలుసుకోవాలి, వచ్చిన అతిథులకు తెలియచెప్పాలి. అలాగే రోడ్ల మీద ఉమ్మడం, కొత్తవారి పట్ల దురుసుగా ప్రవర్తించడం వంటి పనులతో మన ప్రదేశానికి వచ్చిన వ్యక్తికి చేదు అనుభవాలు మిగల్చకుండా పౌరులను సెన్సిటైజ్ చేయాలి. ఇవన్నీ చేస్తూ నా రెండవ ఇరవై ముగిసింది. అప్పుడు కోవిడ్ వచ్చింది. హాలిడే తీసుకుని మా ఊరికి వెళ్లాలనిపించింది. అప్పుడు నా దగ్గరున్నది పదివేలు మాత్రమే. నాకు అక్కలు, అన్నలు ఏడుగురు. నా కొడుకుతోపాటు వాళ్ల పిల్లలందరినీ చదివించాను. అప్పటికి నేను పెట్టిన స్టార్టప్ మనుగడ కూడా ప్రశ్నార్థకమైంది. పదివేలతో వచ్చాను, ఇరవై ఏళ్ల తర్వాత పదివేలతోనే వెళ్తున్నాను... అనుకుంటూ మా ఊరికెళ్లాను.

ఊరు కొత్త దారిలో నడిపించింది!

నా మిల్లెట్ జర్నీ మా ఊరి నుంచే మొదలైంది. మా అక్క కేజీ మిల్లెట్స్ 15 రూపాయలకు అమ్మడం నా కళ్ల ముందే జరిగింది. అవే మిల్లెట్స్ నగరంలో యాభై రూపాయలు, వాటిని కొంత ప్రాసెస్ చేస్తే వంద నుంచి రెండు- మూడు వందలు, వాటిని రెడీ టూ కుక్‌గా మారిస్తే గ్రాములకే వందలు పలుకుతాయి. తినే వాళ్లకు పండించే వాళ్లకు మధ్య ఇంత అగాథం ఎందుకుంది... అని ఆ అఖాతాన్ని భర్తీ చేయడానికి నేను చేసిన ప్రయత్నమే మిల్లెట్ బ్యాంక్. ఈ బ్యాంక్‌ను మా ఊరిలో మొదలు పెట్టాను. ఒక ప్రదేశం గురించి అక్కడి అగ్రికల్చర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్ అన్నీ కలిస్తేనే సమగ్ర స్వరూపం అవగతమవుతుంది. నేను చేసింది అదే. మా మిల్లెట్ బ్యాంకు జీ 20 సదస్సుల వరకు దానంతట అదే విస్తరించుకుంటూ ఎదిగింది. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, చేర్యాల పెయింటింగ్స్, ఉత్తరాది కళలు, మన రంగవల్లిక... అన్నింటినీ కలుపుతూ ఒక గిఫ్ట్ బాక్స్ తయారు చేశాను. ప్రతినిధులకు, వారి భాగస్వాములకు భారతదేశం గురించి సమగ్రంగా వివరించగలిగాను. జీ20 ద్వారా ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చుకున్న నా మిల్లెట్ బ్యాంకు మరింతగా వ్యవస్థీకృతమై ఒక అమూల్‌లాగా ఉత్పత్తిదారుల సహకారంతో వందేళ్ల తర్వాత కూడా మనగలగాలనేది నా ఆకాంక్ష. మిల్లెట్ బ్యాంకుకు అనుబంధంగా ఓ ఇరవై గ్రీస్ బాక్స్‌లు, సీడ్ బ్యాంకులు కూడా ఏర్పాటు చేయాలి. రైతును తన గింజలు తానే సిద్ధం చేసుకోగలిగినట్లు స్వయంపోషకంగా మార్చాలనేది రైతు బిడ్డగా నా కోరిక" అని మిల్లెట్ బ్యాంకు, సీడ్ బ్యాంకు స్థాపన గురించి వివరించారు విశాలరెడ్డి.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: ఎస్. ఎస్. ఠాకూర్

స్త్రీ 'శక్తి'కి పురస్కారం

టీసీఈఐ (తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ) నిర్వహిస్తున్న 'స్త్రీ శక్తి అవార్డ్స్ 2023' అవార్డు కమిటీకి గౌరవ సభ్యురాలిని. ఈ నెల 17వ తేదీన హైదరాబాద్, గచ్చిబౌలిలో పురస్కార ప్రదానం జరుగుతుంది. గడచిన ఐదేళ్లుగా స్త్రీ శక్తి అవార్డ్స్ ప్రదానం జరగనుంది. ఇప్పటి వరకు తెలంగాణకు పరిమితమైన ఈ అవార్డులను ఈ ఏడాది జాతీయస్థాయికి విస్తరించాం. పదిహేనుకు పైగా రాష్ట్రాలతోపాటు మలేసియా, యూఎస్‌లలో ఉన్న భారతీయ మహిళల నుంచి కూడా ఎంట్రీలు వచ్చాయి. అర్హత కలిగిన ఎంట్రీలు 250కి పైగా ఉండగా వాటిలో నుంచి 50 మంది అవుట్ స్టాండింగ్ ఉమెన్ లీడర్స్ పురస్కారాలందుకుంటారు. జీవితంలో ఎదురైన సవాళ్లను ఎలా ఎదుర్కొన్నారు, ఆత్మస్థయిర్యం కోల్పోకుండా ముందుకు సాగిన వైనం, వారు సాధించిన విజయాలు- చేరుకున్న లక్ష్యాలు, ఎంతమందికి ఉపాధినిస్తున్నారు, వారి భవిష్యత్తు ప్రణాళికలు కార్యాచరణ ఎలా ఉన్నాయనే ప్రమాణాల ఆధారంగా విజేతల ఎంపిక ఉంటుంది.

– విశాల రెడ్డి ఉయ్యాల
ఫౌండర్, మిల్లెట్ బ్యాంకు

నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

ఆశాలత చకచకా ఐదు నిమిషాల్లో వంట ముగుస్తుంది. ఇంత సులువుగా హాయిగా వండొచ్చా అనిపిస్తుంది వీడియో చూస్తే! కాని ఆమెకు చూపు లేదు. ఫుడ్ వ్లోగర్‌గా ఇన్‌స్టాలో లక్ష, యూ ట్యూబ్‌లో రెండు లక్షల మంది ఫాలోయెర్లను సంపాదించుకుంది. కొత్తిమీర పచ్చడి నుంచి రొయ్యల వేపుడు వరకూ ఆమె వంటలకు డిమాండ్. కళ్లు లేని వారు ఇన్‌స్పయిర్ చేయగలరు అంటుందామె. కాసర్‌గోడ్‌కు చెందిన ఆశాలత తెలుసుకోదగ్గ వ్యక్తి.

రుచికి చూపెందుకు?





ఆశాలత

నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం. అంటే దృష్టి కలిగి ఉన్నందుకు ఎంత జాగ్రత్తగా కాపాడుకోవాలో ఎరుక తెచ్చుకోవాల్సిన దినం. దృష్టి లేని వారికి సమాజంలో అందాల్సిన సౌలభ్యాలు, అవకాశాల గురించి చైతన్యం కలిగించుకోవాల్సిన దినం. దృష్టి లేకపోయినా తమ జీవన సమరాన్ని గొప్పగా సాగిస్తుంటే అందరం కలిసి ముందుకు సాగుదాం అని చెప్పాల్సిన దినం. పరస్పరం స్ఫూర్తి పొందాల్సిన దినం. కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాలో రావణేశ్వరంలో నివసించే ఆశాలతను చూస్తే ఆమె నుంచి పొందాల్సిన స్ఫూర్తి, ఆమెకు ఇవ్వాల్సిన ఉత్తేజం చాలానే ఉందనిపిస్తుంది.

మునివేళ్లకు కళ్లు

49 ఏళ్ల ఆశాలత మునివేళ్లకు కళ్లున్నాయ్ అనిపిస్తుంది ఆమె వంట చేసే పద్ధతి చూస్తే. కత్తిపీటతో కూరలు తరగడం, మిక్సీలో మసాలాలు వేసుకోవడం, స్టౌ ఆన్ చేసి మూకుళ్లు పెట్టడం, వండటం ఇవన్నీ మునివేళ్ల స్పర్శతోనే ఆమె గుర్తించి పూర్తి చేస్తుంది. 'నాకు పుట్టుకతో దృష్టి లేదు. టీనేజ్ వరకూ వెలుతురు, చీకటి అర్థమయ్యేవి. టీనేజ్ దాటాక పూర్తిగా చీకటి కమ్ముకుంది. అయినప్పటికీ మా అమ్మా నాన్నలు నన్ను అంధురాలిగా చూస్తూ, నిరాశ పరుస్తూ పెంచలేదు. మా నాన్న టి.సి.దామోదర్ నన్ను చదువుకోమని బాగా ప్రోత్సహించాడు. బ్రెయిలీలోనే చదువు కొనసాగించి బి.ఇడి చేశాను. ఆ తర్వాత టీచర్ ఉద్యోగం పొందాను. మా ఊరి గవర్నమెంట్ స్కూల్‌లోనే సోషల్ టీచర్‌గా పని చేస్తున్నాను' అని చెప్పింది ఆశాలత. 18 ఏళ్లకు పెళ్లయ్యాక అత్తారింటిలో ఆమెకు వేరే ఏ పని చెప్పకపోయినా, ముగ్గురు పిల్లలు పుట్టినా పెంచడంలో అవస్థ రాకుండా చూసుకున్నా ఆశాలత అందరూ చేయదగ్గ పనులు చేయడానికి ప్రయత్నించేది. 'దృష్టి లేకపోతే ఇంటి పనులు కష్టమే. ఇల్లు చిమ్మడం, బట్టలు ఉతకడం కంటే వంట చేయడం సులభం అని మెల్లగా నేను తెలుసుకున్నాను' అందామె నవ్వుతూ.

వంటలో మేటి

సమయం దొరికితే వంట చేయడం మొదలెట్టిన ఆశాలత లాక్‌డౌన్‌లో పూర్తిస్థాయి వ్లోగర్‌గా మారి తన వంట వీడియోలను అప్‌లోడ్ చేస్తూ ఫాలోయెర్స్‌ను సంపాదించుకుంది. 'అంధులు తమ రోజువారి పనులు ఎలా చేసుకుంటారో... ముఖ్యంగా వంట ఎలా చేసుకుంటారో చూపించాలనుకున్నాను' అంటుందామె. దృష్టి లేకపోయినా ఆమె అంత సామర్థ్యంగా, కచ్చితంగా వంట చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె పాటించే శుభ్రతను చూసి కూడా.

'మా అబ్బాయి అమల్ నా వీడియోలు షూట్ చేసి ఎడిట్ చేస్తాడు. నేను నా పిల్లలకు ఒకటే చెప్తాను.. మీ మీద మీరు ఆధారపడండి... అమ్మ నాన్నలు మీ కోసం అన్నీ చేయాలనుకోకండి అని' అంటుందామె. వెజ్, నాన్‌వెజ్ కూరలు ఇంట్లో అందరూ చేసుకునే విధంగా ఆమె వీడియోలు చేసి పెడుతుంది. అలాగే తరచూ కుటుంబంతో విహారాలు చేసి ఆ వీడియోలు కూడా పెడుతుంది. 'అంధులు నన్ను చూసి ఇన్‌స్పయిర్ అవ్వాలి. ఇంట్లోనే ఉండకుండా లోకాన్ని తిరిగి అనుభూతి చెందాలి' అంటుందామె. ఆమె తన వీడియోల్లో అంధులు కరెన్సీ ఎలా గుర్తిస్తారు, అలంకరణ సామాగ్రి ఎలా ఎంచుకుంటారు లాంటి అంశాల గురించే కాక సాధారణ స్త్రీలకు ఉపయోగపడే అంశాలను కూడా పోస్ట్ చేస్తూ ఉంటుంది.

సినిమా

కళ్కిలో ఇలా..



అమితాబ్ బచ్చన్

బిగ్ బి అమితాబ్ బచ్చన్ అభిమానులకు బర్త్ డే గిఫ్ట్ ఇచ్చింది 'కల్కి 2898 ఏడీ' టీమ్. బుధవారం (అక్టోబర్ 11) అమితాబ్ బచ్చన్ పుట్టినరోజు సందర్భంగా 'కల్కి...'లో ఆయన గెటప్ ఇలా ఉంటుందంటూ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ప్రభాస్ హీరోగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. "కొన్ని తరాలకు స్ఫూర్తిగా నిలిచిన లెజెండ్‌తో సినిమా చేయడం ఓ ఆశీర్వాదం. ఒక పెద్ద కల నెరవేరినట్లు అనిపిస్తోంది. పుట్టిన రోజు శుభాకాంక్షలు సార్" అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రభాస్ స్పందించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సి. అశ్వినీదత్ నిర్మిస్తున్నారు. "మైథాలజీ స్ఫూర్తితో సైన్స్ ఫిక్షన్‌గా రూపొందుతోన్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రాన్ని 2024 ప్రథమార్ధంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది.

నచ్చావే మరింత..



వైష్ణవ్ తేజ్, శ్రీలీల

"హే బుజ్జి బంగారం.. ప్రేమేగా ఇదంతా.. హే నువ్వు నా సొంతం.. నచ్చావే మరింత...' అంటూ ప్రేయసిని ఉద్దేశించి పాట పాడారు వైష్ణవ్ తేజ్. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో వైష్ణవ్ తేజ్, శ్రీ లీల జంటగా నటించిన ఫ్యామిలీ-యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'ఆదికేశవ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నవంబరు 10న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'హే బుజ్జి బంగారం..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. చిత్రసంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా అర్మాన్ మాలిక్, యామిని ఘంటసాల పాడారు.

రేపే నారాయణమూర్తి యూనివర్సిటీ



ఆర్. నారాయణమూర్తి

"యూనివర్సిటీ' విద్యార్థులే కాదు.. వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు చూడాల్సిన సినిమా" అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆర్. నారాయణమూర్తి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'యూనివర్సిటీ' చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు 'యూనివర్సిటీ' ప్రివ్యూ వేశారు. ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ- "దేశంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి. అప్పుడే ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ ఉండదు' అనే అంశాన్ని ఈ చిత్రం ద్వారా గట్టిగా చెప్పారు నారాయణమూర్తి" అన్నారు. "నిరుద్యోగ సమస్య దేశాన్ని ఎంత పట్టి పీడిస్తోందో ఈ చిత్రంలో బాగా చెప్పారు" అన్నారు ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి. "పరీక్షల మీద పరీక్షలంటూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం దుర్మార్గం" అన్నారు ఆర్. నారాయణమూర్తి.

మోగించిందే పీపీ సన్నాయి...

'నింగి నేలా.. నీలా నాలా.. కలిశాయే...' అంటూ మొదలవుతుంది 'యానిమల్' సినిమాలోని 'అమ్మాయి..' పాట. రణబీర్ కపూర్,



రణబీర్, రష్మిక

రష్మికా మందన్నా జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యానిమల్'. ఈ చిత్రంలో "పెదవంచుల్లో మోగించిందే పీపీ సన్నాయి... అమ్మాయి.. అమ్మాయీ..." అంటూ సాగే పాట లిరికల్ వీడియోను యూనిట్ విడుదల చేసింది. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ఈ చిత్ర సంగీత దర్శకుడు ప్రీతమ్, రాఘవ చైతన్య పాడారు. భూషణ్‌కుమార్, క్రిషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, మురాద్ ఖేతని నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో డిసెంబరు 1న విడుదల కానుంది.

థ్రిల్లర్ గాడ్



నయనతార, 'జయం' రవి

'జయం' రవి, నయనతార జంటగా ఐ. అహ్మద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'ఇరైవన్'. ఈ సినిమా 'గాడ్' టైటిల్‌తో ఈ శుక్రవారం తెలుగులో రిలీజ్ కానుంది. నిర్మాతలు సుధన్ సుందరం, జి. జయరాం, సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ- "క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ సినిమా సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను మెప్పిస్తుంది" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా.

వ్యూహం.. శపథం... డేట్ ఫిక్స్



'వ్యూహం'లో అజ్మల్

'శపథం'లో అజ్మల్

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'వ్యూహం'. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం తర్వాత రాజకీయ పార్టీలు ఎలాంటి వ్యూహాలు పన్నాయి? ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? అనే కథాంశంతో 'వ్యూహం' రూపొందుతోంది. ఈ చిత్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో అజ్మల్ నటిస్తున్నారు. ఆర్‌జీవీ డెన్ ప్రొడక్ట్- రామదూత క్రియేషన్స్‌పై దాసరి కిరణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 'వ్యూహం'ని నవంబర్ 10న, 'శపథం' (వ్యూహం 2)ని జనవరి 25న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ చిత్రానికి కెమెరా: సుజీష్ రాజేంద్రన్.

నువ్వు నీలా ఉండు అని చెప్పింది


– నూపుర్ సనన్



రవితేజ టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో మయాంక్ సింఘానియా సహనిర్మాతగా అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నూపుర్ సనన్ మాట్లాడుతూ- "ఈ సినిమాలో ఎవర్నైనా ప్రేమిస్తే వారి కోసం ఏదైనా చేయడానికి సాహసించే మార్వాడి అమ్మాయి సారా పాత్రను చేశాను. ఈ చిత్రంలో నా వేషధారణ మోడ్రన్‌గా ఉంటూనే ట్రెడిషనల్‌గా ఉంటుంది. తెలుగులో చేసిన తొలి సినిమా 'టైగర్ నాగేశ్వర రావు'తోనే నాకు సారాలాంటి చాలెంజింగ్ రోల్ దొరకడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా కోసం దాదాపు రెండు వందల మందిని ఆడిషన్ చేశాక, 'సారా' పాత్రకు నన్ను ఎంపిక చేశారు వంశీగారు. సెట్స్‌లో ఆయన చెప్పినట్లు నటించాను. ప్రస్తుతం నవాజుద్దీన్ సిద్దిఖీతో ఓ సినిమా చేస్తున్నాను" అన్నారు. ఇంకా మాట్లాడుతూ- "నేను సినిమాల్లోకి వెళ్తానన్నప్పుడు 'నువ్వు నీలా ఉండు' అని అక్క (హీరోయిన్ కృతీ సనన్) సలహా ఇచ్చింది. 'మిమి' సినిమాలో అక్క నటన నాకు కన్నీళ్లు తెప్పించింది. మా అక్క తెలుగులో మహేశ్‌బాబు, ప్రభాస్, నాగచైతన్య వంటి స్టార్లతో సినిమాలు చేసింది. ఆ విధంగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది" అని చెప్పుకొచ్చారు.

తెలుగు సినిమా మారిపోయింది

– దర్శకుడు మల్లికార్జున్



శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మధురపూడి గ్రామం అనే నేను'. మల్లికార్జున్ దర్శకత్వంలో ముప్పా వెంకయ్య చౌదరి సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో కేఎస్ శంకర్ రావు, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మల్లికార్జున్ మాట్లాడుతూ – "ఓ మనిషికి ఆత్మ ఉంటుందన్నట్లుగానే.. ఓ ఊరికి ఆత్మ ఉంటే ఏం జరుగుతుందనే కల్పిత కథే ఈ చిత్రం. ఓ వ్యక్తి మరో వ్యక్తి తలను నరికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడనే వార్తను నా చిన్నతనంలో చదివాను. ఆ విజువల్‌ను ఊహించుకుంటూ ఈ సినిమా కథను అల్లుకున్నాను. అయితే ఆ ఘటనకు, ఈ సినిమాకు ఏ మాత్రం సంబంధం లేదు. పోరాటం, స్నేహం, రాజకీయం... ఇలా అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న రా అండ్ రస్టిక్ ఫిల్మ్. సూరి పాత్రలో హీరో శివ నా విజన్‌కి తగ్గట్లు నటించాడు. నిర్మాతలు బాగా సపోర్ట్ చేశారు. మణిశర్మగారి సంగీతం ఈ చిత్రానికి అదనపు బలం. కరోనా తర్వాత తెలుగు సినిమా మారిపోయింది. ఆరు ఫైట్లు.. ఆరు పాటలు అంటే ఆడియన్స్ చూడటం లేదు. కొత్తదనం కోరుకుంటున్నారు. అందుకే ఈ సినిమా తీశాను. ఇక ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో నా దగ్గర ఓ కథ ఉంది" అన్నారు.

నాపై నాకు నమ్మకం వచ్చింది

– రాఘవా లారెన్స్

"జిగర్తాండ డబుల్ ఎక్స్'లో నాకు మేకప్ వాడలేదు. మేకప్ లేకుంటే బాగుండనేమో? అనుకున్నాను. కానీ, స్క్రీన్‌పై చూసుకున్నాక నా మీద నాకు నమ్మకం ఏర్పడింది" అన్నారు రాఘవా లారెన్స్. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగర్తాండ డబుల్ ఎక్స్'. కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం దీపావళికి తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ సినిమాలోని 'కోరమీసం..' పాటను రిలీజ్ చేశారు.



ఎస్‌జే సూర్య, లారెన్స్, కార్తీక్ సుబ్బరాజ్

ఈ సందర్భంగా లారెన్స్ మాట్లాడుతూ- "జిగర్తాండ'లో నేను చేయాల్సింది.. కానీ, కుదర్లేదు. ఆ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్‌కు జాతీయ అవార్డు వచ్చింది. 'జిగర్తాండ డబుల్ ఎక్స్' కోసం ఓ ఊర్లో రోడ్డు, బ్రిడ్జి నిర్మించారు మా నిర్మాత. ఆయన మంచి మనసు కోసమైనా ఈ చిత్రం బాగా ఆడాలి" అన్నారు. "ఈ సినిమా పండగలా ఉంటుంది" అన్నారు కార్తికేయన్. "జిగర్తాండ' కంటే డబుల్ ఎక్స్ రేంజ్‌లో ఈ చిత్రం ఉంటుంది" అన్నారు కార్తీక్ సుబ్బరాజ్. "ఈ సినిమా నాకు ప్రత్యేకం" అన్నారు ఎస్‌జే సూర్య.

నవంబర్‌లో పొలిమేర 2



రాజేశ్

'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి, బాలాదిత్య, సాహితీ దాసరి, రవి వర్మ, 'చిత్రం' శ్రీను, అక్షతా శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించారు. గౌరు గణబాబు సమర్పణలో గౌరీ కృష్ణ నిర్మించారు. ఈ చిత్రాన్ని పంపిణీదారుడు వంశీ నందిపాటి నవంబర్ 3న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. డా. అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ- "గ్రామీణ నేపథ్యంలో జరిగే మర్డర్ మిస్టరీకి బ్లాక్ మ్యాజిక్ అంశాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కొన్ని వాస్తవ ఘటనలను ఈ చిత్రంలో జోడించాం" అన్నారు. "మా ఊరి పొలిమేర' ఘనవిజయం అందుకోవడంతో రెండో భాగంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగా రాజీ పడకుండా ఈ సినిమా తీశాం" అన్నారు గౌరీకృష్ణ.

ఉపాధ్యాయుల కథ



వికాశ్ వశిష్ట

వికాశ్ వశిష్ట హీరోగా మోక్ష, కుషిత కళ్లపు హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'నీతోనే నేను'. అంజిరామ్ దర్శకత్వంలో ఎమ్. సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ఎమ్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ- "నీతోనే నేను' షూటింగ్‌ని ఒక్క షెడ్యూల్‌లో 33 రోజుల్లోనే పూర్తి చేశాం. ఈ సినిమా చూసిన మెదక్ వాళ్లందరూ... మా ప్రాంతవాసి నిర్మించిన గొప్ప సినిమా అని చెప్పుకుంటారు" అన్నారు. "మా చిత్రాన్ని ఆదరించాలి" అన్నారు అంజిరామ్. "సమాజాన్ని గొప్పగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల కథతో ఈ సినిమా చేశాం" అన్నారు చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎమ్. ప్రభాకర్ రెడ్డి. "మా సినిమా అందరికీ నచ్చుతుంది" అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్.



క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 4-6, 6-3, 10-8తో ఖచనోవ్-రుబ్లెవ్ (రష్యా) జోడీపై గెలిచింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ ఆరు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో అరెవాలో (ఎల్‌సాల్వడార్)-రోజర్ (నెదర్లాండ్స్)లతో బోపన్న, ఎబ్డెన్ తలపడతారు.

అల్‌కరాజ్‌కు చుక్కెదురు



ప్రపంచ రెండో ర్యాంకర్, స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టోర్నీ నుంచి నిష్క్రమించాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 7-5, 2-6, 4-6తో 19వ ర్యాంకర్ దిమిత్రోవ్ (బల్గేరియా) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 10 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో దిమిత్రోవ్ పది ఏస్‌లు సంధించడంతోపాటు అల్‌కరాజ్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

అదరగొట్టిన రోహిత్


రోహిత్ శర్మ

7 వరల్డ్‌కప్‌లో రోహిత్ సెంచరీల సంఖ్య. ఈ టోర్నీ చరిత్రలో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా నిలిచిన అతను సచిన్ టెండూల్కర్ (6) పేరిట ఉన్న రికార్డును సవరించాడు. 2015 ప్రపంచకప్‌లో ఒక సెంచరీ చేసిన రోహిత్, 2019 వరల్డ్‌కప్‌లో 5 శతకాలు బాదాడు.

556 అంతర్జాతీయ క్రికెట్‌లో (మూడు ఫార్మాట్‌లలో కలిపి) రోహిత్ సిక్సర్ల సంఖ్య. గేల్ (553) రికార్డు అధిగమించాడు.

63 సెంచరీకి రోహిత్ తీసుకున్న బంతుల సంఖ్య. వరల్డ్‌కప్‌లో భారత్ తరఫున ఫాస్టెస్ట్ సెంచరీగా గతంలో కపిల్ దేవ్ (72 బంతులు; 1983లో) పేరిట ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు.

31 వన్డేల్లో రోహిత్ సెంచరీల సంఖ్య. రికీ పాంటింగ్ (30)ను అతను అధిగమించాడు. ఈ జాబితాలో సచిన్ (49), కోహ్లి (47) మాత్రమే ముందున్నారు.

19 వరల్డ్‌కప్‌లో 19 ఇన్నింగ్స్‌లలోనే 1000 పరుగులు పూర్తి చేసిన డేవిడ్ వార్నర్ (19) రికార్డును రోహిత్ సమం చేశాడు.

16 ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో అఫ్గానిస్తాన్ ఓడిన మ్యాచ్‌ల సంఖ్య. మూడో ప్రపంచకప్ ఆడుతున్న అఫ్గానిస్తాన్ 17 మ్యాచ్‌లు ఆడి కేవలం ఒక మ్యాచ్‌లోనే గెలిచింది. 2015 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్‌పై అఫ్గానిస్తాన్ ఒక వికెట్ తేడాతో నెగ్గింది.

వరల్డ్‌కప్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా ఇప్పటికే తన పేరును లిఖించుకున్న రోహిత్ శర్మ ఇప్పుడు మరో మెట్టు ఎక్కాడు. టోర్నీలో ఏడో శతకం సాధించిన తొలి ఆటగాడిగా శిఖరాన నిలుస్తూ మెరుపు ప్రదర్శనతో జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. గత మ్యాచ్‌లో డకౌట్ అయిన కసినంతా చూపిస్తూ అఫ్గానిస్తాన్‌పై అతను చెలరేగాడు. ఈ క్రమంలో తన స్థాయిని ప్రదర్శిస్తూ పలు రికార్డులను అధిగమించాడు. దాంతో రోహిత్ ధాటికి అఫ్గాన్ విలవిల్లాడింది. మెరుగైన స్కోరు సాధించామన్న ఆ జట్టు సంబరం కాస్తా రోహిత్ ఆట ముందు ఆవిరైంది. రోహిత్ ఆటతో సులువుగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా భారత్ లక్ష్యం చేరింది. ఇక శనివారం జరిగే అసలు పోరులో పాకిస్తాన్‌ను పడగొట్టేందుకు టీమిండియా సిద్ధమైంది.


బుమ్రా, హార్దిక్

న్యూఢిల్లీ: ప్రపంచకప్ తొలి పోరులో పటిష్ట ఆస్ట్రేలియాను ఓడించిన భారత్ రెండో పోరులో చిన్న టీమ్ అఫ్గానిస్తాన్‌పై చెలరేగింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌ను ఏకంగా 15 ఓవర్లు మిగిలి ఉండగానే ముగించి భారీ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. బుధవారం ఫిరోజ్‌షా కోట్లా స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. కెప్టెన్ హష్మతుల్లా షాహిది (88 బంతుల్లో 80; 8 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (69 బంతుల్లో 62; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. బుమ్రా నాలుగు వికెట్లతో, హార్దిక్ పాండ్యా రెండు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. అనంతరం భారత్ 35 ఓవర్లలో 2 వికెట్లకు 273 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (84 బంతుల్లో 131; 16 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో చెలరేగగా, విరాట్ కోహ్లి (56 బంతుల్లో 55 నాటౌట్; 6 ఫోర్లు) మరో అర్ధ సెంచరీని తన పేరిట నమోదు చేసుకున్నాడు. ఆడిన రెండు మ్యాచ్‌లూ గెలిచిన టీమిండియా శనివారం అహ్మదాబాద్‌లో జరిగే తమ తర్వాతి పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడుతుంది.

సెంచరీ భాగస్వామ్యం...

బ్యాటింగ్‌కు స్వర్గధామంలాంటి పిచ్‌పై అఫ్గానిస్తాన్ చెప్పుకోదగ్గ స్కోరే సాధించగలిగినా... కీలక సమయాల్లో భారత బౌలర్లు చెలరేగడంతో ఆ జట్టు ఆశించినన్ని పరుగులు రాబట్టడంలో విఫలమైంది. 31 పరుగుల వ్యవధిలో ఆ జట్టు తొలి 3 వికెట్లు చేజార్చుకుంది. అయితే హష్మతుల్లా, అజ్మతుల్లా కీలక భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. 21.2 ఓవర్లపాటు భారత్‌కు వికెట్ ఇవ్వకుండా నిలువరించడంలో సఫలమైన వీరిద్దరు నాలుగో వికెట్‌కు 121 పరుగులు జత చేశారు. అయితే రన్‌రేట్ పేలవంగా సాగడంతో అది చివర్లో జట్టు స్కోరుపై ప్రభావం చూపించింది. టీమిండియా బౌలర్లలో సిరాజ్ మినహా అంతా మెరుగైన ప్రదర్శనే చేశారు. ఓవర్‌కు 8.44 చొప్పున పరుగులిచ్చిన సిరాజ్ బౌలింగ్‌లో అఫ్గాన్ బ్యాటర్లు 12 ఫోర్లు, 1 సిక్స్ రాబట్టారు.

ఎదురులేని బ్యాటింగ్‌తో...

తనదైన శైలిలో మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగిన రోహిత్ సునాయాసంగా అఫ్గాన్ నుంచి మ్యాచ్‌ను లాక్కున్నాడు. ఫజల్ ఓవర్లో సిక్సర్‌తో వరల్డ్ కప్‌లో వేయి పరుగులు పూర్తి చేసుకున్న రోహిత్, అతని తర్వాతి ఓవర్లో 2 ఫోర్లు, 6 బాది 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. తర్వాతి రెండు ఓవర్లలో రోహిత్ మరో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టాడు. 10 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 94 పరుగులకు చేరింది. ముజీబ్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతనికి సెంచరీ పూర్తి చేసేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. 18వ ఓవర్ రెండో బంతికే రోహిత్ శతకం పూర్తి కావడం విశేషం. మరో ఎండ్‌లో రోహిత్‌కు సహకరించిన ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 47; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) వికెట్ తీసి భారీ భాగస్వామ్యం తర్వాత అఫ్గాన్ కాస్త ఊపిరి పీల్చుకుంది. తొలి వికెట్‌కు రోహిత్, కిషన్ 156 పరుగులు జత చేశారు. ఆ తర్వాత జత కలిసిన కోహ్లి ప్రశాంతంగా ఆడుకుంటూ పోయాడు. రషీద్ ఓవర్లో వరుసగా 4, 4, 6 కొట్టిన భారత కెప్టెన్ అతని తర్వాతి ఓవర్లో స్వీప్ షాట్‌కు ప్రయత్నించి బౌల్డ్ కావడంతో ఒక గొప్ప ఇన్నింగ్స్ ముగిసింది. విజయానికి 64 పరుగులు కావాల్సిన ఈ దశలో జత కలిసిన కోహ్లి, శ్రేయస్ అయ్యర్ (23 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) చివరి వరకు నిలిచి ఆట ముగించారు.

భారత కెప్టెన్ మెరుపు సెంచరీ

- ప్రపంచకప్ చరిత్రలో 7వ శతకం
- భారత్‌కు వరుసగా రెండో విజయం
- 8 వికెట్లతో అఫ్గానిస్తాన్ చిత్తు


హష్మతుల్లా

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	2	2	0	4	1.958
భారత్	2	2	0	4	1.500
పాకిస్తాన్	2	2	0	4	0.927
దక్షిణాఫ్రికా	1	1	0	2	2.040
ఇంగ్లండ్	2	1	1	2	0.553
బంగ్లాదేశ్	2	1	1	2	-0.653
ఆస్ట్రేలియా	1	0	1	0	-0.883
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
అఫ్గానిస్తాన్	2	0	2	0	-1.907

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా
వేదిక: లక్నో
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం


కోహ్లి, నవీన్

నవీన్‌కు కోహ్లి బాసట!

గత వరల్డ్ కప్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరుగుతుండగా స్టీవ్ స్మిత్‌ను ప్రేక్షకులు 'చీటర్' అంటూ గేలి చేశారు. అయితే బ్యాటింగ్ చేస్తున్న కోహ్లి బౌండరీ వద్దకు వచ్చి అలా చేయవద్దని వారించడంతో పాటు స్మిత్ భుజంపై చేయి వేసి మద్దతు పలికాడు. ఇప్పుడు కూడా దాదాపు అలాంటి ఘటనే జరిగింది. ఐపీఎల్ టోర్నీలో కోహ్లి, అఫ్గాన్ ఆటగాడు నవీన్ ఉల్ హక్ మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి నవీన్ ఎక్కడ, ఏ మ్యాచ్‌లో కనిపించినా ప్రేక్షకులు కోహ్లి, కోహ్లి అంటూ ఆట పట్టిస్తూ వచ్చారు. ఇప్పుడు మైదానంలో అదే కనిపించింది. అయితే 'ఢిల్లీ బాయ్' కోహ్లి మళ్లీ స్వయంగా ఫ్యాన్స్‌ను నిలువరించాడు. ఇలా చేయవద్దంటూ ఆపాడు. ఆ తర్వాత నవీన్‌తో చేతులు కలపగా ఇద్దరు చిరునవ్వులు చిందిస్తూ 'థమ్సప్' సంకేతం చూపించడం హైలైట్‌గా నిలిచింది. తాజా ఘటనతో నాటి వివాదానికి తెర పడినట్లే. మ్యాచ్‌లో నవీన్ బౌలింగ్‌లో 10 బంతులు ఆడిన కోహ్లి 3 సింగిల్స్ తీశాడు.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) శార్దుల్ (బి) పాండ్యా 21; ఇబ్రహీమ్ (సి) రాహుల్ (బి) బుమ్రా 22; రహమత్ (ఎల్బీ) (బి) శార్దుల్ 16; హష్మతుల్లా (ఎల్బీ) (బి) కుల్దీప్ 80; అజ్మతుల్లా (బి) పాండ్యా 62; నబీ (ఎల్బీ) (బి) బుమ్రా 19; నజీబుల్లా (సి) కోహ్లి (బి) బుమ్రా 2; రషీద్ ఖాన్ (సి) కుల్దీప్ (బి) బుమ్రా 16; ముజీబ్ (నాటౌట్) 10; నవీన్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 272.** వికెట్ల పతనం: 1-32, 2-63, 3-63, 4-184, 5-225, 6-229, 7-235, 8-261. బౌలింగ్: బుమ్రా 10-0-39-4, సిరాజ్ 9-0-76-0, హార్దిక్ పాండ్యా 7-0-43-2, శార్దుల్ ఠాకూర్ 6-0-31-1, కుల్దీప్ యాదవ్ 10-0-40-1, రవీంద్ర జడేజా 8-0-38-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి) రషీద్ 131; ఇషాన్ కిషన్ (సి) ఇబ్రహీమ్ (బి) రషీద్ ఖాన్ 47; కోహ్లి (నాటౌట్) 55; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (35 ఓవర్లలో 2 వికెట్లకు) 273.** వికెట్ల పతనం: 1-156, 2-205. బౌలింగ్: ఫారుఖీ 6-0-50-0, ముజీబ్ 8-0-64-0, నవీన్ ఉల్ హక్ 5-0-31-0, అజ్మతుల్లా 4-0-34-0, నబీ 4-0-32-0, రషీద్ 8-0-57-2.

'ఒలింపిక్ సవాల్‌కు సిద్ధం'

షట్లర్ సాత్విక్ సాయిరాజ్ వ్యాఖ్య ● 'ఆసియా' ప్రదర్శనపై చీఫ్ కోచ్ గోపీచంద్ సంతోషం



ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్‌లతో భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్

సాక్షి, హైదరాబాద్: 'మేం వరుస విజయాలు సాధిస్తున్నా చాలా మంది ప్రత్యర్థులు కొంత కాలం వరకు కూడా మమ్మల్ని పట్టించుకోలేదు. అయితే ఇప్పుడు మా ఆటపై అందరి దృష్టి ఉంటుంది. కానీ ఇప్పుడు ఇకపై మా ఆటను విశ్లేషించి మాపై విజయం సాధించేందుకు ప్రయత్నిస్తారు'... భారత డబుల్స్ బ్యాడ్మింటన్ స్టార్, వరల్డ్ నంబర్‌వన్ సాత్విక్ సాయిరాజ్ చేసిన వ్యాఖ్య ఇది. సాత్విక్-చిరాగ్ శెట్టి ద్వయం ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్‌లో స్వర్ణపతకాన్ని సొంతం చేసుకుంది. టీమ్ ఈవెంట్‌లో కూడా భారత పురుషుల జట్టు రజతం సాధించగా... పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ కాంస్యం గెలిచాడు. ఈ నేపథ్యంలో బుధవారం గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో అభినందన కార్యక్రమం జరిగింది. ఇందులో ఆటగాళ్లతో పాటు చీఫ్ కోచ్ గోపీచంద్ పాల్గొన్నారు.

వాళ్లని పడగొట్టగలిగాం...

గత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించకపోవడంతో తీవ్రంగా నిరాశ చెందామని, ఆ తర్వాత మరింత పట్టుదలగా సాధన చేసి ఆసియా క్రీడలకు వెళ్లినట్లు సాత్విక్ వెల్లడించాడు. చాలా కాలంగా తమకు కొరకరాని కొయ్యగా ఉన్న మలేసియా జోడీ సా వుయి యిక్-ఆరోన్ చియాలను ఆసియా క్రీడల సెమీఫైనల్లో ఓడించడం తమ ఆనందాన్ని రెట్టింపు చేసిందని అతను అన్నాడు. వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ కోసం తాము అన్ని విధాలా సిద్ధమవుతామన్న సాత్విక్... అన్నింటికంటే ఫిట్‌నెస్ కీలకమని వ్యాఖ్యానించాడు. 'ఇప్పుడు మాకు ప్రత్యేకంగా ప్రత్యర్థులు ఎవరూ లేరు. మా శరీరమే మాకు ప్రత్యర్థి. రాబోయే రోజుల్లో గాయాలు లేకుండా పూర్తి ఫిట్‌గా ఉంటే చాలు. కోర్టులో ఫలితాలు వాటంతట అవే వస్తాయి. ఈ క్రమంలో ఒలింపిక్స్‌కు ముందు కొన్ని టోర్నీలలో మేం ఓడినా పర్వాలేదు. అన్నింటిలోనూ గెలిస్తే అసలు సమయానికి సమస్య రావచ్చేమో' అని సాత్విక్ అన్నాడు.

ఇలాంటి అవకాశం రాదని...

పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో తీవ్ర గాయంతో బాధపడుతూనే ప్రణయ్ పతకం కోసం పోరాడాడు. చివరకు అతను విజయం సాధించినప్పుడు కోచ్ గోపీచంద్ సహా సహచరులంతా భావోద్వేగానికి గురయ్యారు. అయితే గాయం ఉన్నా ఆడేందుకు సిద్ధం కావడం అందరం కలిసి తీసుకున్న నిర్ణయమని ప్రణయ్ చెప్పాడు. 'నా శరీరం ఎంత వరకు సహకరించగలదో ఫిజియో కొన్ని సూచనలు ఇచ్చారు. దాని ప్రకారమే కోచ్ గోపీ సర్‌తో పాటు అందరితో చర్చించాక నేను ఆడేందుకు సిద్ధమయ్యా. నొప్పి ఉన్నా సరే పట్టుదలగా ఆడాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే ఇలాంటి అవకాశం మళ్లీ మళ్లీ రాదు. ఆసియా క్రీడల్లో పతకం విలువేంటో తెలుసు. గతంలో ఎన్నోసార్లు గాయాలతో బాధపడి కీలక సమయాల్లో అవకాశం కోల్పోయా. ఈ జీవితకాలపు అవకాశాన్ని పోగొట్టుకోరాదని భావించా. అయితే గాయం తీవ్రత వల్లే టీమ్ ఈవెంట్ ఫైనల్లో ఆడలేదు' అని ప్రణయ్ చెప్పాడు. నిజానికి తమ స్వర్ణంకంటే ప్రణయ్ కాంస్యం గెలుచుకోవడం తమకు ఎక్కువ ఆనందాన్నిచ్చిందని సాత్విక్ అన్నాడు. అతను పతకం కోసం ఎంత కష్టపడ్డాడో, కీలక సమయాల్లో వెనుకబడి పుంజుకునేందుకు ఎంత పోరాడాడో తమకు తెలుసు కాబట్టి అతను పతకం సాధించాలని జట్టంతా కోరుకుందని సాత్విక్ వెల్లడించాడు.

'వారి వల్లే ఈ ఉత్సాహమంతా'

గోపీచంద్ భారత కోచ్‌గా మారి 17 ఏళ్లు పూర్తయ్యాయి. ఇక చాలనుకొని తప్పుకోవాలని చాలా సార్లు భావించానని, అయితే యువ ఆటగాళ్ల విజయాలు తనకు ప్రేరణ అందిస్తున్నాయని గోపీచంద్ చెప్పారు. సింగిల్స్, టీమ్ ఈవెంట్‌లలో పతకాలు రావడం ఎంతో ఆనందం కలిగించిందని గోపీచంద్ అన్నారు. 'నా దృష్టిలో ఆసియా క్రీడల మెడల్ అంటే ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలతో సమానం. అందుకే ఈ ఆనందమంతా. జట్టు సభ్యులంతా చాలా బాగా ఆడారు. శ్రీకాంత్, లక్ష్య సేన్‌లకు ప్రత్యేక అభినందనలు. ఇక ప్రణయ్ పతకం కోసం ప్రార్థించినంతగా నేను ఎప్పుడూ ప్రార్థించలేదు. ఈ ఒక్కసారి అతడిని గెలిపించమని దేవుడిని కోరుకున్నా. ఒలింపిక్స్‌కు ఇంకా సమయముంది. అయితే దానికి తగిన విధంగా సిద్ధమవుతాం' అని గోపీచంద్ అన్నారు. అధికారికంగా ఇప్పుడు సాత్విక్-చిరాగ్ నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్నా... గత ఏడాది కాలంగా వారి ఆటను చూస్తే అప్పటి నుంచే వారిని తాను నంబర్‌వన్‌గా భావించినట్లు ఆయన వెల్లడించారు.

సింధు శుభారంభం

వాంటా (ఫిన్‌లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు 21-13, 21-6తో 2017 ప్రపంచ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి చేరింది. ఒకుహారాపై సింధుకిది 11వ విజయం. ఇటీవల ఆసియా క్రీడల్లో నిరాశపరిచిన సింధు ఈ మ్యాచ్‌లో 33 నిమిషాల్లో ప్రత్యర్థి ఆట కట్టించింది. తొలి గేమ్‌లో సింధుకు కాస్త పోటీనిచ్చిన ఒకుహారా రెండో గేమ్‌లో మాత్రం భారత స్టార్ దూకుడుకు చేతులెత్తేసింది. రెండో గేమ్ ఆరంభంలోనే 6-0తో ఆధిక్యంలోకి వెళ్లిన సింధు ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. మరో మ్యాచ్‌లో భారత్‌కే చెందిన ఆకర్షి 18-21, 22-20, 21-18తో లియాన్ టాన్ (బెల్జియం)పై నెగ్గింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో కిరణ్ జార్జి (భారత్) 24-22, 15-21, 21-15తో తోమా జూనియర్ పాపోవ్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు.



'కంగారు' పడితే కష్టమే

కృష్ణమాచారి శ్రీకాంత్



భారత్ చేతిలో తొలి మ్యాచ్‌లో ఓడిన ఆస్ట్రేలియా ఇప్పుడు జోరు మీదున్న దక్షిణాఫ్రికాతో తలపడనుంది. కీలకమైన ఈ పోరులో ఓడితే ఆసీస్‌కు ఇబ్బందులు తప్పవు. లెక్క బెట్టి తర్వాతి మ్యాచ్‌లు గెలవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. కంగారు పడితే మాత్రం కష్టాలు తప్పవు. లక్నో పిచ్ స్పిన్‌కు అనుకూలం. దీంతో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలపై ఇంకాస్త శ్రద్ధ పెట్టాలి. ముందుగా బ్యాటింగ్‌కు దిగితే మంచి స్కోరు సాధించి పిచ్ పరిస్థితుల్ని ఆకళింపు చేసుకుంటే తర్వాత ప్రత్యర్థి వికెట్లను పడగొట్టేందుకు మెరుగైన అవకాశాలుంటాయి. ఏడో నంబర్‌లో గ్రీన్ లేదంటే స్టొయినిస్‌లలో ఎవరిని ఎంచుకుంటారన్నది ఆసక్తికరం. ఇక స్పిన్ విభాగం మరింత బాధ్యత పెంచుకోవాలి. మ్యాక్స్‌వెల్ రూపంలో అనుభవజ్ఞుడైన స్పిన్నర్ ఉన్నప్పటికీ స్పెషలిస్ట్ స్పిన్నర్ ఆడమ్ జంపా రాణించాల్సిన అవసరమైతే ఉంది. అతను భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో నిరాశపరిచాడు. ఇప్పుడు సఫారీ జట్టు పనిపడితే జట్టుకు ఎంతో ఉపయోగపడుతుంది. మరోవైపు దక్షిణాఫ్రికాను చూస్తే ఇటీవల నిలకడైన ఆటతీరుతో విజయాలు సాధిస్తోంది. సొంతగడ్డపై 3-2తో ఆసీస్‌ను ఓడించింది. బ్యాటర్లంతా సూపర్ ఫామ్‌లో ఉన్నారు. శ్రీలంకతో మ్యాచ్‌లో ఏకంగా ముగ్గురు సెంచరీలు చేశారు. లక్నో పిచ్‌పై డికాక్‌కు మంచి అవగాహన వుంది. ఐపీఎల్ క్రికెట్‌లో ఆడిన అనుభవం ఇప్పుడు కచ్చితంగా మేలు చేస్తుంది. మిడిలార్డర్‌లో మిల్లర్, క్లాసెన్‌లు రాణిస్తే పరుగుల వరదకు ఢోకా ఉండదు. లెఫ్టార్మ్ స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షమ్సీలను ఒకవేళ దక్షిణాఫ్రికా పక్కన బెడితే అంతకు మించిన ఆశ్చర్యం ఉండదు. కుల్దీప్ యాదవ్‌లాగే షమ్సీ లెఫ్టార్మ్ మణికట్టు స్పిన్నర్ కాబట్టి తుది జట్టులో ఉంచితే మంచి ఫలితాలుంటాయి. ప్రపంచకప్ ప్రారంభదశలోనే రెండు మేటి జట్ల మధ్య మ్యాచ్ ప్రేక్షకులను అలరిస్తుంది. రెండింటిలోనూ ఏ జట్టూ తగ్గదు. ఎంతవరకైనా పోరాడతాయి.

'మాతో పోలిస్తే అంతరం చాలా ఎక్కువ'

- భారత యువ మహిళా షట్లర్ల ఆటతీరుపై సైనా వ్యాఖ్య
- 'ప్రోస్' బ్యాడ్మింటన్ అకాడమీ మెంటార్‌గా కొత్త పాత్ర


'బ్యాడ్మింటన్ ప్రోస్ అకాడమీ ప్రారంభోత్సవంలో విజయ్, సైనా, కశ్యప్, గురుసాయిదత్

సాక్షి, హైదరాబాద్: భారత మహిళల బ్యాడ్మింటన్‌లో వస్తున్న కొత్త తరం ఆటగాళ్లలో దూకుడు లోపించిందని ఒలింపిక్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించే ధాటైన ఆట వారి నుంచి రావాలని ఆమె సూచించింది. సరిగ్గా చెప్పాలంటే తనతో పాటు సింధు తర్వాత వచ్చిన ప్లేయర్లు ఆశించిన ప్రదర్శన ఇవ్వలేకపోతున్నారని సైనా చెప్పింది. 'నిజాయితీగా చెప్పాలంటే మా ఇద్దరికీ, కొత్తగా వచ్చిన మహిళా షట్లర్లకు మధ్య అంతరం చాలా ఎక్కువగా ఉంది. మ్యాచ్ ఆరంభం నుంచి అటాక్ చేసే మాలాంటి ప్లేయర్లు ఇప్పుడు భారత్‌కు కావాలి. త్వరలోనే మహిళల బ్యాడ్మింటన్‌లో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నా' అని సైనా పేర్కొంది. 'బ్యాడ్మింటన్ ప్రోస్' పేరుతో కొత్తగా రానున్న బ్యాడ్మింటన్ అకాడమీకి సైనా మెంటార్‌గా వ్యవహరించనుంది. మాజీ ఆటగాడు అనూప్ శ్రీధర్, విజయ్ లాన్సీ కలిసి దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొంది. 'ప్రోస్ అకాడమీకి ప్రత్యేక కోచ్‌ల బృందం ఉంది. నాకున్న అనుభవాన్ని వారితో పంచుకునేందుకే మెంటార్‌గా పని చేయబోతున్నా. దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బ్యాడ్మింటన్ అకాడమీలు రావడం సానుకూల పరిణామం' అని సైనా పేర్కొంది. భారత షట్లర్ పారుపల్లి కశ్యప్, ప్రస్తుతం భారత టీమ్ కోచ్‌ల బృందంలో ఒకడైన గురుసాయిదత్ కూడా ఈ అకాడమీకి మెంటార్లుగా పని చేస్తారు.

సాక్షి **బిజినెస్**
గురువారం
12-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	394	66,473
నిఫ్టీ ▲	122	19,811

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,556	▽ 8
డోజోన్స్	33,624	▽ 115
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,620	▽ 8
డాక్స్	15,460	▲ 36
షాంఘై	3,079	▲ 4
నికాయ్	31,936	▲ 190

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	57,860 ▲ 381
బంగారం (22 క్యారెట్)	57,628 ▲ 381
వెండి (కిలో)	69,494 ▲ 911

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎయిర్	82.45	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎయిర్	100.70	104.04
€	యూరో	ఎయిర్	86.77	89.86
¥	జపాన్ ఎన్ (100)	ఎయిర్	55.13	56.83
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎయిర్	52.39	54.73
S$	సింగపూర్ డాలర్	ఎయిర్	60.11	62.05
SAR	సౌదీ రియాల్	క్యాష్	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	క్యాష్	21.76	23.55
¥	చైనా యువాన్	క్యాష్	10.27	12.34

క్యూ2లో టీసీ'ఎస్'!

రూ.11,342 కోట్ల నికర లాభం; 8.7 శాతం అప్

ఆదాయం 7.9 శాతం పెరుగుదల; రూ.59,692 కోట్లు

రూ.17,000 కోట్లతో షేర్ల బైబ్యాక్‌కు సై..

షేరుకు రూ. 9 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్

ముంబై: దేశీ సాఫ్ట్‌వేర్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టీసీఎస్).. మెరుగైన ఫలితాలతో బోణీ కొట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో (2023–24, క్యూ2) కంపెనీ రూ. 11,342 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ. 10,431 కోట్లతో పోలిస్తే 8.7 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం సైతం 7.9 శాతం పెరుగుదలతో రూ. 55,309 కోట్ల నుండి రూ.59,692 కోట్లకు ఎగబాకింది. ఇక వాటాదారులకు టీసీఎస్ మరోసారి భారీ బైబ్యాక్ ఆఫర్‌ను ప్రకటించడం విశేషం. మరోపక్క, మందకొడి ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఐటీ రంగానికి ప్రతికూలతలు కొనసాగుతాయని కూడా కంపెనీ స్పష్టం చేసింది.

త్రైమాసిక ప్రాతిపదికన ఇలా...

ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్ (క్యూ1లో) నమోదైన రూ.11,074 కోట్లతో పోలిస్తే త్రైమాసిక ప్రాతిపదికన క్యూ2లో నికర లాభం 2.5% వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం క్యూ1లో రూ.59,381 కోట్లతో పోలిస్తే క్యూ2లో అర శాతం పెరిగింది.

ఫలితాల్లో ఇతర ముఖ్యాంశాలు...

- క్యూ2లో కంపెనీ నిర్వహణ లాభం 9.1 శాతం వృద్ధితో రూ.14,483 కోట్లకు పెరిగింది. అదేవిధంగా నిర్వహణ మార్జిన్లు పావు శాతం పెరిగి 24.3 శాతానికి చేరాయి.
- భౌగోళికంగా చూస్తే, యూకే నుండి ఆదాయం 10.7 శాతం ఎగబాకగా, ఉత్తర అమెరికా నుండి స్వల్పంగా 0.1 శాతం వృద్ధి చెందింది. వర్ధమాన మార్కెట్లలో మధ్యప్రాచ్యం, ఆఫ్రికా ఆదాయం 15.9 శాతం వృద్ధి నమోదు కాగా, లాటిన్ అమెరికా 13.1 శాతం, ఆసియా పసిఫిక్ 4.1 శాతం, భారత్ ఆదాయం 3.9 శాతం చొప్పున పెరిగాయి.
- విభాగాల వారీగా.. ఇంధనం, వనరులు, యుటిలిటీల నుండి ఆదాయం 14.8 శాతం పెరిగింది. తయారీ రంగం నుండి ఆదాయం 5.8 శాతం, లైఫ్ సైన్సెస్–హెల్త్‌కేర్ 5 శాతం పెరగ్గా, బ్యాంకింగ్–ఫైనాన్షియల్ సర్వీసెస్ (బీఎఫ్‌ఎస్‌ఐ) మాత్రం మైనస్ 0.5 శాతంగా నమోదైంది.
- సెప్టెంబర్ చివరి నాటికి టీసీఎస్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,08,985కు చేరింది. క్యూ2లో నికరంగా 6,000 మంది సిబ్బంది తగ్గారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40,000 మంది ఫ్రెషర్లను నియమించుకోవాలన్న లక్ష్యంలో ఎలాంటి మార్పు లేదని టీసీఎస్ చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ చెప్పారు. క్యాంపస్ నియమకాలపై ఇప్పటికే దృష్టి పెట్టామన్నారు.
- క్యూ2లో కంపెనీ 11.2 బిలియన్ డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులను కుదుర్చుకుంది. ఇందులో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ/5జీ, వాహన దిగ్గజం జేఎల్‌ఆర్‌కు సంబంధించిన డీల్స్ ప్రధానంగా ఉన్నాయి.
- ఇజ్రాయెల్‌లో 250 మంది కంపెనీ ఉద్యోగులు పని చేస్తున్నారని, యుద్ధ ప్రభావం అక్కడ తమ వ్యాపారాలపై పెద్దగా ప్రభావం చూపలేదని టీసీఎస్ సీఎఫ్‌ఓ ఎన్. గణపతి సుబ్రమణ్యం చెప్పారు.
- రూ. 1 ముఖ విలువ గల ఒక్కో షేరుపై కంపెనీ రూ. 9 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి రికార్డు తేదీ అక్టోబర్ 19 కాగా, నవంబర్ 7న చెల్లించనుంది. దాదాపు రూ.3,300 కోట్లు ఇందుకు వెచ్చించనుంది.

టీసీఎస్ షేరు ధర బుధవారం బీఎస్‌ఈలో అర శాతం నష్టంతో రూ. 3,610 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసిన తర్వాత ఫలితాలు వచ్చాయి.

బైబ్యాక్ బొనాంజా @ రూ.17,000 కోట్లు

టీసీఎస్ బైబ్యాక్ పరంపరను కొనసాగిస్తోంది. రూ. 17,000 కోట్ల విలువైన షేర్లను వాటాదారుల నుంచి తిరిగి కొనుగోలు చేసేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. బైబ్యాక్ షేరు ధరను రూ. 4,150గా నిర్ణయించింది.



మా సర్వీస్‌లకు కొనసాగుతున్న డిమాండ్, క్లయింట్లు దీర్ఘకాల ప్రాజెక్టులకు కట్టుబడి ఉండటం, జెన్ ఏఐ ఇంకా ఇతర కొత్త టెక్నాలజీలను ప్రయోగాత్మకంగా ఉపయోగించేందుకు చూపుతున్న ఆసక్తి.. మా దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై భరోసా కల్పిస్తోంది. ఆర్థిక అనిశ్చితి కొనసాగుతోంది. దీనివల్లే ఆదాయ వృద్ధి అంతంతమాత్రంగా నమోదైంది. అయితే పటిష్టమైన డీల్స్ జోరుతో ఆర్డర్ బుక్ భారీగా వృద్ధి చెందింది. మొత్తం కాంట్రాక్ట్ విలువ (టీసీవీ) పరంగా క్యూ2లో రెండో అత్యధిక స్థాయిని నమోదు చేసింది.

– కె. కృతివాసన్, టీసీఎస్ సీఈఓ

వర్క్ ఫ్రమ్ హోమ్‌కు 'టాటా'

కరోనా మహమ్మారి కారణంగా కల్పించిన రిమోట్ వర్కింగ్ (వర్క్ ఫ్రమ్ హోమ్) సదుపాయానికి టీసీఎస్ టాటా చెప్పింది. ఇకపై తమ ఉద్యోగులందరూ ఆఫీసుల నుంచే విధులు నిర్వర్తించాలని కంపెనీ బుధవారం ప్రకటించింది. కో–వర్కింగ్ వల్ల వ్యవస్థ విస్తృతం అవుతుందని, ఉత్పాదకత పెరుగుతుందని టీసీఎస్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ పేర్కొన్నారు.

ఆక్సా వాటా భారతీ గ్రూప్ చేతికి

కొనుగోలుకు బైండింగ్ డీల్

న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ భాగస్వామ్య సంస్థలో ఏఎక్స్ఏ(ఆక్సా) వాటాను కొనుగోలు చేయనున్నట్లు భారతీ గ్రూప్ తాజాగా పేర్కొంది. వెరసి భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఆక్సాకుగల 49 శాతం వాటాను సొంతం చేసుకునేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఈ లావాదేవీ తదుపరి జీవిత బీమా జేవీకి హోల్డింగ్ కంపెనీగా భారతీ లైఫ్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్(బీఎల్‌వీపీఎల్) నిలవనున్నట్లు తెలియజేసింది. 100 శాతం వాటాను పొందడం ద్వారా భారతీ గ్రూప్ ఈ ఫీట్‌ను సాధించనుంది. ప్రస్తుతం జేవీలో ఆక్సాకు 49 శాతం వాటా ఉంది. తగిన అనుమతులు పొందాక లావాదేవీ డిసెంబర్‌కల్లా పూర్తికానున్నట్లు భారతీ అంచనా వేసింది. 2006లో ఆక్సా, భారతీ గ్రూప్ సంయుక్తంగా భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్, భారతీ ఆక్సా జనరల్ ఇన్సూరెన్స్‌లను ఏర్పాటు చేశాయి. తదుపరి 2020లో ఐసీఐసీఐ లాంబార్డ్‌కు జనరల్ ఇన్సూరెన్స్‌ను విక్రయించాయి.

హైదరాబాద్ నుంచి మరిన్ని ఫ్లయిట్లు

సింగపూర్ ఎయిర్‌లైన్స్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్–సింగపూర్ రూట్లో అక్టోబర్ 29 నుంచి మరిన్ని ఫ్లయిట్లు నడపనున్నట్లు సింగపూర్ ఎయిర్‌లైన్స్ జీఎం (ఇండియా) సై యెన్ చెన్ తెలిపారు. ప్రస్తుతం వారానికి ఏడు సర్వీసులు ఉండగా 12కి పెంచుకోనున్నట్లు వివరించారు. అనుబంధ బడ్జెట్ విమానయాన సంస్థ స్కూట్ నిర్వహించే ఫ్లయిట్స్ స్థానంలో వీటిని నడపనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి సర్వీసులు ప్రారంభించి 20 ఏళ్లవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాలు తెలిపారు. హైదరాబాద్ మార్కెట్ నుంచి ఫుల్ సర్వీస్‌లు, కార్గోకు డిమాండ్ పెరిగినట్లు చెన్ చెప్పారు.

చైనా ఈవీ స్టార్టప్ దివాలా

సమస్యల్లో డబ్ల్యూఎం మోటార్స్

షాంఘై: తాజాగా చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) వర్ధమాన కంపెనీ డబ్ల్యూఎం మోటార్స్ దివాలా ప్రకటించింది. సబ్సిడీలలో కోత, అందుబాటు ధరలకు ప్రాధాన్యతగల మార్కెట్ నేపథ్యంలో ఈవీ స్టార్టప్.. పలు సవాళ్లను ఎదుర్కొంది. వెరసి కార్యకలాపాలను కొనసాగించడంలో విఫలమైంది. నిజానికి ఈవీ అమ్మకాలలో చైనా ప్రపంచంలోనే నాయకత్వ స్థాయిలో ఉంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వివరాల ప్రకారం అంతర్జాతీయ అమ్మకాలలో(2023 తొలి క్వార్టర్) 56 శాతం వాటాను ఆక్రమిస్తోంది. ఈ కాలంలో ఈవీ అమ్మకాలు వార్షికంగా 32 శాతం ఎగశాయి. వీటిలో బ్యాటరీ ఈవీల వాటా 73 శాతంగా నమోదైంది. మిగిలిన 27 శాతం వాటాను ప్లగిన్ హైబ్రిడ్ ఈవీలు అందిపుచ్చుకున్నాయి.

కంపెనీ ఎదిగిన తీరిలా

డబ్ల్యూఎం మోటార్స్‌ను 2015లో ఫ్రీమ్యాన్ షేన్ ఏర్పాటు చేశారు. తొలి దశలో టెక్ దిగ్గజాలు బైడు, టెన్సెంట్, పీసీసీడబ్ల్యూ(హాంకాంగ్), హాంగ్షాన్, షున్ టక్ హోల్డింగ్స్ తదితరాలు పెట్టుబడులు అందించాయి. ఇతర ప్రత్యర్థి సంస్థల బాటలోనే చైనీస్ క్లిష్టతరహా బ్యాటరీ సప్లై చైన్ ఎకోసిస్టమ్ ఆధిపత్యం ద్వారా కంపెనీ లబ్ధి పొందింది. అయితే, ప్రత్యర్థి సంస్థల నుంచి తీవ్రపోటీ, ముడివ్యయాల పెరుగుదల, సబ్సిడీలలో కోత, అమ్మకాలు పడిపోవడం వంటి అంశాలు రెండేళ్లుగా కంపెనీకి సవాళ్లు విసురుతున్నాయి. దీంతో 2021కల్లా వార్షిక నష్టం రెట్టింపై 1.13 బిలియన్ డాలర్లను తాకింది.



ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ 10 లీటర్ల జార్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జెమినీ ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా (జీఈఎఫ్) తాజాగా ఫ్రీడమ్ రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 10 లీటర్ల జార్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. యాంకర్ సుమ కనకాల, జీఈఎఫ్ ఇండియా సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర రెడ్డి బుధవారమిక్కడ ఈ ఉత్పాదనను విడుదల చేశారు. ఆయిల్ వినియోగంతర్వాత నిల్వ చేసుకునేందుకు వీలుగా పది లీటర్ల జార్‌ను పరిచయం చేస్తున్నట్టు చెప్పారు. రూ.600 కోట్లతో ఆయిల్ రిఫైనరీ, సీడ్స్ క్రషింగ్ యూనిట్‌ను హైదరాబాద్ సమీపంలో నెలకొల్పుతున్నట్టు వెల్లడించారు. 2025–26లో ఈ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని, 1,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.



19,800 పైకి నిఫ్టీ

- సెన్సెక్స్ లాభం 394 పాయింట్లు
- సూచీలకు రెండో రోజూ లాభాలే...



ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు తగ్గడం, ప్రపంచ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కలిసిరావడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ లాభాలు ఆర్జించాయి. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, దేశీయ కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలపై ఆశాజనక అంచనాలు మార్కెట్ వర్గాలను మెప్పించాయి. అలాగే అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ షేర్లు ఒకటిన్నర శాతం రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 394 పాయింట్లు పెరిగి 66,473 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 19,811 వద్ద నిలిచింది. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు ఇంట్రాడే స్థిరంగా ముందుకు కదలాయి. ఒక దశలో సెన్సెక్స్ 513 పాయింట్లు పెరిగి 66,592 వద్ద, నిఫ్టీ 149 పాయింట్లు దూసుకెళ్లి 19,839 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. ఎఫ్ఎంసీజీ, ఇంధన, మెటల్, ఫార్మా, ప్రైవేట్ రంగాలకు చెందిన చిన్న, తరహా షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.55%, స్మాల్ క్యాప్ సూచీ 0.77% ర్యాలీ చేశాయి. అయితే ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. టీసీఎస్ రెండో క్వార్టర్ ఆర్థిక ఫలితాల వెల్లడి ముందు పలు ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజులో రూ.1.90 లక్షల కోట్లు పెరిగింది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

మహిళల ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్ (డిప్లొమా)

ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ).. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి మహిళలను టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో ప్రోత్సహించేందుకు ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్‌ను విడుదల చేసింది. ఈ పథకం ద్వారా డిప్లొమా విద్యనభ్యసిస్తున్న మహిళలకు ఆర్థిక సాయం అందిస్తారు.

» **స్కాలర్‌షిప్‌ల సంఖ్య:** దేశ వ్యాప్తంగా 5000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 కేటాయించారు.
» **స్కాలర్‌షిప్ మొత్తం:** టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లపాటు ఏటా రూ.50,000 అందిస్తారు.
» **అర్హత:** ఏదైనా టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సు అభ్యసిస్తూ ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా రెండో సంవత్సరం ప్రవేశాలు పొందిన అభ్యర్థులు అర్హులే. కుటుంబ వార్షికాదాయం రూ.8,00,000 లక్షలకు మించకూడదు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు దరఖాస్తుకు అర్హులు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
» **వెబ్‌సైట్:** https://scholarships.gov.in

డా.వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీలో బీఎన్‌వైఎస్ ప్రవేశాలు

విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు అనుబంధంగా ఉన్న కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎన్‌వైఎస్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 100
» **సీట్ల వివరాలు:** కేర్ యోగా, నేచురోపతి మెడికల్ కాలేజీ(బాపట్ల)–50 సీట్లు. పతంజలి మహర్షి నేచురోపతి అండ్ యోగా మెడికల్ కాలేజ్, గుంతకల్–50 సీట్లు.
» **అర్హత:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్(ఫిజిక్స్,కెమిస్ట్రీ,బయాలజీ)ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** అభ్యర్థి 31.12.2023 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.10.2023
» **వెబ్‌సైట్:** https://ugbnys.ysruhs.com

మహిళల ప్రగతి స్కాలర్‌షిప్ పథకం-2023

ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)..2023 విద్యా సంవత్సరానికి సంబంధించి మహిళలను టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్ ప్రకటనను విడుదల చేసింది. ఈ పథకం ద్వారా డిగ్రీ విద్యనభ్యసిస్తున్న మహిళలకు ఆర్థిక సాయం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు దరఖాస్తుకు అర్హులే.

» **స్కాలర్‌షిప్‌ల సంఖ్య:** దేశవ్యాప్తంగా 5000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 కేటాయించారు.
» **స్కాలర్‌షిప్ మొత్తం:** డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు ఏటా రూ.50,000 అందిస్తారు.
» **అర్హత:** ఏదైనా టెక్నికల్ డిగ్రీ కోర్సు అభ్యసిస్తూ ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరం ప్రవేశాలు పొందిన అభ్యర్థులు అర్హులే.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
» **వెబ్‌సైట్:** https://scholarships.gov.in

తెలంగాణ వైద్య కళాశాలల్లో అధ్యాపక పోస్టులు

తెలంగాణ ప్రభుత్వం.. ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో ఒప్పంద ప్రాతిపదికన ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వంటి అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది.

» **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
» **విభాగాలు:** అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ,ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు బోధన, పరిశోధనానుభవం ఉండాలి. **వయసు:** 69 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** ప్రొఫెసర్‌కు రూ.1.90 లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1.50 లక్షలు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1.25 లక్షలు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలకు అదనంగా మరో రూ.50,000 ఇస్తారు.ఎంపికైన వారు బాండ్ పేపర్ రాసివ్వాలి. ఒకవేళ మధ్యలో ఉద్యోగాన్ని వదిలేస్తే మూడు నెలల జీతాన్ని జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది. జాయినింగ్ సమయంలో ఒరిజినల్ సర్టిఫికేట్లను ఇవ్వాల్సి ఉంటుంది.
» **ఎంపిక విధానం:** పీజీ మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను స్కాన్ చేసి మెయిల్ ద్వారా పంపాలి.
» **ఈమెయిల్:** dmerecruitment.contract@gmail.com.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.10.2023.
» **వెబ్‌సైట్:** dme.telangana.gov.in

అమెరికాకు వడివడిగా ఇలా..

అమెరికాలో.. ఉన్నత విద్య! మన దేశ విద్యార్థుల తొలి గమ్యం!! ముఖ్యంగా టెక్నికల్, మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు యూఎస్ యూనివర్సిటీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆయా యూనివర్సిటీల నిబంధనలకు అనుగుణంగా ప్రామాణిక టెస్ట్‌లలో బెస్ట్ స్కోర్ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. అమెరికాలో ఏ కోర్సుల్లో చేరాలనుకున్నా.. ఇమిగ్రేషన్, అకడమిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరం. ఈ నేపథ్యంలో.. యూఎస్‌లో మన విద్యార్థులకు క్రేజీ కోర్సులు.. అడ్మిషన్ నిబంధనలు.. ఇన్‌స్టిట్యూట్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. సిద్ధం చేసుకోవాల్సిన ఇతర డాక్యుమెంట్లు తదితర వివరాలు..

» యూఎస్ వర్సిటీల్లో కొనసాగుతున్న ఫాల్ సెషన్ సందడి
» ప్రవేశాల కోసం ఆసక్తి చూపుతున్న భారత విద్యార్థులు
» ఇన్‌స్టిట్యూట్స్ ఎంపికలో అప్రమత్తత ముఖ్యం



అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళుతున్న విద్యార్థుల్లో అధిక శాతం మంది ఎంఎస్, ఎంబీఏ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పలు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పీజీ స్టడీస్‌కి సంబంధించి దాదాపు 60 శాతం మంది ఈ రెండు కోర్సులనే ఎంచుకుంటున్నారు. గత విద్యా సంవత్సరంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో 13.3 శాతం మంది, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ కోర్సుల్లో 66 శాతం మంది చేరినట్లు ఓపెన్ డోర్స్ నివేదిక పేర్కొంది.

ఇన్‌స్టిట్యూట్‌ల గుర్తింపు

అమెరికాలో ఉన్నత విద్యలో చేరాలనుకునే విద్యార్థులు ముందుగా.. అక్కడి ఇన్‌స్టిట్యూట్‌ల ఎంపికపై కసరత్తు చేయాలి. తొలుత తమకు ఆసక్తి ఉన్న ప్రోగ్రామ్‌లను అందిస్తున్న యూనివర్సిటీల జాబితాను సిద్ధం చేసుకోవాలి.

ఆ తర్వాత.. ఆయా విశ్వవిద్యాలయాల నిబంధనలు, స్టాండర్డ్ టెస్ట్‌ల కనీస స్కోర్ వివరాలు తెలుసుకోవాలి. అదేవిధంగా ప్రతి యూనివర్సిటీకి సంబంధించి దరఖాస్తు గడువు తేదీలు వేర్వేరుగా ఉంటాయి. ఫాల్ ఇన్‌టేక్ సెప్టెంబర్‌లో మొదలై డిసెంబర్‌లో ముగుస్తుంది. అలాగే స్ప్రింగ్ ఇన్‌టేక్ జనవరిలో ప్రారంభమై మే వరకూ కొనసాగుతుంది.

రోలింగ్ అడ్మిషన్స్

అమెరికా యూనివర్సిటీలు ప్రవేశ ప్రక్రియలో ఫాల్, స్ప్రింగ్‌లతోపాటు రోలింగ్ అడ్మిషన్ విధానాన్ని అమలు చేస్తుంటాయి. ఈ విధానంలో అభ్యర్థులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్ణీత సెషన్లలో సీట్లు భర్తీ కాని సందర్భాల్లో రోలింగ్ అడ్మిషన్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం కల్పిస్తారు. కాబట్టి ఆయా యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అడ్మిషన్ సెషన్ల గురించి కూడా తెలుసుకోవాలి. రోలింగ్ అడ్మిషన్ సెషన్ అందుబాటులో ఉంటే దానికి కూడా దరఖాస్తు చేసుకోవడం మేలు.

అర్హత నిబంధనలు

ఆయా యూనివర్సిటీలు అనుసరిస్తున్న అర్హత నిబంధనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎక్కువ శాతం ఇన్‌స్టిట్యూట్‌లు 16 ఏళ్ల (10+2+4) ఎడ్యుకేషన్ విధానంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలంటున్నాయి. మరికొన్ని విశ్వవిద్యాలయాలు మాత్రం 10+2 తర్వాత మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు కూడా అవకాశం కల్పిస్తున్నాయి. ప్రఖ్యాత యూనివర్సిటీలు (హార్వర్డ్, ఎంఐటీ, యూసీ, కార్నెగీ మిలన్ తదితర) మాత్రం తప్పనిసరిగా 10+2+4 విధానంలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారినే అర్హులుగా పేర్కొంటున్నాయి.

ప్రామాణిక టెస్ట్‌లు

అధికశాతం యూఎస్ యూనివర్సిటీలు స్టాండర్డ్ టెస్ట్ స్కోర్లను తప్పనిసరి చేస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న డొమైన్ ఆధారంగా జీఆర్‌ఈ, జీమ్యాట్, టోఫెల్ వంటి టెస్టుల స్కోర్లు పొందాల్సి ఉంటుంది. జీఆర్‌ఈలో సబ్జెక్ట్ టెస్ట్ స్కోర్లను కూడా అక్కడి ప్రముఖ యూనివర్సిటీలు తప్పనిసరి చేస్తున్నాయి. జీఆర్‌ఈలో కనీసం 300కుపైగా పాయింట్లు సొంతం చేసుకుంటే.. అడ్మిషన్ అవకాశాలు మెరుగవుతాయి.జీమ్యాట్‌లో 650కు పైగా స్కోర్ పొందడం మేలు. టోఫెల్‌లో కనీసం 100 స్కోర్ సాధిస్తే.. టాప్ యూనివర్సిటీల్లో ప్రవేశం లభించే అవకాశం ఉంటుంది.

మిగతా వాటిపైనా దృష్టి

యూనివర్సిటీల నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నప్పటికీ.. అనేక ఇతర అంశాలు సైతం ప్రవేశం ఖరారులో కీలకంగా మారుతున్నాయి. వీటిల్లో లెటర్ ఆఫ్ రికమండేషన్ (ఎల్ఓఆర్), స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ) ముఖ్యమైనవి. కొన్ని సందర్భాల్లో అకడమిక్,టెస్ట్ స్కోర్లను సైతం కాదని ఎల్ఓఆర్, ఎస్ఓపీ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారంటే.. వీటి ప్రాధాన్యతను తెలుసుకోవచ్చు.

లెటర్ ఆఫ్ రికమండేషన్

అభ్యర్థుల నైపుణ్యాలను, సామర్థ్యాలను ధ్రువీకరిస్తూ.. సంబంధిత రంగంలోని నిపుణులు ఇచ్చే సిఫార్సు లేఖలే.. లెటర్ ఆఫ్ రికమండేషన్. అభ్యర్థులు తాము చదువుకున్న యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్లు; వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ అయితే ఉన్నతాధికారులతో లెటర్ ఆఫ్ రికమండేషన్‌ను పొందాల్సి ఉంటుంది. తమ గురించి బాగా తెలిసిన వ్యక్తులతో ఈ సిఫార్సు లేఖలు పొందడం వల్ల మరింత ఉపయుక్తంగా ఉంటుంది. అమెరికాలోని వర్సిటీలు కనీసం రెండు ఎల్ఓఆర్‌లను కోరుతున్నాయి.

ఎస్ఓపీ.. స్పెషల్ కేర్

మరో కీలకమైన డాక్యుమెంట్.. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ). విద్యార్థులు సదరు యూనివర్సిటీలో చేరాలనుకోవడానికి కారణాలు.. అదే ప్రోగ్రామ్‌ను ఎందుకు ఎంపిక చేసుకున్నారు.. భవిష్యత్తు లక్ష్యాలు ఏంటి?ఇలా వివిధ కోణాల్లో అన్ని వివరాలు పొందుపరుస్తూ నిర్దేశిత పదాల్లో సొంతంగా రాయాల్సిన నివేదిక ఇది.దీన్ని యూనివర్సిటీకి చెందిన అకడమిక్ నిపుణుల కమిటీ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. కొన్ని సందర్భాల్లో టెస్ట్ స్కోర్లు, అకడమిక్ పర్సంటేజీలు తక్కువగా ఉన్నప్పటికీ.. ఎస్ఓపీలో అభ్యర్థి పొందుపర్చిన సమాచారం, వారి నిబద్ధతను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తున్నాయి.

కీలకంగా రెజ్యూమే

విదేశీ యూనివర్సిటీలో అభ్యర్థుల అడ్మిషన్‌ను ఖరారు చేసే మరో సాధనం.. రెజ్యూమే. ఇటీవల కాలంలో కొన్ని యూనివర్సిటీలు రెజ్యూమే లేదా సీవీని కూడా అప్‌లోడ్ చేయమంటున్నాయి. అభ్యర్థులు అకడమిక్ స్థాయిలో పొందిన అర్హతలతో పాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొన్న తీరు, ప్రాజెక్ట్ వర్క్స్ వంటి వాటి గురించి తెలుసుకోవాలనుకోవడం ఇందుకు కారణం.

వీసాకు దరఖాస్తుకు ఇలా

అమెరికాలో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులు..యూనివర్సిటీ ఇచ్చే కన్ఫర్మేషన్ లెటర్ ఆధారంగా ఇమిగ్రేషన్ విభాగంలో ఐ–20ఫామ్‌ను పూర్తి చేసి వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. వీటిని పరిశీలించిన ఇమిగ్రేషన్ విభాగం అధికారులు నిర్దేశిత తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచిస్తారు. ఇంటర్వ్యూ సమయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలి. కోర్సు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగొచ్చేస్తామనే విధంగానే సమాధానాలు ఇవ్వాలి.

కొలువుకు మార్గం ఓపీటీ

అమెరికాలో అడుగుపెట్టిన విద్యార్థులకు కలిసొస్తున్న విధానం.. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ). ముఖ్యంగా కోర్సు పూర్తి చేసుకున్నాక అక్కడే ఉద్యోగం సొంతం చేసుకోవాలనుకునే వారికి ఓపీటీ దోహదపడుతోంది. యూఎస్‌లోని ఏదైనా యూనివర్సిటీలో పీజీ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులు.. కోర్సు ముగిసిన తర్వాత ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ పేరుతో అక్కడి సంస్థల్లో 12 నెలలపాటు పని చేసే అవకాశం ఉంది. స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల అభ్యర్థులు 12 నెలలకు అదనంగా మరో 24 నెలలు అంటే మొత్తం 36 నెలలు ఓపీటీ విధానంలో అక్కడి కంపెనీల్లో పని చేసే వీలుంది.

ఓపీటీ సమయంలో అభ్యర్థులు తమ పనితీరుతో సదరు సంస్థల యాజమాన్యాల నుంచి సానుకూల ఫలితం ఆశించొచ్చు. వారి ద్వారా ఆ సంస్థల్లో శాశ్వత ఉద్యోగం కల్పించే విధంగా యాజమాన్యాలు అభ్యర్థుల తరఫున హెచ్–1బీ పిటిషన్‌కు దరఖాస్తు చేసే అవకాశం ఉంటుంది. వాస్తవానికి గత కొన్నేళ్లుగా యూఎస్‌లో దాఖలవుతున్న హెచ్–1బీ పిటిషన్లలో ఓపీటీ పూర్తి చేసుకున్న విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది.

50 వేల డాలర్ల ఫీజు

అమెరికాలోని యూనివర్సిటీల్లో ఎంఎస్ ప్రోగ్రామ్ ఫీజు గరిష్టంగా 50 వేల డాలర్ల వరకు ఉంటుంది. కొన్ని యూనివర్సిటీలో 30వేల డాలర్లతో చదివే అవకాశం ఉంది. హార్వర్డ్, ఎంఐటీ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో చదవాలంటే.. ఏడాదికి కనీసం యాభై వేల డాలర్ల ఫీజు చెల్లించాల్సిందే.

ముఖ్య డాక్యుమెంట్స్

అకడమిక్ ట్రాన్స్‌క్రిప్ట్స్(విద్యార్హతల సర్టిఫికెట్లు); జీఆర్‌ఈ/జీమ్యాట్/టోఫెల్ /ఐఈఎల్‌టీఎస్ తదితర టెస్ట్ స్కోర్లు; లెటర్ ఆఫ్ రికమండేషన్; స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్; వర్క్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్(బ్యాంక్ స్టేట్‌మెంట్); రెజ్యూమే/సీవీ.

వీసాకు కావల్సిన పత్రాలు

ఐ–20(అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్);యాక్సెప్టెన్స్ లెటర్; సెవిస్ రిసిప్ట్(ఐ–901); వీటితోపాటు ఆర్థిక వనరుల రుజువులు; సిటిజన్ షిప్ పాస్‌పోర్ట్; అపాయింట్‌మెంట్ లెటర్;డిఎస్–160కన్ఫర్మేషన్ లెటర్.

క్లుప్తంగా...

హోంవర్క్ చేయలేదని బాలికను చితక్కొట్టిన టీచర్

సిద్దిపేట జిల్లాలో ఘటన


విద్యార్థిని వీపుపై తేలిన వాతలు

వర్గల్ (గజ్వేల్): హోంవర్క్ చేయలేదని ఓ ఉపాధ్యాయుడు విద్యార్థిని చితక్కొట్టడంతో వీపుపై వాతలు తేలిపోయాయి. బుధవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. అనంతగిరిపల్లికి చెందిన ఎల్కంటి వీణ స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాలుగోతరగతి చదువుతోంది. గణితం హోంవర్క్ చేయకుండా ఆ బాలిక మంగళవారం స్కూల్‌కు వచ్చింది. ఉపాధ్యాయుడు మల్లికార్జున్ హోంవర్క్ ఎందుకు చేయలేదంటూ కర్రతో ఆ బాలిక వీపుపై కొట్టాడు. దీంతో వీపుపై వాతలు ఏర్పడ్డాయి. కూతురు వీపుపై వాతలను గమనించిన తల్లిదండ్రులు, బంధువులు బుధవారం ఉపాధ్యాయుడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.10 ఇవ్వలేదని బాలుడి ఆత్మహత్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన


సుధీర్‌బాబు

చండ్రుగొండ (భద్రాద్రి కొత్తగూడెం): నోట్ బుక్ కొనుక్కునేందుకు తల్లి రూ.10 ఇవ్వలేదని బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి కొత్త గూడెం జిల్లా చండ్రుగొండ మండలం బెండాలపాడులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆదివాసీలు కణితి లక్ష్మణరావు, కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు సుధీర్ బాబు, శివ ఉన్నారు. సుధీర్‌బాబు (10) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లే క్రమంలో నోట్‌బుక్ కొనుక్కునేందుకు రూ.10 కావాలని తల్లిని అడిగాడు. ఆమె 'డబ్బులు లేవు, ఊళ్లో రావాల్సి ఉంది.. అడిగి తీసుకుని వస్తాను'అంటూ గ్రామంలోకి వెళ్లి తిరిగి వచ్చేసరికి బాలుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి బాలుడిని చండ్రుగొండ పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతిచెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అందరిలో ఆర్థ్రైటిస్!

చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరిలో కీళ్ల నొప్పులు

- వయసు మీదపడే కొద్దీ తీవ్రమయ్యే కీళ్ల వాపు వ్యాధి
- అనారోగ్య జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల ముందే వచ్చేస్తోంది
- ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమంది బాధితులు
- లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దంటున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దశరథరామారెడ్డి
- నేడు ప్రపంచ ఆర్థరైటిస్ డే



సాక్షి, హైదరాబాద్: చిన్నా పెద్దా తేడా లేకుండా ఇప్పుడు అందరూ కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. దీనికి కారణం ఆర్థరైటిస్. దీన్నే కీళ్ళవాపు వ్యాధి అంటారు. మీదపడే వయస్సుతో మరింత తీవ్రమయ్యే ఈ వ్యాధి, పూర్వం ఎక్కువగా వృద్ధాప్యంలో అంటే 65 ఏళ్లు పైబడిన వారిలో ఎక్కువగా వచ్చేది. కానీ ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా ముందే వచ్చేస్తోంది. అనారోగ్య జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 12ను ప్రపంచ ఆర్థరైటిస్ డేగా పాటిస్తారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథరామారెడ్డిని 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది. వివరాలు ఆయన మాటల్లోనే..

లక్షణాలు కన్పిస్తే నిర్లక్ష్యం చేయకండి

ఆర్థరైటిస్ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకండి. అసాధారణమైన కీళ్ళ వాపు, నొప్పి లేక కీళ్ళు బిగుసుకుపోవడం వంటివి రోజుల తరబడి ఉన్నా, అకస్మాత్తుగా తీవ్రమైన వెన్నునొప్పి వచ్చినా, కీళ్లను తాకడం బాధాకరంగా మారినా ఆర్థోపెడిక్ సర్జన్‌ను సంప్రదించాలి. 65 ఏళ్ల మహిళలు 70 ఏళ్ల పురుషులు ఎముక సాంద్రత (బోన్ డెన్సిటీ) పరీక్ష చేయించుకోవాలి.

ఆర్థరైటిస్‌లో అనేక రకాలు

ఆర్థరైటిస్‌లో అనేక రకాలు ఉన్నాయి. ప్రతిదానికి వేర్వేరు చికిత్సలు కూడా ఉన్నాయి.

ఆస్టియో ఆర్థరైటిస్ (ఓఏ): వృద్ధులలో ఎక్కువగా ఉంటుంది. విశ్రాంతి తీసుకున్న తర్వాత నడిస్తే కీళ్ళు గట్టిగా అనిపించవచ్చు. అయితే ఒకసారి కదలడం మొదలుపెడితే నొప్పి త్వరగా తగ్గిపోతుంది.

రుమటాయిడ్ ఆర్థరైటిస్ (ఆర్ఏ): రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ను మందులతో, కీళ్ళపై ఒత్తిడిని తగ్గించడం ద్వారా వ్యాయామంతో తగ్గించవచ్చు.

సోరియాటిక్ ఆర్థరైటిస్: ఆర్ఏ లాగే ఇది ఆటో ఇమ్యూన్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధి. సాధారణంగా సోరియాసిస్ ఉన్నవారిలో సంభవిస్తుంది.

గౌట్: శరీరంలో యూరిక్ యాసిడ్ అధిక స్థాయిలో ఉండటం ఈ సమస్యకు కారణం.

లూపస్: లూపస్ అనేది చర్మం, అవయవాలు శరీరంలోని అనేక ఇతర ప్రదేశాలలో మంటను కలిగించే దీర్ఘకాలిక వ్యాధి.



స్పైనల్ ఆస్టియో ఆర్థరైటిస్ (వెన్నెముక ఆస్టియో ఆర్థరైటిస్): కొన్నిసార్లు ఆస్టియో ఆర్థరైటిస్ వెన్నెముక వద్ద నుండే నరాలపై ఒత్తిడి తెచ్చే 'స్పర్స్' (ఎముక ఎదుగుదల)కు కారణమవుతుంది. దీనివల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను స్పైనల్ ఆస్టియో ఆర్థరైటిస్ అంటారు.

ఎలా నియంత్రించాలి?

- బరువును నియంత్రణలో ఉంచుకోవాలి. ఎక్కువ బరువుంటే తగ్గించుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించాలి.
- క్రమం తప్పకుండా నడకవంటి వ్యాయామం చేయడంవల్ల కీళ్ల ఫ్లెక్సిబిలిటీ (సరళంగా వంగే గుణం) పెరుగుతుంది.
- ఈత కొట్టాలని, బరువులు ఎత్తడం లాంటి కసరత్తులు చేయాలని కొందరు వైద్యులు సిఫారసు చేస్తారు.
- పండ్లు, మూలికలు, చేపలు, కూరగాయలతో సహా అధిక మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు కలిగిన ఆహారం తినాలి.
- ధూమపానం, మద్యపానం మానాలి. ఎముకలు చిట్లకుండా చూసుకోవాలి.

ఒకరోజు యూకే డిప్యూటీ హైకమిషనర్‌గా రితికాప్రసాద్


యూకే డిప్యూటీ హైకమిషనర్ గారెత్ ఓవెన్‌తో రితికా ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని డిప్యూటీ హైకమిషన్ (యూకే) నిర్వహించిన కాంటెస్ట్‌లో విజేతగా నిలిచిన రితికా ప్రసాద్ ఒకరోజు డిప్యూటీ హైకమిషనర్‌గా కొనసాగారు. రితికా ప్రసాద్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)లో అర్బనైజేషన్‌లో స్పెషలైజేషన్‌తో పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నారు. అలాగే ఆమె ఢిల్లీ యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. రితికా జీ–20కి సంబంధించి ఇటీవలి ప్రచురణతో సహా పలు అకడమిక్ కార్యక్రమాలు, పాలసీ బ్రీఫ్‌లో భాగస్వామ్యమయ్యారు. జెండర్, హెల్త్‌కు సంబంధించిన అంశాలు, పర్యావరణ సుస్థిరత పట్ల ఆమెకు ఆసక్తి ఉన్నట్లు చెప్పారు. ఒకరోజు డిప్యూటీ హైకమిషనర్‌గా బాధ్యత తీసుకున్న తర్వాత తొలి ఎంగేజ్‌మెంట్‌లో భాగంగా జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్యానెల్ చర్చల్లో పాల్గొన్నారు.

నేడు చెన్నైలో 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్'కి కవిత

సాక్షి, హైదరాబాద్: ఏబీపీ నెట్‌వర్క్ సంస్థ నిర్వహించే దక్షిణాది సదస్సులో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ కవిత గురువారం చెన్నైకు వెళ్తున్నారు. సాయంత్రం 7.30 గంటలకు చెన్నైలో 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్'లో కవిత తమ పార్టీ విధానాన్ని తెలియజేస్తారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపోటములు, వివిధ పార్టీల స్థితిగతులు వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ప్రముఖ రచయిత చేతన్ భగత్ సమన్వయకర్తగా వ్యవహరించే ఈ చర్చలో కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై పాల్గొంటారు.

తల్లిదండ్రులకు అన్నం పెట్టని కొడుకుకు 3 రోజుల జైలు

సంగెం: తల్లిదండ్రులకు అన్నం పెట్టకుండా దూషించిన కొడుకుకు 3 రోజుల జైలుశిక్ష విధిస్తూ వరంగల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన బుట్టి ఉపేంద్ర, నర్సయ్య దంపతులకు శ్రీను, రాజులు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఉన్న ఇల్లు, వ్యవసాయ భూములను కొడుకులిద్దరికీ పంచి ఇచ్చి ఓ రేకుల షెడ్‌లో తల్లిదండ్రులు కాలం వెళ్లదీస్తున్నారు. పెద్ద కొడుకు శ్రీను, కోడలు మంజుల ఆ వృద్ధ దంపతులకు అన్నం పెట్టకపోగా దూషించి కొట్టడం, ఇంట్లోనుంచి వెళ్లగొట్టడం చేస్తున్నారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి కుమారుడు, కోడలిని కోర్టులో హాజరుపరిచారు. కోడలు మంజులకు రూ.1,200 జరిమానా, కుమారుడు శ్రీనుకు 3 రోజుల జైలుశిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రం వీరస్వామి తీర్పు ఇచ్చినట్లు సంగెం ఎస్సై ఎం.భరత్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.